విమర్శాదర్శం

డా॥ ద్వా.నా.శాస్త్రి



99877

విమర్శాదర్శం

డా॥ ద్వా.నా. శాస్త్రి

కిన్నెర పబ్లికేషన్స్
హైదరాబాద్

Vimarshaadarsham

By Dwa. Na Sastry

© Dwa. Na Sastry

894.8274
దా.నా.-వి

First Edition : 2011

Price : Rs. 120/-

For Copies :
All leading Book Shops
&
Dr. Dwa. Na Sastry
1-1-428, Gandhinagar,
Hyderabad - 500 080
Cell: 098492 93376

Book Production :
T. Muralidhar Gowd
9393 176 552

Cover Design:
Swapna

Typeset :
K.B.T. Kondaiah

Published by :
Kinnera Publications
2-2-647/153. Central Excise Colony
Hyderabad - 500 013
Ph: 040-2742 6666

Printed at :
Karshak Art Printers
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

cl 9842

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
99877
ACC No. .....
గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్ - 500032.

అంకితం



నన్ను
ఒకనాడు ఆర్థికంగా ఆదుకొన్న మంచిమనిషి
ఉత్తమ చరిత్ర అధ్యాపకులు
నేను పనిచేసిన
శ్రీ కోనసీమ భానోజి రామర్స్ కళాశాల
పూర్వ ప్రిన్సిపాల్
శ్రీ వాడ్రేవు వేణుగోపాల్ గార్కి

ముకుళిత హస్తాలతో

– ద్వా.నా.శాస్త్రి

నా పలుకులు

నాకు ఎటువంటి భేషజాలూ లేవు. సంకుచితత్వం అసలు లేదు. వాస్తవికతకు ప్రాధాన్యం ఇవ్వాలనే నా తపన. సాహిత్యం అనేది ఆలోచనామృతం. ఇదే "అంతిమం" అనడానికి వీలులేదు. భిన్నమైన ఆలోచనలు సాహిత్యాభివృద్ధికి దోహదం చేస్తాయన్న నమ్మకం గలవాడ్ని. రాగద్వేషాలకు అతీతంగా విమర్శపైగల మమకారంతో రాసినవే ఈ వ్యాసాలు.

"Criticism may be regarded as having two different functions that of interpretation and that of judgement" అన్న డబ్ల్యు.హెచ్. హడ్సన్ నాకెప్పుడూ గుర్తుకు వస్తాడు.

ఒక రచన ప్రకాశించడం కోసం, పాఠకుల ఆలోచనకు ప్రేరకంగా ఉండటం కోసం, రచయితకి ఒక మార్గం చూపడంకోసం, సాహిత్యాభిలాషను పెంచడంకోసం- పంచడం కోసం విమర్శ అవసరమనినా అభిప్రాయం.

– ద్వా.నా.శాస్త్రి

ధన్యవాదాలు

ఈ "విమర్శాదర్శం" పుస్తకం రావటానికి ఆర్థిక సహకారం అందించిన మంచి మనిషి శ్రీ వాడ్రేవు వేణుగోపాల్‌గార్కి, వారి కుమారుడు చి॥ విజయానంద్‌కి–

నా శ్రేయోభిలాషులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గార్లకి–

నా పట్ల అమితాదరణ చూపిస్తున్న ఆత్మీయులు, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత శ్రీ సలీంగార్కి– నా వ్యాసాలను ప్రచురించిన వివిధ పత్రికాధిపతులకు, ఈ వ్యాసాల రచనకు అవకాశం కల్పించిన కొన్ని విశ్వవిద్యాలయాల ఆచార్యులకు–

మరొక విమర్శ వ్యాస సంపుటి రావాలని నన్ను ఎల్లవేళలా వేగిరపరచిన శ్రీ గుడిపాటి, పూర్ణచంద్ వంటి మిత్రులకి– ఐ.ఏ.ఎస్. అభ్యర్థులకి తెలుగు బోధించడంలో అవకాశమిచ్చి నన్ను నిత్య విద్యార్థిగా చేసిన ఆర్.సి.రెడ్డి గార్కి– నా ఐ.ఏ.ఎస్. అభ్యర్థులకి–

తొలినాళ్ళలో నన్ను విమర్శకుడిగా ప్రోత్సహించిన చేరా మేష్టారుగార్కి, కీ.శే. కూచిమంచి సత్యసుబ్రహ్మణ్యం, డా॥ నండూరి రామమోహనరావుగార్లకు– ఇప్పటి ఆంధ్రభూమి సంపాదకులు శ్రీ ఎం.వి.ఆర్.శాస్త్రిగార్కి, వార్త సంపాదకులు శ్రీ టంకశాల అశోక్‌గార్కి, ఆంధ్రప్రభ సంపాదకులు శ్రీ పి. విజయబాబుగార్కి–

నాతో సద్విమర్శతో వాగ్వాదానికి దిగే ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గార్కి అసలు సైన్సు విద్యార్థి అయిన నన్ను ఎం.ఏ.

తెలుగు చదివింపజేసిన మా నాన్న కృష్ణశాస్త్రిగార్కి, నన్ను ఇంతవాడ్ని చేసిన గురువులు కీ.శే. ఆచార్య తూమాటి దొణప్పగార్కి–

పుస్తకరూప కల్పనలో నాతో అండగా నిలిచే నా ప్రియమిత్రుడు, పుస్తకరూపశిల్పి శ్రీ తాళ్ళపల్లి మురళీధరగౌడ్‌కి–

కర్షక ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ జగన్మోహన్‌రెడ్డిగార్కి– నా హితుడు స్నేహితుడు కిన్నెర (మద్దాలి) రఘురాంకి– తమ కిన్నెర సంస్థ తరఫున ప్రచురించుకోవటానికి అంగీకరించిన ఆ సంస్థ అధ్యక్షులు ఉత్తమ విద్యావేత్త డా॥ ఆర్. ప్రభాకరరావు ఐ.పి.ఎస్. గార్కి–

నా మనఃపూర్వక ధన్యవాదాలు

– ద్వా.నా.శాస్త్రి

సూచిక

1. దేశికవిత్వం–పాల్కురికి సోమన ---------- 07
2. శ్రీకాళహస్తీశ్వర శతకంలో సామాజిక స్పృహ ---------- 17
3. కావ్య, ప్రబంధ శబ్దాలు సమానార్థకాలు! ---------- 21
4. ప్రాచీన కవిత్వంలో కాకతీయుల నాటి సాంఘిక జీవితం–కుల వ్యవస్థ 32
5. సాహిత్యంలో 'అంకితాలు' ---------- 38
6. చిన్నయ సూరి శైలి – తెలుగుదనం ---------- 46
7. దీర్ఘ కవితలు– వచన కవితా వైభవం ---------- 53
8. వచన కవిత్వంలో అలంకారికత ---------- 62
9. తెలుగు విమర్శలో వాదోపవాదాలు ---------- 73
10. ఒకే వస్తువులో విభిన్న శిల్పాలు ---------- 88
11. ఆరు పదుల తెలుగు కవిత ---------- 95
12. ప్రపంచీకరణ– తెలుగు నాటకరంగం ---------- 107
13. తెలుగు నాటకాలు – బౌద్ధవాఙ్మయ ప్రభావం ---------- 110
14. తెలుగు 'నుడి'కి 'గుడి' కట్టిన సినారె ---------- 117
15. మనం జారవిడుచుకున్న కవిగారి 'నుడికడలి' ---------- 125
16. లిఖిత సాహిత్య పత్రికలు ---------- 131
17. జాషువా కవిత్వం– మరో కోణం ---------- 142
18. శ్రీశ్రీ హాసక్రీడలు ---------- 149

1

దేశికవిత్వం-పాల్కురికి సోమన

"భృంగిరిటి గోత్రుడను గురు
లింగ తనూజుండ శివకులీనుడ దుర్వ్యా
సంగ వివర్జిత చరితుడ
జంగము లింగప్రసాద సత్ర్పాణుండన్"

అని అనుభవసారంలో తనను గురించి పేర్కొన్న పాల్కురికి సోమనాథుడు అచ్చమైన దేశికవి, అచ్చమైన తెలుగు కవి. అనువాద యుగంలో నివసించి తెలుగు సాహిత్యానికి స్వతంత్ర కావ్య ఉషోదయం కావించిన భాస్కరుడు పాల్కురికి సోమనాథుడు.

ఒక ఆందోళన

ఒక తపన

ఒక నిబద్ధత

ఒక లోచూపు

వీటికి తోడు నిర్భయత్వం

... ఇన్నీ కలిస్తే పాల్కురికి సోమనాథుడు. దేశికవిత్వోద్యమానికి నాయకుడయ్యాడు. తొలి దినాలలోనే వస్తువులోను, ఛందస్సులోను, భాషలోను, వర్ణనలోను నవ్యత్వాన్ని ప్రదర్శించిన దీపధారి పాల్కురికి సోమన.

సంగీతంలోగల మార్గ, దేశి- కన్నడంలోకి ప్రవేశించి - తెలుగు శాసనాలలోకి వ్యాపించి- నన్నెచోడుని ద్వారా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి.

"మార్గకు మార్గము దేశియమార్గము" అని నన్నెచోడుడు ప్రకటించి శ్రీకారం చుట్టినవాడే– కాని దేశియమార్గాన్ని జీవిత లక్ష్యంగా భావించి రచనలు చేసి– వ్యాప్తి కలిగించి "ఇదీ దేశి" అని ఒక రాచబాట వేసినవాడు పాల్కురికి సోమన మాత్రమే.

"దేశిగా విరచింతు ద్విపదకువళ్ళు"

"జాతి దేశియు ప్రబంధ చరిత తాళానుగతి"

"దేశియ మార్గంబు దీటు కొనంగ".

అని సోమన పదే పదే దేశిని నొక్కి వక్కాణించాడు.

"దేశేదేశే జనానాం యద్రుచ్యాహ్లాదయ రంజనమ్

గీతంచ వాదనం నృత్తం తద్దేశీత్యభిధీయతే"

అని నిర్వచనం. స్థానిక ప్రాంతీయ భాషాపదజాలంతో హృదయరంజకంగా ఆడి పాడటానికి యోగ్యమైనది దేశి అని భావం. "ప్రవాహినీ దేశ్యా" అని ఆంధ్ర శబ్ద చింతామణికారుడు చెప్పనే చెప్పాడు. సంస్కృత లక్షణ గ్రంథాలలో చెప్పబడిన కావ్యవర్గానికి చెందినవి మార్గ కవిత్వానికి చెందుతాయి. పాల్కురికి సోమన దేశికవితా సంప్రదాయాన్ని ఈ విధంగా వివరించవచ్చు:

వస్తువు

ఛందస్సు

భాష

వర్ణన

పాత్రపోషణ.

ప్రధానంగా భాషా ఛందస్సులే ఆతని దేశి కవిత్వోద్యమానికి మూలం.

సోమన పౌరాణిక వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వలేదు. సంస్కృతానువాదాలు చెయ్యలేదు. "సంస్కృత పురాణేతిహాసాల అంగడివీథులను వదలి సమకాలమునకు దగ్గరలోని స్థానికములు, జానపదములు నయిన జనజీవన సాధారణములను పాల్కురికి గ్రహించెను" అన్న విమర్శకులమాట వాస్తవమే.

"ఆతత భక్త పురాతన భక్త గీతార్థ సమితియే మాతృక కాగ"

"పరి శిష్ట పరిమిత ప్రాక్తన భక్త చరితంబు"

అంటూ శ్రీశైల జన్మవృత్తాంతం, సిరియాళాది చరితలు తప్ప మిగిలినవన్నీ జనం కథలే– మధుర మూఢ భక్తికి సంబంధించినవే. స్వతంత్ర, సహజ కథలే దేశీయత! జానపదంలోని Valloer, Pastoral వంటివే సోమన రచనలలో కనిపిస్తాయి. పాల్కురికి వస్తువులోని విశేషాలను చిలుకూరి నారాయణరావుగారు ఇలా వివరించారు–

- కథా వస్తువులో క్రొత్తదనము. ఇతనికి పూర్వము శైవకావ్యములున్నా వాటికిన్ని సోమనాథుని గ్రంథములకున్న పోలిక లేదు.
- వీర శైవ సిద్ధాంతమును వివరించే ఉద్దేశముతో కావ్యమనే ఆధారమును కల్పించుకొని సిద్ధాంతమును ప్రత్యేకముగా విస్తరించి చెప్పక కథతో మేళవించి కవి తన సిద్ధాంతమును ప్రతిపాదిస్తున్నాడనే విషయము పాఠకులకు తోచకుండా చేయడము.
- అనేకములయిన విడి విడి భక్తమాహాత్మ్య కథలనొక్కచోట చేర్చి, అవి అన్నీ ప్రత్యేక కథలు కానట్లు కావ్య స్వరూపమును కల్పించడము.
- వీర శైవేతరులకు పరిచితములైన కథలను కూడా చెవులలో గింగిరుమన్నట్లు మోగించి మోగించి అవి పరిచితములయినట్లు చేయడము.

ఇటువంటి వస్తు సంవిధానం దేశి రచనామార్గానికి ఎంతో ఉపకరించింది. శైవమతవ్యాప్తి అనే లక్ష్యంతో వస్తువును ఎన్నుకోవడంలో, వస్తు ప్రదర్శనలో తనదైన దేశిమార్గాన్ని అనుసరించినవాడు పాల్కురికి సోమన.

దేశికవిత్వానికి పాల్కురికి సోమన "ఛందస్సు" ద్వారా పుష్టిని చేకూర్చాడు. కన్నడిగులకు "త్రిపద" ఎలాగో తెలుగువారికి 'ద్విపద' అనాదినుంచీ వుంది. గుణగ విజయాదిత్యుని శాసనంలో (9వ శతాబ్దం) ద్విపద విశేషమైన తరువోజ కనబడుతోంది. నన్నయ కూడా తరువోజ వాడాడు. జానపద వాఙ్మయంలో కూడా ద్విపద లక్షణాలు పుష్కలంగా వున్నాయి. మార్గకవిత్వం వల్ల ద్విపద మరుగున పడిపోయింది. అటువంటి ద్విపదను మళ్ళీ సింహాసనం మీద కూర్చోపెట్టినవాడు పాల్కురికి సోమన. మూడింద్రగణాలు, ఒక సూర్యగణం అయితే ఒక పాదం అవుతుంది. ప్రతిపాదంలో మూడో గణం మొదటి అక్షరానికి యతి. అటువంటి రెండు పాదాలను ప్రాస కలుపుతుంది. ద్విపద ఏ పాదానికి ఆ పాదం తెగిపోవాలన్న లక్షణాన్ని సోమన

పాటించలేదు. సోమన ద్విపదను శైవవాఙ్మయ మాధ్యమంగా ప్రమాణీకరించి స్థిరపరిచినాడు.

"ప్రాసమైనను యతిపై వడియైన
దేశిగా నిలిపి యాది ప్రాస నియతి
తప్పకుండగ ద్విపదులు రచియింతు"

అని ధంకా భజాయించి పండితారాధ్య చరిత్రలో ప్రాస యతిని ఎక్కువగా వాడాడు. చిలుకూరి నారాయణరావుగారు– అను ప్రాసావేశము వచ్చినప్పుడు, సంస్కృత వాక్యముల అనుకరణము చేసేటప్పుడు సోమన ప్రాస యతి వాడాడని వివరించారు. ఈ ప్రాసయతి ఒక వింత నడక కల్పించి మరింతగా సయోగ్యతను చేకూరుస్తుందని చెప్పారు.

"ఐహికాముష్మిక ద్విపద హేతువగుట ద్విపదనాబరగు" అని పవిత్రతను ఆపాదించాడు.

"ద్విపదాంబురుహముల ధృతి బసవేశు
ద్విపదాంబురుహము లతిప్రీతి బూంతు
సన్నుతిసేయుదు సత్కవులలర
తిన్నని సూక్తుల ద్విపదరచింతు" (పండితారాధ్య చరిత్ర)

అంటూ మొట్టమొదటిసారి దేశీయచ్ఛందమైన ద్విపదకి కావ్యగౌరవం కల్పించి, పండిత పామరుల ఆదరణకి పాత్రమైన వాడు పాల్కురికి సోమన. ఇతని ప్రభావంతో గోన బుద్ధారెడ్డి, పల్నాటి భారత కవులు, మడికి సింగన, నాదెండ్ల గోపమంత్రి, పిడుపర్తి బసవన, పిడుపర్తి సోమన, తాళ్ళపాక తిమ్మక్క, గౌరన, శ్రీనాథుడు వంటి వారెందరో ద్విపద కావ్యాల ద్వారా ప్రసిద్ధి పొందారు.

ద్విపద తర్వాత సోమన మాత్రాచ్ఛందస్సుగల రగడకి ప్రాధాన్యమిచ్చాడు. "సోమనాథుని బసవరగడయే తరువాతి తెలుగు కావ్యములలోని రగడలకు మూలము" అని పండితుల ఏకాభిప్రాయం. సోమన బసవాధ్య రగడ, గంగోత్పత్తి రగడ, సద్గురు రగడలను రచించినట్లు పిడుపర్తి సోమన చెప్పాడు. బసవ స్తుతి పరమైన "బసవ రగడ"లో మొత్తం 108 పాదాలున్నాయి. అంత్యప్రాసకూడా ఎక్కువగా పాటించాడు. ప్రారంభంలో ఉత్సాహ వృత్తం కనబడుతుంది. బసవరగడ ముద్రితమై లభ్యమవుతోంది.

తెలుగు దేశికవిత్వానికి మరొక అలంకారం ఉదాహరణ ప్రక్రియ. మధుర కవితాశాఖకి చెందినట్టుగా చెప్పబడే ఉదాహరణ వాఙ్మయానికి సోమనాథుడే ఆద్యుడు. ఎనిమిది విభక్తులతో ఎనిమిది వృత్తములు, ఎనిమిది కళికలు, ఎనిమిది ఉత్కళికలు, చివర సార్వవిభక్తిక పద్యం– ఉదాహరణ ప్రక్రియ లక్షణాలు. పాల్కురికి సోమన బసవోదాహరణమే కాకుండా పండితారాధ్యోదాహరణం రాయగా ఆచార్య బి. రామరాజు సేకరించి ప్రకటించారు. 'కళిక' అనేది రగడ భేదం. ఉత్కళికలో సగం. అర్థకళిక, బసవేశ్వరుని మహిమను వర్ణిస్తూ రాగ ప్రధానంగా బసవోదాహరణ రాయబడింది.

32 సీసపద్యాలతో రాయబడిన చెన్నమల్లు సీసాలు దేశీయ ఛందస్సునకు సంబంధించినదే. శ్రీశైల మల్లికార్జునస్వామి పేర నడిమి వయసునందే రచించి యుండునని బండారు తమ్మయ్యగారు నిరూపించారు. సోమన రాసిన గద్యలలో దేశీయ ఛందస్సుతోపాటు సంస్కృత ఛందస్సూ వుంది. ఇటీవల శ్రీ ధూపం బసవ నాగయ్యగారు ఓం నమశ్శివాయ సాహితీ సాంస్కృతిక పరిషత్ ద్వారా శ్రీ తుమ్మపూడి కోటేశ్వరరావు గారి వ్యాఖ్యానంతో ముద్రించారు.

తెలుగుభాష పాల్కురికి సోమన సొమ్ము. భాష అతడు చెప్పినట్లు అతనికి వశమైంది.

"ఉరుతరగద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జానుతెనుగు"

"ఆరూఢ గద్య ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబుగామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు"

– "జాను తెనుగు" అనేది దేశిరచనలో ఒక భాగం. జాను తెనుగుపై సుదీర్ఘమైన చర్చలే జరిగాయి. చాలామంది అచ్చ తెలుగు అన్నారు. అయితే సోమన రచనలన్నీ అచ్చ తెలుగు రచనలు అనటానికి వీలులేదు. తేట తెనుగు– తిన్నని సూక్తి– లోక వ్యవహారంలో నున్న సర్వజన సుబోధమైన తెలుగు. ఇంపు పెంపుగల తెలుగు, భావ ప్రకటన సరళంగా ఉండే తెలుగు– జనవ్యవహారంలో నలిగిపోయిన సంస్కృత శబ్దాలతో

కూడిన దేశి భాష... ఇలా జాను తెనుగుకి విభిన్న వివరణలు ఇచ్చారు. సారాంశంగా తెలుగు భాషలో సహజంగా వాడుకలోగల సంస్కృత, దేశిపదాలతో కూడి స్పష్టంగా, సుబోధకంగా, సరళంగా, ప్రసన్నంగా ఉండే భాష అని చెప్పవచ్చు. సంస్కృత పద ప్రయోగ వ్యామోహం, పాండిత్య ప్రదర్శన లేనిదన్నమాట. అంటే అసలైన తెలుగుకి ప్రాధాన్యం ఇవ్వటమే జానుతెనుగు. పాల్కురికి సోమన అచ్చమైన తెలుగు భాషాభిమాని అనటానికి ప్రత్యక్ష సాక్ష్యమైన పంక్తులివి–

"తెలుగు మాటలనంగ వలదు
వేదముల కొలదియకా చూడు"డు!

పాల్కురికి సోమన తేట తెలుగుకు, ప్రజలభాషకు ఇచ్చిన ప్రాముఖ్యం ఎంతటిదో ఈ కింది ఉదాహరణలు వెల్లడిస్తాయి:

అచ్చులోపం : తర్గు, కర్వ, ఎర్గి, కడ్గి, నర్కి, బడ్తె మొద।

వ్యవహారంలో ఉన్న సంధులు
: చీరెల్ల, కోకమ్మి, ప్రాతప్పు, ఏలిచ్చు, ఏతెంచారగించు, పొంచున్న, జిల్లెడాకులు బ్రహ్మత్య.

మిశ్రసమాసాలు లేదా వైరి సమాసాలు
: చౌదళాబ్జము, శివమరులు, ఇతరవేల్పులు, ఆదికుమ్మరి, భావుకమోజు, దీపకంభములు, షోడశపండువు.

వాడుక పదాలు : మహాదేవి, దాసమయ్య, జాలరి, కొండీడు, ముండమోపుల పగిది, కండక్రొవ్వుదనం, పొట్లాలు, పిల్లాండ్లు, పాతర్లు.

సామెతలు : *అద్దంబులోపలి నీడయట్లు*
ఆడబోయిన తీర్థమెదురు వచ్చినట్టు
ఈనగాచి నక్కలకునిచ్చిన యట్లు
ఎద్దీనెననిన గొందికట్టు మనిన చందము!
కాకులు పెంచిన కోకిలపిల్ల కాకుల బోలునే కావు కావనుచు?

జాతీయాలు : గొడ్డువీగి, పచ్చిబొంకులు, గజస్నానం, ఎండమావులు, నీట వ్రాతలు, నోరితాళం, బయలిదీపము (అస్థిరం), రోకటి పాటలట్లు మొ॥

నిఘంటుకెక్కని పదాలు: అంకు సొంకులు, అక్షిరోగము, అనసులు, అరసుట్టు, అన్నెక్కు, ఉప్పరగుళ్లు, అరగిపండ్లు, ఇజ్జలజ్జల వారు మొ॥

అన్యదేశ్య శబ్దాలు : కఠారము, కడాని, జోహారు, బత్తీసు, ఛత్తీసు.

ఆరె భాషనుపయోగించి పద్యాలు రాశాడు.

పాల్కురికి వర్ణనలు అచ్చంగా తెలుగువారివే- తెలుగు జీవనాన్ని ప్రతిబింబించేవే. బసవేశ్వరుని శివలీలలు, సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనలు, సంగళవ్వ కొడుకును పిలుచు ఘట్టము, వృషభవర్ణన... బెజ్జమహాదేవి శివుని లాలించు వర్ణన మొదలైనవి అపూర్వములు, పండితారాధ్య చరిత్రలోని కోడి వర్ణన ఇది-

"తొలి కోడి కనువిచ్చి నిలిచి మై వంచి
జల జల రెక్కలు సడలించి నీల్గి
గ్రక్కున గాలార్చి కంఠంబు విచ్చి
ముక్కున నీ కెలు చక్కొల్పి కడుపు
నిక్కించి, మెడసాచి, నిక్కిమున్సాచి
కొక్కొరో కుర్రని కూయక మొన్న"

పాల్కురికి సోమన శివభక్తుల్నే పాత్రలుగా స్వీకరించాడు. పురాణ పాత్రల్ని స్వీకరించలేదు. ప్రజల నాలుకలపైగల కథల్ని తీసుకున్నాడు. శివునివంటి వారిని కూడా సామాన్యునిగానే చిత్రించాడు. బసవేశ్వరుడు, మల్లికార్జున పండితారాధ్యుడు వంటి శివభక్తుల్ని శివునిగానే భావించాడు. శివభక్తిగల వారు ఏ కులమువారైనా గౌరవించాడు. ముగ్ధ సంగయ్య, కన్నప్ప, మాదిరాజయ్య, మడివాలు మాచయ్య, నిమ్మవ్వ, మోళిగ మారయ్య, ముసిడి చౌడయ్య మొదలైన సామాన్య పాత్రలకి కావ్యంలో స్థానం కల్పించాడు.

సోమన రచనలలో గ్రామ, పట్టణ ప్రాంతాల, పుణ్యక్షేత్రాల వివరణలు, విశేషాలు గమనిస్తాం. సామాజిక పరిశీలన అనేది కూడా దేశికవి లక్ష్యాలలో ఒకటి. నేలవిడచి సాము చేయని కవి పాల్కురికి సోమన. నన్నయ భారతంలో ఏకవచన ప్రయోగం తప్ప బహువచనంలో గౌరవవాచకం "గారు" కనిపించదు. కానీ పాల్కురికి సోమన తన రచనలలో అనేక మార్లు 'గారు' ఉపయోగించాడు. ఈ ప్రయోగం తెలుగు నాట 12వ శతాబ్దిలోనే బాగా ఉన్నట్టు సాక్ష్యం ఇదే! ఉదాహరణలు-

"సోమనాథయ్యగారు"– "మాదిరాజయ్యగారు"

"మడివాలు మాచయ్యగారు"– "శివనాగయ్యగారు".

అంతేకాదు – "సురసానమ్మగారికి", "కామలదేవిగారు" అంటూ స్త్రీలను గౌరవించడం గమనార్హం.

పాల్కురికి సోమన దేశీయతలో తెలుగువారి ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వటం గమనిస్తాం. ఆడపడుచు ప్రాముఖ్యం, భార్యా భర్తల అనుబంధం, మాతృత్వం, ముద్దుల మరది, మరదలు, పుత్రవ్యామోహం మొదలైన వాటిని బసవపురాణంలోను, పండితారాధ్య చరిత్రలోను తనివితీర .వివరించాడు. ఆనాటి ఆభరణాలు, ఆహారం, వస్త్రాలు, వృత్తులు, కొలతలు, నాణెములు, వినోదాలు, జాతులు, వ్యాధులు, చికిత్స... ఇవన్నీ సోమన రచనలలో ఎంత విరివిగా ఉన్నాయో డా॥ అనప్పిండి సూర్యనారాయణ మూర్తిగారు ప్రత్యేకంగా సిద్ధాంత వ్యాసమే రాశారు. శివభక్తులైతే, శైవమతస్థులైతే కులవివక్ష లేదనీ, అందరూ సమానులే అని చాటాడు.

పాల్కురికి సోమన కేవలం కవికాడు. అతని శాస్త్ర పాండిత్యం పారము ముట్టినది. బహుభాషాపాండిత్యం, బహుశాస్త్ర పరిజ్ఞానం ఉన్నా శైవమతంకోసం దేశి ఉద్యమాన్ని చేపట్టాడు. పాండిత్య ప్రకటనకి కాక సామాజిక స్పృహకే ప్రాముఖ్యమిచ్చాడు. పరమత సహనం లేకపోవటం అనే లోపం సోమనాథునిలో వున్నా తెలుగు భాషకి, తెలుగు జాతి జీవనానికి, తెలుగుదనానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చి దేశి కవిత్వోద్యమానికి మార్గదర్శకుడయ్యాడు.

పాల్కురికి సోమన దేశికవిత్వోద్యమం ఎంత బలవంతమైనదంటే, ఎంత తీవ్రమైనదంటే తరువాతి కవులు సోమన ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. నన్నయ మార్గాన్ని కాకుండా, చంపూ పద్ధతిని కాకుండా దేశిమార్గాన్ని అనుసరించి పరిపుష్టం చేసిన దేశికవితా సార్వభౌముడు పాల్కురికి సోమన. ఇతని దేశి రచనల ప్రభావం ఎలా వుందో రేఖా మాత్రంగా పరిశీలిద్దాం–

సోమన చిరుతొండనంబి– శ్రీనాథుడి హరవిలాసంలో మరింతగా విస్తరించి రాణించాడు.

సోమన పండితారాధ్య చరిత్రను శ్రీనాథుడు రచించినా అలభ్యం.

సోమన ద్విపదను శ్రీనాథుడు అందిపుచ్చుకొని పల్నాటి వీరచరిత్ర రాశాడు. శతక ప్రక్రియకి ఆద్యుడై నేటి వరకు శతకం సజీవంగా ఉండటానికి మూల కారకుడయ్యాడు.

ఉదాహరణ ప్రక్రియలో అనంతరకాలంలోనే కాదు – ఆధునిక కవులు కూడా ఉదాహరణలు రాశారు.

శ్రీనాథుని రచనలలో వీరశైవ సంప్రదాయ లక్షణాలున్నాయి.

శ్రీనాథుని సీసపద్య రచనపై పాల్కురికి ప్రభావం వుంది.

పాలిశెట్టి లింగన్న "నవ చోళుల చరిత్ర"ను ద్విపద కావ్యంగా రాశాడు.

అన్నమయ్య భార్య తిమ్మక్క సుభద్రా కల్యాణాన్ని ద్విపదలోనే రచించింది.

దక్షిణాంధ్రయుగంలో దేశిరచనలకీ, ఆధునిక కాలంలో అచ్చ తెలుగు రచనలకీ పాల్కురికి సోమనే బాట వేశాడు.

"నా యొడయుండ, నావిభుడ, నాహృదయేశ్వర, నా మనోరమా
నా యిలవేల్పు, నా వరద, నా గురులింగమ, నాదు జంగమా
నాయధినాథ, నా వరుడ, నన్ను గృపామతి బ్రోవుమయ్య దే
వా యమి బృందవంద్య, బసవా బసవా బసవా వృషాధిపా!"

అంటూ శివుడ్నే సర్వస్వంగా భావించిన భక్తాగ్రగణ్యుడు సోమన. తెలుగులో శతక వాఙ్మయానికి బీజం వేస్తే ఇవాళ ఆ ప్రక్రియ శాఖోపశాఖలుగా విస్తరించింది.

నన్నయ భారత ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తూ "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని..." అనే సీసపద్యం రాస్తే- దానిని అనుసరిస్తూ పాల్కురికి సోమన చతుర్వేద సార ప్రాశస్త్యాన్ని ఇలా వెల్లడించాడు-

"వైదికులిది శుద్ధ వైదికంబని యెన్న
శాస్త్రజ్ఞులిది ధర్మ శాస్త్రమనగ
తార్కికులిది మహోత్కరంబనంగ
పౌరాణికులిదె పురాణమనగ

ఆగమవిదులు దివ్యాగమంబిదియన
తంత్రజ్ఞులిది వీరతంత్రమనగ
భక్తవారంబిది భక్తి మార్గంబన
ముక్త్యర్థులిది మహాముక్తి యనగ
కవులు భువిని నిదియె కావ్యంబనంగ
సజ్జనులకెల్ల మిగుల సంతసమున
నిర్వికల్ప రతి చతుర్వేద సారమున్
పద్యముల్ రచింతు బసవలింగ" (చతుర్వేద సారము)

చివరగా పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో తెలిపిన సత్యవాక్కులను పరిశీలించండి-

"బసవపురాణ పండితారాధ్య చరిత్రములు రెండును నెక్కడ చూచిన నక్కడ నవరసములు పొంగి పొరలి పోవునంతటి రసోదంచితములుగ ద్విపదులలో గూర్పబడినవి. భక్త శిరోమణి యగు పోతన భక్తి పారవశ్యపు కవిత్వమునకును, కవిసార్వభౌముడగు శ్రీనాథ మహాకవి నుడికారముల గడుసుతనంపు చిన్నెలకును, కర్ణాట రాజ్య రమానాథుడు నాంధ్రభోజుడు నాంధ్రకవియునగు శ్రీకృష్ణదేవరాయ మహారాజుల యాముక్తమాల్యద మున్నగు కృతులలోని యద్భుత వర్ణన పటిష్ఠములగు సందర్భములకును, దీనికి దానికిని యేల ఇందదనుక మన యాంధ్ర సారస్వతమునగల హృద్యములగు, రసవద్వర్ణనోదంచితములగు కావ్యపు మెరుగుల కన్నిటికిని ఈ రెండు ద్విపద కావ్యములే మార్గదర్శకములై రాజిల్లినవియనుటలో నేమియును సందియము లేదు".

2

శ్రీకాళహస్తీశ్వర శతకంలో సామాజిక స్పృహ

ప్రాచీన లాక్షణికులు కవికి లోకానుశీలన ఉండాలని చెప్పారు. "లోకశాస్త్ర కావ్యాద్యవేక్షణాత్" అనడంలో భావం ఇదే. పాశ్చాత్యులు కూడా "Poetry is the criticism of life" అన్నారు. అయితే ప్రాచీన కవిత్వంలో కావ్యాలు, ప్రబంధాల కంటే శతకాలలోనే సామాజిక చిత్రీకరణ బాగా ఎక్కువ. శతక ప్రక్రియను సామాజిక చైతన్యానికి అనువైన ప్రక్రియగా కవులు మలచుకొన్నారు. ఆ వెసులుబాటు శతక రచనలో వుంది. శతక రచన పూర్తిగా కవినిష్ఠం. అంటే ఆత్మాశ్రయ లక్షణం గలది. శతకంలో కవి గుండె విప్పి ఆరవేసుకుంటాడు. అందుకే శతకం కవి మనసుకి, వ్యక్తిత్వానికి నిలువుటద్దం.

రాయలకాలం నాటి ప్రముఖ శతకం శ్రీకాళహస్తీశ్వర శతకం. శివభక్తుడైన ధూర్జటి భక్తితత్త్వంతోపాటు సామాజిక చిత్రీకరణను ప్రకటించిన వృత్త పద్యశతకం "శ్రీకాళ హస్తీశ్వర శతకం". రాయల ఆస్థానంలో పదవిని వదిలివేసిన తర్వాత రాయబడిన శతకం కాబట్టి ఇందులో ప్రతిబింబించే సాంఘిక పరిస్థితులన్నీ రాయల అనంతరకాలం నాటివని తెలుస్తుంది. రాయల అనంతరం ఆంధ్రసామ్రాజ్యం అఖండతను కోల్పోయి ఛిన్నాభిన్నమైంది. ఆనాటి సమాజాన్ని "ఎక్స్‌రే" కళ్ళతో పరిశీలించి ధూర్జటి ఈ శతకం రాశాడు. ప్రబంధయుగంలో శ్రీకాళహస్తీశ్వర శతకంలో చిత్రించబడిన సామాజిక పరిస్థితులు మరొక రచనలో చూడం.

మనుషుల వ్యామోహం: మనుషులు కొన్నిటిపట్ల మక్కువ ఎక్కువ పెంచుకొంటారు. బంధాలను తెంచుకోలేరు. ప్రతి విషయానికీ బెంబేలు పడతారు.

అసహనం ప్రదర్శిస్తారు. అక్కరలేని వాటిపై వ్యామోహం పెంచుకొంటారు. విరక్తుడు కాలేక కష్టాలు కొని తెచ్చుకొంటున్నాడు. ఈ సామాజిక అంశాలను ధూర్జటి చాలా పద్యాలలో వెల్లడించాడు.

"అంతా మిథ్య తలంచి చూచిన నరుండ ట్లౌటెఱింగిన్ సదా
కాంతల్పుత్రులు నర్థముల్ తనువు నిక్కంబంచు మోహార్ణవ
భ్రాంతింజెంది చరించు గాని..." (3వ పద్యం)

అనే పద్యంలో సమాజంలో మానవులు మోహసముద్రంలో పడి కొట్టుకు పోతున్నారన్నాడు. స్త్రీలు, పుత్రులు, డబ్బు, శరీరం... ఇవన్నీ శాశ్వతం, యథార్థం అనే భావంతో వీటి రక్షణకోసం, వీటి పెంపుకోసం అష్టకష్టాలూ పడి దుఃఖానికి నిచ్చెనలు వేస్తున్నాడు. అంటే అనురాగం వద్దని కాదు, డబ్బు వద్దని కాదు – ఎంతవరకు అవసరమో అంతవరకే– మితిమీరవద్దంటున్నాడు.

"ఒక పూటించుక కూడు తక్కువగునే నోర్వంగ లేరెండకో
పక నీడన్వేదకుం చలింజడిసి కుంపట్లెత్తుకోజూచు, వా
నకు ఇండ్లిండ్లును దూరు నీ తనువు దీనన్వచ్చు సౌఖ్యంబురో
సిక డాసింపరు గాక మర్త్యులకటా! శ్రీకాళహస్తీశ్వరా!" (80వ పద్యం)

ఇందులో కూడా మానవుల చిత్తవృత్తిని వర్ణించాడు. ఒకపూట కూడా తక్కువ కాకూడదు. ఎండ అక్కర్లేదు, వాన అక్కర్లేదు, చలికి ఓర్చుకోలేడు. శరీరం పట్ల ఇంత వ్యామోహం ఎందుకో అంటున్నాడు ధూర్జటి.

రాజరిక వ్యవస్థ: రాయలపరిపాలన అనంతరం చిన్న చిన్న రాజులు పరిపాలనలోకి వచ్చారు. వారంతా స్వార్థపరులు, దుర్మార్గులు, కళాపోషణ లేనివారు. అధికారమదాంధులు. ఇవన్నీ గమనించిన ధూర్జటి నాటి సమాజంలోగల రాజరిక వ్యవస్థనీ రాజులు ప్రజల్ని బాధించడాన్ని వివరంగా కళ్లకి కట్టించాడు. అంతటి సామాజిక స్పృహగల ప్రాచీన కవిశ్రేష్ముడు ధూర్జటి.

"రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు, వారిచ్చు నం
భోజాక్షి చతురంతయానతురగీ భూషాదులాత్మ వ్యధాబీజంబుల్" (18.ప.)

"ఆ రాజశబ్దంబు ఛీ ఛీ జన్మాంతరమందు నొల్లను జుమీ" (21.ప.)

"రాజర్థాతురు డైనచో నెచట ధర్మంబుండు...?" (22వ ప.)

"రాజన్నంతనె బోవు నాకృపయు, ధర్మంబు..." (39వ ప.)

రాజరిక వ్యవస్థలో జీవిస్తూ ఆ వ్యవస్థను దుమ్మెత్తి పోయడానికి ఎంత ధైర్యం కావాలి? సామాజిక బాధ్యతగల కవికి ఈ గుండె ధైర్యం వుంటుంది. ఉండాలని తెలిపాడు.

పుత్ర సంతతి: ధూర్జటికి గల సామాజిక అవగాహనను పరిశీలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. "కొడుకు పుట్టాలి" అని అందరూ కోరుకొంటారు. పుత్రుడు పున్నామ నరకం నుండి రక్షించేవాడని శాస్త్రం చెప్తుందంటారు. దీనిని సాక్ష్యాలతో తిప్పికొడుతూ ధూర్జటి ఇలా ప్రకటిస్తాడు–

"కొడుకుల్ పుట్టరటంచు నేడ్తు రవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరే కౌరవేంద్రున కనేకుల్, వారి చే నేగతుల్
వడసెన్? పుత్రులు లేని యా శుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్ష పదంబ పుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!" (28వ ప.)

ధృతరాష్ట్రునికి నూరుగు కొడుకులు పుట్టినా దుర్గతి తప్ప సద్గతి కలుగలేదు. కొడుకులు లేకపోయినా శుకమహర్షికి పుణ్యగతి కలగలేదా? కాబట్టి లోకం అంతా కొడుకు కావాలని కోరుకోవటం తగదని సంప్రదాయాన్ని ధిక్కరించాడు ధూర్జటి.

మూఢనమ్మకాలపై ధ్వజం: సమాజంలోగల శకునాలను, హాస్త సాముద్రికాలను, గ్రహదోషాలను ధూర్జటి నిరసించాడు. చిత్తశుద్ధితో దేవుడ్ని సేవించాలి గానీ వీటిని నమ్ముకొని మరింత దిగులు చెందటం ధూర్జటికి నచ్చలేదు. ఎంతో సామాజిక పరిశీలన ఉన్న కవి కాబట్టి ఈ విధమైన భావాలను వెల్లడించాడు.

"గ్రహ దోషంబులు దుర్నిమిత్తములు నీ కల్యాణ నామంబు..."(29.ప)

"కలలంచు న్శకునంబులంచు గ్రహయోగంబంచు
సాముద్రికంబులటంచు దెవులంచు, దిష్టియనుచు భూతంబులంచు...
(53వ ప.)

సమాజాన్ని ఎంతో "లోనారసి" గానీ ఇలా చెప్పలేడు.

చిత్తశుద్ధి లేకపోవటంపై ఆగ్రహం: సమాజంలో నీతులు చెప్పటం తప్ప ఆచరణ కనిపించదు. "ఎదుటివాడికి చెప్పేటందుకే నీతులున్నాయి" అన్నది సర్వసాధారణమైంది. ధూర్జటి ఈ కుహనా తత్వాన్ని కూడా వదిలిపెట్టలేదు.

"శ్రుతులభ్యాసము చేసి శాస్త్ర గరిమల్గోధరించి... వృధావచనము
ల్చెప్పంగ నే కాని" *(58వ ప.)*

"చదువు ల్నేర్చిన పండితాధములు స్వేచ్ఛాభాషణ క్రీడలన్ వదరన్..."
(70వ ప.)

జ్ఞాతులు ద్రోహులు: దాయాదుల స్వభావాన్ని ధూర్జటి బయటపెట్టాడు. మహాభారతం, పల్నాటి భారతం దాయాదుల స్వభావానికి నిలువుటద్దాలు. ధూర్జటి ఈ లోకరీతినీ వదలకుండా వెల్లడించాడు–

"జ్ఞాతుల్ద్రోహులు వాండ్రుసేయు కపటీర్ష్యాది క్రియాదోషముల్..." (69ప.)

అంటూ వారు చేసే పనులు సహింపశక్యం కాదని స్పష్టీకరించాడు.

మృత్యుభయం: సమాజంలో ప్రతిఒక్కరికి చావుభయమే. "పుట్టినవాడు గిట్టక మానడు" వంటి సూక్తులు తెలిసినా – తన కళ్ళెదుటే అందరూ మరణించడం చూస్తూ ఇది సహజం" అనుకోడు. ఈ పరిస్థితిని "తాతల్ తల్లియు తండ్రియున్ మరియు పెద్దల్చావగా చూడరో భీతింబొందంగ నేల చావునకు..." (99 ప.) అని తెలుపుతూ కళ్ళు తెరిపిస్తాడు.

పదవీదాహం: కాలమేదైనా మానవ స్వభావం 'అధికారదాహం'. దానికోసం చెయ్యరాని పనులు చేస్తారు. లాభిస్తుందంటే ఎంతటి దారుణానికైనా ఒడిగడతారు. ఈ సామాజిక సత్యాన్ని ఇలా చెప్తాడు ధూర్జటి–

"ఒకరి జంపి పదస్థులై బ్రతుకతామొక్కక్కరూహింతురే
లోకొతామెన్నడు జావరో తమకు భోవోసంపదల్..." *(67ప.)*

ఈ విధంగా ధూర్జటి 'ప్రిజమ్'లాంటి జీవితపు కోణాల్ని నిశితంగా దర్శించి శ్రీకాళహస్తీశ్వర శతకంలో ప్రదర్శించాడు. శతకకవి సమాజంలో ఒకడనీ, శతకకవికి సామాజిక స్పృహ– సామాజిక బాధ్యత ఉంటుందని తెలిపాడు. అయితే ఈ సామాజిక సందేశమంతా భక్తి నేపథ్యంగానే చెప్పాడని మర్చిపోకూడదు. ధూర్జటి "స్తుతమతి" అనడానికి, అతని పల్కు అతులిత మాధురీ మహిమ కలది అనడానికి ఈ శతకం ఒక మచ్చు తునక. తొలిసమాజ కవుల్లో ధూర్జటి స్థానం సుస్థిరం.

3

కావ్య, ప్రబంధ శబ్దాలు సమానార్థకాలు!

ఉద్దేశం: మన సాహిత్య చరిత్రకారులు కావ్యం వేరు, ప్రబంధం వేరు అని నిర్ణయించారు. శ్రీనాథయుగాన్ని కావ్యయుగంగా రాయలయుగాన్ని ప్రబంధయుగంగా పేర్కొన్నారు. కావ్యం, ప్రబంధం భిన్న ప్రక్రియలన్నారు. ఈ అంశంపై పూర్వం చర్చలు జరిగినా ప్రస్తుత సందర్భంలో మరొకసారి చర్చించుకొని దానికి భిన్నంగా కావ్య, ప్రబంధాలు ఒకటేనని స్పష్టపరచటం ఈ వ్యాసోద్దేశం.

సందర్భం: పి.జి.స్థాయి పరీక్షలలో, సివిల్స్ పరీక్షలో కావ్యం, ప్రబంధం ప్రక్రియలపై ప్రశ్నలుంటున్నాయి. అధ్యాపకులే కాకుండా సాహిత్య విద్యార్థులను కూడా తికమక పెట్టే అంశం. భేదాలు చెప్పాలి కాబట్టి "గిట్టుబాటు"గా చెప్పక తప్పటం లేదు. వ్యవహారంలోనూ, విమర్శలోనూ, బోధనలోనూ పండితులూ, ఆచార్య వర్యులూ అందరూ శృంగార నైషధకావ్యం, మనుచరిత్ర కావ్యం, ఆముక్తమాల్యద కావ్యం... అంటూ కావ్య, ప్రబంధాలను సమానార్థకంగానే వాడుతున్నారు. మరి సాహిత్య విద్యార్థులకెందుకీ భేదం?

కావ్యం: 'కవయతీతి కవిః తస్యకర్మ కావ్యమ్"– విద్యాధరుడు.

వర్ణించేవాడు కవి. అతని నిర్మాణం కావ్యం. అంటే వర్ణన ప్రధానమైనది కావ్యం. మరి ప్రబంధంలోనూ వర్ణనే ప్రధానం గదా!

మమ్మటుడు కూడా "సాలంకారే" అంటూ అలంకారిక శైలిని పేర్కొన్నాడు. ప్రబంధాలలోనూ అలంకారికత ముఖ్యమే. విశ్వనాథుడు "వాక్యం రసాత్మకమ్ కావ్యమ్" అనటం విదితమే. ప్రబంధంలో కూడా రసపోషణ– శృంగార, వీర, భక్తి రసాలు

అత్యంత ముఖ్యం. మరి జగన్నాథ పండితరాయలు "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అని నిర్వచించాడు.

"ఒక్కొక్క యర్థమును పునఃపునరనుసంధానము చేయగా అలౌకికానందము కలుగుచున్నది. ఆయానందమునే లోకోత్తరాహ్లాదమనియు నందురు. ఆహ్లాదము యొక్క లోకోత్తరాహ్లాద జనకజ్ఞాన గోచరత్వమే రమణీయత్వము. చమత్కార జనక భావనా విషయార్థ ప్రతిపాదక శబ్దము కావ్యము అని సిద్ధము" అని వ్యాఖ్యానించారు ఆచార్య కాకర్ల వేంకటరామనరసింహం (సాహిత్య దర్శనము. పుట 55). ప్రబంధాలలో ఆనందం, చమత్కారం ప్రధానం. అదే రమణీయత్వం. అందుకనే కవిత్రయం భారతాన్ని కావ్య దృష్టితో అనువదించారంటారు. ప్రబంధాలలో కూడా ఈ రమణీయతకే పెద్ద పీట.

న్యాయవాగీశుడు, వాగ్భటుడు మొదలైన లాక్షణికులు కావ్యానికి గుణాలు, రీతులు ముఖ్యమన్నారు. (ప్రబంధ రచన అలరించడానికి ఇవి హేతువులని విదితమే). కావ్యహేతువులుగా చెప్పబడిన ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలు ప్రబంధకవికీ ఉండాలి. అప్పుడే అతను ఉత్తమ కవి కాగలడు. కావ్యాత్మ గురించి పలికిన పలుకులన్నీ ప్రబంధానికి కూడా వర్తిస్తాయి. ప్రబంధ లక్షణాలను చెప్తూ మన విమర్శకులు– 'వక్రోక్తి వ్యంగ్యోక్తి' ఉండాలన్నారు. మరి ఆనంద వర్ధనుడు – "ధ్వన్యాలోకం"లో "కావ్యాస్యాత్మాధ్వనిః" అన్నాడు. కుంతకుడు "వక్రోక్తి జీవితం"లో "వక్రోక్తిః కావ్య జీవితమ్" అన్నాడు. అంతే కాదు శ్లేష– వక్రోక్తికి శోభను ఆపాదిస్తుందన్నాడు. మరి 'శ్లేష'తో రచించిన వసుచరిత్ర కావ్యం కాదా? వరూధినీ ప్రవరుల సంభాషణలో వ్యంగ్యోక్తి, వక్రోక్తులు లేవా? ఇవి కావ్య లక్షణాలే కదా! క్షేమేంద్రుడు తన "ఔచిత్య విచార చర్చ"లో "ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్" అన్నాడు. రసపోషణకీ, పాత్ర చిత్రణకీ ఔచిత్యం ముఖ్యం. ప్రబంధానికీ ఇదే ముఖ్యమని తెలిసిందే.

ఆలంకారికులు కావ్యపరంగా చెప్పినవన్నీ ప్రబంధానికీ అన్వయిస్తున్నాయని పై ఉదాహరణలు, వివరణలు తెలుపుతాయి.

ప్రబంధం: ప్రబంధ శబ్దం మొట్టమొదటగా పాణిని రాసిన 'అష్టాధ్యాయి'లో కనిపిస్తుంది–

"నానద్య తనవత్ క్రియా ప్రబంధ సామీప్యయోః"

ఇక్కడ ప్రబంధ శబ్దం కావ్యంతో, సాహిత్యంతో సంబంధం లేకుండా వాడబడింది. దీనికి "సాతత్యం" అని అర్థం. కాల సంబంధమైన నైరంతర్యం అని భావం.

భరతుడు "నాట్యశాస్త్రం"లో ప్రబంధ శబ్దం వాడలేదు. కానీ 'కావ్య' శబ్దాన్ని దృశ్యకావ్యపరంగా వాడాడు. కాళిదాసు కాలంనాటికి ప్రబంధ శబ్దం రూపకంగా వాడబడింది. బాణుని కాదంబరికి రాసిన మహోపాధ్యాయ భానుచంద్ర సిద్ధిచంద్రులు *"ప్రబంధాః కథాః తేషాం రచనేన గ్రథనేన"* అని వివరణ ఇచ్చారు. ప్రబంధ రచన అనగా కథా ప్రధాన రచన అని భావం. 'కథ' అనేది సంస్కృత గద్యకావ్య భేదం కూడా! కాబట్టి 'కాదంబరి'ని కథా ప్రబంధమన్నారు.

"భావికత్వమితి ప్రాహుః ప్రబంధ విషయంగుణమ్..." అంటూ భామహుడు పద్యకావ్యాన్ని ప్రబంధంగా పేర్కొన్నాడు. రుద్రటుడు 'కావ్యాలంకారం'లో ఉద్దేశపూర్వకంగానే కావ్యశబ్దానికి బదులుగా ప్రబంధ శబ్దాన్ని ఉపయోగించి

"సంతి ద్విధా ప్రబంధాః కావ్య కథాఖ్యాయి కాదయః

కావ్యే ఉత్పాద్యానుత్పాద్యా..." అన్నాడు. ప్రబంధం శ్రవ్యకావ్యమనే ఇతని ఉద్దేశం.

జయదేవకవి గీత గోవింద కావ్యం రచించాడు. ఇందులో భక్తి శృంగారాలున్నాయి. లేదా 'మధురభక్తి' ఉంది. అయితే కవి స్వయంగా–

"కరోతి జయదేవకవిః ప్రబంధమ్" అనటం గమనార్హం. అలంకార గ్రంథాలను, వేదాంతాది శాస్త్ర గ్రంథాలను కూడా ప్రబంధంగా వ్యవహరించడం వుంది.

"అత్ర కేచిత్ శోకః శ్లో కత్వమాగత
ఇత్యుక్త్వా అస్మిన్ ప్రబంధేశోకరస ఏవ..."

అంటూ వాల్మీకి రామాయణానికి వ్యాఖ్య రాసిన గోవిందరాజు పలికారు. ఆయన దృష్టిలో రామాయణం ప్రబంధం! సీత ప్రబంధ నాయిక! రాముడు ప్రబంధ నాయకుడు! *"సీతాయాః ప్రబంధ నాయికాత్వముక్తం"* అన్నది సాక్ష్యం.

దండి రచించిన కావ్యాదర్శం, దశకుమార చరితము, అవంతిసుందరీ కథ–లను కలిపి ప్రబంధ త్రయం అనటం ప్రసిద్ధి. తెలుగులో 'దశకుమార చరిత్ర'ను తొలి కథాకావ్యంగా పేర్కొంటారు.

ఇక వాచస్పత్య నిఘంటువు ప్రకారమైతే "ప్రబంధ్యతే ఇతి ప్రబంధః" అని వుంది. ప్రబంధమంటే ఒక రచనా విశేషంగానే చెప్పడింది. వి.ఎస్. ఆప్టే నిఘంటువులో కూడా ప్రబంధ శబ్దానికి–

"Any literary work or composition. A beigned story, a work of imagination founded on a substranctum of fact" అని అర్థం కనిపిస్తుంది.

మొత్తంమీద సంస్కృతంలో ప్రబంధశబ్దం 'ఒకరచన', 'పద్యకావ్యం', 'కథాకావ్యం', 'కల్పితకథా కావ్యం' మొదలైన అర్థాల్లోనే కనిపిస్తుంది. కొన్నిచోట్ల కావ్యం, ప్రబంధ శబ్దాలు పర్యాయ పదాలుగానూ వాడబడ్డాయి. ఇక మన తెలుగు కవిత్వంలో ఎలా వాడబడిందో చూద్దాం.

నన్నయ్య: *"నీయనుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహం*
బునం జేసి నా నేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెద"

అన్నాడు. తన భారతాన్ని కావ్యంగానే పేర్కొన్నాడు. మరి ఇతిహాసాన్ని కావ్యంగా అన్నాడే! అంటే ఇతిహాసాన్ని కావ్యంగా మలుస్తానన్న అభిప్రాయంగా భావించవచ్చనుకుంటాను. జక్కన "విక్రమార్క చరిత్ర"లో నన్నయను ప్రస్తుతిస్తూ.

"వేయి విధంబులందుఁ బదివేవురు పెద్దలు సుప్రబంధముల్
పాయక చెప్పిరట్లు..."

అన్నాడు. "సుప్రబంధాలు" చెప్పారనటం గమనార్హం.

నన్నెచోడుని 'కుమారసంభవం' కావ్యాన్ని తొలి ప్రబంధంగా కొందరు పేర్కొంటారు. అది కావ్యమా? ప్రబంధమా? అన్న చర్చలు కూడా జరిగాయి. కుమార సంభవం అవతారికలో–

"జంగమ మల్లికార్జును.....
... విస్తరించెద ప్రబంధము సద్రసబంధురంబుగాన్"

అన్న పద్యం వుంది (1-48). ప్రబంధ శబ్దాన్ని ప్రయోగించిన మొదటి కవి నన్నెచోడుడే. 'రసబంధురం' ప్రబంధ లక్షణంగా చెప్పాడు. కానీ–

"సమస్త వస్తు కవీశ్వర రచిత రుచిర కావ్య రత్నవీధి"

"సత్కవి కావ్యము నొక్కరూపమై"

"తల యూపింపని యది కావ్యమె?"

"పరిపూర్ణంబైన దివ్య కావ్యాంగనా సృష్టికిం"

అని 'కావ్యం' పదానికి ప్రాధాన్యమిచ్చాడంటే కావ్య, ప్రబంధ శబ్దాలకు అంత వ్యత్యాసం లేదనే అవగతమవుతుంది.

తిక్కన తన "విరాటపర్వం"లో-

"అని రచనా కౌతుకమునమన
మలరగ నీ ప్రబంధమండలికధినాథుని గా"

అన్నాడు. అంతేకాదు- తర్వాతి వచనంలో "అని పూని ఈ దృశంబులగు పుణ్య ప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు..." అన్నాడు. నిర్వచనోత్తర రామాయణంలో తిక్కన "ఎవ్వరి వారలరీ ప్రబంధమే మునికృతమన్న" అని ప్రయోగించాడు. "మత్ప్రణీత ప్రబంధము" (10-123) అనీ వాడాడు. తిక్కన శిష్యుడు కేతన 'దశకుమార చరిత్ర'లో

"సరసకవీంద్రుల సత్ప్రబంధమలొప్పఁ
గొను ననుటధిక కీర్తనకుఁ దెరువు"

అనటం గమనార్హం. తిక్కన అంకితం తీసుకొన్నది దశకుమార చరిత్ర ఒక్కటే! అది కావ్యం- కథా కావ్యం! మరి కేతన 'ప్రబంధం' అన్నాడే! అంటే కావ్యం, ప్రబంధాలు పర్యాయ పదాలుగానే భావించాలి మరి!

పాల్కురికి సోమన-

"బసవపురాణ ప్రబంధమన్ పేరి
బసవపురాణమన్ పట్టిగలాడ"

అంటూ బసవపురాణ ప్రబంధం- అనటం గమనార్హం. అంటే కావ్యానికి బదులుగానే ప్రబంధం అన్నాడని గ్రహించవచ్చు. "ప్రబంధ వాఙ్మయ వికాసము" అనే సిద్ధాంత గ్రంథంలో డా॥ పల్లా దుర్గయ్య ఇలా అంటారు- "అనేక పర్యాయములు ప్రబంధ శబ్దమును ప్రయోగించుటచే నీ పండితారాధ్య చరిత్రము ప్రబంధమేయని సోమనాథుడు తలచెనేమో యని తోచుచున్నది" (పుట 37).

అని అన్నదీ శ్రీనాథుడే! ఇంతే కాదు- శ్రీనాథుడి ఆశ్వాసాంతగద్య ఇది-

"ఇది శ్రీమత్ కమలనాభ పౌత్ర మారయామాత్య పుత్ర
సకల విద్యాసనాథ శ్రీనాథభట్ట ప్రణీతంబైన
శృంగార నైషధ కావ్యంబునందు ప్రథమాశ్వాసము"

దీనినిబట్టి ప్రబంధ కావ్య శబ్దాలు పర్యాయ పదాలనే తెలుస్తుంది.

భీమఖండంలో బెండపూడి అన్నయామాత్యుడు శ్రీనాథుడిని పిలిపించి ఇలా అన్నాడు-

"పాకనాటింటివాడవు బాంధవుడవు
కమలనాభుని మనమడవమలమతివి
నాకు గృతిసేయు మొక ప్రబంధంబు నీవు"

"ఒక ప్రబంధంబు వెలితిగా సుకృతగరిమ" అనీ అన్నాడు. అంతే కాదు. "రచియింపు మంధ్రజగతీ భాషా ప్రబంధంబుగన్" అన్నాడు. శ్రీనాథుడు కూడా "ఆంధ్రభాషా ప్రబంధంబుగ జెప్పందొడంగితి", "భీమేశ్వర పురాణంబను మహాప్రబంధంబునందు"... అనీ అన్నాడు. అతనేమో ప్రబంధం అంటూ వుంటే మనం కాదు- కావ్యం అంటున్నాం!

కాశీఖండం పీఠికలో శ్రీనాథుడు కావ్య, ప్రబంధ శబ్దాలు వాడాడు. "నేను సమకట్టితి గావ్యము గానొనర్పగన్" అన్న వెంటనే "ఇమ్మహా ప్రబంధ ప్రారంభంబు కర్ణాకర్ణి కావశంబున నాకర్ణించి..." అన్నాడు. వేమ భూపాలుడు-

"నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాడవు మాకు నాశ్రితుడవనఘ!
ఇపుడు చెప్పదొడగిన ఈ ప్రబంధ
మంకితము సేయు వీర భద్రయ్య పేరు"

అని అడిగాడు. మరి ప్రథమ, ద్వితీయ, పంచమ, షష్ఠాశ్వాసాల చివర "కాశీఖండంబును మహాకావ్యంబునందు" అనటం, తృతీయ, చతుర్థాశ్వాసాల చివర "కాశీఖండంబను మహా ప్రబంధంబునందు" అనటం పరిశీలిస్తే కావ్య, ప్రబంధ శబ్దాలు సమానార్థకాలని స్పష్టమవుతుంది.

హరవిలాసం శ్రీనాథుడి దృష్టిలో ప్రబంధం, మహాప్రబంధం, శైవ ప్రబంధం!

మనం ప్రబంధకవులుగా నొక్కివక్కాణిస్తూ వారి కృతుల్ని ప్రబంధాలని ముద్రవేస్తున్నాం. ఇవి కావ్యాలు కావు అంటున్నాం కానీ వాస్తవం ఏమిటంటే ఆ ప్రబంధకవులే తమ కృతుల్ని కావ్యాలుగా పేర్కొనటం. ఉదాహరణకి–

"నవీన కావ్య రచనకుననుకూల కథల్ దలంచు నా సమయమునన్" – పెద్దన (పీఠిక). "కళాపూర్ణోదయంబను మహాకావ్యంబు నిర్మింప గడంగితి" – పింగళి సూరన (పీఠిక)

(ఆశ్వాసాంతగద్యలో కూడా సూరన మహాకావ్యమని పేర్కొన్నాడు).

"ఒక్కమహాకావ్యంబు రసోచిత చమత్క్రియా కల భవ్యంబుగా నొనరింపం బూని" – రామరాజ భూషణుడు (వసుచరిత్ర పీఠిక)

ఆధునికుల అభిప్రాయం: "పురాణ ప్రసిద్ధమగు కథను గాని లేక స్వకపోలకల్పిత కథనుగాని యాధారముగ గొని పురశైలాద్యష్టాదశ వర్ణనములలో గథకు సంబంధించిన వానింగొన్ని వర్ణనల గూర్చి రచించిన గ్రంథము ప్రబంధము నాబడు, కావ్యమనియు జెప్పనొప్పును" – పారిజాతాపహరణానికి 'సురభి' వ్యాఖ్యలోది ఇది.

పండిత ఉమాకాంత విద్యాశేఖరులు 'వీర చరిత్ర'లో ద్వితీయ భూమికలో ఇలా అన్నారు– (పుట 2). "ప్రబంధమంటే కావ్యమేగాని విశేషార్థమేమీ లేదు. రామాయణ, భారతాదులు కూడా ప్రబంధాలేను. ప్రబంధం, కావ్యం పర్యాయ పదాలని, విశేషమేమీ లేదని..." అంతటి ఉమాకాంతంగారి మాటల్ని తీసిపారేస్తే ఎలా?

ఆచార్య పల్లా దుర్గయ్య– "ఇట్లాంధ్ర ప్రబంధములు చూచుటకు సంస్కృత కావ్యముల వంటివే యైనను వానికంటే కొంత విశిష్టములైన పద్యకృతులనుటసత్య దూరము కాదు" అని స్పష్టా స్పష్టంగా చెప్పారు. ఏమైనా "కావ్యములవంటివే" అన్నారు గదా! ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం సివిల్ సర్వీసెస్ అభ్యర్థులకోసం రాసిన "తెలుగు లిటరేచర్"లో ప్రబంధ శబ్దం కావ్య వాచియే కావచ్చు" అన్నారు (పుట197)

కావ్యవర్ణనలే ప్రబంధవర్ణనలు:

ప్రబంధంలో అష్టాదశ వర్ణనలుండాలంటారు. ఈ అష్టాదశ వర్ణనలు మహాకావ్య సంప్రదాయం. దండి తన 'కావ్యాదర్శం'లో–

"నగరార్ణవ శైలర్తు చంద్రార్కోదయవర్ణనమ్
ఉద్యాన సలిల క్రీడా మధు పానర తోత్సవాః..."

అంటూ పద్దెనిమిది వర్ణనలు గలది మహాకావ్యం అన్నాడు. ఆ తర్వాత విద్యానాథుడు 'ప్రతాపరుద్రీయం'లో కూడా వీటిని మహాకావ్య లక్షణాలే అన్నాడు. నన్నెచోడుడు ప్రథమాశ్వాస పీఠికలో

"వనజ కేళీరవిశశి
తన యోదయ మంత్రగతి రతక్షితి పరణాం
బునిధి మధు ఋతు పురోద్వా
హనగ విరహ ద్యూత వర్ణనాష్టాదశమున్" (1-44)

అని ప్రకటించాడు. ఇవన్నీ కావ్యవర్ణనలే. 'కుమార సంభవం' తొలి ప్రబంధంగా భావించడానికి ఈ వర్ణనలు ఒక ఆధారంగా చెప్తారు.

కవిత్రయం వారిని, శ్రీనాథుడిని విమర్శించేటప్పుడు ప్రబంధ శైలి వుందనీ, ప్రబంధ వర్ణనలున్నాయనీ, ప్రబంధ రచనకు బాటలు వేశారనీ... ప్రబంధ రీతికి దగ్గరగా వుందనీ అంటారు. కానీ – 'అనువాదం' అన్నమాటతో వారి రచనల్ని కావ్యాలు అంటారు. "ప్రబంధ వాఙ్మయ వికాసం" అనే సిద్ధాంత గ్రంథంలో ఆచార్య పల్లా దుర్గయ్య "అనువాద కవుల రచనలలోని ప్రబంధ వర్ణనలు" అనే అధ్యాయంలో 194వ పుట నుంచి 243వ పుట వరకు కావ్య కవులుగా చెప్పబడుతున్నవారి ప్రబంధ వర్ణనలను సవివరంగా తెలిపారు. అంటే కావ్య- ప్రబంధ వర్ణనలు సమానమనే గదా అర్థం! ప్రబంధ వర్ణనలుగా చెప్పబడే వర్ణనలన్నీ కావ్యాలలో కనిపిస్తాయనటానికి దుర్గయ్యగారి ఈ అధ్యాయమే నిదర్శనం. ముఖ్యంగా శ్రీనాథుని కావ్యాలలో గల ప్రబంధ వర్ణనలను పది పుటలలో స్పష్టంగా వివరించారు. కాబట్టి వర్ణనలను బట్టి కావ్య ప్రబంధాలకు పెద్ద తేడా లేదని స్పష్టమవుతుంది.

ప్రబంధ లక్షణాలుగా చెప్పబడేవి అన్వయిస్తున్నాము అంటే ప్రశ్నార్థకమే మిగులుతుంది. గొప్ప ప్రబంధంగా, ప్రబంధానికి మారు పేరుగా చెప్పబడే "మనుచరిత్ర"కే ప్రబంధ లక్షణాలు అన్వయించటం లేదని కాకలు తీరిన పండితులే పేర్కొన్నారు. ప్రబంధంలో శృంగారం ప్రధానంగా, తక్కిన వీరాదులు గౌణంగా

వుండాలని లక్షణం. మనుచరిత్రలో అంగిరసంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పైకి శృంగార ప్రబంధంగా కనిపిస్తున్న మనుచరిత్రలోగల రసం వివాదాస్పదమైంది.

వరూధినీ ప్రవరుల కథలో శమ ప్రధానుడైన ప్రవరుడు ఆలంబనముగా అంగిరసము శాంతమని, ప్రణయ ప్రధానమైన వరూధిని ఆలంబనముగా శృంగారము అంగరసమని ఆచార్య పింగళి లక్ష్మీకాంతం నిర్ణయించారు (తెలుగు భాషా సమితి వారి విజ్ఞాన సర్వస్వం– పుట 930).

సముద్రాల నాగయ్యగారు 'సాహితీ సుధాలహరి' అనే వ్యాస సంపుటిలో పింగళివారి వాదాన్ని అంగీకరింపకుండా "ప్రవరాలంబనముగా ధర్మవీరమే ప్రధాన రసమ"న్నారు. ప్రవరుడు గృహస్థ ధర్మములను పాటించు ధర్మవీరుడుగా పేర్కొన్నారు.

మరికొందరు వరూధిని, ప్రవరుల వృత్తాంతంలో శృంగారం లేదన్నారు. ఏకత్రానురాగంవల్ల 'రసాభాస' అన్నారు. గంధర్వునియందు కూడా వరూథినికి అనురాగం లేదు. ఆచార్య జి. నాగయ్య 'తెలుగు సాహిత్య సమీక్ష"లో మనుచరిత్రలో సర్వత్ర ధర్మవీరమే ప్రధాన రసముగా విలసిల్లినది అని నిర్ణయించారు. మరి 'శృంగార ప్రధానం' అనే అంశం ఏమైంది?

ప్రబంధ లక్షణాలైన ఏకనాయకాశ్రయంగానీ, వస్త్వైక్యంగానీ మనుచరిత్రకు అన్వయించవని పలువురు నిర్ణయించారు. ఇదంతా చర్వోప చర్చలకు దారితీసింది. ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు రచించిన ప్రబంధాలకు కూడా పై లక్షణాలు సరిగా వర్తించవు. అందుకని కొందరు వీటిని "భక్తి ప్రబంధాలు" అన్నారు మళ్ళీ! కళాపూర్ణోదయం పూర్తిగా కల్పితమైనా ప్రబంధమే గదా! కాబట్టి "అనువాదాలు" అనే అంశానికి ప్రాధాన్యమిచ్చి కావ్య ప్రబంధాలను వేరు చేయటం సరికాదనిపిస్తుంది. ఈ అనువాదం కూడా స్వతంత్రమే. చేర్పులు, మార్పులు అనేకం. కావ్యానువాద పద్ధతుల్లో గల స్వతంత్రపై ఎన్నో సిద్ధాంత గ్రంథాల్లో, వ్యాసాల్లో వివరించబడింది.

'తెలుగువాణి' ప్రత్యేక సంచికలో ఆచార్య పి.యశోదారెడ్డి 'ప్రబంధకవులు' అనే వ్యాసంలో ఇలా అంటారు– "ఈ కాలమున వెలసిన కావ్యములు దాదాపు గుణరూప విశేషములందు సమానములై ఒప్పుటచే ఈ కావ్య జాలము నంతటిని ప్రబంధ శబ్దముచే వ్యవహరించినారు". ఈ మాటల్లో కావ్యాన్నే ప్రబంధంగా అన్నారన్నదే ముఖ్యాంశం.

ఆచార్య జి. నాగయ్య "తెలుగు సాహిత్య సమీక్ష" అనే గ్రంథంలో ఇలా స్పష్టీకరించారు- (పుట 542). "కావ్య ప్రబంధ భేదమును ప్రాచీనాంధ్రకవులు కూడా అంతగా పాటించినట్లు కానరాదు. నన్నెచోడునితో పాటు తిక్కన, కేతన, మంచన, ఎర్రన, శ్రీనాథుడు, పిల్లలమర్రి పిన వీరభద్రుడు, నందిమల్లయ్య, ఘంట సింగనలు మొదలగు వారు ప్రబంధ పదమును కావ్యపరముగానే ప్రయోగించినారు... అల్లసాని పెద్దనాది కవులును తమ ప్రబంధములను కావ్యములుగానే పేర్కొనియున్నారు.

మొత్తంమీద కావ్య, ప్రబంధశబ్దాలు పర్యాయపదాలని స్పష్టం. ఇంచుమించుగా రెండింటి లక్షణాలు సమానమే. వీటికి మూలం సంస్కృత కావ్య లక్షణాలే. ప్రబంధాలను పంచకావ్యాలలో వాటివిగా వ్యవహరిస్తున్నాం గదా! కాబట్టి శ్రీనాథయుగం- శ్రీనాథయుగమే - కావ్యయుగం కాదు! రాయలయుగం- రాయల యుగమే- ప్రబంధ యుగం కాదు. ఏ యుగంలో వెలువడినా 'కావ్యాలు' అనటమే సమంజసం. మన వాడుక కూడా ఇంతే! కావ్యభేదాలు ఎలాగూ వున్నాయి.

కావ్య ప్రబంధాలు సమానార్థకాలు- అనటంవల్ల ప్రయోజనాలు ఏమిటి అన్నది ప్రశ్న.

- తొలి ప్రబంధమేది? అనే వివాదం సమసిపోతుంది.
- మనుచరిత్రకి ప్రబంధ లక్షణాలు అన్వయించవన్న వాదానికి తావుండదు.
- కావ్యమా? ప్రబంధమా? అనే సందేహం ఉండదు.
- సాహిత్య విద్యార్థులకి ఈ సంశయాలు కలుగవు.
- అధ్యాపకులు తలపట్టుకొని కావ్య ప్రబంధ భేదాలను గిరిగీసి చెప్పలేని పరిస్థితి తప్పుతుంది.
- ఈ ప్రక్రియావాదంపై శ్రద్ధ పెట్టడం పోయి కావ్యంపై శ్రద్ధ వహించడం జరుగుతుంది. అప్పుడు కవికి మరింత న్యాయం జరుగుతుంది.

కాబట్టి స్పష్టతకోసం, నిర్దిష్టతకోసం కావ్యప్రబంధ శబ్దాలను పర్యాయ పదాలుగా భావించడం సముచితం, సమంజసం!

4

ప్రాచీన కవిత్వంలో కాకతీయుల నాటి సాంఘిక జీవితం- కుల వ్యవస్థ

"చరిత్ర లక్షణము సత్య ప్రతిపాదనము. ఒకవిధముగా చూచినచో కవిత్వధ్యేయము కూడ సత్యప్రతిపాదనమే. సార్వజనీనమైన సచేతనమైన సత్యమే దాని లక్ష్యము" అన్న అరిస్టాటిల్, వర్డ్స్ వర్త్‌ల అభిప్రాయాల్ని ఆచార్య సి. నారాయణరెడ్డి ప్రకటించి కావ్యచరిత్రలకు గల ప్రాధాన్యాన్ని వివరించారు. నిజానికి కవిత్వమూ చరిత్ర రెండూ పరస్పర సహకారులు. పరస్పరోపయోగులు.

"Poetry is the ciriticism of life" అని ఆంగ్ల సాహిత్య విమర్శకుడు మాథ్యూ ఆర్నాల్డ్ నిర్వచించాడు. అయితే కవిత్వమంతా జీవిత ప్రతిబింబం కాదని ప్రాచీన కవిత్వం పరిశీలిస్తే తెలుస్తుంది. కవి కూడా సంఘజీవి కాబట్టి తాను రాసే కవిత్వంలో సమాజాన్ని ఎంతో కొంత చిత్రించకుండా ఉండలేడు. కొందరు ఎక్కువ చిత్రిస్తే మరికొందరు కొద్దిగా చిత్రీకరిస్తారు. కాకతీయుల కాలంలో గల కవులు సామాజిక చత్రీకరణని ఎక్కువగానే చేశారు. చారిత్రక పండితులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ "సాంస్కృతికంగా కాకతీయులు తెలుగు భాష మాట్లాడే ప్రజలందర్నీ ఒక తాటికిందికి తెచ్చారు. దీనికి, తిక్కన మహాభారతాన్ని కాకతీయ రాజుల ఆస్థానంలో పూరించిన దృష్టాంతం కేవలం యాదృచ్ఛికం కాదు. తెలుగు సాహిత్యం, లలిత కళలు విస్తృతంగా పరిపుష్టం పొందటం ఈ యుగంలోనే జరిగింది" అంటూ తెలుగువారి జానపద సంస్కృతి విశేషాల్ని, సమాజాన్ని ఆనాటి సాహిత్యం మన కళ్ళముందుంచిందనటం స్వభావోక్తి అవుతుంది. కాకతీయుల కాలం నాటి సాంఘిక జీవితం అంటే 12, 13 శతాబ్దాల నాటి సామాజిక జీవితమే.

కులవ్యవస్థ : వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థకి మూలం. సాంఘిక రాజకీయ పరిస్థితుల వల్ల వర్ణాలు కాలక్రమంలో కులాలుగా ఏర్పడ్డాయి. "కాకతీయ రాజులు చతుర్థ కులస్థులు. అన్నికులాలతోను సామరస్య విధానాన్ని విధిగా పాటించారు. ఈ కాలంలోనే బ్రాహ్మణేతర చతుర్థ కులాల్లో రాజకీయ చైతన్యంతోపాటు ఆర్థిక సామాజిక సాంస్కృతిక పెరుగుదల విశేషంగా కనిపిస్తుంది. కుల సామరస్యంతోపాటు మతాన్ని కాకతీయులు తమ రాజ్య సుస్థిరతకు దోహదం చేసుకొన్నారు" అని వకుళాభరణం రామకృష్ణగారు చెప్పినది అనాటి కవిత్వంలో కనిపించేదే. శివకవులు కులవ్యవస్థను నిరసించారు. శైవం తీసుకొంటే చండాలుడైనా బ్రాహ్మణుడితో సమానమే అన్నాడు పాల్కురికి సోమన. పండితారాధ్య చరిత్రలో సోమన ఏ కులం వారైనా శ్రీశైలం దర్శిస్తే పుణ్యం వస్తుందన్నాడు. శివుడు అన్నికులాలనూ సమానంగా చూస్తాడన్న భావం ప్రకటించాడు. బసవపురాణంలో అష్టాదశవర్ణాల ప్రసక్తి వుంది.

కాకతీయుల కాలంలో బ్రాహ్మణాధిక్యత కొనసాగింది. రాజవంశాన్ని రక్షించడం బ్రాహ్మణుల ప్రధాన కర్తవ్యంగా తెలుస్తుంది. ఈ విషయాలు ఏకామ్రనాథుని "సిద్ధేశ్వర చరిత్ర"లో కనిపిస్తాయి. బౌద్ధజైన మతాలు బ్రాహ్మణాధిక్యతను తగ్గించి క్షత్రియుల ఆధిక్యాన్ని పెంచాయి. చతుర్థ కులజులైనా రాజ్యాలు స్థాపించి పరిపాలకులు కావడం వల్ల "క్షత్రియులు"గా పేర్కొనబడ్డారు. ఏకామ్రనాథుడు, ప్రతాపరుద్ర చరిత్రలో–

"విశ్వకర్మలు, గొల్లలు, కాపులు, ఈడుగలు, తంబళ్ళు, కుమ్మర, కమ్మరి, పద్మసాలె, పట్టుసాలె, మేదర, ఉప్పర, మేర, బెస్త, బక్క, సంగర, రజకులు, బలిజ, వేశ్య, వంటలక్కలు..."

అంటూ కులాలను పేర్కొన్నాడు. సురవరం ప్రతాపరెడ్డిగారు కోమటిని ఆ రోజుల్లో గౌరులనీ, సేట్లు అనీ అనేవారన్నారు. వీరశైవులు బలిజ కులస్థులుగా వ్యాపారం చేసేవారట. మంచన రాసిన "కేయూర బాహు చరిత్ర"లో కోమటి పదం కనిపిస్తుంది.

ప్రతాపరుద్ర చరిత్ర, పల్నాటి వీరచరిత్ర, బసవపురాణం, క్రీడాభిరామం వంటి కావ్యాలు అనాటి వృత్తి పనులు, కులాలు వివరించాయి.

"యిచ్చుచో నెఱిగి కల్లచ్చులనూకి
యచ్చుల నొరగొనునగసాలియతడు"

అని బసవపురాణంలో వుంది. కమ్మచ్చులు; సుత్తెలు, కత్తెరలు, మూసలు తయారు చేసేవారని తెలుస్తుంది. కమ్మరి, కుమ్మరుల గురించి కూడా బసవ పురాణంలో కనిపిస్తుంది.

"చటుల సంస్కృతి జీవఘట చక్రకర్మ
పటు పరివర్తన భ్రమణంబు గూర్చి
కీలు వొందించి యాక్రియ రాటనముల
వాలి యాడించు నా వడ్రంగి యతడ"

అన్నాడు పాల్కురికి సోమన. పల్నాటి వీరచరిత్రలో పట్టెమంచాలను తయారు చేసేవారని పేర్కొనబడింది. నిలువుటద్దం తయారు చేయటంలో నేర్పరులట. బసవపురాణంలో పాల్కురికి సోమన చాకలి వారిని ప్రశంసిస్తాడు-

"చాకిచాకని యేల సందడించెదవు
చాకియే యతడు సాక్షాల్లింగమూర్తి
భక్తుల చీరల భక్తుల కిచ్చు
యుక్త సద్భక్తిని యుక్తి వట్రిల్ల"

'పల్నాటి వీరచరిత్ర'లో గొల్లల ప్రస్తావన కనిపిస్తుంది-

"వేళాయె వాటికి వేగమే పోయి
పితుకుడు పాలను ప్రియమున మీరు
అనవిని గొల్లలు 'అవుగాక' యనుచు"

పల్నాటి వీర చరిత్రలోనే

"అప్పుడు నీ వడిగి యావులతోడ
గొల్లబంటుల చాల కోరి తేవలయు"

అంటూ రాచ కుటుంబాలవారు అరణంగా ఆవులతోపాటు గొల్లలను కూడా తెచ్చుకొనే వారని పేర్కొన్నారు. పల్నాటి వీరచరిత్రలో గానుగ వారిని గురించీ వుంది. క్రీడాభిరామకర్త "గానుగ పట్టెమీద కూర్చున్న పడుచుది పాలసముద్రం నుంచి వెలుపలికి వచ్చిన లక్ష్మిలాగా ఉంది" అన్నాడు.

ఓరుగల్లులో 'మోహరివాడ' వుందనీ, కుట్రపువారు అని పిలువబడేవారు దర్జీపనివారనీ, వీరు సైనికుల దుస్తులను కుట్టడానికి ప్రత్యేకంగా వాడేవారనీ డాక్టర్ ప్రమీలా రెడ్డిగారు వివరించారు. క్రీడాభిరామంలో వీరి గురించి–

"కొలుచును, జేనవెట్టు, కుచకుంభయుగం బెగడిగ్గ కన్నుఁ క్రే
వలపరికించు, కక్షముల వైచును దృష్టులు మాటి మాటికిన్..."

అని దర్జీవాళ్ళ చేష్టలు వర్ణించబడ్డాయి.

బసవపురాణంలో బొంతలు కుట్టి జీవించేవారిని పేర్కొనడం కాదు– గౌరవించాడు. బొంతలు కుట్టే శివభక్తుడికి శివుడు ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొమ్మన్నాడట. అప్పుడు –

"రాత్రియు నూది దారంబు గ్రువ్వంగ
నేత్రములకు దృష్టి నెక్కొల్పుమనుడు"

అని తనకి సూక్ష్మ దృష్టిని ప్రసాదించమన్నాడట.

సురవరం ప్రతాపరెడ్డిగారు "మడిగూటి వృత్తి" ఉందని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఈ తెగవారున్నారట. వీరు బోయ సంతతివారు. రంగనాథ రామాయణంలో "రామరాయని బోయరాశికి నెక్కి" అనటం, నిర్వచనోత్తర రామాయణంలో రేవు బోయలు శౌర్య ప్రతాపాలు కలవారనటం గమనార్హం.

రంగనాథ రామాయణం– యుద్ధకాండలో–

"దానవ యక్ష గంధర్వ దేవాదు
లైనను వెట్టి సేయ గనున్న నన్ను"

అని పేర్కొనటం వల్ల వెట్టి చాకిరీ 13వ శతాబ్దినాడే వుందన్నమాట. ప్రతిఫలం లేకుండా, కూలి లేకుండా, ఉచితంగా పనిచేయటం వెట్టిచాకిరీ. ఈ చాకిరీ చేసేవాళ్ళని 'వెట్టోళ్ళు' అంటారు. పంచములు వెట్టోళ్ళుగా స్థిరపడ్డారు. మార్కండేయ పురాణంలో కూడా మారన జయించిన రాజులు ఓడిపోయిన రాజులచేత వెట్టి చేయించినట్టు తెలిపాడు పాల్కురికి సోమన.

"వెట్టిగా దెచ్చిన యట్టివి సభలె" (పం.చ.)
"వెట్టి చేసేడు నీకు వెయ్యేడులైన" (బ.పు.) అన్నాడు.

క్రీడాభిరామంలో-

"పరశురాముని కథలెల్ల ప్రౌఢి పాడె
చారుతరకీర్తి బవనీల చక్రవర్తి"

అని బవనీలు వాద్యాలు వాయిస్తూ ఏకవీరాదేవి ముందు నిలిచి పరశురాముని కథలను నేర్పుగా పాడేవారని చెప్పబడింది. బవనీలను బైండ్లవాళ్ళు, అంటారు. ఇతరుల్ని స్తోత్రం చేస్తూ జీవించడమే వీరి వృత్తి అని చెప్తారు.

జానపద కళాకారులు, వృత్తి కళాకారులు అయిన పిచ్చుక కుంట్లు గురించి కూడా కావ్యాలలో ప్రస్తావించబడింది. సురవరం ప్రతాపరెడ్డిగారు వీళ్ళు రెడ్ల గోత్రాలను తంబూరాపై పాటలుగా పాడతారని తెలిపారు.

"మాకు వీవంగ చేతులు లేవయ్య, నడచి
పోవంగ గాళ్ళను లేవయ్య అంధ
కులమయ్య పిచ్చుక గుంటులమయ్య"

అని పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో పేర్కొన్నాడు.

ఇంకా పూసలవారు, రుంజలు, పాములవాళ్ళు, చెంచులు, ఎరుకులు, పింజారులు (దూదేకులవారు) వంటివారి ప్రస్తావనా వుంది. క్రీడాభిరామంలో వీర రస ప్రధానమైన పాటలు పాడే భిక్షుక వృత్తి చేసుకునే "గడిదు" అని వాళ్ళని పేర్కొన్నాడు. "కాయస్థులనే" కొత్త కులం ఉన్నట్టు ప్రమీలారెడ్డిగారు వివరించారు. దస్తావేజులు రాసేవారట.

కాకతీయుల కాలంలో ఒక పక్క వర్ణవ్యవస్థ సాగగుతూనే వున్నా మరో పక్క వర్ణ వ్యవస్థను ఛేదించడానికి కూడా ప్రయత్నం జరిగింది. పండితారాధ్య చరిత్రలో "మాటి మాటికి గ్రొవ్వి మాదిగి యనుచు/ నేటికి పలుక ధర్మేతరులార" అని ప్రకటించడం, శివభక్తులకి కులం లేదనటం, అంత్యజులకు వీరశైవం అండగా నిలవటం గమనిస్తాం.

ఆ రోజుల్లో వేశ్యాకులానికి గౌరవాదరాలున్నాయి. దేవదాసీ, గుడిచేటి వృత్తి వారే కాలక్రమాన వేశ్యావృత్తికి లోనయ్యారు. ధనవంతుల అవసరాలకు ఆడిపాడి అలరించేవారుగా, కోరికలు తీర్చేవారుగా ఉంపుడు కత్తెలుగా మారి– తర్వాత భోగం వాళ్ళ కులంగా స్థిరపడింది.

"పరిమితాహారంబు పాటించి యొడి యంగ
ముల నాడు నాటికి నలుగువెట్టి..."

అని వేశ్యలు ఎలా వుండాలో కేతన 'దశకుమార చరిత్ర'లో పేర్కొన్నాడు. బ్రాహ్మణులు, సెట్టి కులస్థులు, ప్రతాపరుద్రుడు... అందరూ వెలయాండ్రకు ముగ్ధులైనవారే. బాలచంద్రునికి వారకాంతవుంది. పల్నాటి వీరచరిత్రలో వేశ్యమాతల గురించే వుంది. వేశ్యావృత్తిని గురించి పూసగుచ్చినట్టు చెప్పినవాడు క్రీడాభిరామ కర్త. అయితే పాల్కురికి సోమన

"ఇంతటికై యొడ లెఱుగమి జేసి
ఇంతుల గోరిపోయెడి దురాత్ములకు"

మానభంగం తప్పదని నిరసించాడు.

ఈ కాలంలోగల రావిపాటి త్రిపురాంతకుడు, పావులూరి మల్లన, నన్నెచోడుడు, వేములవాడ భీమకవి, మల్లికార్జున పండితారాధ్యుడు, యథావాక్కుల అన్నమయ్య, తిక్కన, కేతన, మంచెన, పాల్కురి సోమన, రంగనాథ రామాయణ కర్త, క్రీడాభిరామకర్త, కృష్ణమాచార్యులు, మారన, బద్దెన వంటి కవుల రచనలే కాకతీయుల కాలంనాటి వర్ణ వ్యవస్థ విశేషాలకు ప్రతిబింబాలు. మిగిలిన యుగాల సాహిత్యంలో కన్న కాకతీయుల యుగం నాటి సాహిత్యమే సమాజానికి నిలువుటద్దంగా వుందని తెలుస్తుంది.

సంప్రదించిన గ్రంథాలు:

- ఆంధ్రుల సాంఘికచరిత్ర– సురవరం ప్రతాపరెడ్డి
- కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం– డా॥ మలయశ్రీ
- కాకతీయ యుగ సాహిత్యంలో సంస్కృతి – ఎం. ప్రమీలారెడ్డి
- కాకతీయ శాసన సాహిత్యం – సంకలనం: పుచ్చా వాసుదేవ పరబ్రహ్మశాస్త్రి.

5

సాహిత్యంలో 'అంకితాలు'

నన్నయ నుంచి నేటివరకు కవులు, కథా రచయితలు, నవలాకారులు, నాటక కర్తలు, పరిశోధకులు అందరూ "అంకితం" ఇవ్వటం అనే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. అంకితం అనే భావన మానసికమైనది. ఈ అంకితాలను బట్టి కవుల లేదా రచయితల స్వభావాలు తెలుస్తాయి. అంకితవచనాలను బట్టి అంకితం తీసుకొనే వారి సంగతులూ తెలుస్తాయి. అంకితాలు కింది అంశాలు ఆధారంగా ఇవ్వబడతాయి.

- ఆర్థిక సంబంధాల వల్ల
- ఆత్మీయత వల్ల
- పరస్పర అవసరాల వల్ల
- గౌరవాదరాల వల్ల
- కృతజ్ఞతాభావం వల్ల

పూర్వం ప్రభువులు కీర్తికోసం అంకితం తీసుకొనేవారు. కృతి శాశ్వతంగా భావించి, ఆ కృతిని స్వీకరించటం వల్ల తన పేరు కూడా శాశ్వతమవుతుందని రాజులు, జమీందారులు భావించారు. కావ్యాన్ని కన్యగా, కావ్యం రాసిన కవిని ఆ కన్యకు తండ్రిగా భావించి – అంకితం తీసుకున్న వాడు ఆ కన్యకు వరుసకు భర్త అవుతాడని "కృతిభర్త" అనే సంప్రదాయం ఏర్పడింది. కాబట్టి అంకితం తీసుకున్న రాజును కవి "మామ" అని సంబోధించటం వుంది. పోతన తన భాగవతాన్ని 'కావ్య కన్య'గానే భావించాడు. ఈనాడు ఆ భావన చాలామందిలో లేదు. అందుకనే 'కృతిభర్త' పదాన్ని వాడకుండా "కృతిస్వీకర్త" అంటున్నారు. ఇదేమీ లేకుండా 'అంకితం' అని

మాత్రమే ప్రయోగిస్తున్నారు. "అంకితాలు" నన్నయనుంచి ఇవాళ్టి వరకు వివిధ ప్రక్రియలలో, భిన్నభావజాలంగల కవులలో రచయితలలో ఎలా వున్నాయో రేఖామాత్రంగా చూద్దాం.

నన్నయ తన ఆంధ్రమహాభారతాన్ని రాజరాజ నరేంద్రుడికి ఇచ్చినట్టు చెప్పుకుంటున్నాం. ఆ విషయం నన్నయ చెప్పలేదు. రాజరాజు రాయమన్నాడు కాబట్టి, రాజరాజు ఆస్థాన కవి కాబట్టి, షష్ఠ్యంత పద్యాలలో రాజరాజు స్తుతి వుంది కాబట్టి అంకితం ఇచ్చి వుంటాడని చాలామంది భావించి సాహిత్య బోధనలో రాజరాజుకి అంకితం ఇచ్చాడని (ఉజ్జాయింపుగా) చెప్తూ వచ్చారు. నిజానికి నన్నయనాటికి ఈ 'అంకితం' అనే సంప్రదాయం వున్నట్టు కనపడదు. రచన పూర్తి అయిన తర్వాత గానీ సహజంగా 'అంకితం' అనే ఆలోచన రాదు గదా! పూర్తి చెయ్యకుండానే ఈ లోకం వదిలి వెళ్ళటంవల్ల అంకితం విషయంలో స్పష్టత లేదు. రాజరాజు కూడా భారతాన్ని రాసి "వినిపింపుము" అన్నాడు తప్ప అంకితం ఇమ్మని అడగలేదు. అందువల్ల ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం రాజరాజు 'కృతిభర్త' కాదు– 'కృతిశ్రోత' అని కొత్త ప్రతిపాదన చేశారు.

నన్నయ తర్వాత కవి పాల్కురికి సోమన వీరశైవ కవి కాబట్టి అంకితాల జోలికే వెళ్ళలేదు. కొట్టరువు తిక్కనామాత్యుడు తన తొలి రచన "నిర్వచనోత్తర రామాయణా"న్ని తన ప్రభువైన మనుమసిద్ధికి అంకితమివ్వడంలో స్వామిభక్తి వెల్లడి అవుతుంది. అయితే తిక్కన తన భారతాన్ని "హరిహరనాథుడి"కి ఇవ్వటం విశేషం. నిజానికి ఇటువంటి దేవుడులేడు. కానీ తిక్కనకి కలలో కనిపించాడు. ఇది తిక్కన సామాజిక దృక్కోణానికి నిదర్శనం. శైవులకీ, వైష్ణవులకీ మత సామరస్యం లేని రోజులవి. ఒకరిపై నొకరు కత్తులు దూసుకుంటున్న రోజులవి. అటువంటి రోజుల్లో సామాజిక బాధ్యతతో తిక్కన "విష్ణురూపాయ నమశ్శివాయ" అంటూ హరిహరాద్వైతాన్ని ప్రతిపాదించాడు. శైవ వైష్ణవ మత ద్వేషాలను తగ్గించటానికి తన వంతు కృషిచేసినవాడు తిక్కన. కలలో కనిపించిన 'హరిహరనాథుడు' ఈ విధంగా చెప్పాడని తిక్కన తెలపటం వల్ల తెలుగు భాషా ప్రాభవం వ్యక్తమవుతుంది.

"తెనుగు బాస వినిర్మింప దివురుటరయ
భవ్య పురుషార్థ తరుపక్వ ఫలము గాదె

దీనికెడనియ్యకొని వేడ్కనూని కృతి ప
తిత్వ మర్థించి వచ్చితి తిక్కశర్మ!"

ఇదే మార్గంలో వెళ్ళి నాచన సోమన తన హరి వంశాన్ని "హరిహరనాథుడి"కి అంకితమిచ్చాడు. వీరిద్దరూ మతసామర్యాన్ని కోరుకున్న కవులుగా చెప్పవలసి వుంది. కేతన "దశకుమార చరిత్ర"ను తిక్కనకి అంకితమిచ్చి గురువుకి అంకితం చేసిన తొలికవిగా పేరుపొందాడు.

అంకితాలవల్ల వ్యక్తిత్వం, స్వభావంవల్ల వెల్లడయ్యే కవి "కవిసార్వభౌమ" శ్రీనాథుడు. శ్రీనాథుడు విద్వత్కవి మాత్రమే కాదు భోగి కూడా. భక్తి, రక్తి రెండూ కోరుకున్న కవి!

శ్రీనాథుని రచనలనూ – వాటి అంకితాలనూ గమనించండి:

మరుత్తరాట్చరిత్ర– మామిడి సింగయామాత్యుని అన్న వేమనకి.

పండితారాధ్య చరిత్ర– మామిడి ప్రెగడయ్యకి (మంత్రికి)

శృంగార నైషధం – సింగయామాత్యునికి

హరవిలాసం – బాల్యసఖుడు అవచితిప్పయ సెట్టికి

భీమఖండం – బెండపూడి అన్నయామాత్యునికి
(తన బంధువు, వీరభద్రా రెడ్డి మంత్రి)

కాశీఖండం – రాజమహేంద్రవర ప్రభువు వీరభద్రారెడ్డికి

శివరాత్రి మాహాత్మ్యం – శ్రీశైల మఠాధిపతి ముమ్మడి శాంతయ్యకి

పల్నాటి వీరచరిత్ర – మాచర్ల చెన్నకేశవస్వామికి

ఈ అంకితాలను బట్టి శ్రీనాథుడి వ్యక్తిత్వం మనకి తెలుస్తుంది. "ఈశ్వరార్చన కళాశీలుడు" గా ప్రశంస పొందిన శ్రీనాథుడు తన రచనను ఒక్కటి కూడా శివుడికి అంకితం ఇవ్వకపోవటం గమనార్హం. శ్రీనాథుడికి ప్రభువుల సేవ, భోగవైభవం, ప్రభువుల ప్రాపకం తప్ప మరొక దృష్టిలేదని చెప్పవచ్చు. బాల్యస్నేహితుడైన సుగంధ ద్రవ్యాల వ్యాపారి అవచితిప్పయ సెట్టికి అంకితమిచ్చాడు. తన బంధువు, వీరభద్రారెడ్డి మంత్రి అయిన బెండపూడి అన్నయామాత్యునికి అంకితమిచ్చి సరాసరి వీరభద్రారెడ్డి కొలువులో పాగా వేశాడు. "పల్నాటి వీరచరిత్ర"లోని వస్తువు దేశీయమైనది. దీనిని

మాచర్లలోని వైష్ణవదేవుడు చెన్నకేశవ స్వామికి అంకితమిచ్చాడు. అంటే తన శైవాభిమానం కన్నా అప్పటి అవసరాలే మిన్న అని భావించినవాడు శ్రీనాథుడు. అయితే తనను వృద్ధాప్యంలో ఆదరించిన శ్రీశైల మఠాధిపతి ముమ్మడి శాంతయ్యకి అంకితమివ్వటం అభినందనీయం. కృతజ్ఞతాపూర్వకంగా అంకితమివ్వటం ప్రశంసనీయమే!

ఇక పోతన– శ్రీనాథునికంటే భిన్నమైన వ్యక్తిత్వంగలవాడని అంకితాన్ని బట్టి తెలుస్తుంది. శ్రీనాథుడిలా భోగికాదు. అక్షరాల దైవభక్తుడు. సిరిసంపదల కోసం రాజుకి అంకితం ఇవ్వలేదు. "ఇమ్మనుజేశ్వరాధములు"కు ఇవ్వను అని ఘంటాపథంగా పలికాడు. "సత్కవుల్ హాలికులైన నేమి?" అని చాటినవాడు.

"నిను నాకటికింగొనిపోయి, యల్ల కర్ణాట
కిరాతకీచకులకమ్మ, త్రిశుద్ధిగనమ్ము భారతీ"

అని ప్రకటించిన విశిష్ట వ్యక్తిత్వం పోతనది.

అల్లసాని పెద్దనగాని, నందితిమ్మనగాని రాయల వారికి అంకితమ్విడంలో వింతలేదు. వీళ్ళిద్దరూ స్వామిభక్తిపరాయణులు కాబట్టి. రాయల ఆస్థానంలో వుండికూడా రాయల వారికి అంకితమియ్యని స్వయం వ్యక్తిత్వంగల కవి ధూర్జటి. అష్టదిగ్గజకవుల్లో ఒకడుగా చాలామంది నమ్ముతున్న పింగళి సూరన అంకితం విషయంలో ఒక ప్రత్యేకతను చాటుకొన్నాడు.

"తండ్రియు సుతులకు దైవం
బండ్రుగదా వేదవాదులదివినియునునే
వీండ్రను వాండ్రును బలె మా
తండ్రి పరమ పూజ్యుగాక తలపమితగునే?"

అంటూ సూరన తన "ప్రభావతీ ప్రద్యుమ్నం" ప్రబంధాన్ని తండ్రి అమరామాత్యునకు అంకితమిచ్చి తన పితృభక్తిని చాటుకొన్నాడు. తండ్రికి అంకితమిచ్చిన తొలి కవిగా నిలిచిపోయాడు సూరన.

పొన్నెగంటి తెలగన తొలి అచ్చ తెలుగు కావ్యం "యయాతిచరిత్ర" రచించాడు. దీనిని–

"బళి – నా కబ్బంబునకున్
తే డబ్బె తావిపుత్తడికిం గల్గినటివిననుచు
మదిలోనను సంతసమంది"

అమీను ఖాన్‌కి అంకితమిచ్చాడు. ఇబ్రహీం కుతుబ్‌షా సామంతుడైన అమీనుఖాన్ తెలుగు భాషా ప్రియుడు. తెలుగు కవుల పోషకుడు. ఇతనిని గురించి తెలగన విస్తారంగా ప్రశంసించాడు. ఈ అంకిత పద్యాలను బట్టి ఇబ్రహీం కుతుబ్‌షా, అమీను ఖాన్‌ల ఔన్నత్యం, ఉదార గుణాలు వ్యక్తమవుతాయి. ఈ పద్యాలు చరిత్రకారులకి ఎంతో ప్రయోజనకరం.

ఆధునిక సాహిత్యానికి మార్గదర్శకుడుగా, యుగకర్తగా పేర్కొనబడుతున్న గురజాడ అప్పారావు అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది "కన్యాశుల్కం" నాటకం. ఎంతటి సామాజిక స్పృహకలవాడైనా తన జీవితానికి ఆలంబనమైన విజయనగర రాజరికాన్ని మర్చిపోలేదు.

"ఘనతవహించిన మహారాజా మీర్జా శ్రీ ఆనంద గజపతిరాజ్ మహారాజా సాహెబ్ మెహర్బాన్ ముష్ఫిక్ కరం పర్మాయి మొఖలెసాన్ బాద్షా యె కళింగ్ మన్నె సూల్తాన్ విజయనగరం బహదూర్ జి.సి.ఐ.ఐ. గార్కి" కన్యాశుల్కాన్ని అంకితమిచ్చాడు. "ఘనత వహించిన సదావిధేయునికి – సదావిధేయుడుగా వుండే గౌరవానికి నోచుకొన్న భవదీయుడు" అనటాన్ని స్వామిభక్తి పరాయణత్వంగా భావించాలా, రాచరికపు ఛాయలుగా భావించాలా అన్నది చాలామంది ప్రశ్న.

విశ్వనాథ సత్యనారాయణగారి అంకితాలపై చమత్కారం ఒకటి ఉంది. విశ్వనాథవారి రచనలను అంకితం తీసుకున్న వాళ్ళందరూ నానా బాధలుపడ్డారట! ముక్త్యాల రాజాగారికి రాజ్యం పోయింది. బందా కనకలింగేశ్వరరావుగారికి భార్యపోయింది. ఒక నవల అంకితం తీసుకొన్న టంగుటూరి ప్రకాశం పంతులుగారికి పదవి పోయింది. కాశీనాథుని నాగేశ్వరరావుగారు అంకితం తీసుకొని స్వర్గస్థులయ్యారు. అందుకని కాటూరి వేంకటేశ్వరరావుగారు ఓసారి అందరూ కూర్చొని వుండగా దీని గురించి ఓ పద్యం చెప్తూ–

"కవుల లోపల బమ్మరాకాసి వీవు
దండమూర బాబు నీదు కైతకు నీకు"

అన్నారట. అయినా విశ్వనాథవారు తమ "ఆంధ్ర ప్రశస్తి"ని మల్లంపల్లి సోమశేఖరశర్మగారికి అంకితమిస్తూ చెప్పిన పద్యాలు ఆణిముత్యాలు. మల్లంపల్లివారి ప్రతిభతో పాటు సమకాలీన సాహిత్యరంగ స్థితిగతుల్ని వెల్లడించే పద్యాలవి. ఒక్క పద్యం మచ్చుకి–

"డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు
రాని యీ పాడు కాలాన బుట్టి
నీ చరిత్ర జ్ఞాన నిర్మాలాంభఃపూర
మూషర క్షేత్ర వర్షోదకమయి
చాడీలకు, ముఖ ప్రశంసల కీర్ష్యకు
స్థానమైనట్టి లోకాననుండి
నీ యచ్ఛతీరకమనీయ శీలజ్యోత్స్న
అడవిగాసిన వెన్నెలగుచు జెలగి"

మహాకవి శ్రీశ్రీ అద్భుత సృష్టి "మహాప్రస్థానం" దీనిని తొలుత పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారికి అంకితమిద్దామని భావించాడు. ఆయన ప్రభావం శ్రీశ్రీపై చాలావుంది. ఈలోపు తన ఆత్మీయ మిత్రుడు, ప్రేరకుడు, కవి అయిన కొంపెల్ల జనార్దనరావు ఆకస్మిక మరణం చెందాడు, క్షయవ్యాధి ద్వారా. అందుకని శ్రీశ్రీ ఉండబట్టలేక–

"తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం? సెలవంటూ ఈ లోకాన్ని వదలి"

అనే స్మృతి కవితలో (ఎలిజీ) మహా ప్రస్థానాన్ని అంకితమిచ్చి జనార్దనరావు ప్రతిభను వెల్లడించాడు. అయినా శ్రీశ్రీ హృదయంలో పంచాగ్నుల వారికి అంకితం ఇవ్వలేదన్న దిగులు వుంది. సిరిసిరి మువ్వ, ప్రాసక్రీడలు, లిమరుక్కులు కలిపి "సిప్రాలి"గా ప్రచురించి పంచాగ్నుల వారికి అంకితమిస్తూ 9.6.1981న అమెరికాలో హోస్టన్‌లో ఉండగా ఇలా రాశాడు–

"సుమారు 50 సంవత్సరాల కిందట బరంపురంలో అఖిలాంధ్ర కవి పండిత సభలు జరిగినప్పుడు పంచాగ్నుల ఆదినారాయణగారిని చూస్తూనే నా గ్రంథం ఒకటి మీ కంకితమిస్తానన్నాను. దరిమిళాను కొంపెల్ల జనార్దనరావు చనిపోయి ఉండకపోతే 'మహాప్రస్థానం' శాస్త్రిగారికే అంకితమయ్యేది. నాటికి నేడు ఈ 'సిప్రాలి'ని వారికి అంకితంగా సమర్పించడం సాధ్యమయింది" ఇది శ్రీశ్రీ కృతజ్ఞతాభావాన్ని ప్రకటిస్తుంది.

అగ్రవర్ణాల దాష్టీకంపై నిప్పులు చెరుగుతూ, తమకు స్ఫూర్తి ప్రదాత అని దళితులు ప్రశంసిస్తున్న గుఱ్ఱం జాషువా తమ 'గబ్బిలం' కావ్యాన్ని ఎవరికి అంకితమిచ్చారో తెలుసా? "గుంటూరు జిల్లా బోర్డు ప్రెసిడెంటుగారును, దేశభక్తులును, కళాభిమానులునగు శ్రీ కల్లూరి చంద్రమౌళి చౌదరిగారు మాయూరు దయచేసి గ్రంథము నామూలాగ్రముగా విని పతిత్వము వహించుట కంగీకరించుట నా యదృష్టము".

త్రిపురనేని గోపీచంద్ అనగానే అందరికీ ముందుగా గుర్తు వచ్చేది "అసమర్థుని జీవయాత్ర" అనే నవల. ఇది అద్భుతమైన మనో విశ్లేషణాత్మక నవల. దీనిని అంకితమిస్తూ గోపీచంద్ అంటారు– "ఎందుకు? అన్న ప్రశ్న నేర్పినందుకు నాన్నగారికి". అని ఎవరా నాన్నగారు? అంటే హేతువాద కవి త్రిపురనేని రామస్వామి చౌదరి. ఎందుకు అంకితమిస్తున్నానో కారణం చెప్పటం గమనిస్తాం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి "బహుకాలదర్శనం"ను కాటూరి వేంకటేశ్వరరావుకి అంకితమిస్తూ రాసిన మాటలు గమనిస్తే వాళ్ళిద్దరి మధ్యగల ఆత్మీయత అవగత మవుతుంది.

"బావగారూ, నేనేమీ రాసినా ఏమి మాట్లాడినా వల్లమాలిన ఇష్టం మీకు. నా రచనలన్నీ అచ్చువేయించమని మహా ఒత్తిడి చేసేవారు మీరు. మీరుండగా ఆ పని చెయ్యలేకపోయాను. ఇప్పుడు వేయిస్తున్నాను.

"ఇది 'బహుకాల దర్శనం' మొదటిది
మీరు దీనిని అందుకోండి బావగారూ!
మీ గొప్పతనానికి ఇది తగినదని కాదు
ఈ శ్రేణిలో మొదటిదని అంతే!
మీరు వెళ్ళిపోయినా నన్నూ నా వాళ్ళనూ
వెయ్యి కళ్ళతో కనిపెడుతూ కాపాడుతూ
ఇక్కడ నాతోనే ఉంటున్నారు మీరు... నాలో నున్నూ బావగారూ".

వ్యక్తులకి అంకితమివ్వడం సరే ఊహాత్మక వ్యక్తులకి కూడా అంకితమివ్వడం చూస్తాం. బుచ్చిబాబు తమ "చివరికి మిగిలేది" నవలను "ఆంధ్రమాత"కు అంకిత మిచ్చారు (తొలి ముద్రణలో ఇది వుంది). దాశరథి తమ 'రుద్రవీణ' కావ్యాన్ని "తెలంగాణకు" అంకితమిచ్చారు.

దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు "రమణీయము" అనే బాలవ్యాకరణ సమీక్షా గ్రంథాన్ని సామూహికంగా అంకితమిచ్చారు. ఆంధ్రభాషార్ణవ బాలవ్యాకరణ నౌకా కర్ణధారునకు చిన్నయసూరి మహోదయునకు, శబ్ద శాస్త్ర సరస్వతీ సమారాధకులకు సకలాంధ్ర భాషాధ్యాపకులకు" ఆనందంతో అంకితమిచ్చారు.

"తెలివిగా బాగుపడుతున్న లోకంలో
అడ్డగోలుగా చెడిపోయినవాడా
నిక్కచ్చిగా బతుకుతున్న వ్యవస్థలో
నిజాయితీగా చచ్చిపోయినవాడా!"

అంటూ "కాస్త సిగ్గుపడదాం" అనే దళిత సంఘీభావ కవితా సంకలనాన్ని త్రిపురనేని శ్రీనివాస్‌కి అంకితమివ్వడం చాలా సముచితంగా ఉంది. ఎందుకంటే తొలి స్త్రీవాద, దళితవాద కవితా సంకలనాలు రావడానికి త్రిపురనేని శ్రీనివాస్ కారణం.

ఈ విధంగా అంకితాల వల్ల ఎన్నో విశేషాలు తెలుస్తాయి. ప్రక్రియాపరంగా కూడా ఈ అంకితాలను విశ్లేషించవలసి వుంది. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డిగారు తమ సిద్ధాంత వ్యాసం "ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు: ప్రయోగములు" అనే గ్రంథాన్ని తల్లి తండ్రులకి అంకితమిస్తూ ఇలా అంటారు–

"కన్నతల్లి, బ్రతికినంత/ కాలము బంగరు మమతల
పొంగించిన పాలవెల్లి/ సింగిరెడ్డి బుచ్చమ్మకు

కన్నతండ్రి నల్లని రే/ గళ్ళు దున్ని నా బ్రతుకున
రవ్వలు పండించిన క/ర్షక మణి మల్లారెడ్డికి"

ఇదీ మానవత్వం, మానవ సంబంధాలు, అనురాగం, కృతజ్ఞత... అంటే! "అంకితాలు" అనేది ఆషామాషీ వ్యవహారం కాదనీ - పరిశీలించవలసిన ముఖ్యాంశమనీ తెలియజేయటమే ఈ వ్యాసోద్దేశం.

6

చిన్నయసూరి శైలి - తెలుగుదనం

"తుద ముట్టఁగ నీ కబ్బము
పదిలముగాఁ జదివినట్టి బాలురకోలిం
బొదలును భాషాజ్ఞానము
కుదురుంగొదలేక నీతి కుశలత్వంబున్"

ఇదీ చిన్నయసూరి నీతి చంద్రికలో కృతి ప్రశంసగా ముందుమాటలో చెప్పుకొన్నది. ఈ పద్యంలోనే తెలుగు పదాలు ఎక్కువ ఉండటం గమనార్హం. నీతి చంద్రిక వల్ల నీతి మాత్రమే కాదు భాషా జ్ఞానం కూడా కలుగుతుందన్నాడు.

చిన్నయసూరి అనగానే బాలవ్యాకరణం– ఆ తరువాత గ్రాంథిక భాష గుర్తుకు రావటం పరిపాటి. చిన్నయసూరిని గ్రాంథిక వాదిగా ముద్ర వెయ్యడం, అతనిని వ్యంగ్యంగా హేళన చేస్తూ కొన్ని రచనలు రావటం తెలిసిందే. అయితే ఇది ఒక పార్శ్వం మాత్రమే. నిజానికి చిన్నయసూరి గ్రాంథిక భాషతో పాటు తెలుగు భాషకి – తెలుగుదనానికి సమప్రాధాన్యం ఇచ్చాడు. ఈ పార్శ్వం నుంచి నీతి చంద్రికను పరిశీలించ వలసి ఉంది. ఆ దిశగా ఈ వ్యాసం చిరుప్రయత్నం మాత్రమే.

'సంస్కృత సమేతరంబయిన ఈ భాష యచ్చయనంబడు' అని సూరి సూత్రం రాయటమే కాదు నీతి చంద్రికలో అచ్చ తెలుగుకి ప్రాముఖ్యమిచ్చాడు. నన్నెచోడుడు, పాల్కురికి సోమనలు ప్రారంభించిన జాను తెనుగు ఉద్యమం, దక్షిణాంధ్ర యుగంలో పొన్నెగంటి తెలగన మొదలైన వారూ ఆధునికుల్లో మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు), ఆదిభట్ల నారాయణదాసు... దాసు శ్రీరాములు... వీరంతా అచ్చ తెలుగు

వాడకాన్ని చిన్న ఉద్యమంగా కొనసాగించారు. అలా బహిరంగంగా కాకుండా ఉద్యమంగా చిన్నయసూరి అచ్చ తెలుగు వాడకానికి ప్రాధాన్యమిచ్చాడు. చిన్నయసూరి శైలిలో గల తెలుగుదనాన్ని ఈ విధంగా వింగడించవచ్చు:

- దేశ్యపదాలు
- ఆచ్చిక పదాలు
- ధ్వన్యనుకరణ పదాలు
- తెలుగు నుడికారం
- సామెతలు
- సూక్తులు
- వాక్య నిర్మాణం

దేశ్య పదాలను మళ్ళీ – వాడుకలోగల పదాలు
– వాడుకలోని ఇతర భాషా పదాలు
– మరుగున పడిన పదాలు

అని వర్గీకరించవచ్చు. కొత్త పదబంధాల, సమాసాల కల్పనకూడా లేకపోలేదు.

చిన్నయసూరి "కొడుకు" అనే పదాన్ని ఎక్కువగా వాడాడు తప్ప 'పుత్రుడు' కాదు.

"ఒక రత్నములో గులకరాలు గంపెడయినను సరిగావు" అనే వాక్యంలో 'గంపెడు' అసలైన దేశ్యపదం. పూర్వం పిల్లలు (సంతానం) ఎక్కువగా వుంటే 'గంపెడు సంతానం' అనేవారు. మరి కొన్ని పదాలు:

మాగన్ను – సగం కళ్ళుమూసుకొని పడుకోవటం – మాగన్నుగా నిద్రపోయాడు అని వాడుక.

ఉసుఱు (ప్రాణం)

ఱొడిగము

వేకువ

దాపు

సూడిద – కానుక అని అర్థం. కానీ తర్వాత సూడిదలు అంటే గర్భవతి 'సమయాన ఇచ్చే కానుకలు అని అర్థం.

బొంత

తొట్టి

ఇచ్చకములు

ఒల్ల – అంగీకరింపను అని అర్థం. ఉత్తరాంధ్రలో నేటికీ వాడుకలో వుంది.

చిన్నయసూరి కొన్ని అచ్చిక పదాలను కావాలని వాడినట్లు తెలుస్తుంది. కొన్ని పదాలు ఆనాటి సాహిత్యంలోనో, పండితులలోనో వాడుకలో ఉండవచ్చు. ఇంకొన్ని నిఘంటువులలోనివి కావచ్చు:

ఉదా: మస్కరి (సన్యాసి)

మతిమంతుడు

చెలికారము

మ్రుక్కడి (అల్పుడు)

దాపురము (దాచుట)

మొరప (మొరగటం)

కొండలపిండు

లెంక (సేవకుడు. తెనుగులెంక బిరుదు తుమ్మల వారికి ఉన్నదే). మనకి తెలియనివి లేదా మారుమూల పదాలు అయినవి కూడా ఉన్నాయనటానికి ఉదాహరణలు:

సలుగులు (అడవి పందులు)

అలబలము (కలకలము)

మొరపనేల (రాతినేల)

కారువులు (వడ్రంగులు)

ధ్వన్యనుకరణ శబ్దాలు ఒక భాషకి అత్యంత సహజమైనవి (Original). భావస్ఫూర్తికి సహకరించేవి కూడా.

"కణిల్లని" అంకు వేసెను

"చంగున" నెగిరి

"కిలకిలా" రావము

"నకనక"లాడు

"గుటగుటం" ద్రావి

"పటపటం" బండ్లు కొఱకుచు

గుండెలు "తటపట" కొట్టుకొన.

ఇవి సుపరిచితములైన ధ్వన్యనుకరణ శబ్దాలే. అక్కడక్కడ "బొట బొటం" గన్నీరు దొరుగ వంటి చోట్ల అసామాన్య ప్రయోగాలు కనబడతాయి. వాడుక భాషకి జవజీవాలు కలిగించే ధ్వన్యనుకరణ శబ్దాలను సందర్భోచితంగా సూరి ప్రయోగించటం తెలుగుదనానికి చిహ్నమే.

జాతీయాలు, తెలుగు పలుకుబడులు తెలుగు నుడికారానికి నిదర్శనాలు. వీటికి చాలా ఉదాహరణలున్నాయి. కొన్ని-

తల్లికడుపు చెఱుప పుట్టినవాడు

చెవినిక్కించి

ఏకాకి నయి నిలిచితిని

వలలో 'తగులుకొని'

ఉస్సురని

పాడుపొట్టకయి

మేయ 'మరిగినది'

కడుపార

నాలిక తీపు

విచ్చల విడి

"ఎత్తువారిచేతిబిడ్డ"

"తాత ముత్తాలు సంపాదించిన"

"నేనేపాటి వాడను"

"నివురు గవిసిన నిప్పు"

"మనసున కెక్కు"

"పెట్టుపోతలు"

"పెండ్లి నడక"

తెలుగు భాషలో (ఇతర భాషలలో కూడా) ద్విరుక్తత లేదా పునరుక్తి ఒక సొగసు - స్వాభావికం కూడా. కవిత్వంలో ఇది 'శిల్పం'గా పరిగణిస్తారు. సూరి గద్యంలో ఇది కనిపిస్తుంది.

ఉదా: మాటి మాటికి- మేలు మేలు- మెల్ల మెల్లగ- చివుకు చివుక్కున- వెదకి వెదకి- పాఱి పాఱి- కొంచెము కొంచెము.

చిన్నయసూరి తెలుగు జాతి వాడే. సామెతల్ని నీతి చంద్రికలో ప్రయోగించాడు. లోకరీతిని కాదనలేని వివేకి సూరి. వ్యాకర్త అయినంత మాత్రాన వ్యావహారికాన్ని తోసిరాజనలేదు గదా! కాకపోతే వ్యాకరణం అనే శంఖంలో పోశాడంతే. తెలుగుదనానికి సామెతలే ప్రాణం కదా! కొన్నిటిని తిలకించండి-

"తోటిలో తల దూర్చి రోకటిపోటునకు వెఱవ దీఱునా?"

"పాలముంచెదరో నీట ముంచెదరో?"

"అందనిమ్రాను పండ్ల కట్టి చాచెదవు"

"పిట్టకొంచెము కూత ఘనము"

"అడుసు త్రొక్కనేల కాలు కడుగనేల"

చిన్నయసూరి అవకాశం వచ్చినప్పుడల్లా సూక్తి సౌరభాన్ని వెదజల్లుతాడు. సంస్కృత సూక్తులు సరే- తెలుగులో కూడా సూక్తి ముక్తావళిని అందించాడనటానికి మచ్చుకి-

"తన్నుకట్ట త్రాళ్ళు తా తెచ్చుకున్నట్టు".

"చెప్పునది యొకటి చేయునది యొకటి".

"ఒకండు సేయ బోయిన మఱియొకటియగు".

"పరుల వంచింపబోయినవాడు తాను వంచితుడగు".

"తనకు మేలు గోరి పరులకు కీడు రోయువాడు తప్పక చెడిపోవును".

"కుట్టిన తేలండ్రు - కుట్టకున్నం గుమ్మర పురువండ్రుగాదె".

"తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు".

"గోరంబోవు పని గొడ్డంటం దీర్ప వలసివచ్చు".

"పాటెఱుగని దొరను సేవించుటకంటె మిన్నకుంటమేలు".

చిన్నయసూరి గ్రాంథిక వాది కాబట్టి సంస్కృత వ్యాకరణమే ప్రామాణికంగా రాస్తాడన్న అపప్రథ లేకపోలేదు. కానీ సూరి నీతిచంద్రికలో తెలుగు వాక్య నిర్మాణానికే ప్రాధాన్యమిచ్చాడు. "వాక్యపరిచ్ఛేదం" అని ప్రత్యేకంగా చెప్పకపోయినా తెలుగు వాక్య నిర్మాణ స్వభావాన్ని సూరి ఎప్పుడూ మర్చిపోలేదు. తెలుగు దనాన్ని ప్రతిబింబించే వాక్యాలను పరిశీలించండి-

"పుట్టగానే విద్వాంసుడుగాడు. పురుషకారము చేత కార్యము సిద్ధించును".

"జాగుసేయక ఈచోట విడిచిపోవలె".

"మనమీ నూకల కాసపడరాదు".

"ఎవ్వరికైన విధి తప్పించుకోవశము గాదు".

"ఆహా! లోభమెంత చెడుగుణము! అన్ని ఇడుములకు లోభము కారణము".

"ఓ చెలికాడా! ఏల మాతో మాటలాడవు?"

"మిత్రుడా, కుశలమా?"

"కొత్తగా వచ్చిన వారిని నమ్మరాదు".

"ఈ పాడు పొట్టకయి ఇంత పాపము చేయుట కెవ్వడు పాలుపడును?"

"అలాగుననే కానిండు".

"ఇంతటితో నేదియు మునిగి పోదు".

వాక్య ప్రయోగాలలో "ఓయన్న", "[illegible]" వంటి సంబోధనలు కూడా తెలుగుదనానికి సాక్ష్యాలే!

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
99877
Acc No
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500032

చిన్నయసూరి తెలుగుదనపు గుబాళింపును పరిపరి విధాలుగా అందించాడు. వ్యాకర్త కాబట్టి ఛాందసుడుగా ముద్ర వేయటం అనుచితం, అసమంజసం.

"ఒల్ల" అనే పదాన్ని చాలాసార్లు ప్రయోగించాడు. దీని అర్థం ఒప్పుకోను. ఉత్తరాంధ్ర మాండలికం ఇది. "ఒల్ల నోరి మామా నేనొల్లను" అనే సినిమా పాటకూడా వుంది. ఇంతటి ప్రాంతీయ పలుకుబడిని కూడా సూరి విస్మరించలేదని గ్రహించాలి.

తెలుగు వచనంలో అంత్యాను ప్రాసకి ప్రాధాన్యమిచ్చినవాడు చిన్నయసూరి. పద్యంలోనే కాదు వచనంలో కూడా అంత్యాను ప్రాసవల్ల తెలుగుదనం ఇనుమడిస్తుంది, అని చాటినవాడు సూరి. మచ్చుకి-

"నాయుల్లంబు పెల్లుగ నుడికిల్లెడు"

"మలంగక, తొలంగక, పట్టువదలక, నట్టుగదలలేక"

"నిమిత్తంబు గానక చిత్తంబుత్తలంబొందెడు"

"మెఱపు మెఱసిన తెఱంగుననుతికి".

చిన్నయసూరి వ్యాకర్త అయినా, కొందరి దృష్టిలో గ్రాంథిక వాది అయినా వాడుకలోనున్న పదాల పట్ల శ్రద్ధలేనివాడు కాడు. వ్యావహారిక భాషాజ్ఞానం ఉన్నవాడు - అనటానికి నీతిచంద్రికలో అతను ప్రయోగించిన వాడుకలోగల ఇతర భాషా శబ్దాలే ప్రత్యక్ష సాక్ష్యాలు.

దసారా- జోహారు- పరాకు- దివాణము మొ॥

"నీజోలికి రాను" - "ఊచ్చు" - "నాడెము" "మచ్చిక" "సారె", "కొంకుమాని" వంటి అసలైన తెలుగు నుడికి - కొడయ, గట్టె, మావు, వంటి వృత్తి పదాలకు- కావ్య గౌరవం కల్పించిన చిన్నయసూరిని ప్రాచీన భాషా రచయితగా కేవలం గ్రాంథికవాదిగా పేర్కొనడం అసమంజసం, అనుచితం.

7

దీర్ఘకవితలు- వచన కవితా వైభవం

శిష్ట్లా ఉమామహేశ్వరరావు ఆద్యుడుగా, కుందుర్తి నాయకుడుగా వచన కవిత్వం మూడు పువ్వులూ ముప్పయి కాయలుగా వర్ధిల్లింది. ఇవాళ కవిత్వం అంటే వచన కవిత్వమే అన్నంతగా విస్తృతి చెందింది. ఒక ప్రక్రియ పరిపుష్టం చెందాలంటే, ప్రాచుర్యం పొందాలంటే వైవిధ్యం వుండాలి. విభిన్నధోరణులను ప్రతిబింబించాలి. కుందుర్తి ఆశించిన కథాకావ్యాలు అంతగా రాకపోయిన దీర్ఘకవితలు లేదా దీర్ఘ కావ్యాలు మాత్రం అనేకం వెలువడ్డాయి, వెలువడుతున్నాయి. ఆంగ్లంలోగల "లాంగ్‌పోయెమ్"ను తెలుగులో దీర్ఘకవితగా, దీర్ఘకావ్యంగా వ్యవహరిస్తున్నారు. శ్రీశ్రీ నిన్నటి కావ్యం పద్దెనిమిది పర్వాలైతే నేటి కావ్యం పద్దెనిమిది పేజీలు అన్నాడు. అంటే పూర్వం 'కావ్యం' మాటకి అర్థం, నియమాలు వేరు. నేటి వచన కవితా కావ్యానికి వేరు అని తాత్పర్యం. నిజానికి దీర్ఘకవిత రాయటం వచనకవితకంటే కష్టం. దీర్ఘ కవిత రాణించాలంటే-

"వస్తు విశిష్టత అవసరం
రచనాశిల్పం అత్యవసరం
విషయంపై సమగ్ర అధికారం మరీ అవసరం.

దీర్ఘకవితలో వచనకవిత పలుచబడే అవకాశం బాగా వుంది. అన్ని పంక్తులూ కవితామయంగా వుండి "ఓహో" అనిపించటం కష్టసాధ్యం కూడా. వస్తువే ప్రధానమైనప్పుడు ఈ ప్రమాదం తప్పదు. కవితాశిల్పమే ప్రధానమైతే వస్తువు బలహీనమవుతుంది. అందుకే దీర్ఘ కవిత రాసి మెప్పించటం మాటలు కాదు.

ఎందుకంటే కొంతమేరకు 'వాచ్యం' అనండి లేదా 'సోది' అనండి వుండే అవకాశం వుంది. దాన్ని అధిగమించినప్పుడే అది ఉత్తమ 'దీర్ఘకవిత'గా పేరొందుతుంది.

తెలుగులో వెలువడిన దీర్ఘ కవితల్ని వస్తువును బట్టి కింది విధంగా వింగడించవచ్చు:

ఉద్యమపరమైనవి : తెలంగాణ (కుందుర్తి), కొత్తగబ్బిలం (ఎండ్లూరి సుధాకర్) నా తెలంగాణ (జూలూరు గౌరీశంకర్) మొ॥

రాజకీయపరమైనవి : రా రాజకీయం (నీత) గుమ్మ (ఛాయారాజ్)

తాత్త్వికపరమైనవి : పునరపి జననం (బండి సత్యనారాయణ) మట్టీ-మనిషీ-ఆకాశం (సినారె) స్తబ్దచలనం (సంగుభొట్ల సాయిప్రసాద్)

ప్రపంచీకరణకు నిరసనగా

వెలువడినవి : ఆట (దర్భశయనం) వాస్కోడిగామా. కామ్ (జూకంటి జగన్నాథం), మూడవ గుణపాఠం (జూలూరు గౌరీశంకర్)

వృత్తిపరంగా వెలువడినవి: ముద్రబల్ల (దాట్ల దేవదానం రాజు) గొడిముక్క (ఆర్. రామకృష్ణ), మగ్గంబతుకు (రాధేయ)

వ్యక్తిపరంగా వెలువడినవి: దయామేఘు మల్హారి (ఎమ్మెన్. సూర్యనారాయణ) బాపూజీ (ఎమ్.ఆర్.ఎస్. కొల్లూరి) బుష్‌కాకి (ద్వా.నా.శాస్త్రి)

వివిధ వస్తువులకు సంబంధించినవి :

తుఫానుపై : కొయ్యగుర్రం (నగ్నముని)

విద్యారంగంపై : విద్యావరణం (బండి, ద్వానా)

భాషపై : మాట (చిన్ని నారాయణరావు)

నీటిపై : జలగీతం (ఎన్. గోపి)

బాల్యంపై : పడగకింద పసితనం (ఆసు రాజేంద్ర), బాలల కొలువు (ఎన్.సిహెచ్. చక్రవర్తి)

బంగ్లాదేశ్ విమోచనం

సందర్భంగా : ముక్తధాత్రి (మాదిరాజు రంగారావు)

ఆత్మకథాపరంగా : మెరుపు పువ్వు (అద్దేపల్లి రామమోహనరావు)

న్యాయవ్యవస్థపై : హాజిర్‌హై (జింబో)

భూకంప వినాశనంపై : కిల్లారి (సి.వి. కృష్ణారావు)

అనుభూతి ప్రధానమైంది : దోనాపాలా (సోమసుందర్)

దీనినిబట్టి దీర్ఘ కవితలలో వస్తువైవిధ్యం, వస్తు వైశిష్ట్యం ఎంత వుందో తెలుస్తుంది. దీర్ఘ కవితలలో అభివ్యక్తి శిల్పం కూడా మరింత ఇనుమడించింది. డా॥ ఎన్. గోపి.

"ఏ బ్రహ్మాండాలనుంచి
వొలికి పడ్డాయో నీళ్ళు!
ఊహలో పట్టని
ఏ వైశాల్యాల గుండా
వీటి చిరంతన ప్రయాణమో
ఏ విశ్వాంతరాళాల
ఆదిమ శబ్దాలను మోసుకొచ్చాయో!
నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం
నీరంటేనే జలజల లాడిపోతాం" (జలగీతం)

అంటూ దీర్ఘ కవితను ప్రారంభించడంలో అభివ్యక్తి శిల్ప పటిమ గమనిస్తాం. ముఖ్యంగా చివరి రెండు పాదాలు 'కవిత్వమయం' ఇదే విధంగా ఎండ్లూరి సుధాకర్ 'కొత్తగబ్బిలం' ప్రారంభంలో విభిన్న శిల్పం కనబరిచాడు...

"తెల్లని ట్యూబులైటు గదిలోకి
నల్ల బ్యాడ్జీలా రెపరెపలాడుతూ
వచ్చిందో కుర్ర గబ్బిలాయి
వాని కన్నుల్లో కవి కోకిల వారసత్వం ప్రతిఫలించింది"

అన్నాడు. ఇక్కడ కవి కోకిల అంటే జాషువా అని కవి హృదయం. అయితే ఈ బిరుదు దువ్వూరి రామిరెడ్డికే ప్రసిద్ధం కాబట్టి మరొక బిరుదు ప్రయోగిస్తే మరింత

ఔచిత్యంగా వుండేది కదా! ఆర్. రామకృష్ణ ఒక పశువుల కాపరి జీవిత స్థితిని వర్ణించే దీర్ఘ కవిత 'గొడిముక్క'లో ప్రారంభం ఔచిత్య వంతంగా వుంది–

"కాలం కడు సిత్రమైంది
అది ఎంతటి గాయన్నైనా మానుపుతుంది
పోరే ఏరు
ఎంతటి గొయ్యినైనా కప్పేసినట్టు"

అంటూ గంభీరంగా మొదలెట్టడం అభివ్యక్తి శిల్పంలో భాగమే. దర్భశయనం కూడా 'ఉత్కంఠ' కలిగేలా– తన కావ్యానికి నేపథ్యంగా ప్రారంభించి "సీరియస్‌నెస్"ను కలిగిస్తాడు–

"పుట్టుక ఒక అద్భుతం
తల్లి గర్భం మెత్తని తొలి పాన్పు
శిశువు కన్నింకా తెరవలేదు
బయటి కాంతి పొడ సూపలేదు"

తొలి దీర్ఘ కావ్యంగా పేర్కొనదగిన 'తెలంగాణా' కావ్యాన్ని కుందుర్తి వివిధ ప్రకరణల శీర్షికలతో రచించాడు. తెలంగాణా విప్లవ పోరాటంపై రాసింది కాబట్టి ఇలా "షురూ" చేశాడు–

"ఒక రాజు మొగాన్నే ప్రొద్దుపొడిచిందా? దేశంలో
ప్రతి రాజు కటికి గుండెలా
పొంగిన అధర్మపు టావేశంలో
పరిపాలన సాగింది"

మరి ఉద్యమపరంగా రాసిన దీర్ఘ కవిత భిన్నంగా ఉండకుండా ఎలా ఉంటుంది. జూలూరు గౌరీశంకర్ "చెకుముకిరాయి" కావ్యాన్ని తెలంగాణా రాష్ట్రోద్యమం గురించి రాస్తూ ఇలా ప్రారంభించాడు.

"ఇది ఇక
తెగ తెంపుల సంగ్రామం
తెగిస్తేనే తెలంగాణ సాధ్యం
నాలుగు వేల ప్రాణాలను

నాడు మేచ్చినం
ఆ జై కొట్టిన అమరులు
మాకు కసి నేర్పించ్రు"

ఇక వస్తుపరంగా చూస్తే "కవికన్ను ప్రిజమ్‌లాంటిది" అన్నది నిజమనిపిస్తుంది. కవి ఎక్కడ ఏ సంఘటన జరిగినా స్పందిస్తాడు. కవి రాష్ట్రకవి- జాతీయకవి మాత్రమే కాడు అంతర్జాతీయ కవి కూడా. దీర్ఘకవితల్ని పరిశీలిస్తే ఇవన్నీ సత్యమని వెల్లడి అవుతుంది. 1993 సెప్టెంబరు 30 రాత్రి మహారాష్ట్రలో భయంకరమైన భూకంపం వచ్చింది. ఒకతరం ప్రజ పూర్తిగా చతికిలబడిపోయింది. ఆ సంఘటనకు స్పందించి, దిగులు చెంది, మొత్తుకొని సి.వి. కృష్ణారావు రాసిన దీర్ఘకవిత "కిల్లారి"-

"అలసిపడుతున్న ప్రాణి అవ్యక్తతలో
మరుభూమి వళ్ళు విరిచింది
చితికిన నీటి బుడగలు ప్రాణాలు"

అంటూ భూమి, నీటి ప్రస్తావనలతో కవిత రాయడం గొప్ప శిల్పం. ఆచార్య కోవెల సంపత్కుమార "ఒక దేశీయాధునిక మహాకావ్యం" అంటూ కొంచెం అతిశయోక్తిగా పలికినా - పెన్నా శివరామకృష్ణ రాసిన "జీవనది" మంచి దీర్ఘకావ్యం. సమాజంలోని అవాంఛనీయ, అనభ్యుదయకర, సామ్రాజ్యవాద ధోరణుల్ని పెన్నా నిరసించాడు. సంవాదాత్మక శైలితో, వ్యంగ్యోక్తులతో ఆకట్టుకొనే పంక్తులెన్నో ఈ దీర్ఘ కావ్యంలో ఉన్నాయి. మచ్చుకి-

"కాషాయపుగడ్డాన్ని ద్వేషిస్తారు సరే
మరోమత గడ్డంలో మార్క్స్ కనిపించటం విచిత్రం"

"పెట్టుబడికి స్వప్నసుందరికి
జన్మించిన వారపుత్రిక ఈ నగరం"

"ఈ మట్టే తన దేహమని ఈ నీరే తన ప్రాణమని
నమ్మిన ప్రతివాడూ సోదరుడే
కానివాడు నిశ్చయంగా కాందిశీకుడే"

దీర్ఘకవితల "పహిల్వాన్"గా జూలూరు గౌరీశంకర్‌ను పేర్కొనాలి. సుమారు పదిహేను దీర్ఘకవితలు రాశాడు. వీటిలో నాలుగు తెలంగాణా వాదానికి

సంబంధించినవే. 1989-90 సంవత్సరంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కి స్పందిస్తూ జూలూరి 'ఇలియాస్' రాశాడు. కార్పొరేట్ మిల్లులవల్ల ఆత్మహత్యలు చేసుకొన్న వారి ఛిద్రమైన బతుకులను చిత్రీకరిస్తూ రాసిన దీర్ఘకవిత "ఓం నమశ్శవాయ"-

"ఇది బుష్ రణగొణధ్వని
మార్కెట్ హింసలో మనిషి నెత్తురు హైజాక్
యుద్ధమూ వాణిజ్యమే
సరళీకరణమంటల్లో ఆజ్యమే"

అంటూ గౌరీశంకర్ సామ్రాజ్యవాదంపై ధ్వజమెత్తుతూ "మూడవ గుణపాఠం" రాశాడు. కరువు గురించిన రాసిన "కాటు", అగ్రవర్ణ భూకామందుల అహంకారాన్ని ఎండగడుతూ రాసిన "నాలుగో కన్ను", నక్సల్స్‌పై నిషేధం ఎత్తివేసినప్పుడు రాసిన "మొగిలిచర్ల" కావ్యాలు సమకాలీన సంఘటనలకు ప్రతిస్పందించి సామాజిక తపనతో రాసినవే. "నా తెలంగాణా", "మహాయుద్ధం", "చెకుముకిరాయి", "ఈ మట్టికి నమస్కరించి" అనే నాలుగు దీర్ఘ కవితలు తెలంగాణా వాదంపై రాసిన ఏకైక కవి జూలూరి గౌరీశంకర్. తెలంగాణా వాదం నేపథ్యంలో సుంకిరెడ్డి నారాయణరెడ్డి (దాలి), ఎలికట్టి శంకర్ (యాది) మొదలైన వారు దీర్ఘ కవితలు రాశారు.

గౌరీశంకర్ తర్వాత ఎక్కువగా దీర్ఘ కవితలు రాసిన కవి ఛాయారాజ్. ప్రగతి శీలత, విప్లవ నిబద్ధతలతో దాదాపు పది దీర్ఘ కవితలు రాశాడు. చారిత్రాత్మకమైన శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటాన్ని "శ్రీకాకుళం"గా రాశాడు. రాజ్యహింసపై "గుమ్మ" కొండకావ్యం, కుటుంబ వ్యవస్థను విజ్ఞానశాస్త్రపరంగా సమీక్షిస్తూ "దర్శిని" కావ్యం స్త్రీ పురుష సంబంధాలను విప్లవ నేపథ్యంతో "నిరీక్షణ" కావ్యం వంటివి రాసి తన నిబద్ధతను వెల్లడించాడు.

"శ్రమే గోళం శ్రమే సాగరం
శ్రమే గర్భకోశం
గర్భకోశం చుట్టూ ఆవరించి వున్నదే అమ్మ"

అంటూ వినూత్న వ్యక్తీకరణతో ఛాయారాజ్ రాసిన కావ్యం "తొలెరుకు" శ్రమనుంచి పండుగలూ సంస్కృతీ వచ్చాయి. అటువంటి శ్రమ శక్తిని వ్యాపారంగా మలచుకొనే వారిపై ఎక్కుపెట్టిన దీర్ఘకవిత "దుఖ్కేరు".

జూకంటి జగన్నాథం చౌరస్తా, శక్తి, ఓ అయిదు ఎపిసోడ్స్, 'వాస్కోడిగామా.కామ్' అనే దీర్ఘ కావ్యాలు రాశాడు. కష్టజీవులూ, పీడితులూ, వృద్ధులూ ఈ కవి కావ్యాలలో కనిపిస్తారు. కావలసినంత కవిత్వం దొరుకుతుందనడానికి ఈ పంక్తులే చిహ్నపతాకలు:

"ఎటుచూసినా ఆకలే ఆకలి
నమలకుండానే జనాన్ని మింగుతోంది అన్యాయం
ఆకలి భుజం మీద చేయి వేసుకొని
స్వైరవిహారం చేస్తోంది
వెగటుగా పగలబడి నవ్వుతోంది"

"గ్లోబలైజేషన్" వల్ల మానవ సంబంధాలు చితికి, ఆర్థిక సంబంధాలు బలోపేతమవటం అందరూ ఆవేదన చెందేదే. అయితే కవితాపరంగా దీనిని ఎన్నిరకాలుగా వ్యక్తీకరించి ఆ రాక్షసి బహుముఖ వికృతత్వాన్ని చూపించవచ్చో దర్భశయనం శ్రీనివాసాచార్య "ఆట" కావ్యంలో ప్రదర్శించాడు. బతుకు మార్కెట్ వశంకావడాన్ని, అసలు మనిషే మార్కెట్ వస్తువైన స్థితినీ అద్భుతంగా చిత్రీకరించాడు దర్భశయనం. "బాలల కొలువు" అనే దీర్ఘ కవితను పిల్లల కోసం మొదటగా రాసిన ఎన్.సిహెచ్. చక్రవర్తిని అభినందించాలి.

శీలా వీర్రాజు, నగ్నముని, శివారెడ్డి వంటి సీనియర్ కవులు రాసిన దీర్ఘ కావ్యాలు ఇదివరకే ప్రాచుర్యం పొంది చర్చలు జరిగాయి. శివారెడ్డి రాసిన "అంతర్జనం" కూడా ఇటీవల కొంత చర్చకి దారితీసింది. దీర్ఘకావ్యాలలో ఎన్నో విశిష్ట, విలక్షణమైనవి ఉన్నా నా దృష్టికి వచ్చిన వాటిల్లో నాకు నచ్చిన మూడింటిని వివరించి ఈ వ్యాసం ముగిస్తాను.

ఎమ్మెస్ సూర్యనారాయణ కూడా ఆరు దీర్ఘ కావ్యాలు రాశాడు. వీటిల్లో "దయామేఘు మల్హారి" మంచి కావ్యం. కోనసీమలో ఒకనాడు అన్నదానానికి మారుపేరుగా నిలిచిన డొక్కా సీతమ్మ (1841-1909) పై రాసిన కావ్యమిది.

"నీది అమృత పాదయాత్ర
అన్నపు మెతుకు పాత్ర
జీవిత యాత్రలో నువ్వొక

అద్భుత అక్షయపాత్ర!
సీతమ్మా!
సతత హరిత సదనానివి
మానవీయ కథనానివి"

అంటూ ఆమె ఔన్నత్యాన్ని వివరించిన తీరు అద్భుతం.

వాస్తవం, సామాజికత, మానవత, విజ్ఞానశాస్త్రం వంటి అంశాలతో పరిశోధనాత్మకమైన గొప్ప కావ్యం "జలగీతం" రాసినవారు డా॥ఎన్.గోపి. ప్రారంభం, కొనసాగింపు, విశ్లేషణ, హెచ్చరిక, సూచన... అన్నీ స్పృశిస్తూ కవితామయం చేసిన "జలగీతం" కావ్యం మహా దీర్ఘకావ్యమనదగినది.

"ఈ కాస్త భూఖండంలో
విర్రవీగుతున్న మనిషి
జలమర్మాలను కనుక్కోవడానికి
జిజ్ఞాసువుగా ఎదిగిన మనిషి
జలస్తన్యాన్ని క్రూరంగా కుమ్ముతున్నాడు
సమస్త జలావరణం మీద వల విసిరాడు"

అంటూ నీటి సమస్త విశ్వరూపాన్ని, మానవుని అత్యంత నిర్లక్ష్యాన్ని ముంచుకు రాబోయే ప్రమాదాన్ని డా॥ ఎన్. గోపి ప్రతిభావంతంగా చిత్రీకరించాడు. "జలస్తన్యం" అపూర్వ ప్రయోగం.

ఇటీవల వెలువడిన మరొక మంచి దీర్ఘ కావ్యం "మాట". మాట మహిమను, మాట అవసరాన్ని... మాటకి గల వివిధ శక్తుల్ని చిన్ని నారాయణరావు ఈ కావ్యంలో వివరించిన తీరు ప్రశంసనీయం.

"మాట
మనసుని రంజింపచేసే
సంజీవని!
మాటే మనిషిని
అనునిత్యం ప్రేరేపించే
అయుధ గని!

మాటే
గెలుపుని సుగమం చేసే
చక్కని మార్గం...
బతుకు చిరుగుల్ని
మాటల దారంతోనే కదా
కుట్టుకునేది"

అంటూ మానవ సమాజంలో మాట ఆవిష్కరించే అద్భుత దృశ్యాల్ని రూపుకట్టించారు. 'మాట తెగులు'ను మాత్రం స్పృశించలేదు.

ఈ విధంగా తెలుగులో 'దీర్ఘకవిత' ఒక బలమైన సాధనంగా రూపుదిద్దుకుంది. దీర్ఘ కవితలన్నీ ఇంచుమించుగా సామాజిక తపనతో రాయబడినవే. ఒక విషయాన్ని విస్తృతంగా, లోతుగా, సారవంతంగా వ్యక్తీకరించడానికి దీర్ఘ కవిత ఎంతగానో ఉపకరిస్తుందని దీర్ఘకావ్యాలు నిరూపిస్తాయి. మనిషి మనుగడ సజావుగా సాగాలనీ, మానవీయ విలువలతో సమాజం సాగాలనీ ఈ దీర్ఘ కావ్యాల కవుల ఆశయాలు. వచన కవితకి దీర్ఘ కవిత పుష్టిని చేకూరుస్తూ మరింతగా దానిని సుస్థిర పరుస్తోంది.

8

వచన కవిత్వంలో ఆలంకారికత

"ఏమిటి చెప్పడం, ఎలా చెప్పడం
అనేవి రెండూ రెండు చక్రాలు
ఈ రెండూ సమంగా ఒప్పడం బండీని త్రిప్పడం
అనేవే కవితా సౌలభ్యత్వాలు"

అన్నారు ఆరుద్ర. అంటే వస్తువు, అభివ్యక్తి రెండూ ప్రధానమే. "ఎలా చెప్పడం" లోనే ఆలంకారికత వుంది. "సౌందర్యమలంకారః" అన్నారు. అందంగా చెప్పడమే అలంకారం. కావ్య సౌందర్యానికి శోభను కలిగించేవనీ, కావ్య శరీరానికి హారాలనీ ఆలంకారికులు చెప్పారు. శేషేంద్ర మాటలు కూడా గుర్తుకు వస్తాయి– "కవి చెప్పే విషయమేదైతే ఉందో, దేన్ని వస్తువంటున్నామో అదే అలంకారంగా మారుతుంది. అంటే తత్వతః వస్తువు అలంకారాలుగా మారిపోవడమే కవిత్వం (వస్తువు వంద రూపాయల నోటు అయితే అలంకారాలు వంద రూపాయి నాణాలు)".

అసలు భాషా వ్యవహారంలోనే అలంకారాలున్నాయి. ఒక భావాన్ని స్పష్టంగా, బాగా, చమత్కారంగా, బలంగా చెప్పటానికి అలంకారాల అవసరం వుంది. అందుకే శేషేంద్ర "అలంకారం మనిషిని Genetic గా ప్రభావితుడ్ని చేసి నాగరికత ఉద్భవానికి మార్గం వేస్తుంది" అంటారు.

శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు రెండింటికీ వచనకవిత్వంలో ప్రాధాన్యం, ప్రాచుర్యం వుంది. శబ్దాలంకారాలలో వృత్యనుప్రాస, అంత్యానుప్రాస, అంతఃప్రాసలు ఎక్కువ కాగా యమకం తక్కువ. అర్థాలంకారాలలో ఉపమ, రూపకాలంకారాలకే

ప్రాముఖ్యం వుంది. మిగిలిన ఉత్ప్రేక్ష, దృష్టాంతం, అర్థాంతరన్యాసాదులు అక్కడక్కడ కనిపిస్తాయి. స్వభావోక్తి అలంకారం కూడా లేకపోలేదు. శ్లేషాలంకారం చాలా తక్కువ. శబ్దాలంకారాలలో లాటాను ప్రాస, ఛేకాను ప్రాసలు లేవని చెప్పవచ్చు.

వచన కవిత్వంలో వ్యంగ్యం, అధిక్షేపం ఎక్కువ. అంటే వక్రోక్తి, గూఢోక్తి అనే అలంకారాలకు దగ్గరగా వుంటుంది. ప్రాచీన కవిత్వంలోలాగా ఆలంకారిక లక్షణాలను అన్వయించి చెప్పటం ఇబ్బందిగా వుంటుంది. ఒక్కొక్కసారి రెండు మూడు అలంకారాలుగా భాసించటం, ఒకేసారి రెండు మూడింటిని ప్రదర్శించటం గమనిస్తాం. ఉపమ, రూపకాలను స్పష్టంగా గుర్తించవచ్చు. పైగా వచన కవిత్వంలో భావ చిత్రాలు లేదా పద చిత్రాలు బాగా ఎక్కువ. వీటిని అలంకారాలుగా గుర్తించడంలో క్లిష్టత ఏర్పడుతుంది. భావన, ఊహ లేదా కల్పన అనేది భావచిత్రాల (ఇమేజరీ)లో వుంటుంది. అంటే 'ఉత్ప్రేక్ష' అనిపిస్తుంది. ఒక్కొక్కసారి రూపకం (మెటఫర్)లా భాసిస్తుంది. వలె, పోలె, అట్లు... అనే ఉపమావాచకాలను బట్టి ప్రాచీన కవిత్వంలో ఉపమాలంకారమని గుర్తిస్తాం. వాటికి బదులుగా వచన కవిత్వంలో లా, లాగా, లాంటి, వంటి... అనే వాచకాలు కనిపిస్తాయి. ఒక్కొక్కసారి లాంటి, వంటి అనేవి సందర్భాన్నిబట్టి "నాన్" అనే ఉత్ప్రేక్షా వాచకమా అన్న భ్రాంతి కూడా కలుగుతుంది.

వచనకవిత్వంలో అలంకారాలను పరిశీలిస్తే

- అనుభవంలోనివి, సహజమైనవి అయిన ఉపమానాలే ఎక్కువ.
- పౌరాణిక పాత్రలు, సంఘటనలూ ఆధునిక భావజాలానికి తగినట్లు ఉపమానాలుగా గ్రహించడం.
- ఒకేసారి రెండు మూడు అలంకారాలను ప్రయోగించటం.
- అతిశయోక్తి వంటివి తక్కువగా ఉండటం.

అనే అంశాలను గమనిస్తాం. అమూర్తాలకి మూర్తిమత్వ ఆరోపణ, అప్రాణి వాచకాలకి ప్రాణి ధర్మ ఆరోపణ ఎక్కువగా కనిపిస్తుంది. ఇక్కడే అలంకారాన్ని గుర్తించటం కష్టమవుతోంది. ఒక్కొక్కసారి 'రూపకం'గా, మరొక్కసారి 'వక్రోక్తి'గా తోస్తుంది. 'ప్రతీక' కూడా రూపకంగా అనిపిస్తుంది. అయితే వడలి మందేశ్వరరావుగారు 'ప్రతీక' రూపకం కాదని నిర్ణయించారు. ఉపమ, రూపకాలు సంకుచిత పరిధిలోనే

భావస్ఫురణకి తోడ్పడతాయనీ, ప్రతీక కావ్యం అంతటికీ వివక్షితార్థాన్ని చేకూరుస్తుందనీ ఆయన తేల్చారు.

ముందుగా వచన కవిత్వంలో శబ్దాలంకారాలను పరిశీలిద్దాం:

అంత్యానుప్రాస : పాదాల చివర లేదా పదాల చివర వచ్చిన అక్షరమే మళ్ళీ రావటం. ఉదా:

"ఆయన పేరు మోహనదాసు
మంచీ చెడులు తూచి పెట్టే ధర్మపు త్రాసు
ఆయనవూరు పోరుబందరు
ఊరిలోనే పోరున్నదని ఉలిక్కి పడ్డారు కొందరు" (కుందుర్తి)

కుందుర్తి, ఆరుద్ర, సినారెలు అంత్యానుప్రాసకి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఆ తరువాత శేషేంద్రను చెప్పుకోవాలి. అంత్యానుప్రాసలో "1, 2, 4, పాదాలకు అంత్య ప్రాస; 1-3, 2-4 లకు అంత్య ప్రాస, రెండేసి పాదాలకు అంత్యప్రాస, 2,4 పాదాలకు అంత్యప్రాస" అనే పద్ధతులు కూడా ఉన్నాయి.

శేషేంద్ర కవిత్వం నుంచి ఉదాహరణలు:

"నది పొలాల వైపు పరుగెత్తింది
అన్నార్తుల్ని రక్షిద్దామని
చెయ్యి రైఫిల్ వైపు పయనించింది
ప్రజా ద్రోహుల్ని శిక్షిద్దామని"
"జీవన సముద్రమంతా ఈదాను
అక్షరాన్ని ఒక బెలూనులా ఊదాను
ఒక బొట్టు కన్నీటిలో నుంచి
ఎంతో దుఃఖం చేదాను"

అనే చోట 1, 2, 4 పాదాలలో అంత్యప్రాస వుంది. పదాంతాలలో అంత్య ప్రాసకి ఉదాహరణ-

"పూర్వం మీ పెరడు/ ఇనుప గని
ఇప్పటికీ మంటిలోన/ ఇనుముందని
పాండురోగానికి మందని..."

పాదాలతో నిమిత్తం లేకుండా కొన్ని పాదాలు వరుసగా అంత్యానుప్రాస పాటించడం ఎక్కువ-

"రజాకార్లు గ్రామాలను మండించారు
దండించారు
పాపం పండించారు.

ఆదిప్రాస: కుందుర్తి కవిత్వంలో ఆదిప్రాస అధికం. ఆ తర్వాతే ఆరుద్ర, సినారె, శ్రీశ్రీ, శేషేంద్రలను చెప్పుకోవాలి.

"అందలం మోసే కూలీ
అందులో కూచున్న రోజు
అందరూ లోకాన్ని తిడతారు
అందులో తప్పు చూపెడతారు" - **కుందుర్తి.**

"ఆటమిక నాగరికతకు
అటవిక నాగరికతకు
అట్టే వ్యత్యాసం లేదు" - **పఠాభి.**

ఇంకా అంతఃప్రాస (పాదమధ్యంలో వేసే ప్రాస), వృత్యనుప్రాసలూ వున్నాయి.

వృత్యనుప్రాస: "అభ్రవీధిలో అభ్రక శకలంలాగ అశుభ్రజ్యోత్స్న" శేషేంద్ర.
"మొసళ్ళు కన్నీళ్ళు వెళ్ళ బుచ్చి..." - **కాళోజీ**

అంతఃప్రాస : *"ఇది వేరు అది మ్రానుు*
ఇది దీపం అది వెలుతురు
ఇది దేహం అది నెత్తురు
ఇది వీణ అది రాగం"

యమకం : రెండుగానీ అంతకంటె ఎక్కువగానీ అక్షరాల సమూహం మళ్ళీ మళ్ళీ వ్యవధానంతో అర్థ భేదంతో వస్తే యమకం అవుతుంది.

"నా దేశంలో నేను ఏకాకిని
నా దేశంలో నేను ఏ కాకిని" - **నిఖిలేశ్వర్**

"ఉత్తుత్త మాటల్తో పొమ్మంటే పోరు
పోరంటే పోరే అందులో ఇంకా జాలేమిటి?"- కుందుర్తి

"అసలే నేను మొదట్నుంచీ
సందేహాల సంశయాల పాముపుట్టను
ఈ జన్మలో చస్తే ఇంక మళ్ళీ పుట్టను" - కుందుర్తి

"ద్రవ్యంలో లోపిస్తే యావత్తు
ద్రవం అయిపోతుంది యావత్తు" - శ్రీశ్రీ

"పెట్టుకొనే టోపీ కాదు - పెట్టిన టోపీ చూడు" - కాళోజీ

"మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని" - సావిత్రి

ఉపమాలంకారం : అర్థాలంకారాలలో ఉపమాలంకారాల్ని పరిశీలిస్తే అందరి కన్న ఎక్కువగా అనుభవంలోనివి, జీవితంలోనివి ఉపమానాలుగా గ్రహించిన కీర్తి కుందుర్తికే దక్కుతుంది. అంటే శేషేంద్ర, ఆరుద్రాదుల కన్న ఎక్కువ గ్రహించాడని తెలుస్తుంది. కుందుర్తి ఉపమలు చూద్దాం-

"అత్తవారింటికి వెళ్ళే కొత్త పెండ్లికొడుకులా..."
"పాలివ్వని పాడి బర్రెలాంటి రాచరికాలు"
"రిక్షాలో కూర్చున్న ఘోషా సుందరిలా...
"పిల్ల కాయలు తియ్యగా తినే
పిప్పర మెంటు బిళ్ళలా"
"నగరకాంతకు మెళ్ళో కట్టిన
తగరపు తాళిబొట్టులా"

కుందుర్తిలో అనేక ఉపమానాలు వాడే లక్షణం వుంది. దీన్ని 'మాలోపమ' అంటారు. తర్వాతి కవులకి బహుశా కుందుర్తి మార్గం వేశాడనుకుంటాను. మరికొందరి ఉపమాలంకారాలు-

"ఎన్నికల ప్రచారంలాగా ఎందుకూ పనికిరాని రాకపోకలు
ఎవరూ నమ్మని వాగ్దానాలవలె ఎందుకో తెలియని ట్రాఫిక్కు"

-ఆరుద్ర (నగర వర్ణన)

"మ్యాటినీ సినిమా తెరమీద
మచ్చల బల్లిలా పాకుతూనో
పాత నవల పంక్తుల మధ్య
రెక్కల పురుగులా అచ్చొత్తుకుంటూనో" – కొండేపూడి నిర్మల

"తలంటి పోసుకున్నట్టు చల్లగా
కొమ్మల్ని విరబోసుకున్న చెట్టు" – జయప్రభ

కుందుర్తి వాడిన మాలోపమలలో ఒకటి–

"దరిద్రుడు మేనిపై ధరించిన అతుకుల బొంతలా
దానవుల సంతలా
బ్రతుకు లోనుంచి కారిపోతున్న చిల్లుల బానలా
అధర్మపు వానలా
దేశపటం" (తెలంగాణా)

ఇటువంటి మాలోపమలు వాడటంలో శివారెడ్డి అందెవేసిన చెయ్యి.

ఉపమాలంకారంలో ఉపమేయం, ఉపమానం, సమానధర్మం, ఉపమా వాచకం అనే నాలుగు అంగాలుంటే దానిని 'పూర్ణోపమ' అంటారు. ఏదో ఒకటి లోపిస్తే 'లుప్తోపమ' అంటారు. శేషేంద్రలో లుప్తోమలు ఎక్కువగా కనిపిస్తాయి. శేషేంద్రలో మరో విశేషం మూర్తామూర్తాలకి సాదృశ్యం చెప్పడం.

"ఇక్కడ జీవితం కుళ్ళిన పండులా శిథిలమై పోయింది"
"ఆశలు మాసి పోతున్నాయి ప్రత్యూష నక్షత్రాల్లా"

అన్న శేషేంద్ర పంక్తుల్లో పూర్ణోపమ వుంటే–

"బంగారు బస్తాలు మోసే వృద్ధ కూలీలా ఉన్న పశ్చిమాకాశం"

అన్నప్పుడు సమాన ధర్మం లోపించింది. కాబట్టి లుప్తోపమ. శేషేంద్ర ఉపమాలంకారాలలో–

"నాగలి భుజాన వేసుకొని పొలం వెళ్ళే ప్రతి రైతు
నాకు శిలువ మోస్తున్న జీసస్‌లా కనిపిస్తాడు"

అనేది ప్రసిద్ధమైంది.

రూపకాలంకారం: ఉపమేయోపమానాలకి అభేదం వర్ణించడం రూపకాలంకారం- (ఇంగ్లీషులో 'మెటఫర్'). ప్రతి వచనకవిరూపకాన్ని ప్రయోగించిన వాడే. అయితే కుందుర్తి, శేషేంద్రల రూపకాలు విశేషంగా వుంటాయి. ఈ రూపకాలలో సమాసగతం, వాక్యగతం అనే భేదాలూ వున్నాయి. పెన్నా శివరామకృష్ణ శేషేంద్ర కవిత్వంలో మూడు రకాల రూపక భేదాల్ని గుర్తించి శేషేంద్ర ఆలంకారికతను నిశితంగా పరిశీలించారు.

- **నిరవయవం :** ఒక వాక్యంలో ఒకే రూపకం.

  ఉదా : మీరు
  అడవులు విడిచిన అగ్నిజ్వాలలు
  కట్టలు తెగిన సముద్రాలు

- **మాలా నిరవయవం :** మాలోపమలాగా కొన్ని రూపకాలు వరుసగా ఉంటాయి.

  ఉదా: *తలపుల సీతాకోక చిలుకలకు పూలపీటల*
  మీద ప్రభాత కిరణాలతో అభ్యంగనం చేయించావు.

- **సమస్త వస్తు విషయ సావయవం :** పరస్పర సాపేక్ష సంబంధాలైన రూపకాల సముదాయం. ఆరోపించిన వస్తువు లన్నింటిని శబ్ద రూపకంలో స్పష్టం చేయడం. శేషేంద్రలో ఇదే ఎక్కువ.

  ఉదా: *మా కన్నుల రంగుల చేపలమీదికి ఎందుకిలా*
  కన్నీటి వలలు విసురుతారు"

శేషేంద్ర వాక్యగత రూపకాలంకారానికి ఒక ఉదాహరణ:

"విధి నా చేతికిచ్చిన విషపాత్రిక ఈ నగరం"

కుందుర్తి కవిత్వంలోనూ రూపకాలంకారాలు బాగా ఎక్కువ. అందుకే సినారె కుందుర్తి గురించి-

"అర్థాలంకారాల్లో రూపకం ఇతడెత్తిన దీపకం
శబ్దాలంకారాల్లో అంత్య ప్రాసం ఇతని చంద్రహాసం"

అన్నారు. కుందుర్తి రూపకాలు ఓ రెండు-

"వెన్నెల బ్రతుకు కన్నెలమీద
విరహపు సర్పపు పడగ విప్పింది"

"ఆశల మేఘాలు కల్పించి
పదునైన ప్రసంగాల వానలు కురిపించి"

శేషేంద్ర వాడిన సమాస గతరూపకాలలో కొన్ని: హృదయపు కొబ్బరి తోపు, కోర్కెల బందూకులు, చూపుల రస్తాలు, పొలికేకల దీపాలు.

ఉత్ప్రేక్ష : కుందుర్తి, శేషేంద్ర, శివారెడ్డి ఉత్ప్రేక్షల్ని వాడిన కవుల్లో ముఖ్యులు. వానచినుకును వర్ణిస్తూ కుందుర్తి ఉత్ప్రేక్షను బాగా ప్రయోగించారు.

ఉదా: "చీటికి మాటికి కోర్టు కెక్కడం
చీదరెత్తింది కాబోలు హైకోర్టు భవనంమీద
చింతతో చిందిన చినుకు
ప్రక్కనే ఉన్న మూసీనదిలో పడి ముక్కు మూసుకొని"

"భూమ్మీద పస్తులున్న మనుషుల్ని చూసి
ఆకాశం కంటతడి పెట్టినట్లు వాన"– **కుందుర్తి**

ఇది హేతూత్ప్రేక్ష. అంటే కారణం కాని దానిని కారణంగా చెప్పటం. శేషేంద్ర వాడిన ఈ కింది ఉత్ప్రేక్ష వస్తూత్ప్రేక్షకి నిదర్శనం. వస్తువునుబట్టి ఊహించడం–

"ఆ చౌరస్తాలో అది ఒక విగ్రహం కాదు
దేశాన్ని చెయ్యెత్తి పిలుస్తున్న ఒక మహా స్వప్నం"

శేషేంద్ర వాడిని ఉత్ప్రేక్షలలో మరికొన్ని–

"ఆ పువ్వు నీ కురుల్లో గూడుకట్టుకొందామని వచ్చిన రంగుల పక్షి"

"రెండు కన్నులతో కార్చే కన్నీరు చాలదన్నట్లు ఇవ్వబడింది ఒకడికి
మూడవ కన్ను మరొకటి"

మరికొన్ని అలంకారాలు:

- **ప్రతీపాలంకారం :** ఉపమానాన్ని ఉపమేయంగా చెప్పటం (చంద్రుడు నీ ముఖంతోసమాన, అనటం)

ఉదా: "నాలాంటి అగ్నిపర్వతాలెన్ని నడుస్తున్నాయో"
ఆ గులాబీసైతం నీ చిరునవ్వుల్ని కాపీ కొడుతుంది"- శేషేంద్ర

◆ అపహ్నుతి : ఉపమేయాన్ని నిషేధించి ఉపమాన ధర్మాన్ని ఆరోపించటం.

ఉదా: "అవి దుకాణాలు కావు
ఉవ్వెత్తున లేచిన పసిఫిక్ సముద్ర ఖండాలు"
"జనుల్లో అవి గుండెలు కావు
రెపరెపలాడుతున్న కాంక్షల జెండాలు" - శేషేంద్ర

◆ శ్లేష : అనేకార్థాలు ద్యోతకం కావటం.

ఉదా: "కరగ్రహణానికి ముందు 'వేలు' కావాలంటాడు ఈనాటి యువకుడు (పతాభి).

◆ ప్రతివస్తూపమ : రెండు వాక్యార్థాల ధర్మం ఒకటే- భిన్న శబ్దాల ద్వారా ప్రకటితం కావాలి.

ఉదా: "సముద్రం తన తీరాన్ని దాటి ఎరుగదు
మనిషి జీవన మరణ తీరాలు దాటి ఎరుగడు" - శేషేంద్ర

◆ స్వభావోక్తి : కుంతకుడు స్వభావోక్తిని అలంకారంగా గుర్తించలేదు. కానీ ఆలంకారికులు దీనికి ప్రముఖ స్థానమే ఇచ్చారు. కుందుర్తిలో స్వభావోక్తులు ఎక్కువ. శివారెడ్డి ఉదయాన్ని వర్ణిస్తూ రాసిన "ఒకానొక పొద్దుటి పూట" (అజేయంలో) కవితలో స్వభావోక్తి రమణీయంగా ఉంటుంది-

"నాలుగు బియ్యపు గింజలు విసిరిన ఆమె ఆ తర్వాత అటు ఇటూ తిరుగుతూ మధ్య మధ్య కోడి పిల్లలకు ఇన్ని మెతుకులేస్తుంది... పనులు పూర్తి అయ్యాక వరండాలో స్తంభాని కానుకుని కురులు చిక్కుతీసుకోవటంలో నిమగ్నమై పోతుంది".

పురుషుడి అవసరాలను సమకూరుస్తూ గృహిణి చేసే పనుల్ని వాతావరణ పరిజ్ఞానంతో రమ్యంగా చెప్పాడు.

- **ఉపమేయోపమ లేదా అన్యోన్యోపమాలంకారం :**

  నేటి కవిత్వంలో ఇది చాలా తక్కువగా వాడబడేది. శివారెడ్డి ఈ అలంకారాన్ని వాడినట్టు పెన్నా శివరామకృష్ణ గుర్తించారు.

  ఉదా: *"నిర్జీవ దేహం నిర్జన దేహం*
  నిర్జన దేహం నిర్జీవ దేహం"
  "వానలాంటి ప్రేమ
  ప్రేమలాంటి వాన"

- **విభావన:** కార్యం నుండి కారణం పుట్టినట్టు వర్ణించడం.

  ఉదా: *"నా మాటలు ఈ దేశపు మట్టిలో చల్లుతున్నా*
  అన్నిచోట్లా కత్తులు మొలవాలని" – శేషేంద్ర

- **ప్రస్తుతాంకురాలంకారం:** ప్రస్తుతం వర్ణిస్తూ ప్రస్తుతాంతారాన్ని స్ఫురింప జెయ్యటం. ప్రస్తుతం నుండి మరొక ప్రస్తుత విషయం స్ఫురించాలి.

  ఉదా: *"ఒక నక్క ప్రమాణ స్వీకారం చేసిందట*
  ఇంకెవర్నీ మోసగించనని
  ఒక పులి పశ్చాత్తాపం ప్రకటించిందట
  తోటి జంతువుల్ని సంహరించినందుకు
  ఈ కట్టు కథ విని గొఱ్ఱెలింకా
  పుర్రెలూపుతూనే ఉన్నయ్" – అలిశెట్టి ప్రభాకర్

- **పర్యాయోక్తి :** ఉద్దిష్టమైన అర్థాన్ని భంగ్యంతరంగా వెల్లడించటం.

  ఉదా: *"సోషలిజం ఎక్కడ చూసినా*
  మెలికల 'శా' తో అచ్చువేశారు" – కుందుర్తి

- **లోకోక్తి :** సామెతలు, నుడులు, పలుకు బళ్ళను అనుసరించి చెప్పటం.

  ఉదా: *"నాలుగు రాళ్ళు చేతిలో పడితే*
  నాకం అంటారు లోకాన్ని" – కుందుర్తి

ఈ విధంగా వచన కవిత్వంలోనూ ఆలంకారికత కంఠ దఘ్నంగా వుంది. అలంకారాలను వాడటంలో తేడా ఉండవచ్చుగానీ కవిత్వం నిరలంకారంగా ఉండదని చెప్పాలి. ఉద్యమ కవిత్వంలో కూడా ఆలంకారికత కావలసినంత వుంది. చివరగా దండి అభిభాషణం –

"కావ్య శోభాకరాన్ ధర్మానలంకారాన్ ప్రచక్షతే
తే చాద్యాపి వికల్ప్యన్తే కస్తాన్ కార్ త్స్న్నేన వక్ష్యతి" – **కావ్యాదర్శం.**

కావ్యానికి శోభను చేకూర్చేవి అలంకారాలు. ఇప్పటికే వాటిని గూర్చి కొత్త కొత్త ప్రతిపాదనలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని పూర్తిగా చెప్పగలవాడు ఎవడు?.

9

తెలుగు విమర్శలో వాదోపవాదాలు

"చెళ్ళ పిళ్ళ చెరలాటము"

"ధరణి కోటవారి ధార్ష్యము"

"శ్రీమదాంధ్ర మహాభారత సంశయ విచ్ఛేదము"

"దుర్విమర్శన విషద్రుమ విచ్ఛేదక జ్ఞాన వీరకుఠారము" అను

నిష్కంటకనిరాఘాట ఘంటాపథ వినాశ విమర్శనము"

ఇవి 19వ శతాబ్దంలో పండితులూ కవులూ వాదోపవాదాలతో రాసిన పుస్తకాల పేర్లు. అప్పట్లో వాదోపవాదాల వ్యాస శీర్షికలు ఇలా వుండేవి–

"నన్నయ వైదికా నియోగా?"

"ఎఱ్ఱన గ్రంథచోరుడా?"

"కృష్ణుడికి మీసాలున్నవా?"

"అర్జునుడు ఎఱ్ఱనివాడా?"

మరి ఆధునిక సాహిత్యంపై వాదోపవాదాల శీర్షికలు చూడండి:

'ఇక చాలు పిడివాదం'

'సంయమనం లేని సోమసుందర్'

'చేరాగారూ, మీరా కళ్ళజోడు తీసెయ్యండి'

'రారాగారికి అసూయ ఎవరిమీదా?'

ప్రథమాంధ్ర విమర్శకుడిగా పేరొందిన కందుకూరి వీరేశలింగం నుంచి ఇవాళ్టి వరకు వెలువడిన విమర్శ – ప్రతివిమర్శలను, వాదోపవాదాలను పరిశీలిస్తే వీటి తీరు తెన్నుల్ని కింది విధంగా అంచనా వేయవచ్చు:

- అభిప్రాయ భేదాలవల్ల
- సిద్ధాంతాల 'నిబద్ధత'వల్ల
- వ్యక్తిగతమైన అసహనం, అహంకారాలవల్ల
- విమర్శించి వెలుగులోకి రావాలనుకోవడం వల్ల
- ప్రాంతీయ, వర్గ భేదాలవల్ల
- పత్రికలవల్ల

ఈ వాదోపవాదాలు కథ, నవల, నాటకం వంటి ప్రక్రియలలో కన్నా కవిత్వ ప్రక్రియలలోనే బాగా ఎక్కువ. పూర్వకాలంలో కూడా కవులమధ్య పద్యాలలో వాదోపవాదాలు జరగటం తెలిసిందే. విమర్శలో వాదోపవాదాలవల్ల ఎన్నో విశేషాలు, సత్యాలు వెలుగులోకి వచ్చినట్టే ధిషణాహంకారాలూ, అసహనం, కక్షలు కూడా వెల్లడి అయ్యాయి. సంయమనంగల విమర్శ, సహృదయతగల విమర్శ, విషయగతమైన విమర్శ ఉన్నా పై వాటివల్ల మరుగున పడిపోయాయి.

కందుకూరి వీరేశలింగం గారికీ కొక్కొండ వేంకటరత్నం పంతులుగారికీ, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారికీ వాదోపవాదాలు బాగా జరిగాయి. ఇవి పరస్పర ద్వేషాలకి శత్రుత్వాలకి దారితీశాయి. 'నీతిచంద్రిక'లోని "విగ్రహతంత్రము" కందుకూరి, కొక్కొండ ఇద్దరూ వచనంలో రాశారు. కొక్కొండవారి పుస్తకానికి టిప్పణి రాసిన శివశంకర పాండ్యా చిన్నయసూరి రచనలో దోషాలున్నాయన్నారు. కందుకూరి వారు కొక్కొండ వారి విగ్రహతంత్ర రచన చూసి రాశారన్నారు. దీంతో కందుకూరి వారికి కోపం వచ్చింది. "గుణాగుణ ప్రదర్శినీ సామాజికుడు" అనే పేరుతో "విగ్రహతంత్ర విమర్శనము" (1876) రాశారు. ఇదే తెలుగులో తొలి విమర్శన గ్రంథంగా పేర్కొనబడుతోంది. రాను రాను కందుకూరి, కొక్కొండల మధ్య వాదాలు ముదిరిపోయాయి. "స్త్రీలకు విద్య కూడదు" అని కొక్కొండ వ్యాసం రాస్తే కందుకూరి "పురుషులకు విద్య కూడదు" అనే వ్యాసం రాశారు. కందుకూరి వారి 'వివేకవర్ధని' పత్రిక పేరు తిరగేసి 'నిర్ధవకవేవి' అంటూ 'నిర్ధవకవి' విధవలకవిగా ఆక్షేపించారు కొక్కొండ. వీరిగాడు, కొండెగాడు అని కొక్కొండ ఒక ప్రహసనంలో కందుకూరిని వెక్కిరిస్తూ పేర్లు పెడితే కందుకూరి కూడా ఒక ప్రహసనంలో 'క్కొ-క్కొ-క్కొండ' అని నత్తిమాటలతో అపహాస్యం చేశారు. కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి కందుకూరి వారి

"రాజశేఖర చరిత్ర" నవలను (వివేక చంద్రిక అనే పేరుంది) "వివేక చంద్రికా విమర్శనము" అనే పేరుతో విమర్శించారు. అసలది గోల్డ్‌స్మిత్ 'వికారాఫ్ వేక్‌ఫీల్డ్'కి అనుసరణ అనీ, రసహీనమనీ విమర్శించారు. కందుకూరిపై కత్తికట్టి రెండు విమర్శ గ్రంథాలు రాశారు. కందుకూరి వారు తమ జీవిత చరిత్ర రాసి "స్వీయచరిత్ర" అని పేరు పెడితే బ్రహ్మయ్యశాస్త్రి ఆ పేరు తప్పనీ స్వకీయ చరిత్ర, స్వచరిత్ర అనాలని బోధించారు. అయితే బ్రహ్మయ్య శాస్త్రి "వివేక చంద్రికా విమర్శనము" తొలి నవలా విమర్శ గ్రంథమైంది. ఇందులోనే 'నవల' పదం మొదట వాడబడింది. కొక్కొండ, వేదం వేంకటరాయశాస్త్రి ఇద్దరూ గ్రాంథిక వాదులే. అయినా వ్యక్తిగతమైన కోపతాపాలవల్ల కొక్కొండ రాసిన "ఆంధ్ర ప్రసన్న రాఘవము" నాటకంపై వేదంవారు తీవ్ర విమర్శ చేసి 324 పుటలలో "ఆంధ్రప్రసన్న రాఘవ విమర్శనము" గ్రంథం రాసి 2,568 దోషాలు చూపించారట!

గ్రాంథిక వ్యావహారిక భాషోద్యమాల వల్ల విపరీతమైన వాదోపవాదాలు జరిగాయి. పద్యాలలో కూడా వైరివర్గాలు దూషించుకున్నారు. "గ్రామ్యభూతమా? గ్రామ్య పిశాచమా?" అంటూ పద్యాలు వెలువడ్డాయి. పిశుపాటి చిదంబరశాస్త్రి రాసిన ఈ పద్యం చూడండి:

"వాడుకొను భాష గ్రాంథిక భాష జేయ
దలచుచున్నారు నేటి పెద్దలు గడంగి
ముఱికి కాలువ నీరు చెంబులను నించి
చేతులారంగ పన్నీరు సేయగలరె?"

ఇటువంటి వెక్కిరింతలు వ్యావహారిక ఉద్యమాన్ని ఆపలేకపోయాయి. గిడుగు రామమూర్తిగారు వేదంవారి రచనలలోగల దోషాల్ని ఎత్తి చూపుతూ "ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం' అనే పుస్తకం రాశారు. కొక్కొండ వంటి వీర గ్రాంథిక వాదిలో వేదంవారు దోషాలు చూపిస్తే– గ్రాంథిక వాది వేదంవారిలోని తప్పుల్ని గిడుగు ప్రకటించారు. గ్రాంథిక పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంథిక భాష వల్ల ప్రయోజనం లేదని గిడుగు చాటడం వ్యావహారిక భాషోద్యమానికి మరింత బలం చేకూర్చింది.

అవధానకళకి విస్తృత ప్రాచుర్యం కల్పించి, పద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిన తిరుపతి వేంకట కవులకి చాలామందితో కవితా కలహాలు వచ్చాయి. కొప్పరపు

సోదర కవులతో, వేంకట రామకృష్ణ కవులతో తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. వ్యక్తిగత దూషణలు చోటు చేసుకున్నాయి. కొప్పరపు కవులతో వివాదాలు వైదిక, నియోగి భేదాలకు దారితీసింది. చెళ్ళపిళ్ళవారి శిష్యుడు, అప్పుడు యువకుడు అయిన వేలూరి శివరామశాస్త్రి, కొప్పరపు సుబ్బరాయ కవి సవాలుకి ఇలా పద్యాస్త్రం వదిలారు– ఈ పద్యం చాలా ప్రసిద్ధమైంది–

"గంటలు కట్టికొంటి వట గంటకు వందలు వేలు పద్యముల్
గెంటుదు నంచు నేడు పరికించెద గెంటుటయెట్టిదో నినుం
గెంటెదనేవధానమున గెల్చెద నీరసధారయందు నీ
ఘంటికలూడ గొట్టెదను గాచుకొనంగ మకింపు మిత్తఱిన్"

1913 జులైనాటి 'కవిత' పత్రికలో కొప్పరపు సోదర కవులు చేసిన ప్రకటనలోంచి కొన్ని పంక్తులు గమనిస్తే వాద వివాదాలు ఎలా హద్దు మీరాయో తెలుస్తుంది– "గంద్రతనము కవిత్వమగునా? వటవట వదరుట వాచా నైపుణ్యమగునా? అసూయా పిశాచా విష్టుడు కవియా? సమీచీన యోచనా భావదుర్భావుడు కవియా? కష్ట నిష్ఠుర వచః పుంజా సమంజసుడు కవియా? మనోలాఘవ సనాథుడు కవియా? ఈ వాక్యములను చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు జ్ఞప్తి యందుంచుకొన గోరుచున్నారము".

తిరుపతి కవులు కొప్పరపు కవులకి 'హితోపదేశం' పంపితే కొప్పరపు కవులు 'జ్ఞానోపదేశం' పంపారు. కొప్పరపు కవుల 'నారాయణాస్త్రా'నికి తిరుపతి కవులు "నమస్కారము" అన్నారు.

తిరుపతి కవులకీ వేంకట రామకృష్ణ కవులకీ కూడా వాగ్యుద్ధాలు తప్పలేదు. వేంకట రామకృష్ణ కవుల్లో ఒకరైన ఓలేటి వేంకటరామశాస్త్రి చెళ్ళపిళ్ళవారి శిష్యులు కూడా. ఈ జంటకవుల మధ్య పట్టుదలలు వ్యక్తిగత కక్షల దాకా వెళ్ళింది. తిరుపతి వేంకటకవులు రాసిన 'పాండవాశ్వమేధ' నాటకంలో నూరు తప్పులు చూపిస్తూ "శతఘ్ని" వదిలారు. దీనికి ప్రతిగా తిరుపతి కవులు "పాశుపతము' వేశారు. మళ్ళీ రామకృష్ణ కవులు "పరాస్త పాశుపతము" రాస్తే, తిరుపతి కవులు "పురశ్చరణము" రాశారు. తిరుపతి కవుల రెండు కావ్యాలను దుయ్యబడుతూ రామకృష్ణ కవులు 120 పుటలలో "పాణిగృహీతా శ్రవణానంద శృంఖలము" రాశారు. దీనిని ఖండిస్తూ తిరుపతి కవులు "శృంఖలాతృణీకరణము" రచించారు. ఆ తర్వాత రామకృష్ణ కవుల్ని పిల్లులుగా,

తమను పెద్ద పులులుగా చిత్రిస్తూ "బిడాలోపాఖ్యానం" రాశారు. ఈ దిగ్గజాల మధ్య వేదాల తిరువేంగళాచార్యుల వంటివారు కూడా ప్రవేశించారు. చర్లవేంకట చలపతి శాస్త్రి చెళ్ళవారిని ఎద్దేవా చేస్తూ "శృంగభంగం" శీర్షికతో పది పద్యాలు రాసి రిజిష్టరు పోస్టులో పంపారు. తిరుపతి కవులు దీనికి సమాధానంగా "సత్యసందేశము" పేరుతో పది పద్యాలు రిజిష్టరు పోస్టులో చర్లవారికి పంపారట! తిరుపతి కవులు బెల్లంకొండ రామారావు, తాతా సుబ్బరాయశాస్త్రి మొదలైన వాళ్ళతో 'పశ్య' శబ్దంపై వాదోపవాదాలు చేశారు. "పశ్యాం పుశ్యాం" అనే పుస్తకం కూడా వెలువడింది. (తిల్లిక, అందిమ్ము-కందోయి వంటి శబ్దాలపై భారతిలో చర్చలు జరిగాయి. చేరా భాషాశాస్త్రంలో "నామ్నీకరణం" అనే పేరు పెట్టినప్పుడు కూడా చర్చలు జరిగాయి).

తిరుపతి కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళవారు శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి శిష్యులే. అయినా వీళ్ళిద్దరికీ తగాదా వచ్చింది. ఈ కలహానికి జయంతి రామయ్య పంతులుగారు "తీర్పరి"గా ఉన్నారు. అయినా సద్దుమణగలేదు. శ్రీపాదవారు కోర్టుకు వెళ్ళడానికి సిద్ధమైతే చివరకు చెళ్ళపిళ్ళవారు "క్షమాపణమ్" అంటూ పద్యాలు రాసి కోపం పోగొట్టారు. ఇవన్నీ ఆనాటి అభినవ సరస్వతి, వజ్రాయుధం వంటి పత్రికలలో గమనిస్తాం.

అప్పుడైనా ఇప్పుడైనా గ్రంథాలపై కూడా వాదోపవాదాలూ, ప్రతి విమర్శ గ్రంథాలూ చూస్తాం. మహాభారతం, రామాయణాదులపై ఎన్నో ఖండన గ్రంథాలు వెలువడ్డాయి. ఎందువల్లనో భాగవతంపై ప్రతి విమర్శ గ్రంథాలు రాలేదు. 1894లో పనప్పాకం అనంతాచార్యులు చేసిన భారత విమర్శ మొదటి ప్రతివిమర్శగా చెప్తారు. నన్నయ భారతం మూలంనుంచి అసహజంగా వక్రీకరించబడిందని ఈయన విమర్శించారు. దీన్ని నిరసిస్తూ కాశీభట్టువారు "కురుపాండవ దాయ భాగ వినిర్ణయము" వెలువరించారు. మళ్ళీ దీన్ని విమర్శిస్తూ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి "కురుపాండవ దాయభాగ విమర్శనము" రాశారు. ఈ వాదాలను సమన్వయ పరుస్తూ పారనంది రామశాస్త్రి "శ్రీ మహాభారత విమర్శనము" రాశారు. పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి మహాభారతాన్ని ఆధునికంగా విమర్శిస్తూ పుస్తకం రాస్తే- దీనికి సమాధానమా అన్నట్టుగా పుట్టపర్తి నారాయాణాచార్యులు రెండు సంపుటాలు వెలువరించారు. జాషువా పద్యాలలో కర్ణుడికి అన్యాయం జరిగినట్టు రాశారు. విశ్వనాథ వారి శ్రీమద్రామాయణ

కల్పవృక్షంలో ఛందోదోషాలున్నాయని కొత్త సత్యనారాయణ చౌదరి రాస్తే విశ్వనాథ శిష్యులు ఖండిస్తూ రాశారు. కమ్యూనిస్టు దృక్పథంతో, స్త్రీ వాద దృక్పథంతో (ముప్పాళ) రంగనాయకమ్మ "రామాయణ విషవృక్షం" రాస్తే, దీనిని ఖండిస్తూ తెన్నేటి లత "విషవృక్ష ఖండనం" రాశారు.

1893 నాటి మాట. మంత్రి ప్రెగడ భుజంగరావుగారి సంపాదకత్వంలో "మంజువాణి" అనే పత్రిక వెలువడేది. అందులో "శృంగార రస ప్రవాహిని" అనే కావ్యం అచ్చయింది. దీనిని విమర్శిస్తూ 'శశిలేఖ' అనే పత్రికలో "మంజువాణీ విమర్శనము" అనే వ్యాసం "ఆంధ్రభాషాభిమాని" పేరుతో వ్యాసం వచ్చింది. దీన్ని ఖండిస్తూ 'హితార్థి" పేరుతో మరో వ్యాసం వచ్చింది. ఆ వ్యాసం పేరు తిలకించండి- "అసహనారణ్య నిర్మూలన కుఠారము" అక్కిరాజు ఉమాకాంతం "టిప్పుసుల్తాన్" నవలకి ఉపోద్ఘాతం రాస్తే, త్రిపురనేని రామస్వామి దీనిని ఖండిస్తూ "గురిగింజ" పేరుతో ఇరవై పుటలు రాశారు. ఆనాటి విమర్శలన్నీ చిన్న చిన్న పుస్తకాలుగా రాదగిన వ్యాసాలే! మారుపేర్లతో కూడా వాదానికి దిగేవారని తెలుస్తుంది.

ప్రబంధాలలో 'మనుచరిత్ర'పై ప్రతి విమర్శలు బాగా వెలువడ్డాయి. మొట్ట మొదటగా దీనిపై విమర్శ చేసినవారు పెన్నేటి రామచంద్రరావు (1899) అని తెలుస్తుంది. గురజాడ శ్రీరామమూర్తి "కవి జీవితములు" అనే గ్రంథంలో రామరాజ భూషణుని బాగా పొగిడి పెద్దనను తక్కువ చేసినందుకు రామచంద్రరావు "మను వసు చరిత్ర రచనా విమర్శనము" రాసి వసుచరిత్రకన్న మనుచరిత్ర మిన్నగా ప్రకటించారు. ఈ రెండు ప్రబంధాల తారతమ్య పరిశీలన సమంజసం కాదంటూ బ్రహ్మయ్య శాస్త్రి "మను వసు ప్రకాశిక" (1902)లో రాశారు. రామచంద్రరావు ఊరుకోకుండా దీన్ని ఖండిస్తూ "మను వసు విమర్శనానుబంధం" పుస్తకం రాశారు. బ్రహ్మయ్యశాస్త్రి తక్కువ తిన్నారా? మళ్ళీ దీనికి ప్రతిగా "మను వసు ప్రణాళికాను బంధం" రాశారు. ఇలా పుస్తకంపై పుస్తకం రాయటం ఆనాటి విమర్శలో గమనిస్తాం.

శ్రీనాథుడు క్రీడాభిరామం రాశాడా లేదా? శ్రీనాథుడు శృంగారియా? పోతన భోగినీ దండకం రాశాడా? వంటి అంశాలపై కూడా విస్తారంగా చర్చలు జరిగాయి. అయితే ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి "కుమార సంభవం నన్నెచోడుని కృతమా?" అనే అంశంతో పెద్ద పుస్తకమే రాసి కొంతకాలం సంచలనం కలిగించారు. నన్నెచోడుడు

రాయలేదనీ, మానవల్లి రామకృష్ణ కవి రాసి నన్నెచోడుని పేరు పెట్టారనీ ఆయన వాదించారు.

నండూరి సుబ్బారావు "యెంకిపాటలు" పై గాలీ దుమారం రేగింది. చాలామంది ఈ కవిత్వంపై ధ్వజమెత్తారు. గ్రాంథికవాదానికి అండగా శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి నిర్వహించిన "వజ్రాయుధం" పత్రికలో బి.శివరామశర్మ రాసిన విమర్శవ్యాసం నుంచి ఈ పంక్తులు పరిశీలిస్తే యెంకి పాటలు ఎంతటి వివక్షకి గురి అయ్యాయో తెలుస్తుంది– "ఈ యెంకి నాయుడు బావలెవరు? వీరు దంపతులా? విటులా? యెంకి స్వీయమా? పరకీయమా? ఇందులోని భావమేమి? రసమేమి? లోకమునకు బోధించు నీతియేమి? ఇది కవిత్వమా? ఇట్టి గ్రంథములు పఠనీయములా? ఇది నోటికి వచ్చినట్లు రాసినదియే కాని కవిత్వము కాదని, భాషకాదని సర్వజనవిదితమే" తిరుపతి వేంకటకవులు "అభినవ సరస్వతి" పత్రికలో కొంత పొగిడినా చివరకు "తుట్టతుద వరకు గ్రంథమంతయు నిట్టి భాషలో వ్రాయుట రసాభాస" అన్నారు. వీటికి సమాధానంగా గొప్ప పండితులైన పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి యెంకి పాటలను సమర్థిస్తూ పీఠిక రాయడంవల్ల ప్రతివిమర్శకులు నిరుత్తరులయ్యారు.

పొట్లపల్లి సీతారామారావు ప్రతివిమర్శవల్ల పేరొందారు. ఈయన "గురజాడ అకవి" అనే వాదాన్ని తీసుకు వచ్చారు. శ్రీశ్రీ సాహిత్యం గొప్పది కాదన్నారు. పింగళి, కాటూరి రాసిన "సౌందరనందం" కావ్యం ఎంతో ప్రసిద్ధి పొందింది. అయితే ఆ రోజుల్లో ఈ కావ్యాన్ని పొట్లపల్లివారు విమర్శించారు. పిలకా గణపతి శాస్త్రి దీనికి ప్రతిగా కావ్య ప్రశంస చేశారు.

సంచలన రచయిత చలం రచనలపై ఎన్నెన్నో విమర్శలు వెలువడ్డాయి. చలం రచనలు ఎప్పుడూ చర్చనీయాంశాలే! రంగనాయకమ్మ "చలం సాహిత్యం" అనే పుస్తకం రాస్తే నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు "చలం శ్మశాన సాహిత్యం" రాశారు. పురాణం సుబ్రహ్మణ్యశర్మ "తెలుగు వెలుగు చలం" పుస్తకం ప్రచురించారు. చలం రమణాశ్రమానికి వెళ్ళిన తర్వాత చలంపై మరిన్ని ప్రతి విమర్శలు వెలువడ్డాయి.

శ్రీశ్రీ ఎంతటి మహాకవి అయినా ఎప్పుడూ విమర్శలకి గురి అవుతూనే వున్నాడు. దీనికి శ్రీశ్రీ ప్రవృత్తి కూడా కొంత కారణం. అధునిక ఉద్యమాల నేపథ్యంలో కూడా విమర్శలను ఎదుర్కొనక తప్పటం లేదు. "ఊగరా ఊగరా ఉరికొయ్య అందుకొని

ఊగరా" అన్న శ్రీశ్రీ ఎప్పుడైనా తుపాకీ పట్టుకున్నాడా? పోరాటంలో పాల్గొన్నాడా? అంటూ విమర్శించారు. శ్రీశ్రీ ప్రజాకవి అయితే "బ్రాహ్మణభాష" ఎందుకు వాడారు? అన్నారు. అద్దేపల్లి రామమోహనరావు మొదటగా "శ్రీశ్రీ కవితా ప్రస్థానం" పుస్తకం రాశారు. మహాప్రస్థానాన్ని ధ్వని, అలంకారం వంటి వాటితో విమర్శించారు. అయితే ఈ విమర్శ ధోరణి గిట్టక రాచమల్లు రామచంద్రారెడ్డి అద్దేపల్లిని విమర్శించారు. డాక్టర్ మిరియాల రామకృష్ణ "శ్రీశ్రీ కవిత్వం– వస్తువు– సంవిధానం" అనే సిద్ధాంత వ్యాసంగా ప్రచురిస్తే పెద్ద ఎత్తున ప్రతి విమర్శలు వెలువడ్డాయి. మొదటగా "పరిశోధన, విమర్శ కవిత్వంగానీ, చమత్కారంగానీ కాదని 'ప్రజాసాహితి'లో 'కేయార్సన్', దుయ్యబడితే ఆంధ్రజ్యోతి వారపత్రికలో పురాణం సుబ్రహ్మణ్యశర్మ "మిరియాల కషాయం" అంటూ తీవ్రంగా – దూషణలతో విమర్శించారు. శేషేంద్ర రాసిన "కవి సేన మానిఫెస్టో" కూడా వాదోపవాదాలకు దారితీసింది.

కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి గ్రహీత కె.శివారెడ్డి రాసిన "భారమితి" కావ్యాన్ని చేరా (చేకూరి రామారావు) సమీక్షించి ప్రతి విమర్శకి గురి అయ్యారు. మార్క్సిస్టు దృక్పథం లేకుండా, ముందు తను ఎడ్యుకేట్ కాకుండా బాధ్యతారాహిత్యంగా విమర్శించారని నారాయణ స్వామి మొదలైన వారు విమర్శించారు. చేరా రాసిన "చేరాతలు" కూడా విమర్శకి గురయ్యాయి. దీనికి కారణం భాషాశాస్త్ర ధోరణితోనూ, అభిరుచి పరంగానూ విమర్శించడమే అనిపిస్తుంది.

ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం "సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు" అనే అంశంపై పరంపరగా వ్యాసాలు రాసినప్పుడు ప్రతివిమర్శలు వెలువడ్డాయి. వాటిలో కొన్ని:

"గతితార్కిక దృష్టిలేని చరిత్రావలోడనం" – *సోమసుందర్*

"విమర్శ అంటే విద్వేషమేనా?" – *డా॥ పి.వి. రమణ*

"ప్రాచీనతను వెక్కిరించడమే సాహిత్య చరిత్ర అవుతుందా?" – *దినకర్*

"శ్రీ సోమసుందర్ అభ్యుదయ దృష్టి" – *డా॥ ముదిగొండ వీరభద్రయ్య*

జి.వి.కృష్ణారావు రాసిన "ఉదయబిందువులు" ను ఆరెస్ సుదర్శనం సమీక్షించారు. ఈ సమీక్షపై త్రిపురనేని వెంకటేశ్వరరావు నిరసనగా వ్యాసం రాస్తూ సమీక్షకుడికి గల తత్వశాస్త్ర పరిజ్ఞానం చాలదని చెప్పారు. యండమూరి వీరేంద్రనాథ్

నవల "తులసిదళం" గొప్ప సంచలనం కలిగించింది. ఒక వారపత్రిక "సర్క్యులేషన్"ని లక్షకి పెంచిన నవల ఇది. అయితే అభ్యుదయ- ప్రగతిశీల- హేతువాదులు దీనిని దుయ్యబట్టారు. ఈ నవల యువతపై దుష్ప్రభావం చూపించిందనీ అశాస్త్రీయమైన నవల అనీ విమర్శించారు. రంగనాయకమ్మ "తులసిదళం కాదు- గంజాయి దమ్ము" అంటూ తీవ్రంగా దుయ్యబట్టారు. చివరకు కోర్టుకెక్కింది ఈ వివాదం. అలాగే చేరా నగ్నముని రాసిన "కొయ్యగుర్రం" కావ్య పీఠిక కూడా వివాదానికి దారితీసింది.

ఇక నాటకాల విషయానికి వస్తే వేదంవారి "ప్రతాపరుద్రీయము", కాళ్ళకూరి వారి "చింతామణి", గురజాడవారి "కన్యాశుల్కం" నాటకాలు విమర్శకు గురవుతూనే వున్నాయి. వేదంవారి నాటకలలోగల పాత్రోచిత భాషాప్రయోగాన్ని వావిలకొలను సుబ్బారావువంటివారు ఖండించారు. కన్యాశుల్కంలో నాటక లక్షణాలు లేవనీ, ప్రదర్శన యోగ్యం కాదనీ, బ్రాహ్మణ వర్గానికి వ్యతిరేకంగా ఎవరో రాయమంటే రాసిందనీ... ఇలా విమర్శలు వెలువడ్డాయి. కన్యాశుల్కం గొప్ప నాటకమని వెలువడిన విమర్శలే ఎక్కువ.

తెలుగు కవిత్వంలో గల ఉద్యమాలపై ఎక్కువ వాదోపవాదాలు జరిగాయి- జరుగుతున్నాయి కూడా! భావకవిత్వంపై ప్రతి విమర్శ బాగా వచ్చింది. భావ కవితా ప్రవక్త రాయప్రోలు అయినా దేవులపల్లి కవిత్వమే విమర్శలకు ఆలవాలమైంది- భావకవిత్వానికి దేవులపల్లి మారుపేరయ్యారు కాబట్టి చెళ్ళపిళ్ళ సైతం "అభినవ సరస్వతి" పత్రికలో ఇలా విమర్శించారు: "ఈ కవిత్వమందు ప్రయోగించు పదములు సంపూర్ణముగ దెలిసికొనుట దుర్లభము. భావకవిత్వమనినంత మాత్రమున పదుగురకు తెలియనిచో ప్రయోజనమేమి? అంగిటిలోనన్నియు నున్నవి- అల్లుని నోట శనియున్నది- యన్నట్లగును. నేటి భావకవిత్వము 'గూటి చిలకేదిరా చిన్నన్నా' లాగున వెళ్ళుచున్నది. అర్థము చెప్పలేము. ఇదియొక పరిభాష".

అప్పకవి, బావకవి, అభావకవి, వంటి పదాలతో వెక్కిరించారు. అక్కిరాజు ఉమాకాంత శేఖరులు "నేటి కాలపు కవిత్వం" అనే పుస్తకంలో భావకవిత్వాన్ని దుయ్యబడుతూ అది "పులుముడు" కవిత్వం, "అయోమయ కవిత్వం" అన్నారు. మరికొందరు భావకవిత్వాన్ని "అపస్మారక కవిత్వం" అన్నారు. పొట్లపల్లి సీతారామారావు దేవులపల్లి ఊర్వశి, ప్రవాసము అనే కావ్యాలను నిందించారు. దీనిని ఖండిస్తూ

"సురభి" వ్యాసం రాశారు. భోగరాజు నారాయణమూర్తి, పొక్కులూరి లక్ష్మీనారాయణ, పోలూరి రామబ్రహ్మం వంటివారు భావకవిత్వాన్ని ఈసడించారు. భావకవిత్వాన్ని వెక్కిరిస్తూ పద్యాలు వచ్చాయి. అనంతపంతుల రామలింగస్వామి కృష్ణపక్షాన్ని దృష్టిలో వుంచుకొని "శుక్లపక్షం" కావ్యం రాసి తెనాలి రామకృష్ణుడికి – వికటకవికి– అంకిత మిచ్చారు. 'సాహితీ సమితి', 'నవ్యసాహిత్య పరిషత్తు' వంటి సంస్థల స్థాపనతో భావకవిత్వం ఎదురొడ్డి నిలవకలిగింది. కొంతమంది భావకవుల కవిత్వాన్ని చూసి దేవులపల్లి వారే ఆశ్చర్యపోయి – ఆత్మపరిశీలన చేసుకొని వుంటారు కాబట్టే ఈ పద్యం రాశారు–

"మెరుగు కంటి జోళ్ళు
గిరజాలు సరదాలు
భావకవికి లేనివేవిలేవు
కవిత యందు తప్ప
గట్టి వాడన్నింట"

భావకవిత్వంపై నిరసనగా "చాకిరేవు" అనే పుస్తకం వచ్చినట్టు తెలుస్తోంది.

అభ్యుదయ కవిత్వోద్యమంపై వాదోపవాదాలు వెలువడ్డాయి. అయితే అభ్యుదయ వాదుల నుంచి కూడా విమర్శలు వెలువడటం విశేషం. కమ్యూనిస్టు పార్టీలో, అరసంలో వచ్చిన చీలికలే దీనికి కారణం. మాజీ అభ్యుదయవాదుల పాత్ర కూడా వుంది. కరపత్రాల ద్వారా, వ్యాసాల ద్వారా పరస్పరం విమర్శించుకొన్నారు. కె.వి. రమణారెడ్డి "అభ్యుదయ యుగం తర్వాత "అనే వ్యాసంలో ఇలా ప్రకటించారు– "నామ మాత్రముగా తరువాత కూడా సంఘము లేకపోలేదుగానీ దానిలోని ఉద్యమత్వము సంపూర్ణముగా అంతరించి నేడును అభ్యుదయ కవిత్వము వచ్చుచున్నదని నిరూపించుటకు అభ్యుదయ విమర్శకులు మిక్కిలి కష్టపడవలసిన స్థితి వచ్చినది" (ఆంధ్రపత్రిక– సౌమ్య ఉగాది సంచిక).

1970 నాటి 'సృజన' పత్రికలోని వాక్యాలు గమనించండి– "అభ్యుదయ రచయితల ఉద్యమం కూడా శవప్రాయం అయిపోయింది. ప్రతి కొత్త ధోరణినీ అభ్యుదయ ధోరణి అనడం పరిపాటి అయింది. సామ్యవాదులూ, జాతీయవాదులూ, వాస్తవవాదులూ, ఆదర్శవాదులూ, ప్రయోగవాదులూ, సంప్రదాయపరులూ ఎలాంటి

వివచక్షణ లేకుండా అభ్యుదయ రచయితలనిపించుకో కలిగేరు". శేషేంద్ర శర్మ "కవిసేన మానిఫెస్టో" పుస్తకంలో అభ్యుదయ వాదుల రాజకీయాల్ని ఎండగట్టారు. ఆచార్య పేర్వారం జగన్నాథం సంపాదకత్వంలో "అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు" పుస్తకం వెలువడితే అభ్యుదయ వాదులు విరుచుకుపడ్డారు.

వింతలలో వింత ఏమిటంటే "కరపత్రాల భాగోతం– తెర వెనుక దుమారం" పుస్తకాన్ని భారతి పత్రికలో సమీక్షిస్తూ అభ్యుదయ సారథులలో ఒకరుగా చెప్పబడే సోమసుందర్ చేసిన వ్యాఖ్యలలో కొన్ని– "కమ్యూనిస్టు మాతృ సంస్థనుంచి 1963లో ఒక ప్రధాన విభాగం చీల్చుక బయట పడ్డ తర్వాత కమ్యూనిస్టులు లక్ష గ్రూపులుగా వేరింటి కాపురాలు పెట్టేసుకున్నారు. ఈ దేశంలో మార్క్సిజం ఏనుగూ ఏడుగురు గుడ్డివాళ్ళూ కథ మాదిరిగా అపభ్రంశం పాలయింది... భారతదేశంలో మార్క్సిజం నేతి నేతి వ్యవహారంగా బ్రహ్మపదార్థంగా మారిపోయింది. ఎవడిమగ్గానికి వాడే సేనాధిపతి!" (అక్టోబరు, 1977). ఈ సోసు రాతల్ని కె.వి. రమణారెడ్డి, కె. అంజయ్యలు ఖండిస్తూ ఉత్తరాలు రాశారు (1978 భారతి).

దిగంబర కవిత్వం మూడు సంవత్సరాలే వున్నా పెద్ద సంచలనం తీసుకు వచ్చింది. ఈ కవిత్వంపై ప్రతి విమర్శ బాగా ఎక్కువగా వెలువడింది. ప్రధానంగా దిగంబర కవిత్వంలోని అశ్లీలత, దూషణలు కోపం తెప్పించాయి. విశ్వనాథను దిగంబర కవులపై అభిప్రాయం అడిగితే "వారెవరో నాకు తెలియదు" అని ఉపేక్షభావాన్ని ప్రకటించారు. అంటే అంత అసహ్యం తెలిపారు. ఈ ఉద్యమాన్ని "సాహిత్య స్టంట్"గా పేర్కొన్న రాచమల్లు రామచంద్రారెడ్డి ఇలా దుయ్యబట్టారు– "సమాజం కుళ్ళుకు వీళ్ళు ఒక చిహ్నం. సమాజం కుళ్ళులో వీళ్ళు ఒక భాగం. సమాజం కుళ్ళి పోయిందన దానికి వీళ్ళు ఒక నిదర్శనం. సమాజం కుళ్ళిపోయిన మాట నిజమే. సమాజం పతనమైన మాట నిజమే. విప్లవాగ్ని జ్వాలలతో తప్ప సంస్కరించడానికి సాధ్యం కానంతగా పతనమైన మాట నిజమే. కానీ, యెంత పతనమైనా ఈ దిగంబరుల పైత్యాన్ని కవిత్వమనుకునేటంతగా పతనమయిందా?" *(సంవేదన, జనవరి 1969).*

సోమసుందర్, ఆరుద్రలు కూడా దిగంబర కవిత్వాన్ని నిరసించారు. కొ.కు, కె.వి.ఆర్.లు కొంత సమర్థించారు. శ్రీశ్రీ ఇలా అన్నారు – "వాళ్ళు నిజమైన కవులు. అయితే వాళ్ళ కవితా శక్తుల్ని సరియైన మార్గంలో పెట్టలేకపోతున్నారు. వాళ్ళలోని

Unrest (అశాంతిని) సరియైన మార్గంలో పెడితే బాగుంటుంది. దిగంబర కవులు తిరుగుబాటు చేస్తున్నారు. వాళ్ళు కనబడిన ప్రతిదానిమీద తిరగబడుతున్నారు. వాళ్ళు అనార్కిస్టులను కోవాలో మార్క్సిస్టులనుకోవాలో తెలీదు. ఎక్కువ అనార్కిస్టులుగానే కనిపిస్తున్నారు" (చూ. ఆధునికాంధ్ర కవితా సమీక్ష – కె.వి.ఆర్. నరసింహం). నిర్దిష్టమైన ప్రాపంచిక దృక్పథం, నిబద్ధ నాయకత్వం, అనుచరులూ లేని కారణంగా దిగంబర కవిత్వం ఉద్యమంగా బలపడకుండానే ఆగిపోయిందని చాలామంది నిర్ధారించారు.

విప్లవ కవిత్వోద్యమం కూడా వాదోపవాదాలకు గురైంది. ఇక్కడ అభ్యుదయ వాదులకీ విప్లవ వాదులకీ మధ్య విప్లవాదులలో వాళ్ళల్లో వాళ్ళ మధ్య వాగ్యుద్ధాలు జరిగాయి. "విరసం మరణించింది" అని శివసాగర్ అంటే వి. చెంచయ్య మరణించింది విరసం కాదు శివసాగరే" అన్నారు. విరసంలో శ్రీశ్రీ పాత్రపై కూడా ప్రతి విమర్శలు వెలువడ్డాయి.

స్త్రీవాద, దళితవాద ఉద్యమాలు కూడా కొంతకాలం ప్రతివిమర్శలకి గురి అయ్యాయి. ఈ ఉద్యమాలు తీవ్రంగా ఉన్నప్పుడు ప్రతిఘటనలు తప్పలేదు. ఈ వాదోపవాదాలు ఎంత విస్తృతంగా జరిగాయంటే డా॥ ఎస్వీ. సత్యనారాయణ సంపాదకత్వంలో రెండు పుస్తకాలు వెలువడ్డాయి. స్త్రీ వాదంపై వెలువడిన కొన్ని వ్యాసాలను పరిశీలిద్దాం.

"నిజానికి ఇవి వారకవితలండీ" అని జ్వాలాముఖి రాస్తే చేరా "ఫ్యూడల్ వాసనల ఊబిలో జ్వాలాముఖి" అని రాశారు. దీనికి ప్రతిగా ఎస్వీ "ఊబిలో చేరా" అన్నారు. చందు సుబ్బారావు జోక్యం చేసుకొని "ఎస్వీ. నువ్వలా గుండె బాదుకోవడం తగదు సుమా" అంటూ సమాధానమిచ్చారు. రావిశాస్త్రి "మధురవాణి మధురమే– ఫెమినిస్టులే గయ్యాళులు" అన్నారు. జయప్రభకీ జ్వాలాముఖికీ మధ్య కవిత్వ పరంగా కూడా వాదాలు జరిగాయి. జ్వాలాముఖి ఈ స్త్రీ వాదం వెనుక అమెరికా సామ్రాజ్య హస్తం ఉందని నొక్కి చెప్పారు. కొంతవరకు దూషణ కూడా చోటు చేసుకొంది. ఓల్గా "నిజాలు రాస్తే నీలి కవితలంటారా?" అని జ్వాలాముఖికి సమాధానమిచ్చారు. ఎస్వీ "ఒళ్ళుబలిసిన మధ్యతరగతి స్త్రీల కవిత్వం"గా విమర్శించారు. కొండేపూడి "లేబర్ డ్రీం" కవితరాస్తే దీనికి నిరసనగా సుమప్రభ "డ్రీం రూమ్" రాసి జ్వాలాముఖికి

అంకితం అన్నారు. ఓల్గా రాసిన "స్వేచ్ఛ" నవలపై కూడా వాడిగా వేడిగా చర్చలు జరిగాయి. స్త్రీ వాదంపై విమర్శలో పురుష ద్వేషం, పెళ్ళి, లైంగిక భావనలు ఎక్కువగా చోటు చేసుకొన్నాయి. ఈ వాదోపవాదాల వల్ల కొంతమంది స్త్రీవాదులలో సంయమనం అలవడిందని తెలుసుకొంటాం.

దళితవాదంపై కూడా ఎక్కువగా వాదోపవాదాలు తీవ్రంగా జరిగాయి. దూషణలూ చోటు చేసుకొన్నాయి. ఈ వాదం ఉద్ధృతంగా వచ్చి 93-96 సంవత్సరాల మధ్య వివాదాలు వెలువడ్డాయి. ముందుగా దళితులెవరు? అనే అంశంపై చర్చలు జరిగాయి. దళిత కవిత్వంలోని హిందూ ద్వేషం, పురాణాలపై దుమ్మెత్తటం, రిజర్వేషన్లు మొదలైన అంశాలపై వాదోపవాదాలు జరిగాయి.

ఆర్.ఎస్. సుదర్శనం "దారి తప్పిన దళిత వాదం" అంటే 'మో' "దళిత కవిత్వానికి వచన కవిత వాహిక కాదు" అంటూ రాశారు. అక్బర్ "ముస్లిములూ దళితులే" అన్న వాదనను దళిత వాదులు పట్టించుకోలేదు. 'అంటరానితనం' వాళ్ళల్లో లేదన్నది దీనికి సాక్ష్యం. ద్వా.నా.కూడా "దూరాలు పెంచే ఉద్యమాలు వద్దు" అని రాశారు. మరికొన్ని వ్యాసాలు:

"దళిత రణక్షేత్రంలో శల్యుడు" – *శిఖామణి*

"నేటి వీరబాహుడు నిన్నటి వీరభక్తుడే" – *సతీష్ చందర్*

దళితులలో ఎ,బి,సి,డి వర్గీకరణ కోసం ఉద్యమం బయలుదేరి మాల మాదిగల మధ్య స్పర్థలకు దారితీసింది. పరస్పరం "వ్యాసాలు" దూసుకున్నారు. డా॥ ఎండ్లూరి సుధాకర్ "వర్గీకరణీయం" అనే దీర్ఘ కవితకు ప్రతిగా గూటం స్వామి "ఏకీ కరణీయం" అనే దీర్ఘ కవిత రాశారు. దళిత విమర్శకులే "దళిత బ్రాహ్మణులు" తయారవుతున్నారని ప్రకటించారు. స్త్రీ వాదంలో లాగా దళిత వాదంలో వ్యక్తిగతమైన వాదాలు పెద్దగా లేవు. విషయపరంగానే ఎక్కువ చర్చలు జరిగాయి.

ముస్లిం వాదం లేదా మైనారిటీ వాదం వచ్చినా కొంతకాలం వరకు వాదాలు లేవు. అయితే కరీముల్లా ముస్లిం వాదానికి ప్రతిగా "ఇస్లాం వాదం" ప్రతిపాదించారు. ముస్లిం వాదంలోగల 'తీవ్రత'ను తగ్గించి శాంతియుతమైన సంస్కరణ దిశగా ఈ వాదాన్ని తీసుకువస్తున్నానని వాదించారు. స్థూలంగా ప్రధానంగా ఈ ఇస్లాంవాదాన్ని ఖండిస్తూ రాశారు. చివరికి కరీముల్లా అన్ని వ్యాసాలనూ, ఇతరుల సూచనలనూ

పరిశీలించి ఇస్లాం వాదాన్ని ఉపసంహరించుకోవటంతో వాదోపవాదాలు ఆగిపోయాయి.

కథా సాహిత్యంలో గురజాడ రాసిన "దిద్దుబాటు" కథానిక శతజయంతి సందర్భంగా కొంత చర్చ జరిగింది. గురజాడ తొలి కథా(నిక) రచయిత కాదనీ భండారు అచ్చమాంబ గురజాడ కంటె ముందే కథలు రాసిందనీ వాదోపవాదాలు జరిగాయి. అచ్చమాంబ కథలు లభ్యమై ప్రచురింపబడ్డాయి. "దిద్దుబాటు" కథా? కథానికా? వీటికి స్పష్టమైన రేఖ గీయగలమా? అనే అంశాలపై కూడా చర్చలు జరిగాయి ఈ చర్చల్లో వేదగిరి రాంబాబు పాల్గొన్నారు. తొలి నవలగా కందుకూరి వారి "రాజశేఖర చరిత్ర"ను ఇంతవరకు పేర్కొంటున్నారు. జయధీర్ తిరుమలరావు, కొలకలూరి ఇనాక్, ద్వా.నా. వంటివారు నరహరి గోపాల కృష్ణమసెట్టి రాసిన "శ్రీరంగరాజచరిత్ర"ను తొలి నవలగా నిర్ణయించాలని ప్రతి విమర్శ చేశారు.

శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా 2010లో వాదోపవాదాలు జరిగాయి. అంతకు ముందు కూడా శ్రీశ్రీ ఎప్పుడు వివాదాలలో ఉన్నవాడే. శ్రీశ్రీ వ్యక్తిత్వంపై కొందరు, శ్రీశ్రీది బ్రాహ్మణ భాష అని కొందరు విమర్శ చేశారు. శ్రీశ్రీని సమర్థిస్తూ సమాధానంగా వ్యాసాలు వెలువడ్డాయి.

పుస్తక సమీక్షల పరంగా చాలా వాదోపవాదాలు జరిగాయి. భారతిలో ఇటువంటి వాదాలు చాలా కనబడతాయి. ఇంకా వెనక్కి వెళితే "అముద్రిత గ్రంథ చింతామణి", "ప్రతిభ", "అభినవ సరస్వతి", "వజ్రాయుధం" వంటి పత్రికలలో పుస్తక సమీక్షలపై చర్చలు కనబడతాయి. నిడదవోలు వెంకటరావు, కాళూరి హనుమంతరావు, చేరా బంగోరె, బండి నాగరాజు మొదలైనవారు ఈ చర్చలో పాల్గొన్నారు.

కొన్ని పత్రికలు సంచలనం కోసం, ఉనికిని చాటుకోవడం కోసం వ్యాసాలు రాయిస్తూ వాదోపవాదాలకు పురికొల్పుతారు. స్పర్థను పెంచడం ఒక యుక్తి. ఒకనాడు విశ్వనాథ వర్గం – శ్రీశ్రీ వర్గం.... అనే విధంగా వుంటే ఇవాళ ఆ వర్గాలు మరింత ఎక్కువయ్యాయి. ప్రాంత, కులాల వారీగా విడిపోవటం కూడా గమనిస్తాం.

కొంతమంది ప్రకటించిన ప్రకటనలవల్ల (స్టేట్‌మెంట్స్) కూడా వాదోపవాదాలు జరిగాయి. వెల్చేరు నారాయణరావు అమెరికా నుంచి మనదేశానికి వచ్చినప్పుడల్లా

"ఇంటర్వ్యూలు" ఇస్తూ ప్రకటనలిస్తూ వుండటం– దానిపై చర్చలు జరగటం ఆనవాయితీగా వుంది. ఒకసారి నగ్నముని తెలుగు కవిత్వంలో 'స్తబ్దత' వుందనడంతో చర్చలు మొదలయ్యాయి. అజంతా "శ్రీశ్రీకి ముందు వెనుక శూన్యం" అనడం, ఎస్వీ "శ్రీశ్రీ తెలంగాణా పోరాటంలో పాల్గొనలేదు" అనడం కొంత చర్చకు దారి తీశాయి.

విమర్శ కత్తిమీద సాములాంటిది. విమర్శకుడికి సంయమనం, సహృదయం లాంటివి ఉండాలన్నారు. కానీ ఇవాళ అటువంటి లక్షణాలు కనబడవు.

"నేరములు కాళిదాస మ
యూరాదులకైన కలుగ నొరులకు లేవే
సారమతులైన సుకవుల
కారుణ్యము కలిమి నేర్పు కవిజనములకున్"

అని 13వ శతాబ్దంలో కేతన "ఆంధ్ర భాషాభూషణము"లో పేర్కొన్నాడు. వేమన "తప్పు లెన్నువారు తమ తప్పులెరుగరు – ఉర్వి జనుల కెల్ల నుండు తప్పు" అన్నాడు. అద్దేపల్లి రామమోహనరావు "రచించిన క్షణాలు మాత్రమే నీవి" అంటాడు. ఒక రచన వెలువడ్డాక అనేకమైన స్పందనలు, ప్రతి స్పందనలు వస్తాయి. ఆ రచయిత, ఆ కవి వాటిని స్వాగతించాలి. 'త్వంశుంఠ' అంటే 'త్వంశుంఠ' అనడం సద్విమర్శ కానేరదు. "వచన పద్యం"పై చేకూరి రామారావు, కోవెల సంపత్కుమార వాదోప వాదాలు చేసుకొన్నారు. ఎక్కడా దూషణ లేదు – ఆభిజాత్యం లేదు. నోరుపారేసుకోవడం లేదు. అంతా విషయ ప్రాధాన్యంగా జరిగింది. పైగా ఇద్దరూ కలసి వాటిని పుస్తకంగా ప్రచురించారు. ఆ వాతావరణం ఉన్నప్పుడే సాహిత్యానికి మేలు జరుగుతుంది. విమర్శకుడు శత్రువు కాదని గుర్తించాలి. చివరగా కందుకూరి వాక్యాలను స్మరించుకుందాం. "పండిన వృక్షమునకే రాయి దెబ్బలన్నట్టు పుస్తకము వ్రాయువారికే విమర్శనమను రాళ్ళు తాకును. అయిన నవి మొదట కొంత నొప్పి కలిగించి గ్రంథకర్తను కాలక్రమమున గట్టివాని గావించుటయే కాక యాతని మహోన్నతునిం జేయును".

10

ఒకే వస్తువులో విభిన్న శిల్పాలు

కవులు ఒకే వస్తువుపై స్పందించి కవితలు రాయడం విశేషమేమీ కాదు. అలా స్పందించగలిగిన వాళ్ళే సహృదయ కవులవుతారు. అత్యాధునిక వచన కవితల్లో ఒకే విషయంపై వేర్వేరుగా వెలువడినవి చాలా వున్నాయి. సమకాలీన సంఘటనలకి స్పందించి కవితలు రాసిన కవులు చాలా మంది వున్నారు. ఒకే విషయం మీద వేర్వేరు కవులు కవితలు రాసినప్పుడు వాటిని తులనాత్మకంగా పరిశీలించటం సమంజస మనిపిస్తుంది. ఏ విధంగా స్పందించారు? ఏ దృక్పథంతో స్పందించారు? ఆ స్పందనని వ్యక్తీకరించేటప్పుడు శైలి ఎలా వుంది? ఒక విషయంపై ఎన్ని రకాలుగా స్పందించ వచ్చు? అనే అంశాలు ఈ పరిశీలనవల్ల అవగతమవుతాయి. ఈ తారతమ్య పరిశీలనవల్ల ఒక కవి లేదా కవిత హైలైట్ కావచ్చు. అది సందర్భాన్నిబట్టి మాత్రమే అని తెలుసుకోవాలి. మొత్తంమీద స్పందించే లక్షణాన్ని మెచ్చుకోవాలి. ప్రస్తుతం రాజకీయ, సామాజిక సంఘటనలకి స్పందించి రాసిన కవితల్ని కాకుండా వ్యక్తులపై రాసిన కొన్ని కవితల్ని పరిశీలించటానికి ఉద్దేశింపబడింది.

'అచ్చాషాబ్'

ఎండ్లూరి సుధాకర్, భగ్వాన్‌లు 'గూర్ఖా'పై కవితలు రాశారు. సుధాకర్ కవితకి 'గూర్ఖా' పేరు పెట్టి పాఠకుడికి ముందే వాచ్యం చేశాడు. కానీ భగ్వాన్ 'అపరిచితుడు'గా గుర్ఖాని చిత్రీకరించాడు. ఇద్దరూ గూర్ఖా జీవితంపై దయ, సానుభూతి కలిగేలా రాయటంలో కృతకృత్యులయ్యారు. భగ్వాన్ కవితలో గూర్ఖా పరాయివాడనీ, అతని జీవిత నేపథ్యాన్ని ఎవ్వరూ తెలుసుకోరనీ వివరిస్తూ "ఏ దేశంవాడో మనకోసం వచ్చాడు"

అని అపరిచితుడైన మన బతుక్కి 'పహారా' ఇచ్చే ఆత్మీయుడని చెప్పబడింది. ఎండ్లూరి కవిత ఇంతకంటే సంపూర్ణంగా వుంది. అంటే "కంప్లీట్ పిక్చర్" ఇచ్చాడు ఎండ్లూరి.

"అతడు రాత్రి సూర్యుడు,
దొంగ చీకటిని వెంటాడుతుంటాడు"

అని ఎండ్లూరి అంటే – ఇదే భావాన్ని భగ్వాన్

"తన కళ్ళను మన ఇళ్ళచుట్టూ సెర్చి లైట్లను చేస్తాడు"గా తెలిపాడు.

భగ్వాన్ కవితలో లేని పద సౌలభ్యం సుధాకర్ "దొంగ చీకటి"లో కనిపిస్తుంది. గూర్ఖా కాపలా కాయటాన్ని ఇద్దరూ అత్యంత శక్తిమంతంగా వ్యక్తీకరించారు. ఇద్దరూ పోటీపడ్డారా– అనిపిస్తుంది.

"మనమంతా గాఢ నిద్రలో గురకలు పెడుతున్నప్పుడు
ఒక్కడే ఓడలా మెలకువ కెరటాల మీద వదలి పోతుంటాడు.
అర్ధరాత్రి భార్యాబిడ్డల్ని విడిచి
ప్రతి రాత్రీ గౌతమ బుద్ధుడవుతాడు"– అనటంలో
సుధాకర్ కలం బలం ఎంత వుందో– పారా హుషార్ అనే కేక

"ఒక మేలు కొలుపు పిలుపులా
మన రెప్పల్ని తెరిచే గొంతు అది
ఒక ఆత్మీయతా స్పర్శలా
మన వెన్నెముకను నిమిరే గొంతు అది"

అన్నప్పుడూ భగ్వాన్ ప్రతిభ తెలుస్తుంది. ఇద్దరూ గూర్ఖాకి మనం ఇచ్చే డబ్బులు గురించి స్పందించటం గమనిస్తాం.

"నెలకో రూపాయి విదిల్చినప్పుడైనా చిరునవ్వు చిలుకరించం" అన్నప్పుడు భగ్వాన్ మన నిర్దాక్షిణ్యంపై చురక వేశాడు. కానీ సుధాకర్

"మనకు జీతం వచ్చిన రోజు నుంచీ
అతడు మన జీతం తాడు పేనుకుంటూ పోతాడు"

అని మంచి రూపకంతో గూర్ఖా డబ్బులకోసం పడే పాట్లు బాగా వర్ణించాడు.

'అక్కడో అయిదు, ఇక్కడో అయిదు తీసుకుంటూ తిరగటం' పేనుకుంటూగా చెప్పడంతో– అంతకంటే బాగా చెప్పలేరనిపిస్తుంది. అయినా అతడు 'అచ్చాషాబ్' అనే సంతృప్తితో 'అవనత శిరస్కుడు' అవుతాడని సుధాకర్ గూర్ఖా జొన్నత్యాన్ని, సంస్కారాన్ని కళ్ళకి కట్టిస్తాడు. అవనత శిరస్కుడనే పదం 'ఇక్కడ జొచిత్యంగానే ఉంది. భగ్వాన్ కవిత "చీకటి చిరునామా అయినవాడు" గా ముగించడంలో జాలి కలిగిస్తుంది తప్ప అతని సంస్కారాన్ని ప్రదర్శించదు. ఇద్దరూ చాలామంది పట్టించుకోని– కానీ అందరికీ కావలసిన గూర్ఖాపై ఇంత మంచి కవితలు రాసినందుకు– వచన కవిత్వానికి బలం చేకూర్చినందుకు అభినందనీయులే.

ఫ్రీడమ్ ఫైటర్ :

స్వాతంత్ర్య సమరయోధులు ఇప్పుడు "రెపరెపలాడని పాతపడ్డ ప్రత్యేక సంచికలా" వుంటారు. పాపం వాళ్ళ దుస్థితి ఇలా వుంటుంది.

"జైలు ముఖం చూడని కుర్ర మంత్రి
జైలు సర్టిఫికేట్ కోసం తిప్పుతాడు"

ఇది డా॥ ఎన్.గోపి రాసిన కవితకి సంబంధించింది. శీర్షిక ఇంగ్లీషులో వున్నా అది వాడుక పదమే. ప్రత్యేక సంచికలు పాతబడగానే దుమ్ము కొట్టుకొని, నలిగిపోయి, విహీన స్థితిలో వున్నట్టే, అలమార్లలోకో, పాత పేపర్ల మధ్యలోకో వెళ్ళిపోయినట్టే ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు కూడా పనికిరాని వాళ్ళుగా, అవశేషాలుగా మిగిలిపోతున్నారని గోపి గొప్పగా వర్ణించాడు. ఇంతకీ నేటితరం వాళ్ళ దృష్టిలో అలాంటి ఫ్రీడమ్ ఫైటర్ ఎటువంటి పాడో తెలుసా?

"వేళ్ళ కొసల మీద వందేమాతరం పూసల్ని దొర్లిస్తూ
కనబడ్డ ప్రతివాణ్ణీ అపరాధిని చేస్తాడు"

ఇక్కడ గోపి సహజ చిత్రణకి ప్రాధాన్యం ఇచ్చాడు. ఆనాటి స్ఫూర్తితో అతడు ప్రతిదాన్నీ విమర్శిస్తాడు. అందరూ దోషులే అంటాడు. కొందరైతే ఆ బ్రిటీష్ వాడే నయం అని కూడా అంటారు. ఈ దృశ్యాన్ని గోపి చక్కగా గుర్తు చేశాడు. నాగభైరవ కోటేశ్వరరావు "స్వాతంత్ర్య సమరయోధులు" అనే కవితలో దృక్పథంలో తేడా గమనిస్తాం. రెండు కవితల్లోనూ సమరయోధుల దుస్థితి వివరించబడింది. నాగభైరవ

స్వాతంత్ర్య సమరయోధుల్ని హైలైట్ చేస్తే, గోపి సమాజంలో వాళ్ళ దుస్థితిని హైలైట్ చేశాడు.

"చెట్టు చిటారు కొమ్మన నిల్చి
తుఫాను విజృంభణాన్ని ఎదుర్కొని
వీరోచితంగా పోరాడాయి"

వంటి ఉపమాన సామగ్రితో ఆ చైతన్య శిఖరాలని చూపించారు నాగభైరవ. ముగింపులో కూడా అనుప్రాసతో నాగభైరవ–

"ఇవి అభిమానంతిని బతికే దీప్తులు
ఇవి దేశభక్తికి రూపమైన ఆప్తులు"

అని స్వాతంత్ర్య సమరయోధుల్ని ప్రశంసించారు. నాగభైరవ కవితలో లేని అదనపు గుణం గోపి కవితలో వుంది. సమరయోధుల చరిత్ర ఎలా వుందో గోపి మంచి పోలికతో మంచిగా చెప్పాడు–

"సావనీరు అడ్వర్‌టైజ్‌మెంట్ల మధ్య
తలొంచుకొని బిక్క చూపులు చూస్తుంది"

ఇందులో తాజా ఉపమానం గమనించవలసింది. అయితే ఆ సమరయోధుడు ఎదురు పడితే తట్టుకోలేని అశక్తతతో–

"అతణ్ణి తప్పుకుపోవటానికి
దారులు వెతుకుతాన్నేను"

అని ముగించడంవల్ల నేటి రాజకీయ అవ్యవస్థని దుయ్యబట్టినట్లయింది. మనం మరచిపోతున్న ఒకనాటి త్యాగధనులపై వాళ్ళని ఆసరాగా తీసుకొని కలుషితమైపోయిన మన వ్యవస్థని విమర్శిస్తూ– రాయబడిన మంచి కవిత లివి.

అమ్మ:

వచన కవితల్లో 'అమ్మ' మీద వచ్చినన్ని కవితలు మరో విషయం మీద రాలేదని పిస్తుంది. అమ్మమీద మూడు కవితా సంపుటాలు వెలువడ్డాయి. అయితే కమిట్‌మెంట్ లేకుండా సహజ వాత్సల్యంతో–

"అమ్మ, ఆకలే అనడం తప్ప అమ్మ కడుపులో కాసిన
ఎర్రటెండను పట్టించుకొన్నదెవ్వడు?"

అని అల్లం నారాయణ 1988లోనే రాశాడు. ఆ కవిత "మా అమ్మ మాత్రం వంటింటి గడప మీద శిల అయింది" అని ముగుస్తుంది. స్త్రీవాదం ఉవ్వెత్తున లేని కాలంలోనే ఈ విధమైన అభివ్యక్తి గమనార్హం– అదీ ఒక కవి కలం నుంచి (కవయిత్రి కాదు).

ఉద్యమాల నేపథ్యంతో అమ్మమీద వెలువడ్డ గొప్ప కవితలు అయిదారున్నాయి. అమ్మని స్త్రీకి ప్రతినిధిగా చిత్రించి పురుషాధిక్యతని ఎండగట్టిన కవితలూ వున్నాయి.

చల్లపల్లి స్వరూపరాణి, "అసలు నీ స్పర్శ తగలందే ఈ నేలపై గాలీ, వెలుతురు పులకించవ"ని చెప్తూ, ఛాందసత్వాన్ని, మత మౌఢ్యాన్ని మేళవిస్తూ "మాయమ్మ" అనే కవితలో అమ్మని తిరుగుబాటు చెయ్యమంటుంది. అల్లం నారాయణ కూడా "మొగ్గలకు రెక్కలతికిన అమ్మ'గా కీర్తించి నాగేటి చాలయింది" అని శ్రమశక్తిని చూపిస్తాడు. స్వరూపరాణి దీర్ఘకవితలో గాఢత తక్కువ కాగా నారాయణ కవితలో సంక్షిప్తత కనిపిస్తుంది. తాజాగా దాట్ల దేవదానం రాజు రాసిన అమ్మ కవితలో అమ్మ అనురాగాన్ని, ఔన్నత్యాన్ని వివరించడం ఉంది తప్ప స్త్రీగా పడే అగచాట్ల ప్రస్తావన లేదు. స్వప్న విరచిత దృశ్యాలు, పుష్ప సౌగంధిక మాలికలు వంటి సమాసాలతో అమ్మకి పెద్ద పీట వేశాడు. ఈ అమ్మ కవితలన్నిటిని మించిన 'అమ్మలకు అమ్మ' వంటి కవిత మద్దూరి నగేష్ బాబు రాశాడు. దళిత నేపథ్యంతో ఆర్ద్రంగా రాసిన 'అలగాతల్లి' కవిత వ్యంగ్యంతో, సహజమైన ఉపమానాలతో, కొత్త టెక్నిక్‌తో వుంది.

"ఏ ప్రభుత్వాసుపత్రి శవాల కొట్టుముందయినా
ఒక కన్నీటి మడుగుని చూశారా– అది మా అమ్మే"

అని ప్రారంభమయ్యే ఈ కవిత ఉత్తమోత్తమ కవిత. గుండెల్ని పిండే కవిత. సంభాషణా శైలిలో సాగటంవల్ల కవితకి ఓ బిగి ఏర్పడింది.

"అందరి తల్లులూ ఆదమరచి సుఖనిద్రలు పోతున్నప్పుడు నా కూలితల్లి పంటకుప్పల మధ్య పరాభవమై పోయింది".

"వానలో తడిసొచ్చి తుడుచుకుందామని అమ్మ కొంగందుకుంటే కోటి పూసికలు నన్ను వెక్కిరించాయండీ".

ఈ కవిత ఒక సత్యాన్ని చాటిచెప్తుంది. స్త్రీ వాదం కంటే దళిత స్త్రీవాదం సహజమైందనీ, లో చూపుకలదనీ, దేశీయమైన భావజాలం కలదనీ నిరూపించే ఈ కవిత గొప్ప కవిత- అనే విషయం తులనాత్మక పరిశీలనవల్ల తెలుస్తుంది.

పనిపిల్ల:

జి. విజయలక్ష్మి, భగ్వాన్, కె. వరలక్ష్మి పనిమనిషి మీద కవితలు రాశారు. కవయిత్రులు పని పిల్ల దుస్థితినీ, సమాజం చేసే దోపిడీని వర్ణించారు. భగ్వాన్ పనిపిల్ల గొప్పదనంతోపాటు అవసరాన్నీ వర్ణించాడు. పనిమనిషిగా ఎంతగా పెనవేసుకు పోయిందో మాత్రమే భగ్వాన్ వివరించాడు. విజయలక్ష్మి, వరలక్ష్మి స్త్రీవాద ధోరణిలో మరింత శక్తిమంతంగా 'పీడితురాలి'గా వ్యక్తీకరించారు.

"మా ఇంటిముందు కల్లాపవుతుంది
మా బిందెల నిండా నీళ్ళవుతుంది"

అని పని పిల్ల శ్రమని వ్యక్తీకరిస్తూనే భగ్వాన్-

"మేం ఇచ్చే గ్లాసెడు కాఫీ తాగి, గుప్పెడు మెతుకులు తిని స్నేహ దీపం అవుతుంది" అని గొప్పదనాన్ని వర్ణించినా, మనీ శ్రమకి తగినట్టు చెల్లించడం లేదన్న విషయం తేటతెల్లమైంది. చేయించుకొన్నవారి దోపిడీ బుద్ధిని కవి అంతగా పట్టించుకోలేదు. పనిమనిషి రాకపోతే-

"మా కన్నుల్లో దిగులవుతుంది/ మా గుండెల్లో బెంగవుతుంది" అని యథార్థాన్ని వర్ణించాడు. ఇంకా పనిమనిషి చుట్టూ అల్లుకుపోయే తీగలం అంటాడు భగ్వాన్.

అయితే కవయిత్రుల దృక్పథం వేరు. పనిపిల్ల స్వగతంగా విజయలక్ష్మి వర్ణించిన తీరు కదిలిస్తుంది.

"కళ్ళు తెరిచినప్పటినుంచి
కన్నీళ్ళే కళ్ళల్లో నింపుకొన్నదాన్ని
కడుపునిండా తిన్నది కలలోనే"

అని వివరిస్తూ భూస్వాముల కామానికి బలైపోయే కిరాతకం కూడా తెల్పబడింది. పేరులో పెన్నిధి లేని పనిమనిషిగా కె. వరలక్ష్మి కొత్త ఉపమానాలతో కొత్త రీతిలో కవిత రాసింది. భగ్వాన్‌లాగా ఆమె వల్ల గిన్నెలు తళ తళ లాడతాయి

అని రాసి, "ఆమె ఇంట్లో సత్తుగిన్నె మాత్రం మసిబారిన మంగలం పెంకులా వుంటుంది" అనడంలో భగ్వాన్ కంటే ఓ మెట్టుపైన వున్న కవితగా మారింది. పనిమనిషి గుడిసె చిరిగిన అలుగ్గుడ్డలా వుందనడం కొత్త ఉపమానమే కాదు. సన్నివేశానికి తగింది కూడా. తాగొచ్చిన మొగుడు, అమ్మగారి ఆధిక్యత, అసంగతం, గర్భస్థ శిశువు– ఇవీ వరలక్ష్మి కవితా సామగ్రి. 'నిర్లప్తత' తప్ప ఆమె జీవితానికి అశలు లేవన్నది నిజమే కదా! నిద్రాదేవికి మాత్రమే ఆమె మీద జాలి అనటం గొప్ప వ్యంగ్యం. ఒకే విషయం మీద విభిన్న కవులు కవితలు రాయడంవల్ల అన్ని కోణాలూ వ్యక్తీకరించే సదుపాయం ఏర్పడుతుంది. సమగ్ర చిత్రీకరణకి అవకాశం కలుగుతుంది. కవిత్వంలో అభివ్యక్తి విధానాలు అవగాహనమవుతాయి. అంతమాత్రాన ఒకరి కవితను తక్కువ చేయడం మరొకరి కవితను ఎక్కువ చేయడం సరికాదు. కవిత్వ విధానాన్ని అంచనావేయడమే ఇది.

11

ఆరు పదుల తెలుగు కవిత

స్వాతంత్ర్యోద్యమం, పాశ్చాత్య దేశాలలో పారిశ్రామిక విప్లవం, సాంఘిక పునరుజ్జీవన ఉద్యమం, పాశ్చాత్య రాజకీయ, ఆర్థిక, సామాజిక సిద్ధాంతాలు ఆధునిక కవిత్వావిర్భావానికి దోహదం చేశాయి. మన రాష్ట్రంలో తలెత్తిన రాజకీయ పార్టీలు, సంస్కరణోద్యమాలు తెలుగు కవిత్వ స్వరూపాన్ని మార్చివేశాయి. అభినవ కవిత్వం కొత్త మలుపులతో కొత్త పుంతలు తొక్కింది. 1947 నుంచి నేటివరకు తెలుగు కవిత బహుముఖాలుగా వెలువడుతూ విస్తరిస్తూ తెలుగు భాషా వైశిష్ట్యాన్ని, తెలుగువారి జీవన సమస్యల్ని, పరిపాలకుల దురాగతాల్ని, తెలుగువారి జీవనతత్వాల్నీ చాటి చెప్తూనే వుంది. ఎంత ఆధునికమైనా తెలుగు కవిత్వం మూలాల్ని విస్మరించలేదు. నూతన ప్రక్రియలతోపాటు ప్రాచీన ప్రక్రియలైన పురాణం, కావ్యం, శతకం, దండకం, అవధానం వంటివి సమాంతరంగా వెలువడుతూ ఉండటం విశేషం.

1947 నాటికి భావకవిత్వోద్యమం తెరవెనుకకి వెళ్ళింది. ఆ భావజాలం కొందరు కవులలో ఉన్నా ఉద్యమస్థాయి కనిపించదు. ఈ కాలంలో అభ్యుదయ కవిత్వం తీవ్రస్థాయిలో వెలువడింది. శ్రీశ్రీ ఈ అభ్యుదయ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ తన అసామాన్య ప్రతిభతో తెలుగునాడును ఉర్రూతలూగించాడు. ఎక్కడ విన్నా శ్రీశ్రీ గేయాలే. నాటి యువతరాన్ని అభ్యుదయ పథం వైపు తనతో లాక్కొని వెళ్ళినవాడు శ్రీశ్రీ. కత్తి కంటే కలం గొప్పదని చాటి చెప్పినవాడు శ్రీశ్రీ. నవ్యసాహిత్య పరిషత్తు, సాహితీ సమితి, తెలంగాణా రచయితల సంఘం, సాధన, అ.ర.సం వంటి సంస్థలు నవీన కవిత్వానికి అండగా నిలిచాయి. ప్రతిభ, అభ్యుదయ, కళాకేళి, సాహితి, తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికలు తెలుగు కవులకి ఆట పట్టులయ్యాయి. కవులకి

లోకానుభవం అవసరమైంది. ప్రపంచ పరిణామాలపట్ల అనుశీలన కవిత్వహేతువైంది. గత నిరసనకి ప్రాధాన్యం పెరిగింది. "సామాజిక స్పృహ" (Social consciousness) అనే పదానికి ప్రాముఖ్యం వచ్చింది. సమాజశ్రేయస్సే కవిత్వ ప్రయోజనమైంది. జాతీయ దృష్టి నుంచి అంతర్జాతీయ దృష్టి అలవడింది.

"శ్రమైకజీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదు" అన్న అభినవ బుక్కు కేంద్రబిందువైంది. అలజడి, ఆందోళన, తిరుగుబాటు... కవిత్వ వస్తువులయ్యాయి. "మార్క్సిజం" అభినవ కవిత్వానికి ప్రాణమైంది. కవుల అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలయ్యాయి. దాశరథి, సోమసుందర్, ఆరుద్ర, అనిశెట్టి, కాళోజి, రెంటాల, గంగినేని, కుందుర్తి, పురిపండా, మల్లారెడ్డి, సినారె వంటివారెందరో కొత్త కవిత్వాన్ని సృష్టించి తెలుగు కవిత్వానికి దిశా నిర్దేశం చేశారు. వీరందరివల్ల నవ్య కవిత్వానికి వారసులు ఇబ్బడి ముబ్బడిగా తయారయ్యారు.

అయితే ఈ అభ్యుదయ ఉద్యమం దాదాపు 1965 వరకు ఉద్ధృతంగా సాగింది. కవితారంగాన్ని చైతన్యపరిచింది. సామాజిక రుగ్మతలపై శంఖం పూరించింది. వామపక్ష పార్టీలలో చీలికలు రావటంవల్ల అభ్యుదయ కవులు కూడా చీలిపోయారు. అభ్యుదయ కవులు సినీకవులయ్యారు. రాజీతత్వం అలవరచుకొన్నారు. ప్రభుత్వ పదవులకోసం, మెప్పుకోసం తాపత్రయపడ్డారు. దీంతో అభ్యుదయ ఉద్యమ తీవ్రత తగ్గి బలహీనపడింది. సాహిత్యంలో కూడా చెప్పిందే పదే పదే చెప్పటంవల్ల వస్తుబలం కొరవడింది.

ఆ తర్వాత ఆరుగురు యువకులు కలిసి దిగంబర కవిత్వోద్యమం తీసుకు వచ్చారు. 1965లో నిఖిలేశ్వర్, నగ్నముని, చెరబండరాజు, జ్వాలాముఖి, మహాస్వప్న, భైరవయ్య అనే కవులు "మంచి కోసం, మనిషిలోని నిప్పులాంటి నిజమైన మనిషికోసం, కపటం లేని చిరునవ్వులు చిందే సమాజంకోసం మా దిగంబర గొంతుకతో చెప్పదలచుకున్నాం" అంటూ మూడు కవితా సంపుటాలు తెచ్చారు. నిరుద్యోగం, దారిద్ర్యం, కుహనా రాజకీయాలు, మతకలహాలు, సాహిత్య వ్యాపారం, సెక్స్ రచనలు... వంటి వాటితో కూడుకొన్న ఈ కుష్ఠువ్యవస్థ" పై దుమ్మెత్తి పోశారు. ఒక "షాక్ ట్రీట్ మెంట్"గా వచ్చిన దిగంబర కవిత్వంలో చాలామటుకు అశ్లీలంతో అసభ్య పదజాలంతో, దూషణలతో నిండి వుంది. అంత దిగంబరత్వం పనికిరాదని విమర్శకులూ, పాఠకులూ

భావించారు. అందుకే 1968 నాటికే ఈ ఉద్యమం కనుమరుగైంది. ఆరుగురితో పుట్టి ఆరుగురితోనే తిరిగింది. "వీళ్ళు చేసేది అభ్యుదయ·రచనకాదు. జాగృతి కోసం ధ్వంస రచన చేస్తారు", "ఈ దిగంబరుల పైత్యాన్ని కవిత్వమనుకొనేటంతగా (ఈ సమాజం) పతనమైందా?" వంటి విమర్శలతో ఉద్యమంగా కాకుండా ఒక ధోరణిగానే నిలిచిపోయింది. పాలపొంగులాంటి ఆవేశం మాత్రమే సుమా! అనిపించింది.

"మావో వజ్రాయుధం" అంటూ 1970లో విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. విప్లవకవిత్వం వాడిగా వేడిగా వెలువడింది. దీనికీ శ్రీశ్రీయే నాయకత్వం వహించవలసి వచ్చింది. అప్పటి జనచైనా వీరికి ఆదర్శం. మావోయిజం, లెని నిజం, మార్క్సిజాల సమ్మేళనం విప్లవ సిద్ధాంతంగా మారింది. సాయుధ పోరాటం ద్వారానే శ్రామిక వర్గవిముక్తి కలుగుతుందనీ, సామ్రాజ్యవాద పెత్తందారీ విధానాలను 'కత్తికి కత్తి' అనే విధంగా సమాధానం చెప్పాలనీ నిర్ణయించారు. ఎన్నికల బూటకపు పద్ధతిని ఎండగట్టారు. ఇటువంటి భావజాలంతో శ్రీశ్రీ, చెరబండరాజు, వరవరరావు, సత్యమూర్తి (శివసాగర్), నగ్నముని, జ్వాలాముఖి, కె.వి.రమణారెడ్డి మొదలైనవారు కవిత్వం రాశారు. దిగంబర కవులుగా వున్న వారు విరసంలో చేరారు. విప్లవ కవిత్వంలో పాట ప్రముఖ పాత్ర వహించింది. సుబ్బారావు పాణిగ్రాహి, వంగపండు ప్రసాదరావు, గద్దర్ మొదలైనవారు విప్లవ భావాలను ప్రజలదగ్గరకు తీసుకెళ్ళారు. కొడవటిగంటి కుటుంబరావు, చలసాని ప్రసాద్ వంటివారు విప్లవ కవిత్వం రాయకపోయినా విప్లవ కవులకి పాఠాలు చెప్పే గురువులయ్యారు. ప్రజాకళా రూపాలు ఆసరాగా జనం దగ్గరికి విప్లవ కవిత్వం వెళ్ళింది. అయితే ఆ తర్వాత ఇది 'రూటు' మార్చుకొని 'నక్సలైట్' ఉద్యమంగా, 'పీపుల్స్‌వార్' ఉద్యమంగా తయారైంది. విప్లవ కవులలో, నాయకులలో చీలికలు వచ్చాయి. ఎవరి గొడుగు వారిదే అయింది. "ప్రపంచ కార్మికులారా, ఏకం కండి" అన్న వారే ఏకం కాకపోవటం ఒక పెద్ద విషాదం! భావజాలం ఎలా వున్నా ప్రజలు హింసను సహించలేరు, స్వాగతించలేరు. అందువల్ల 1980 తర్వాత ఉనికికోసమే విప్లవ కవిత్వం కొనసాగుతోంది తప్ప అప్పటి ఊపు లేదు.

ఇన్ని ఉద్యమాలూ వాదాలూ వచ్చినా "ఆకాశంలో సగం" అయిన స్త్రీలను కవులెవరూ పట్టించుకోలేదన్న ఆవేదనతో, కసితో స్త్రీవాద ఉద్యమం వచ్చింది. ఇంగ్లీషులో గల "ఫెమినిజం" తెలుగులో స్త్రీవాదమైంది. పురుషాధిక్యతపై ధ్వజమెత్తుతూ

స్త్రీల విముక్తికై, ఆత్మ గౌరవానికై రూపొందించబడిన ఆలోచనాధోరణి స్త్రీవాదం. స్త్రీని తల్లిగా, భార్యగా మాత్రమే ముద్ర వేయబడటం నుంచి మనిషిగా గుర్తింపు పొందే స్థితి రావాలని, కవయిత్రులు కలమెత్తారు. లైంగిక వివక్షను నిరసించారు. స్త్రీకి సమానహక్కు, స్వేచ్ఛలు వీరి లక్ష్యాలు. "గురిచూసి పాడే పాట", "నీలి మేఘాలు" అనే స్త్రీవాద సంకలనాలు వీరి ధోరణిని వెల్లడిస్తాయి. ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, విమల, పాటిబండ్ల రజని, ఘంటసాల నిర్మల, మందరపు హైమవతి, కె. గీత వంటివారు తమ కవిత్వంలో కొత్త కోణాలను ఆవిష్కరించారు. పురుషాధిక్య భావజాలంగలవాళ్ళకి కనువిప్పు కలిగించారు. స్త్రీల సమస్యల్ని, వేదనల్ని, 'స్కానింగ్' చేసినట్టు చూపించారు. పెళ్ళి, సంసారం, ఇంటిచాకిరీ, వంట, సంతానోత్పత్తి వంటి విషయాలపై కూడా గొప్ప కవితలు వెలువడ్డాయి. స్త్రీ వాదుల్లో కూడా ఉదారవాదులు, రాడికల్ వాదులు, మార్క్సిస్టువాదులు లేకపోలేదు.

1980 నుంచే స్త్రీవాదం ఉద్యమస్థాయిలో ప్రచారం పొందింది. కొంత సంచలనమూ తీసుకు వచ్చింది. కానీ ఈ ఉద్యమం కూడా ఆ సంచలనాన్ని, ఆ తీవ్రతను క్రమేణా కోల్పోతూ వచ్చింది. అభ్యుదయ కవులలాగా 'పాడిందే పాట'గా అయింది. పురుష ద్వేషం, శారీరక ధర్మాలకి పురుషులే కారణమనటం, కుటుంబ వ్యవస్థను, వివాహ వ్యవస్థను నిరసించడం లేదా వక్రభాష్యం చెప్పటం, సామ్రాజ్యవాద ప్రభావం ఉండటం వంటి కారణాల వల్ల స్త్రీవాద కవిత్వం విమర్శకు గురైంది. లింగ వివక్షకే పరిమితం కాకుండా స్త్రీల స్వేచ్ఛ, హక్కులకోసం ప్రాధాన్యం వహించి వుంటే మరింత విజయవంతమయ్యేదన్న అభిప్రాయం కలిగింది. ఆవేశమూ, సెక్సూ, పెళ్ళిపై వ్యతిరేకతల వల్ల స్త్రీవాదం సానుభూతిపరులను తగ్గించుకొంది. 2000 నాటికి బలహీన పడింది.

ఒక పక్క స్త్రీవాదం ఉద్వేగంతో, ఉత్తేజంతో వస్తున్న రోజుల్లోనే దళితవాదం మొదలైంది. ఎన్ని ఉద్యమాలు వచ్చినా ఈ దేశంలోని అత్యంత ప్రధాన సమస్య "కులసమస్య"ను ఎవ్వరూ పట్టించుకోలేదు. అసలు గాయం ఎక్కడుందో తెలుసుకోకుండా మందులు పూశారు... అంటూ దళితులు తమ గుండె చప్పుళ్ళను వినిపించారు. 1985 ప్రాంతం నుంచి సన్నటి మూలుగులతో ప్రారంభమై 1990-95 ప్రాంతంలో ఉవ్వెత్తున ఎగసింది. పూలే ఇజం, అంబేద్కరిజంల సిద్ధాంతాలు

ప్రాతిపదికగా దళిత ఉద్యమం బయలుదేరింది. "అంటరానితనానికి గురై మూడు సహస్రాబ్దాలు జైల్లో బతికి పంచములని పిలువబడ్డ షెడ్యూల్డు కులాలకు చెందినవాళ్ళే దళితులు. వాళ్ళు హిందూ, బౌద్ధ, క్రైస్తవ, మహమ్మదీయ, సిక్కు మతాలకు చెందినా దళితులే. "కులసమస్య నిర్మూలన కాంక్షాభివ్యక్తి దళిత సాహిత్యం" అని ప్రకటించారు. మొదట్లో బి.సి.లు, ముస్లిములు కూడా దళితులుగానే చెప్పారు. ఆ తర్వాత బి.సి కుంపటి వేరు, ముస్లింల కుంపటి వేరు అయింది. కొంతకాలానికి దళితులలోనే మాల, మాదిగ భేదాలు (పూర్వం నుంచి వున్నవే) భగ్గుమన్నాయి. "సంఘటితం కండి" అన్న అంబేద్కర్ పిలుపు గాలికి కొట్టుకు పోయింది.

అగ్రకులాల ఆధిపత్య ధోరణిని ప్రశ్నించడం, ఆత్మగౌరవం పొందడం, కులపీడనపై కన్నెర్ర జేయడం, మనువాద సంస్కృతిని బద్దలుకొట్టడం, రాజ్యాధికారం... అనే లక్ష్యాలతో "దళితకవిత", "చిక్క నవుతున్నపాట", "పదునెక్కిన పాట", "ప్రవహించేపాట" వంటి కవితా సంకలనాలు వెలువడ్డాయి. శివసాగర్, ఎండ్లూరి సుధాకర్, సతీష్‌చందర్, జూలూరు గౌరీశంకర్, కత్తి పద్మారావు, మద్దూరి నగేష్‌బాబు, శిఖామణి మొదలైన కవులెందరో కొత్త చూపుతో, దళిత జీవితాలలోని బహుముఖ పార్శ్వాలను వెలుగులోకి తెచ్చారు. గద్దర్, మాస్టర్‌జీ, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, వంగపండు మొదలైనవారు పాటల ద్వారా కులపీడనను ఎండగట్టారు. అయితే 2000 సంవత్సరం తర్వాత దళితుల్లో చీలికలు ఏర్పడ్డాయి. 'ఎ.బి.సి.డి.' వర్గీకరణ వీళ్ళల్లో ద్వేషాల్ని రగిలించింది. ఈ అంశంపైనా కవిత్వం వెలువడింది. కానీ అంతకు ముందున్న 'సంఘటితం కావడం' కనపడలేదు. కులనిర్మూలన ధ్యేయం కాస్తా కుల అంతరాలకు దారితీసింది. దళిత బ్రాహ్మణులు తయారయ్యారు. కసి, దూషణలు చోటు చేసుకొన్నాయి. అయినా దళిత కవిత్వం వెలువడుతూనే వుంది.

ఎప్పుడైతే దళిత ఉద్యమంలో బి.సి.లో భాగస్వాములు కాలేదో అప్పుడు బి.సి. వాద కవిత సంకలనం వెలువడింది. కానీ ఇది కొనసాగలేదు. ఆ తర్వాత ముస్లింవాదం తలెత్తింది. అభద్రతాభావంతో ఈ దేశంలో హీనంగా జీవించవలసి వస్తోందనీ, హిందువుల ఆధిపత్యంవల్ల దీనంగా బతకవలసి వస్తోందనీ, ముస్లింల పేదరికం పెరిగిపోతోందనీ, వేధింపులు ఎక్కువవుతున్నాయనీ కవులు ముస్లింవాద కవిత్వం రాయటం 2000వ సంవత్సరంలో మొదలైంది. దీనిని మొదట్లో మైనారిటీ వాదంగా

పిలిచారు. "నా దేశంలో నేనొక కాందిశీకుణ్ణి" అంటూ "జిహాద్", "జల్ జలా" వంటి సంకలనాలు వెలువడ్డాయి. ఖాదర్ మొహియుద్దీన్, రసూల్, అఫ్సర్, ఖదీర్, భాజా, ఇక్బాల్ చంద్, హనీఫ్, స్కైబాబా మొదలైనవారు ముస్లింవాద భావజాలంతో కవితా సంపుటాలు వెలువరించారు. షాజహానా, షెహనాజ్ వంటి ముగ్గురు నలుగురు కవయిత్రులు మాత్రమే ముస్లింవాద కవిత్వం రాస్తున్నారు. గుంటూరు ఏసుపాదం, కలేకూరి ప్రసాద్, మద్దూరి వంటి కొద్దిమంది క్రిస్టియన్ మైనారిటీల స్థితిని చిత్రీకరించారు తప్ప క్రిస్టియన్ మైనారిటీ కవిత్వం స్థిరపడలేదు. మైనారిటీల హక్కులు ప్రధాన ధ్యేయంగా ముస్లింవాద కవిత్వం వెలువడినా మొత్తంమీద హిందూమతంపైగల కసి ఎక్కువగా కనిపిస్తుంది. అంటే ముస్లింవాద కవిత్వంలో మతప్రస్తావన ఎక్కువైంది. పైగా ఉర్దూ పదాల వాడకం అధికం. కరీముల్లా అనే కవి ముస్లింవాదంలోని ఈ ధోరణులకి నిరసనగా "ఇస్లాంవాదం" ప్రారంభించాడు. ఇస్లాంవాద కవితా సంకలనాలూ వెలువడ్డాయి. అయితే ఇదొక వాదంగా స్థిరపడక ముందే సద్దుమణిగింది.

ఈ వాదాలూ ధోరణులూ అలా ఉండగా 'ప్రత్యేక తెలంగాణా' ఉద్యమ ప్రభావంతో తెలంగాణా కవులు ప్రాంతీయ స్పృహతో కవిత్వం రాయటం 1995 ప్రాంతంలో మొదలైంది. తెలంగాణా వివక్షకు గురిఅవుతోందనీ, తెలంగాణీయుల ఉనికి, భద్రత ప్రశ్నార్థకాలవుతున్నాయనీ దిగులు చెందుతూ తమ ప్రాంతంమీద తమకే అధికారం ఉండాలనీ, కోస్తా ఆంధ్రుల పెత్తనం అంతమవ్వాలనీ... ప్రాంతీయ అస్తిత్వవాదం వచ్చింది. తెలంగాణాపై ఎప్పటినుంచో గళమెత్తుతున్న కవి కాళోజీ మరింత బలంగా వక్కాణించారు. "పాక్కిలి", "మత్తడి" వంటి సంకలనాలు ప్రాంతీయ స్పృహను శక్తిమంతంగా చిత్రీకరించాయి. జూలూరు గౌరీశంకర్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, జూకంటి జగన్నాథం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సిధారెడ్డి, వేణుసంకోజు, యెన్నం ఉపేందర్, కాసుల ప్రతాపరెడ్డి మొదలైన కవులు తెలంగాణా వాసుల ఆకాంక్షలకు ప్రతిరూపం ఇస్తూ కవితలు రాశారు. తమ ఆత్మగౌరవాన్ని నిర్దిష్టమైన స్వరంతో వెల్లడించారు. కానీ– కొద్దిమంది కవితల్లో కోస్తా ప్రాంతంపై ద్వేషం కనిపిస్తోంది. దూషణకూడా చోటు చేసుకొంది. తమ అస్తిత్వ పోరాటంలో ఆ ఆవేశం తప్పదంటారు. కని, ద్వేషంవల్ల కవిత్వ వాతావరణం, సహవాసం దెబ్బ తింటున్నాయన్నది మర్చిపోకూడదు. తెలంగాణా అస్తిత్వవాదం ప్రభావంతో రాయలసీమ కవులు, ఉత్తరాంధ్ర కవులు తమ ప్రాంతీయ స్పృహను వ్యక్తీకరిస్తూ కవిత్వం రాస్తున్నారు.

కవితా సంకలనాలూ వెలువడుతున్నాయి. తెలంగాణాలో వెలువడిన దళిత కవిత్వంలో ఈ ప్రాంతీయ అస్తిత్వ వేదన బాగా ఎక్కువ. ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వంలో ధిక్కార స్వరం ఎక్కువైనా తెలుగు సాహిత్యరంగంలో ఇప్పుడు వీస్తున్న గాలి ఇదే!

కొంతకాలం తెలుగు కవిత్వంలో ఆధునికోత్తరవాదం లేదా ఆధునికానంతర వాదం అనే కొత్త ధోరణి ప్రచారంలోవుంది. ఇంగ్లీషులో దీన్ని "పోస్ట్ మోడర్నిజం" అంటారు. పాశ్చాత్య సాహిత్యంలో ఈ ధోరణి 1960ల నాటికే వుండగా మన తెలుగులోకి 1990 తర్వాత ప్రవేశించింది. సిద్ధాంతాల అఖండతను ప్రశ్నిస్తూ ముందుకు వచ్చిన ఈ సిద్ధాంతం ఒక ఆలోచనా ధోరణి. సత్యం, హేతువు, హేతుబద్ధత, గుర్తింపు, విశ్వజనీనత, మహాకథనాలు వంటివాటిని ఆధునికోత్తర వాదం పూర్తిగా ఒప్పుకోలేదు. విశ్లేషించాలంటుంది. అఖండత స్థానంలో సాపేక్షిత ఉండాలంటుంది. సమగ్రత, సార్వకాలీనతలనూ అంగీకరించలేదు. సామూహికీకరణను నిరాకరిస్తుంది. అఖండ అర్థాల అంతరార్థాన్ని, ప్రతి అంశాన్ని ఖండఖండాలుగా చూడటాన్ని అంగీకరిస్తుంది. అయితే ఈ ఆధునికోత్తరవాదం ఇవాళ దాదాపుగా లేదని చెప్పాలి. దీనికి పెద్దగా ఆదరణ లభించలేదు.

ఈ వాదాలతో పాటు కొంతకాలం "అనుభూతివాదం" తెలుగు కవిత్వంలో ప్రచారం పొందింది. అనుభూతికి ప్రాధాన్యమిచ్చేది లేదా అనుభూతిని సాక్షాత్కరింప జెయ్యాలన్న తపనగలది అనుభూతి కవిత్వం. రాజకీయవాదాలకి, సామాజిక స్పృహకి వ్యతిరేకంగా అనుభూతి కవిత్వం వెలువడింది. ఆత్మానుభూతుల్ని "శుభ్రం"గా వెల్లడించాలనీ, వ్యక్తి వాదానికి లేదా శుద్ధ కళావాదానికి ప్రాధాన్యం ఇస్తూ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, ఇస్మాయిల్, వేగుంటమోహన ప్రసాద్, కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ మొదలైనవారు అనుభూతి కవిత్వం రాశారు. తొలి అనుభూతివాద కవిగా "అమృతం కురిసిన రాత్రి" కవి బాలగంగాధర తిలక్‌ను చెప్పాలి. అనుభూతి కవిత్వం ఆత్మాశ్రయ కవిత్వానికి, అంతర్ముఖత్వానికి చెందుతుంది. అస్పష్టతవుంటుంది. కేవలం స్వప్న కవిత వంటిదనీ, సమాజానికి అంత ప్రయోజనం లేనిదనీ విమర్శకులు వెల్లడించారు. అయినా సీతారాం, సిద్ధార్థ, నామాడి శ్రీధర్, కాశీభట్ల వేణుగోపాల్ మొదలైన వారు అనుభూతి కవిత్వం రాశారు.

పాశ్చాత్య వాదాల ప్రభావం ఆధునిక కవిత్వంపై చాలా వుంది. వ్యక్తి స్వాతంత్ర్యం ప్రధానంగా వెలువడిన వాదం "అస్తిత్వవాదం" (Extentialism) ఆర్. ఎస్. సుదర్శనం, వేగుంట, నిఖిలేశ్వర్, మాదిరాజు రంగారావు వంటివారు ఈ ధోరణిలో కవిత్వం రాశారు. 1947 తర్వాత ఆధునిక కవిత్వాన్ని బాగా ప్రభావితం చేసిన వాదం "ప్రతీకవాదం" (Symbolism) సంవిధాన శిల్పానికి ప్రతీకవాదం ఉపకరించింది. కవి వాడిన ప్రతీకలు తెలిస్తే ఆనందమే, లేకపోతే అస్పష్టత తప్పదు. వస్తువును వ్యాఖ్యానించటానికి, అనల్ప భావాన్ని సంక్షిప్తంగా వివరించటానికి ప్రతీక తోడ్పడుతుంది. ప్రతీకలు కవి భావాలకి సంబంధించినవై వుంటాయి. అంటే వైయక్తికమై వుంటాయి. "సమగ్ర భావమయ ప్రపంచం" ప్రతీకలలో దర్శనమిస్తుంది. ఆరుద్ర "త్వమేవాహం" ప్రతీకాత్మక కావ్యం. శ్రీరంగనారాయణ బాబు, శ్రీశ్రీ, శేషేంద్ర, సినారె వంటివారు ప్రతీకల్ని సమర్థంగా ప్రయోగించారు. ఆధునిక కవి 'ప్రతీక'లు లేకుండా మంచి కవిత్వం రాయలేడని చెప్పదగినంతగా ప్రతీకవాదం వ్యాపించింది.

ఆదునిక కవిత్వంలో భావచిత్రణ లేదా పదచిత్రణ (Imagism) ముఖ్యమైన కవితా శిల్పమైంది. కవిత్వంలో గొప్ప అభివ్యక్తికి ఈ భావచిత్రణ ప్రధానసాధనమైంది. ఇంగ్లాండ్ నుంచి వచ్చిన ఈ "టెక్నిక్"కి ఎజ్రాపౌండ్‌ను చెప్తారు. అతని ప్రభావంతోనే తెలుగులో "ఇమేజిజమ్" ను కవులు సమర్థంగా ప్రయోగించారు. "భావ చిత్రం మనోనయనానికి రూపుకట్టేది. ఇంద్రియ స్పర్శగలది. శబ్దాల ద్వారా రూపుకట్టేది" భావ చిత్రం! కవితా నిర్మాణ సామగ్రిలో పదచిత్రణ ముఖ్యమైంది. పాఠకుడిని ఉత్తేజపరచటంలో, పాఠకుడిలో సంపూర్ణ అవగాహన, అనుభూతి కలిగించటంలో పదచిత్రణ తోడ్పడుతుందిగానీ – ఇక్కడ కూడా అస్పష్టత తప్పదు. డా డాయిజమ్ లేదా విధ్వంసనవాదం అనే ధోరణిలో కొందరు కవిత్వం రాశారుగానీ, ఆదరణ లభించలేదు. పాఠకుల మెప్పు పొందలేకపోయింది. ఫ్రాయిడ్ మనో విశ్లేషణశాస్త్రం (Psychoanalysis) ఆధారంగా ఆధునిక కవిత్వంలో కొంతమంది "అధి వాస్తవికతా వాదం" ప్రవేశపెట్టారు. దీనిని 'సర్రియలిజమ్' అంటారు. అన్వయ రాహిత్యం, అవ్యక్త ప్రేలాపన, అజ్ఞాతంగా ఉన్న వాటిని బహిరంగ పరచడం అధివాస్తవికతా లక్షణం. శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబులు ఈ తరహా కవిత్వం రాశారు. వేగుంట వారి వంటి కవిత్వంలోనూ ఈ ఛాయలు కనిపిస్తాయి. అయితే ఇది కేవలం ప్రయోగవాదం గానే నిలిచిపోయింది.

ఆధునిక కవిత్వంపై హేతువాద ప్రభావమూ కనిపిస్తుంది. "నిర్హేతుకమైన భావాలకూ, ప్రమాణాలకూ తావులేకుండా, యథార్థమైన జ్ఞానాన్ని గుర్తించడమే హేతువాదం" అంటారు. త్రిపురనేని రామస్వామి పద్యాలలో ఈ హేతువాద ధోరణిని వ్యాప్తి గావించారు. దళితవాదంలో హేతుభావాల ఛాయలు కనిపిస్తాయి. నార్ల, ముద్దుకృష్ణ హేతువాద ధోరణిలో రచనలు చేశారు.

మానవుడే అన్నిటికి మూలం. మానవుడి సంక్షేమమే ప్రధానం. వ్యక్తి సమాజానికి బలికాకూడదు. మానవ జీవితం పవిత్రమైంది... అనే భావనలతో మానవతావాద కవిత్వం వెలువడింది. శేషేంద్ర, సినారె, కుందుర్తి, కాళోజీ, పాపినేని శివశంకర్, కొప్పర్తి మొదలైన కవుల కవిత్వంలో మానవతావాదం ఎక్కువగా కనిపిస్తుంది.

సుప్రసన్న, సంపత్కుమార, పేర్వారం జగన్నాథం, నరసింహారెడ్డి అనే నలుగురు కవులు చేతనావర్త ధోరణితో కవితా సంకలనాలు తెచ్చారు. అందుకే వీళ్ళని చేతనావర్త కవులు అంటారు. సంప్రదాయ స్పృహ, దేశభక్తి, ఆధ్యాత్మిక దృష్టి ఈ కవిత్వ లక్షణాలు. విదేశీ 'ఇజాలని" అంగీకరించరు. ప్రగతివాద కవి మార్క్సిస్టు అయి ఉండాలనటం సరికాదంటారు. రాజకీయాలకు అతీతంగా కవి ఉండాలంటారు. "చేతనావర్త కవిత్వం" అనే బృహత్ సంపుటం వెలువడింది. అయితే ఇది కొంతకాలం – ఒక ధోరణిగా పేరు పొందింది తప్ప – దీనివల్ల ప్రభావితులైనవారు, అనుయాయులూ ఉన్నట్టుగానీ, బాగా ప్రచారం పొందిందనిగానీ చెప్పటం కష్టం. కొంతమంది "పైగంబర కవులు"గా "నిరశన కవులు"గా కవిత్వం రాసినా గుర్తింపు రాలేదు.

ఇన్ని ఉద్యమాలూ, ఇన్ని నవీన ధోరణుల మధ్య పద్యకవిత్వం తన స్థానాన్ని పదిలం చేసుకొంది. "నవ్య సంప్రదాయ ఉద్యమం"గా కొందరు ప్రకటించినా దానిని ఉద్యమం అనటం సమంజసం కాదు. ఇదీ ఒక ధోరణి మాత్రమే! ఈ నవ్య సంప్రదాయానికి విశ్వనాథ సత్యనారాయణ నాయకుడు. గడియారం వేంకటశేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, ముదిగొండ వీరభద్రమూర్తి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, ఉత్పల సత్యనారాయణాచార్య, కరుణశ్రీ, పైడిపాటి సుబ్బరాయశాస్త్రి, వానమామలై వరదాచార్యులు మొదలైనవారి కావ్యాలు ఈ నవ్య సంప్రదాయ ధోరణికి చెందుతాయి. జాతీయతకీ, దేశీయతకీ, గత వైభవ సంస్మరణకీ, ప్రాచీన సాహిత్య వైశిష్ట్యానికీ ప్రాధాన్యం ఇస్తుందీ నవ్య సంప్రదాయం. ప్రాచీన

సాహిత్యాన్ని నవీనంగా, పునఃప్రతిష్ఠించాలని చెప్తుంది. పాశ్చాత్య సాహిత్యానికి బానిస కావద్దంటుంది. మన సంస్కృతినీ, వారసత్వాన్నీ గౌరవించాలని హితవు పలుకుతుంది. "జాతీయ దృక్పథం" ఈ ధోరణికి పునాది. రాజకీయాలు లేని సాహిత్య సామాజిక స్పృహకి నవ్యసంప్రదాయ కవులు ప్రాధాన్యమిచ్చారు. అయితే మన గత వైభవాన్ని, మూలాల్ని మర్చిపోకూడదని బోధించే ఈ వాదం ఉద్యమ రూపం పొందలేదన్నది సత్యం. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం ఈ వాదాన్ని వ్యాప్తిచేశారు.

1947 నుంచి ఆధునిక కవిత్వంలో రూప ప్రాధాన్యం గమనిస్తాం. పద్యరూపం ఆధునిక భావజాల ప్రకటనకి సముచిత రూపం కాదని "వచన కవిత" అవతరించింది. ఇంగ్లీషులోగల "ఫ్రీవర్స్" అనేది 'వచన కవిత'గా వచ్చింది. సరళంగా, వాడుక భాషలో, నియమ రహితంగా, స్వేచ్ఛగా రాసే అభినవ రూపంగా 'వచనకవిత' వ్యాప్తి చెందింది. కుందుర్తి "ఫ్రీవర్స్ ఫ్రంట్" ద్వారా వచన కవిత్వోద్యమాన్ని చేపట్టారు. ఇవాళ కవిత్వమంటే వచన కవిత్వమే అన్నంతగా ప్రాచుర్యం పొందింది. "మినీ కవిత్వం" కూడా కొంతకాలం ఉద్యమ స్థాయిలో వెలువడింది. అద్దేపల్లి రామమోహనరావు, రావి రంగారావు, కొల్లూరి , జి.వి.పూర్ణచంద్, గుత్తికొండ సుబ్బారావు మొదలైనవారు మినీ కవిత్వోద్యమ సారథులయ్యారు. వచన కవిత్వాన్ని ఇమేజిజమ్, అస్పష్టత, వచన ప్రాయం... అనే అవలక్షణాలనుంచి మినీ కవిత్వం వచన కవిత్వాన్ని రక్షించింది. వ్యంగ్యం, క్లుప్తతలు ప్రధానంగా వెలువడిన మినీ కవిత్వం కొత్త కవుల్ని తయారు చేసింది. కొల్లూరి "మినీ కవితా విప్లవం" అనే సంకలనాన్ని మొటమగా తీసుకొచ్చాడు. నేటికీ రావి రంగారావు మినీ కవిత్వ ప్రచారాన్ని కొనసాగిస్తూనే వున్నారు.

వచన కవిత్వంలో చెప్పుకోదగిన విశేష పరిణామం "దీర్ఘకవిత". కుందుర్తి కథా కావ్యాలు రావాలని పిలుపునిచ్చినా అప్పటికి ఎవరూ స్పందించలేదు. కథా కావ్యాలతో పాటు ఎక్కువగా దీర్ఘ కవితలు వెలువడ్డాయి. వెలువడుతూ వున్నాయి. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై విశిష్టమైన దీర్ఘ కవితలు వెలువడ్డాయి. తెలంగాణా నుంచి ప్రాంతీయ స్పృహతో చాలా దీర్ఘ కవితలు వెలువడ్డాయి. జూలూరు గౌరీశంకర్, జూకంటి జగన్నాథం, ఛాయారాజ్ వంటివారు దీర్ఘకవితలు (long Poems) బాగా రాశారు. ఆచార్య సి.నారాయణరెడ్డి "ప్రపంచ పదులు" అనే కొత్తరూపాన్ని సృష్టించారు. శారదా అశోకవర్ధన్ మాత్రమే ఈ కవితారూపంలో కవిత్వం రాశారు.

గురజాడా సృష్టించిన "ముత్యాల సరం" రూపంలో కొందరు కావ్యాలు రాశారు. ఆదునిక కవిత్వంలో గేయం ప్రముఖస్థానం ఆక్రమించుకొంది. గేయం, పాట అనే రూపాలు ఉద్యమ కవిత్వానికి ప్రధానవాహికలయ్యాయి. విశ్వనాథ, పుట్టపర్తి, బోయి భీమన్న, సినారె, నాగభైరవ, విద్వాన్ విశ్వం, బాపురెడ్డి మొదలైనవారు గేయ కావ్యాలతో ప్రస్తుతి కెక్కారు. బాలల గేయాలు రాసినవారిలో బి.వి.నరసింహారావు, చల్లా రాధాకృష్ణ శర్మ, మిరియాల రామకృష్ణ, నార్ల చిరంజీవి, మసూనా, కరుణశ్రీ వంటి వారు బాలల గేయాలు రాశారు.

ఉర్దూలో గజల్ కమనీయ కవితాలహరి. అయితే ఆ భాషలో ఎక్కువగా ఈ కవితారూపం శృంగార పరంగా, తాత్త్వికపరంగా వుంది. దాశరథి కృష్ణమాచార్య గాలిబ్ గజల్స్‌ను మొదటగా తెలుగులోకి అనువదించారు. కానీ ఆచార్య సి. నారాయణరెడ్డి తెలుగులో గజల్స్ సొంతంగా రాసి, పాడటమే కాకుండా గజల్ ప్రక్రియకి సామాజిక స్పృహను అద్దారు. జపనీస్ కవితా రూపం "హైకూ" బాగా ప్రచారం పొందింది. "హైకూ" లక్షణాల్ని తెలుగులోకి తీసుకురావటం కష్టం కాబట్టి తెలుగు కవులు ఆ లక్షణాలను పాటించకుండా కేవలం మూడు పాదాలలో హైకూలు రాశారు. గాలి నాసరరెడ్డి, ఇస్మాయిల్, పెన్నా శివరామకృష్ణ, బి.వి.వి.ప్రసాద్ వంటివారు హైకూల సంపుటాలు ప్రచురించి హైకూ కవితారూపానికి వ్యాప్తి కలిగించారు. రావి రంగారావు "సామాజిక హైకూలు" రాశారు. ఏమైనా హైకూలలో ప్రగతిశీల భావాలకి, సామాజిక స్పృహకీ చోటు లేదనే చెప్పాలి.

ఆచార్య ఎన్. గోపి సొంతంగా "నానీలు" అనే కవితా రూపంలో కవితలు రాసి ఎందర్నో ఆకర్షించారు. నానీలు ఇటీవలి కవితారూపంగా స్థిరపడింది. దాదాపు వంద మందికి పైగా కవులు, కవయిత్రులు నానీలు రాశారు. నానీల కవితా సంపుటాలు దాదాపు వందవరకు వెలువడ్డాయి. నాలుగు పాదాలలో 20-25 అక్షరాలతో నానీలుంటాయి. నానీలలో తాత్త్విక చింతనతోపాటు సామాజిక స్పృహ ఉండటం విశేషం.

వచన కవిత్వం ఎంతగా విస్తృతి చెందినా, మరెంతగా ప్రాచుర్యం పొందినా పద్య కవిత్వం వెలువడుతూనే ఉంది. విశ్వనాథ వారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం ఈ కాలంలోనే వెలువడింది. పుట్టపర్తి వారి 'శివతాండవం' ప్రజాదరణ పొందింది.

ఉత్పల సత్యనారాయణాచార్యులు "ఈ జంటనగరాలు– హేమంత శిఖరాలు" కావ్యం ద్వారా పద్యరచనకి కొత్త సొబగులు సమకూర్చారు. జ్ఞానానందకవి, సంపత్కుమార, బేతవోలు రామబ్రహ్మం, రసరాజు, ఆశావాది ప్రకాశరావు, బండ్లమూడి సత్యనారాయణ, అనుమాండ్ల భూమయ్య, నాగభైరవ, ఆచార్య తిరుమల, గరికిపాటి నరసింహారావు, వేముగంటి నరసింహాచార్యులు, కడిమిళ్ళ వరప్రసాద్ మొదలైన వారెందరో పద్య కవిత్వానికి వన్నె చిన్నెలు సమకూర్చి పద్యం తెలుగువాడి నాల్క అని చాటి చెప్పారు. అష్టావధాన, శతావధాన, సహస్రావధానాలు ముమ్మరంగా నిర్వహించబడ్డాయి.

ఈ అరవై సంవత్సరాల తెలుగు కవిత్వం (1947–2007)లో మరొక ముఖ్యమైన ఉద్యమం తెలంగాణా విముక్తి పోరాటం. దేశానికి స్వాతంత్ర్యం లభించినా తెలంగాణా హైదరాబాద్ సంస్థానపు నిజాం నవాబు నిరంకుశ పాలనలోనే మగ్గిపోతోంది. నిజాం దుష్ట, నిరంకుశ పరిపాలనకి వ్యతిరేకంగా కవులు ఉద్యమించారు. దాశరథి, సోమసుందర్, కాళోజీ, ఆరుద్ర, రెంటాల మొదలైన కవులతో పాటు యాదగిరి వంటి ప్రజాకవులు నిజాం వ్యతిరేక కవిత్వం రాశారు. తెలంగాణా సాయుధ పోరాట కవిత్వం ప్రత్యేక స్థానం సంపాదించింది.

భాష విషయానికి వస్తే ఉద్యమాల ప్రభావంతో 'భాషాస్వేచ్ఛ' లభించింది. వ్యాకరణ సంకెళ్ళు విడిపోయాయి. "సారళ్యం" ప్రాముఖ్యం వహించింది. ప్రజాకవిత్వం వల్ల, అభ్యుదయ, విప్లవ, దళిత ఉద్యమాలవల్ల ప్రజల భాషకి, వాడుక భాషకీ, మాండలికాలకీ ఆదరణ లభించింది. కోస్తా మాండలికేతర భాషలలో విశిష్టమైన కావ్యాలు వెలువడ్డాయి. ముఖ్యంగా తెలంగాణా మాండలికంలో విలక్షణమైన, ఉదాత్తమైన కావ్యాలు వచ్చాయి. గత అరవై సంవత్సరాల తెలుగు కవిత్వాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే బహుముఖాలుగా విస్తరిల్లుతోందనీ, ఇతర భాషలలోని కవిత్వం కంటే వస్తుపరంగా భాషాపరంగా ముందు వరసలోనే ఉందనీ, ఈ ఆధునిక కవిత్వం సమాజపరమైన మనిషి మనుగడకోసం, మానవత్వం కోసం పరితపిస్తోందనీ, "కాదేదీ కవితకనర్హం", "కవిత్వమొక తీరని దాహం" అనేవి అక్షర సత్యాలనీ నిరూపిస్తూ దినదినాభివృద్ధి చెందుతోందని తెలుస్తుంది.

12

ప్రపంచీకరణ- తెలుగు నాటకరంగం

సరళీకృత ఆర్థిక విధానం, సాంకేతిక పరిజ్ఞానం, సమాచార పరిజ్ఞానం వల్ల ప్రపంచమంతా ఒక గ్రామంగా మార్చివేయబడటం "ప్రపంచీకరణ" (గ్లోబలైజేషన్) అంటున్నారు. ఒకదేశపు పరిస్థితులను, సమస్యలను మిగతా దేశాలతో అనుసంధానం చేయటం, ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలకు అనుగుణంగా దేశ పరిస్థితుల్ని, ప్రణాళికల్ని మార్చుకుంటూ సరళీకృత విధానాల ద్వారా అభివృద్ధి చెందడం ప్రపంచీకరణ ఉద్దేశం. కమ్యూనికేషన్, సాంకేతికరంగం, వాణిజ్యరంగాలలో ప్రపంచీకరణ వల్ల పురోభివృద్ధి జరిగినా రచయితలు, కవులు, కళాకారులు ప్రపంచీకరణ దుష్ఫలితాలపైనే కలమెత్తారు, గళమెత్తారు. ప్రపంచీకరణ అనేది అనేక కోణాలకు సంబంధించినది కాగా తెలుగు కవులు, రచయితలు, కళాకారులు ప్రధానంగా "సామ్రాజ్యవాదం" పైనే గురిపెట్టారు. ప్రపంచబ్యాంకును తన గుప్పిట్లో పెట్టుకొని వర్ధమాన దేశాలపై, అభివృద్ధి చెందుతున్న తృతీయ ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయిస్తున్న అమెరికా ఆధిపత్య స్వభావమే ప్రపంచీకరణకి మూలకారణమని వీరి అభిప్రాయం.

తెలుగులో కవిత్వం, కథలపై ప్రపంచీకరణ ప్రభావం బాగా ఎక్కువ. ముఖ్యంగా కవులు ప్రపంచీకరణ దుష్ఫలితాలపై తీవ్రంగా స్పందించి కవితలు, దీర్ఘకవితలు రాశారు. అయితే నాటకరంగంపై ప్రపంచీకరణ ప్రభావం తక్కువనే చెప్పాలి. ప్రపంచీకరణ ప్రభావాలను, పరిణామాలను నాటక రచయితలు బాగా పరిశీలించక పోవడం, కొంతమంది పట్టించుకోక పోవడం, పోటీలలో బహుమతులు పొందేలా రాయాలనుకోవడం, ప్రపంచీకరణ ప్రభావంతో నాటకం రాస్తే, ప్రదర్శిస్తే ఆదరణ

రాదేమోనన్న శంక, ఇంకా చెప్పాలంటే స్పాన్సర్స్ దొరకరేమో నన్న దిగులూ.... ఇవన్నీ కారణాలుగా చెప్పవచ్చు.

పాటిబండ్ల ఆనందరావు రచించిన "పడమటిగాలి" నాటకాన్ని ముందుగా పేర్కొనాలి. నాలుగు గంటల పాటు ప్రదర్శించవలసిన ఈ నాటకం కుదింపుతో ప్రదర్శించబడి విస్తృత వ్యాప్తి చెందింది. పల్లెటూర్లు ఎలా విధ్వంసమవుతున్నాయో, ఆధునిక సాంకేతికత, సరళీకృత ఆర్థిక సంస్కరణలవల్ల తమకి తెలియకుండానే రైతులు, కూలీలు ఎలా పతనమవుతున్నారో కనువిప్పు కలిగించే నాటకమిది.

వల్లూరి శివప్రసాద్ "ప్రపంచీకరణ"ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా రాయకపోయినా దాని దుష్పరిణామాలను వస్తువుగా తీసుకొని రాసినట్టు కనిపిస్తుంది. "ఏరువాక సాగాలి" అనే నాటికలో రైతుల అప్పులు, అప్పులు తీర్చటానికి కిడ్నీ అమ్ముకోవటం, ఆత్మహత్యలు చేసుకోవటం చిత్రీకరించబడింది. దీనికి ప్రపంచీకరణకి సంబంధం వుంది. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, రైతులకు ప్రభుత్వం తక్కువ వడ్డీకి ఋణాలివ్వక పోవటం ప్రపంచ బ్యాంకు షరతులు... ఇవే రైతుల ఆత్మహత్యలకు కారణాలని కొందరి విశ్లేషణ. వల్లూరి శివప్రసాద్ రాసిన మరొక నాటిక "హింసధ్వని"లో ఎంసెట్ ర్యాంకులు, ఐ.టి. సాఫ్ట్‌వేర్, విదేశీ చదువుల మధ్య యువత ఎలా వత్తిడులకు గురవుతోందో "హంసధ్వని" రాగంతో ప్రశాంతంగా ఉండవలసిన తరం 'హింసధ్వని'తో డబ్బు మనుషులై పోతున్నారని ఈ నాటిక చెప్తుంది.

గంధం నాగరాజు రాసిన "ఆలోచించండి" నాటకంలో సాఫ్ట్‌వేర్, ఐ.టి. ఉద్యోగాలవల్ల ఆడంబర జీవిత విధానాలు, డబ్బే ప్రాణంగా భావించడం, మానసిక కాలుష్యంలో జీవించడం చూస్తాం. వై.ఎస్. కృష్ణేశ్వరరావు "సంపద" నాటకంలో కూడా ఆర్థిక సంబంధాలనే వస్తువుగా స్వీకరించారు. డబ్బు వ్యామోహం ఎక్కువైన కొద్దీ డబ్బువేటలో మానవ సంబంధాలు మృగ్యమై పోతాయని సందేశం ఇస్తుంది. "సంపద"లో మనిషి తననుంచి తానే దూరమై పరాయీకరణ చెందుతున్నాడనేదే రచయిత వేదన.

ప్రపంచీకరణ పరిణామాలపై వీధినాటకాలు ఎక్కువగా వెలువడ్డాయి. వామపక్ష భావజాలంగల ప్రజానాట్యమండలి, ఆంధ్ర ప్రజానాట్యమండలి సంస్థలు ప్రపంచీకరణకి నిరసనగా వీధి నాటకాలు రాసి ప్రదర్శించడం ఎక్కువ. కొన్ని వీధి నాటకాలకు

రచయితలుండరు. సామూహిక రచయితలుంటారు. లేదా ప్రదర్శిస్తున్న సంస్థ పక్షాన రాయబడుతుంది.

దేవేంద్ర అధిక ధరలు, నూతన ఆర్థిక సంస్కరణలకి వ్యతిరేకంగా "గొర్రెలు తిరగబడతాయి" అనే వీధి నాటకం రాశారు. డంకెల్ ప్రతిపాదనలవల్ల విత్తనాలు కల్తీ కావటం, మొలకెత్తకపోవటం, మొలకెత్తినా చెట్లకి పంట లేకపోవడం (పత్తి, మిర్చి రైతులు), దానివల్ల అప్పులు, ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేవేంద్ర, దాశరథి కలిసి రాసిన "అప్పా?" అమ్మకమా?" ప్రజల్లో స్పందన కలుగజేసింది. జి-7 దేశాలను ఏడు చేపల కథలుగా చిత్రీకరిస్తూ ప్రపంచబ్యాంకు షరతులతో ప్రైవేటీకరణ జరగటాన్ని దేవేంద్ర, దేవి, దాశరథులు కలిసి "చీమ కుట్టింది"లో చూపించారు. ప్రజాసాహితి పక్షాన "డంకెల్ గంటలు" వీధి నాటకం రాయబడింది.

ప్రజానాట్యమండలి అయిదు వీధి నాటకాలను ప్రత్యేకంగా ప్రపంచీకరణను నిరసిస్తూ ప్రదర్శిస్తోంది. "గోవిందా గోవిందా" అనే వీధినాటకంలో ఏడుకొండల్ని కూడా ప్రభుత్వం మింగేస్తుందని చెప్పబడింది. మన నీటిని ప్రయివేటీకరణ చేసి, కార్పొరేట్ సంస్థలకి అమ్మి నీటి వ్యాపారం చేస్తూ సామాన్యుల దాహాన్ని తీర్చలేని విధానంపై రాసింది "వాటర్ వాటర్". మన దేశంలో రెండు లక్షలమంది అమ్మాయిలను అక్రమ రవాణా వ్యాపారం చేస్తున్నారు. మనరాష్ట్రం నుంచీ ఈ వ్యాపారం సాగుతోంది. ప్రపంచీకరణ ప్రభావంవల్ల మీడియామోజు పెరగటం, జీవనం భారమై కొందరు ఈ విధంగా గురి అవుతున్నారు. ఈ వస్తువుతో రాయబడిందే "అపరంజి బొమ్మలు". రియల్ ఎస్టేట్ వ్యాపారానికి బలైపోతున్న సామాన్యులు, మధ్యతరగతి ప్రజల దురవస్థలను చిత్రీకరిస్తూ "భూమికోసం" "కుక్కమూతి పిందెలు" రాయబడ్డాయి.

మొత్తంమీద ప్రపంచీకరణ ప్రభావంవల్ల జానపద కళలు, నాటకరంగం వెనుక బడుతున్నాయి. నాటక రచయితలకి డబ్బు దాహం, కీర్తిదాహం ఎక్కువై సామాజిక స్పృహ తగ్గిపోతోంది. భాషావిషయంలో అంగ్ల పదాలు ఎక్కువవుతున్నాయి. Nativity తగ్గిపోతోంది. కార్పొరేట్ సంస్థలు "స్పాన్సర్" చేయటం మొదలైంది. కవులు, కథా రచయితల్లాగా ప్రపంచీకరణ దుష్పరిణామాలను ధైర్యంగా రాసే నాటక రచయితలూ-ప్రదర్శించే సంస్థలూ బాగా రావలసిన అవసరం వుంది.

13

తెలుగు నాటకాలు - బౌద్ధవాఙ్మయ ప్రభావం

మతప్రభావం సమాజంపై ఎప్పుడూ వుంటుంది. సాహిత్యం కూడా దానికనుగుణంగా వెలువడుతుంది. శైవ, వైష్ణవమతాల ప్రభావం, ముస్లింమత ప్రభావం, క్రైస్తవమత ప్రభావం తెలుగు సాహిత్యంపై చాలా వుంది. బౌద్ధం క్రీ.పూ. 300 నుంచి క్రీ.శ. 600 వరకు ఆంధ్రదేశంలో బహుళ ప్రచారంలో ఉందని చారిత్రకుల నిర్ణయం. ఇప్పటికి మనరాష్ట్రంలో దాదాపు 165 బౌద్ధావశేషాలు లభించాయంటే బౌద్ధ ప్రభావం ఎంత వుందో తేలికగా ఊహించవచ్చు. "నేను చెప్పానని మీరు విశ్వసించవద్దు. చెప్పింది ఆలకించి, ఆలోచించుకొని అనుభవ పరీక్షకు నిలిస్తే దానిని ఆమోదించండి" అని బుద్ధుడు ప్రకటించాడు. హేతువు, విచారణ, విశ్లేషణ, అనుభవాలు ఆధారంగా బౌద్ధం వెలువడింది. కానీ ఆధునిక యుగంలో బుద్ధుని బోధనలు చాలామందిని ఆకట్టుకున్నాయి. హిందువుల్లో చైతన్యం తీసుకువచ్చిన బౌద్ధం సాహిత్యంలో కొత్త వెలుగుల్ని ప్రసరింపజేసింది. అంబేద్కర్ ప్రచారంవల్ల బౌద్ధం అన్ని వర్గాలవారికి వ్యాపించింది. మళ్ళీ కొత్త కోణాలు వెలుగు చూశాయి. బౌద్ధం ఇచ్చిన స్వేచ్ఛ రచయితలకి స్ఫూర్తినిచ్చింది. బౌద్ధం కొంత ఆధారంగా గ్రహిస్తూనే కల్పిత ప్రధానమైన రచనలు వెలువడ్డాయి. తెలుగులో బౌద్ధ ప్రభావంతో వెలువడిన నాటకాలు, నాటికలు కొంచెం తక్కువే అయినా ఎంతోమందిని కొత్త రచనలకి దారి చూపించినది బౌద్ధం అనవలసి వుంటుంది.

తెలుగులో ప్రహసనాలు ఒకప్పుడు బాగా వెలువడ్డాయి. దశరూపకాలలో నాటకం తర్వాత ప్రహసనం వ్యాప్తికెక్కింది. క్రీ.శ.600 నాటి పల్లవ మహేంద్ర విక్రమ వర్మ చెక్కించిన శాసనాలలో "భగవదజ్జుకం", మత్తవిలాసం" అనే రెండు

ప్రహసనాల ప్రసక్తి ఉందంటూ ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో పేర్కొన్నారు (12వ సంపుటం). వీటిల్లో బౌద్ధాన్ని వెటకారం చేస్తూ దూషణ కూడా వుందట. ఈ రెండు ప్రహసనాలను వేటూరి ప్రభాకరశాస్త్రి అనువదించి అచ్చువేశారని (1924లో, 1935లో) ఆరుద్ర పేర్కొన్నారు. తెలుగులో (అనువాదమైనా) బౌద్ధరూపకాలు ఇవే మొదటివని చెప్పవచ్చు.

ఆధునికుల్లో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు "బుద్ధబోధసుధ" అనే నాటకం 1909లోనే రచించారు. బహుశా దీనిని మొదటి నాటకంగా పేర్కొనవచ్చనుకుంటాను. "గౌతమబుద్ధ" పేరుతో అయిదారు నాటకాలు, నాటికలు వచ్చాయి. 'తిష్యరక్షిత' పేరుతో రెండు నాటకాలు, అశోకుడి పేరుతో రెండు నాటకాలు వెలువడ్డాయి. అశోకుడి తత్వాన్ని వివరించే కళింగనాటకం, ధర్మదీక్ష నాటకాలూ వచ్చాయి. బుద్ధుడి నిర్యాణానంతరం 'దంతం'పై 'జగజ్యోతి' అనే నాటకం రాయబడింది. పి.వి. రాజమన్నారు, అజంతా, బౌద్ధ విహారాల నేపథ్యంతో బౌద్ధ ప్రభావితుడైన నాగసుందరుడి ప్రేమగాథను "నాగుబాము"గా రచించారు. రూపనగుడి నారాయణరావు "సౌందరనందం" నాటకాన్ని, సుబ్రహ్మణ్యకవి సంప్రదాయ బద్ధంగా "బుద్ధావతారం" నాటకాన్ని రాశారు. మలయశ్రీ బుద్ధుని జీవిత సంగ్రహాన్ని, "శాంతిపథం"గా రాస్తే ఆత్రేయ "అశ్వఘోషుడు" రాశారు. నాగార్జునాచార్యునికి ప్రాధాన్యమిస్తూ జి.వి. కృష్ణారావు "బొమ్మ ఏడ్చింది" అనే నాటకం రాశారు. ఇటీవల నందమూరి లక్ష్మీపార్వతి వినూత్నమైన పద్ధతిలో "శ్రమణకం" నాటకం రచించారు.

బౌద్ధమత ప్రభావంతో నాటికలు కూడా వెలువడ్డాయి. వీటిల్లో గేయనాటికలు, నృత్యనాటికలూ వున్నాయి. జి.వి.కృష్ణారావు "ప్రతిక్రియ" అనే నాటికను బౌద్ధక్షమకి చిహ్నంగా రాశారు. బేతవోలు రామబ్రహ్మం "సౌందరనందం" అనే నృత్యనాటికను, పోలవరపు కోటేశ్వరరావు 'గౌతమబుద్ధ' యక్షగాన నాటికను, 'భద్ర' అనే గేయ నాటికను రాశారు. అద్దేపల్లి రామమోహనరావు "సంఘం శరణం గచ్ఛామి" అనే వచన కవితా నాటకం రాయడం గమనార్హం.

బెర్ట్రాండ్ రసెల్ "Of the greatest religious of history, I prefer Buddhism, especially it its earliest form, because it has had the smallest element of persecution" అన్నాడు. బుద్ధుని ధర్మమార్గం, సత్యాహింసల బోధన చాలామందిని

చైతన్య పరచింది. బుద్ధని హేతుబద్ధత, నిబద్ధత ధమ్మపథం రచయితల్ని జాగృత పరచింది. అందుకే "గౌతమబుద్ధ" పేరుతో బుద్ధుని గొప్పదనాన్ని వెల్లడించే నాటకాలు వెలువడ్డాయి.

ఆత్రేయ, రూపనగుడి నారాయణరావు, కొండముది గోపాలరాయశర్మ "గౌతమ బుద్ధ" నాటకాలు రాశారు. బుద్ధుని అంతరంగ పరివర్తననూ, ఆత్మపరిత్యాగం, సత్యసంధత, తాత్త్వికత, సామాజిక శ్రేయస్సూ వీరందరూ చిత్రీకరించారు. ఆత్రేయ నాటకం ప్రదర్శింపబడలేదు. కొండముది వారి నాటకం ప్రదర్శించబడినట్టు తెలుస్తుంది. "ప్రత్యక్ష మానవరూపాన్ని సంతోషపరచ లేనివాడు కనుల కందని దేవుణ్ణి సంతోషపెట్టడం భ్రమ" అన్నది ఆత్రేయ సందేశం.

పానుగంటివారి విలక్షణ నాటకం "బుద్ధ బోధ సుధ" రచన 10-10-1909న ప్రారంభమై 10-01-1910న ముగించబడింది. 1910లో రేపల్లె విజ్ఞాన సమాజం వారు ప్రచురించారు. పానుగంటివారి నాటకాలకి రాసినట్టుగానే కూచి నరసింహంగారు దీనికి నాంది, ప్రస్తావనలు రాశారు.

"పరులను దుఃఖంబు చల్లార్చు తఱిని భిన్న
మౌన హంభావమును మాపియాత్మ దోర్చి
తాను సర్వాత్మకుండయి తరుణమార్గమును
గఱపె బుద్ధు డవతార పురుషుండు"

అని సూత్రధారిచేత చెప్పిస్తారు రచయిత. ఈ నాటకంలో పద్యాలున్నా సంభాషణే ఎక్కువ. స్త్రీ పాత్రలు లేని ఈ నాటకం సామెతలతో వాదోపవాదాలతో సాగుతుంది. హాస్యపాత్ర లేని 'సీరియస్' నాటకం ఇది. బౌద్ధంపైగల విమర్శలు-వాటికి సమాధానాలతో రంజుగా సాగుతుందీ నాటకం.

మల్లాది అవధాని ఒక ఐతిహ్యాన్ని ఆధారంగా తీసుకొని "జగజ్జ్యోతి" అనే నాటకం రాశారు. 1939 మార్చి నాటి భారతిలో ప్రచురింపబడింది. సుగతుని నిర్వాణం తర్వాత బుద్ధుని "దంతం" భద్ర పరచటం, కళింగరాజు గుహాశివుడు దంతపురాన్నే నిర్మించాడు. శ్రీకాకుళం దగ్గర 'దంతపురి' వుంది. బుద్ధుని దంతకాంతులే జగజ్జ్యోతి. దీనినెవరూ తస్కరించలేరు. ఆ కాంతిని పోగొట్టే చీకట్లు లేవు. దంతాన్ని బుద్ధుని బోధనకి, కరుణకి ప్రతీకగా గ్రహించి ఈ నాటకం రాయబడింది.

శివరాజు వెంకటసుబ్బారావు అసలు పేరైన బుచ్చిబాబు "తిష్యరక్షిత" అనే బౌద్ధ నాటకాన్ని రెండు అంకాలుగా రాశారు. సహదేవ సూర్యప్రకాశరావుగారు కూడా ఇదే ఇతివృత్తంతో నాటకం రాశారు. నిషిద్ధ ప్రణయం, తిరస్కృత హృదయపు ప్రతీకార వాంఛ, స్త్రీ మానసిక వ్యధ... లను 'తిష్యరక్షిత' నాటకం చిత్రీకరిస్తుంది. నలభై నాలుగు సంవత్సరాల అశోకుడు ఇరవై మూడు సంవత్సరాల తిష్యరక్షితను మూడవ భార్యగా స్వీకరిస్తాడు. వయస్సు పైబడిన భర్తతో యవ్వనోద్రేకంతో ఉన్న యువతి భార్యగా వుంటే కోర్కెలు తీరక మానసిక వ్యధను అనుభవించటం ఈ నాటకంలో చూస్తాం. తిష్యరక్షిత మొదట రాజు తమ్ముడు మహేంద్రని కవ్విస్తుంది. అతడు లొంగడు. తర్వాత సవతి కొడుకు కునాళుని కామించి వెంటబడుతుంది. అతనూ తిరస్కరిస్తాడు. అతని కళ్ళు కుట్రతో పీకించి కక్ష తీర్చుకుంటుంది. అశోకుడు అమె చేసిన నేరాలకు మరణ శిక్ష విధిస్తాడు. అంతకు ముందే తిష్యరక్షిత ఆత్మహత్య చేసుకుంటుంది. తిష్యరక్షిత చేత బుచ్చిబాబు ఇలా అనిపిస్తాడు "ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం నన్ను అనుభవించాడు. ఓపిక తగ్గిన తరువాత మతంపేరు చెప్పి వాంఛను దూషిస్తూ భార్యలను ఖైదీలను చేసి హింసించాడు... మతం మానసిక బలహీనతలను కప్పిపెట్టే ఒక మహాభూతం". బుచ్చిబాబు ఈ నాటకం బౌద్ధం కోసం రాసినట్టు కనపడదు. మతం-సహజాతాల మధ్య ఘర్షణను మనస్తత్వ శాస్త్రం ఆధారంగా వివరించటమే ఉద్దేశంగా భావిస్తాం (కరటూరి సత్యనారాయణ 'తిష్యరక్షిత' కావ్యంలో తిష్యరక్షిత పశ్చాత్తాపం చెందడం, కుణాలుడు మరణదండన శిక్షను రద్దుచేసి ధర్మం స్థాపించడం చిత్రీకరించ బడింది).

బౌద్ధంలో అశోకుడికి ప్రముఖ స్థానం వుంది. హింస హింసను ప్రేరేపిస్తుందని తెలుసుకుని, ప్రజాశక్తికి తలవంచి జ్ఞానోదయంతో ధర్మ అశోకుడయ్యాడు. ఈ గాథ చాలామందిని ఆకర్షించింది. ఆచార్య ఆత్రేయ తొమ్మిది అంకాల "అశోక సామ్రాట్" నాటకంలో చండాశోకుడు, కాలాశోకుడు, ధర్మాశోకుడిగా మారిన తీరును ప్రదర్శించారు. సైనికాధికారులు, తిష్యరక్షిత, అందరూ అశోకుడికి ఎదురు తిరగటం, ప్రజా విప్లవం ముందు అశోకుడు తలవంచటం - తద్వారా మార్పు వచ్చి బాధపడటం ఆత్రేయ నాటకంలో చూస్తాం. భూషణ్‌బాబు అనే రచయిత కూడా "అశోక సమ్రాట్" నాటకం రాసినట్టు ఆచార్య మొదలి నాగభూషణ శర్మ తెలిపారు. చాగంటి సన్యాసిరాజు "అశోక" నాటకం రాసినట్టు తెలుస్తోంది.

అత్రేయ 'అశ్వఘోషుడు' అనే నాటకాన్ని 1947 తర్వాత రాసినట్టుగా తెలుస్తోందని పరిశోధకులు తెలిపారు. రాహుల్ సాంకృత్యాయన్ రాసిన "వోల్గాసే గంగ" నవలలోగల "ప్రభ" కథ ఈ నాటకానికి ఆధారమని చెప్తారు. అశ్వఘోషుడు బ్రాహ్మణుడు. యవనుడైన (మ్లేచ్ఛుడు) దత్తమిత్రుని కూతురు "ప్రభ"ను ప్రేమిస్తాడు. కానీ బ్రాహ్మణ సమాజం వీరి వివాహానికి అడ్డు తగులుతుంది. అశ్వఘోషుడు, ప్రభ ఇద్దరూ బౌద్ధాశ్రమంలో చేరతారు. "సంఘం, శాస్త్రాలు పవిత్ర ప్రేమను బలిగోరుతున్నాయమ్మా" అని తండ్రి అంటే కూతురు "సంఘశ్రేయస్సు కోసం, సమష్టి సౌఖ్యం కోసం వ్యక్తి సుఖాన్ని త్యజించటం త్యాగమవుతుంది" అంటుంది.

డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి 'శ్రమణకం' అనే నవల రచించారు. దీనిని శ్రీ డి.విజయభాస్కర్‌తో కలిసి నాటకంగా రూపొందించారు. ఈ నాటకం ప్రదర్శించబడి రసజ్ఞులమెప్పు పొందింది. శ్రమణకుడు విప్లవ భావాలుగల వాడిగా, బౌద్ధంవల్ల కుటుంబ వ్యవస్థ పతనమవటం సహించలేక గృహస్థులు, స్త్రీలు సంసారం చేస్తూనే బౌద్ధాన్ని ఆచరించవచ్చనీ, కుటుంబ వ్యవస్థ నాశనం కాకూడదనీ, స్త్రీ స్వేచ్ఛగల బౌద్ధం అవసరమనీ ఈ నాటకం తెలియజేస్తుంది. సామాన్యంగా శ్రమణకుడిని బౌద్ధభిక్షువుగా చెప్తారు. కానీ ఈ రచయిత్రి అభ్యుదయ భావాలకు ప్రతినిధిగా చిత్రీకరిస్తారు. భార్యాభర్తలిద్దరూ కాపురంచేస్తూనే బుద్ధ ధర్మాన్ని ప్రచారం చేయవచ్చు అన్నది నాటక సారాంశం. సుందరి ఆవేశంతో ఇలా అంటుంది– "వెళ్ళండి... అందరూ వెళ్ళండి... అందరూ వెళ్ళిపోయి దీక్షలు తీసుకొని బుద్ధునికి దాసులుగా మారిపోండి. ప్రకృతి ప్రసాదించిన అనుభూతుల్ని భూస్థాపితం చేసి, శిలల్లా, శిలాజాల్లా, బతకండి. గుండెల్ని పక్కకు నెట్టి బండల్లా జీవించండి. వెళ్ళిపోండి... ఇలా కాదు మిమ్మల్ని నిందించి ప్రయోజనం లేదు. ఆ బుద్ధుణ్ణే ఎదుర్కొంటాను. జనాభాలో సగమైన స్త్రీలను, ఆకాశంలో సగమైన స్త్రీలను ఒక దండుగా మార్చి, ఒక దండగా మార్చి ఆ బుద్ధునిమీదకే దండెత్తుతాను. అవును దండెత్తి తీరుతాను". చివరగా బుద్ధుడు భరతవాక్యం పలుకుతూ "గృహస్థుల్ని కూడా ఈ రోజు నుండే బౌద్ధంలోకి ఆహ్వానిస్తున్నాను. దంపతులు ఆశ్రమ ధర్మాన్ని అర్థం చేసుకుని అంకిత భావంతో మెలగాలి. బౌద్ధ సిద్ధాంతాల్ని గృహస్థ ధర్మాన్నీ రెండింటినీ ఆచరించ దల్చుకున్నవారికి "శ్రమణకం" అనే కొత్త శాఖను ఏర్పాటు చేస్తున్నాను" అంటాడు. నందమూరి లక్ష్మీపార్వతి కొత్త

ప్రతిపాదనలతో బౌద్ధాన్ని మరింత వ్యాప్తి చెందించటానికి స్త్రీల అభ్యున్నతికి దోహద పడేలా "శ్రమణకం" రచించారు.

నాటకాలతోపాటు బౌద్ధ ప్రభావంతో నాటికలు వెలువడ్డాయని తెలుసుకున్నాం. వీటిల్లో ప్రక్రియా వైవిధ్యం గోచరిస్తుంది. ఆధునికత దర్శనమిస్తుంది.

శ్రీ జి.వి.కృష్ణారావు "ప్రతిక్రియ" అనే నాటికలో ప్రతీకారాన్ని బౌద్ధం ఆధారంగా చెప్పబడింది. మామూలుగా ప్రతిక్రియ ద్వేషంతో కూడుకొని వుంటుంది. కానీ సహనం, అవగాహనలతో కూడా ప్రతిక్రియ ద్వారా శత్రువును లేదా పగను జయించవచ్చని ఈ నాటిక తెలుపుతుంది. బౌద్ధ ధర్మంలో ప్రధాన ఉద్దేశం ఇదే గదా!

1985-86 ప్రాంతంలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం "సౌందరనందం" అనే నృత్యనాటికను గంటసేపు ప్రదర్శించబడేలా రాశారు. భూటాను బృందం ఈ నృత్యనాటికను తిలకించి పరవశించి భిక్షాపాత్రలో "కరెన్సీ" నింపి భూటాన్‌లో ప్రదర్శింపజేశారు.

"పలుకవేస్వామి! ఒక మారు పలుకు మయ్య!
నాల్గక్షరంచెనా మీయన్న? పల్కవేమి?
'నీచురాల! అవలబొమ్మ నీవు' అనుచునైన
పలుకుమా! ఒక తూరి పలుకుమయ్య!"

అంటూ సుందరి దిగులు చెందడం అందర్నీ కంటతడిపెట్టిస్తుంది. సంగీతానికి, నృత్యానికి, సాహిత్యానికి సమప్రాధాన్యం ఇచ్చి రసానుభూతిని కలిగించే నాటిక ఇది.

శ్రీ పోలవరపు కోటేశ్వరరావు "గౌతమబుద్ధ" అనే గేయనాటికను యక్షగానంలా ప్రదర్శించటానికి అనువుగా రాశారు. ఈయన రచించిన "భద్ర" (కుండలకేశిని) విలక్షణమైన నాటిక. గౌతమబుద్ధుని సమకాలీనమైన 'భద్ర' జీవిత గాథను సంగీత, నృత్య రూపకంగా రచించి సంచలనాత్మకమైన ఆలోచనను కలిగిస్తారు రచయిత. భద్ర అహంకారి. సుందరినన్న గర్వం. చివరకు పగను పెంచుకుంటుంది. తెలివిగలదైనా "అహం" (ఇగో) మనిషిని పశువును చేస్తుంది. చివరకు తనను తాను తెలుసుకొని బుద్ధుని శిష్యురాలవుతుంది.

"తప్పు చేయవచ్చు తడబాటు పడవచ్చు
తప్పు తెలిసి మెలగ ధన్యుడగును
నీతి మార్గ మరసి నిర్భీతి పయనించ
శాంతి కలుగు తుదకు సౌఖ్యమబ్బు"

అన్న బుద్ధుని బోధనతో భద్ర శాంతికాముకురాలవుతుంది.

అద్దేపల్లి రామమోహనరావు వచన కవిత్వంలో ప్రతిభావంతుడు. విమర్శకుడు. బుద్ధుని కోణం నచ్చి వచన కవితా రూపంలో నాటకం రాసి ప్రయోగం చేశారు అద్దేపల్లి. 1965లో రాసినా 1998లో ముద్రించబడిన "సంఘం శరణం గచ్ఛామి" నాటకానికి ముందుమాట రాస్తూ అద్దేపల్లి బుద్ధుడి వ్యక్తి చైతన్యం ఎలా సామాజిక చైతన్యంగా మారిందో, వ్యక్తిగత అన్వేషణ లక్ష్యం ఎలా సఫలీకృతం చెందిందో వివరించటమే రచనోద్దేశంగా తెలిపారు. ఎనిమిది అంకాలుగా విభజింపబడిన ఈ నాటకం శైలిలోనూ, భావచిత్రాలలోనూ గాఢమైన అభివ్యక్తిలోనూ విశిష్టతను సంతరించుకుంది.

"ఈ జగత్తును చూస్తున్న నిమిషాన
నాలోని బంధమేదో చుట్టలు విప్పుకుని
వ్యాపిస్తున్నట్లున్నది
నాకు జనాలమధ్య పోతున్నట్లు లేదు
జనాల గుండెల్లోకి దూసుకు పోతున్నట్లున్నది"

అంటూ గౌతమునికి సర్వమానవ జాతిమీదున్న అపారమైన ప్రేమను రామమోహనరావు హృదయానికి హత్తుకుపోయేలా చిత్రీకరించారు. బుద్ధుడొక చైతన్య స్రవంతి అని రచయిత ఉద్దేశం.

ఈ విధంగా బౌద్ధమత ప్రభావం తెలుగు సాహిత్యంలో నాటకరంగంపై కూడా పేర్కొనదగినంతగానే కనిపిస్తుంది. నాటకం, నాటిక, నృత్యనాటిక, గేయనాటిక, వచన కవిత వంటి ప్రక్రియలలో బౌద్ధ ప్రభావంతో రచనలు చేయబడ్డాయి. ప్రాచీన, ఆధునిక ప్రక్రియలకు బౌద్ధం ఒక వస్తువై తెలుగు లో రూపక సాహిత్యం పరిపుష్టమైంది. బౌద్ధాన్ని అంగీకరిస్తూనే, అనుసరిస్తూనే రచయితలు కల్పనకి కూడా అవకాశమిచ్చారు. సమకాలీనమైన ఆలోచనలకి, భావాలకి అక్షర రూపమిచ్చి రూపక ప్రక్రియను ఆలోచనామృతంగా తీర్చిదిద్దారు రచయితలు.

14

తెలుగు 'నుడి'కి 'గుడి' కట్టిన సినారె

"భాషే నేను తెచ్చుకున్న తీయని వరం
భాషే నేను కట్టుకున్న జీవన గోపురం
నా ఇంటి వివృత గవాక్షం భాష
నా కంటి వినిర్మల కటాక్షం భాష"

అని పలికిన ఆచార్య సి. నారాయణరెడ్డి ఆధునిక కవుల్లో ముందువరసకి చెందేవారు. సర్వతోముఖ ప్రతిభాశాలి. బహుభాషాకోవిదులైనాగానీ తెలుగంటే చెప్పలేని మక్కువ. యాభై సంవత్సరాలుగా కాలంవెంట కవిగా తనను తానే బేరీజు వేసుకుంటూ తన కవితా పారిజాతాల సౌరభాన్ని గుబాళింపజేస్తున్న ఒకే ఒకడు - సినారె. అన్ని ప్రక్రియల్లోను, అన్ని ఉద్యమాలలోను, సమ దృష్టిని కలిగి కొత్తతరం కవులతో దీటుగా కవితా రచన చేస్తున్న కవన విశ్వంభరుడాయన.

"తెలుగు కళ్ళకు తెలుసు నా
లలిత కళారూపం
తెలుగిళ్ళకు తెలుసు నా
కలగీతికా దీపం"

అనటంలో తెలుగుదనం వుంది, ఆత్మవిశ్వాసం ఉంది- ధషణాహంకారం వీసమెత్తయినా లేని మానవతావాది సినారె.

సినారె కవిత్వం చదివినా, వచనం పరిశీలించినా, పాట విన్నా, గేయం పాడినా భాషా సౌందర్యం మనల్ని పట్టేస్తుంది. వస్తు, భావాలతోపాటు భాషకి ప్రాధాన్యం

ఇచ్చిన కవి సినారె. సంభాషణలలో కూడా ఒక చమత్కారం, ఒక విరుపు, ఒక చరుపు, ఒక కుదుపు, ఒక మెరుపు లేకుండా వుండదు. భాషమీద అధికారంగల కవులు చాలామంది వున్నారు. అయితే తెలుగు భాషమీద సినారెకి ఉన్న ప్రభుత మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఆ ప్రభుత పాండిత్య ప్రదర్శనకోసం కాదు- భావరామణీయకతకోసం, చమత్ 'కృతి' కోసం. తెలుగు పలుకుబడికిగల చేవని తెలియజేయడం కోసం. కవిత్వంలోనే కాదు సభలలో ఉపన్యసించేటప్పుడు కూడా భాషా సామర్థ్యాన్ని, భాషౌచిత్యాన్ని గమనిస్తాం. తెలుగు భాషలోగల మహత్తరశక్తిని తెలియజేసినవారు సినారె.

శీర్షికలు పెట్టడంలోనే సినారె తన భాషాశక్తిని ప్రదర్శించారు. 'నామౌచిత్యం' అనేది చాలా ముఖ్యం. పుస్తకాలకిగాని, కవితలకి గాని పేరు పెట్టడంలో తెలుగు పలుకుకి ప్రాధాన్యమివ్వడం గమనిస్తాం:

"ఉదయం- నాహృదయం"

"దివ్వెల మువ్వలు"; "మనిషీ- చిలక"

"పగలే వెన్నెల"; "మార్పు నా తీర్పు"

"కవిత నా చిరునామా"; "నడక నా తల్లి"

మొదలైనవి పుస్తకాల పేర్లు. కవితల శీర్షికలలో గుబాళించే తెలుగుదనం కొంత దర్శిద్దాం-

'ఉదయానికి ఉరి', 'సన్నాజాజీ పూలామాలా', 'తొండరగండడు', 'నీకూ నాకూ ఏం పోలిక?', 'జగత్తు మత్తుగా పడుకుంది', 'ఒకే ఒక్క దీపం', 'చిచ్చూ నీ పుట్టిన రోజు', 'కాలం గొంతులో వెలక్కాయ', 'మానవతా! తమాషా చూస్తున్నావా?', 'అది చెట్టే కాదు', 'గొర్రెలు గొర్రెలు'.

సినారె శీర్షిక పెట్టడం దగ్గరనుంచి భాషపై ప్రత్యేకమైన నిశిత దృష్టిగలవారని తెలుస్తుంది. అయితే ఆ భాషాదృష్టి భాషాడంబరం కాకపోవటం విశేషం. భాషకోసం కాదు- భావం కోసం భాషను ప్రయోగిస్తారు. అందుకే కొత్తగా సినారెది 'భావభాష' అనవచ్చు. సినారె శబ్దపరిజ్ఞానం భావ రామణీయకతకీ, శైలీ మనోహరత్వానికి మూలమైంది.

కార్లయిల్ చెప్పిన "Musical Thought" కాల్‌రిడ్జి చెప్పిన "Best words in their best order" అన్నవాటికి సినారె కవిత్వమే కాదు, పాటలే కాదు, వచనం కూడా సాక్ష్యమే!

"పలుకు పలుకులోన తెలుగు, పలికెను పర్జన్యంలా
పదం పదంలోన తెలుగు, ఎదిగెను చైతన్యంలా"

అన్న సినారె మాటలు అక్షర సత్యాలు.

వెనుకటి తరం సినీకవులంతా సాహితీవేత్తలు. ఏ పాట రాసినా సాహితీ పరిమళం గుబాళించ వలసిందే. సినారె కూడా సినిమా పాటలలో తమ 'సత్తా' చూపించారు. తెలుగు పలుకుబడిని పూరా ప్రదర్శించారు. వాడుకభాషా పదాలను వాడారు. ధ్వన్యను కరణశబ్దాలను, నుడికారాన్ని వాడారు. కొత్త పదబంధాలను సృష్టించారు. భావం, శబ్దం, లయ – మూడూ పోటా పోటీగా పరుగులెత్తినా శబ్దం ఒకడుగు ముందే ఉంటుంది. మనల్ని కవ్విస్తుంది. సినారె శబ్దాలు తమ లోతును కనుక్కోమని మనకి సవాల్ విసిరినట్టు కనపడతాయి.

"పగలే వెన్నెల, జగమే ఊయల
కదిలే ఊహలకే కన్నులుంటే"

"తొలిచూపులు నా మదిలో తలుపుతీసెనే
పెదవులపై చిరునవ్వులు నిదురలేచెనే"

వంటి పాటలలో తెలుగు పదాల పోహళింపు – పద చిత్రాల గుబాళింపు మనల్ని పరవశింప జేస్తాయి.

"పదే పదే కన్నులవే బెదరునెందుకు
ఎదో ఎదో చక్కిలిగింత కలిగినందుకు
ఒదిగి ఒదిగి లేతవలపు ఉబికినందుకు"

అన్నప్పుడు పదాల పునరుక్తి, లలిత భావ ప్రకటనకి దోహదకారి అయింది. డా॥ గోపి అన్నట్టు "మౌఖిక సంప్రదాయ పునాదుల్లోంచి వచ్చిన శిష్టకవి. లేత వలపు ప్రయోగం విశిష్టం. హరికథలు తొలిప్రేరణగా ఉన్న కవి" అందువల్లనే

"మల్లీయల్లో మల్లీయల్లో మల్లీయల్లో
మళ్ళీ వస్తావో లేదో మరదలు పిల్లో
వెన్నియల్లో వెన్నియల్లో వెన్నియల్లో
నిన్నూ జూస్తేనే ఒళ్ళు ఝుల్లో ఝుల్లో"

అని జానపద బాణీని పట్టుకోగలిగారు.

"నేనులో ఏముంది, నీవులో ఏముంది?
నేనులో నీవుంది, నీవులో నేనుంది"

ఇలా తెలుగు పదాలను వాడటం అపూర్వం. ఈ పదవైచిత్రి సొగసుతనం తీసుకొచ్చింది. వ్యాకరణం సంకెళ్ళను ఛేదించుకొని తెలుగుదనం ప్రవహించింది. సినారె పాటల్లో 'సొగసుకాడ', జిలుగుపైట, కులుకునడక, కొసరి విన్నానులే, పిండి వెన్నెల, వలపుల సాంబ్రాణి, కువకువ, మిసమిస, అందీ అందని, మబ్బులవాడ, నవ్వులు చిలికిన... మొదలైన తెలుగు పద సంపద ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

'ప్రపంచపదులు', 'కలంసాక్షిగా' (ద్విపదులు) సినారె నూతన సృష్టి. ఎంతటి సంస్కృత పాండిత్యం వున్నా తిక్కన "జాత్యము గామి సంస్కృతమెయ్యెడజొన్పు" అన్నట్టుగా సినారె కూడా అవసరమైతే తప్ప సంస్కృతాన్ని వాడరు. తెలుగుమీదగల మక్కువ అపారం. 'మనభాషలో ఆశక్తి లేకపోతేగదా' అని సినారె మనకి చెప్తున్నారా అనిపిస్తుంది. అంత్యప్రాసలు, ఆదిప్రాసలతోపాటు అంతఃప్రాసల ప్రయోగం సినారె ప్రత్యేకత. ఈ శాబ్దిక సౌందర్యం తెలుగు పదాలతోనే సాధించటం గమనించదగింది.

"నింగి లోతును చూడగోరితె నీటి చుక్కను కలుసుకో
రత్న తత్వం చూడగోరితె రాతి ముక్కను కలుసుకో
మౌన శిల్పం చూడగోరితె మంచుగడ్డను కలుసుకో
మనిషి మూలం చూడగోరితె మట్టి బెడ్డను కలుసుకో"

ఇందులో అంతఃప్రాసతో పాటు అంత్య ప్రాసను కూడా సాధించారు. ఈ ప్రాసల వెనుక అగాధమైన భావనాశక్తి వుంది. దానిలోతును చూడగోరితె సినారె తెలుగుదనాన్ని తెలుసుకో- అనాలనిపిస్తుంది. 'కలంసాక్షిగా'లో ఉన్న ద్విపదులు అలవోకగా పెల్లుబికి వచ్చినవే. స్థిరచిత్తంతో కూర్చొని రాసినవి కాదు. అయినా శబ్దశక్తి ఫలితంగా, లోకానుభవ శక్తి ఫలితంగా వెలువడినట్టు తెలుస్తుంది.

"ఎందుకో అసూయపరులకు నీపై ఏ అపకారం చేయందే
అలా పెరిగిపోయావెందుకు అంగుళమైనా వాళ్ళెదగందే"

అనటంలో వ్యంగ్యవైభవం వుంది. ఈ ద్విపదులలోనే సినారె తెలుగు వైభవం సహజసుందరంగా వ్యాపించింది అనటానికి– 'కురుచబుద్ధి, పుట్టగొడుకు, చచ్చు, జిగేలనిపించే, బజ్జోమంటే, తీసెయ్యాలోయ్, అంతో యింతో" వంటివి నిదర్శనాలు. 'ప్రపంచ పదులు'లో కూడా.

" 'పుచ్చిన నాలుక', 'ముసురు కొచ్చే', 'కొమ్ముకాచే', 'పాచిపట్టిన', 'తేపతేపకు', 'గోళ్ళుగిల్లు కోవటం" వంటి తెలుగు 'సుద్దులు' మన హృదయాల్ని పట్టేస్తాయి.

ఈనాడు మనం మర్చిపోయిన రమణీయమైన తెలుగు పలుకుబడిని సినారె కవిత్వంలో గుర్తించవచ్చు. సినారె కవిత్వంలోగల తెలుగు శబ్ద సంపదపై ఒక "పద ప్రయోగ కోశం" రూపొందితే గానీ సినారె గళంలో ఎన్ని తెలుగు స్వరాలు తరగలెత్తాయో తెలియదు.

సినారె లలిత గీతాలు అమందానందాన్ని కలగజేస్తాయి. 'లయ'కు మరోపేరు నారాయణరెడ్డి. ఆయనకి సమయపాలనే కాదు, పరిపాలనే కాదు– శబ్దపాలన కూడా కొట్టినపిండి. తెలుగు పదాలు సినారె గళంలోంచి, కలంలోంచి 'నేను వస్తాను, నేను వస్తాను' అని ఒకదానినొకటి తోసుకువస్తాయా అనిపిస్తుంది. కొత్త పదచిత్రాలను, పదబంధాలను భావకవులు తీసుకొచ్చారని చెప్తారు. వాళ్ళని సినారె అధిగమించారేమో అన్నంతగా కేవలం తెలుగు పదాలతో వాటిని సాధించారు.

"దరిలేని కడలి కెరలికెరలి ఉరిమి నవ్వేవేళ
వెదురింట తూలి వెర్రిగాలి వేణువయ్యే వేళ
కోరిక కొమ్మకు వేడుక రెమ్మకు కోకిల పుడుతుంటే
నడవని మట్టికి కదలని గుట్టకు అడుగులు పడుతుంటే"

"ఇంకేం కావాలి?" అని తాను పరవశించి ఘనల్ని పరవశింపజేస్తారు. ఇందులో అంత్యప్రాస సరే– వెర్రిగాలి, కోరిక కొమ్మ, వేడుక రెమ్మలు కొత్త పదచిత్రాలు, పదబంధాలు, 'కెరలికెరలి' అనే ద్విరుక్త ప్రయోగం భావస్ఫూర్తికి ఉద్దీపకం.

"ఉనికి లేనివాడవంట– కనిపించని వాడవంట"
"ఆ పూలల్లో ఆ రెమ్మల్లో – ఆ లోయల్లో ఆ పాయల్లో"

వంటివి ఎన్నో సినారె గీతాల్లో "తేనెసోకనోరు తీయనయగు రీతి"గా వుంటాయి. వాడవంట-లో 'అంట' అనేది మాండలిక సొగసుగలపదం. అనుట- అంట అవటం భాషా పరిణామం. మాత్రాచ్ఛందస్సులో అందెవేసిన చేయి కావటంవల్ల, లయబద్ధమైన కవితాత్మ గలవారు కావటంవల్ల గీతాలలో అప్రయత్నంగానే పొదుకొని, చిత్తెపోవ, దిమ్మెత్తి, కిమ్మనక, సైదోడు - నీరుకారు- తరగలెత్తు- కుములు వంటివి పదే పదే ప్రవహిస్తూ వుంటాయి.

వచనకవితలో సినారె ప్రయోగాలు అసామాన్యం. తెలుగు భాష వైభవాన్ని ప్రదర్శించారు. అర్థవంతమైన పదచిత్రాలు, అస్పష్టతలేని భావచిత్రాలు సినారె సొత్తు.

ఎన్ని నుడికారాలో! ఎన్ని నిశ్చయార్థక, ప్రశ్నార్థక, సందేహార్థక, ఆశ్చర్యార్థక వ్యాక్యాలో! మరెన్ని సూక్తులో! ఇంకెన్ని జాతీయాలో! తెలుగు భాష నాడిని పట్టుకొన్న కవి గదా! మరి సాక్ష్యాలు కావాలా - మచ్చుకి:

"క్రమం కాదు పురోగమనం ముఖ్యమని
అలల్ని చూసైనా నేర్చుకోరేమిటి?"
"రానే చేతిలో పసవుంటే
బొగ్గుతో రాసిన అక్షరాలు అగ్గిపుట్టిస్తాయి"
"అమ్మలనే అమ్ముకునే వంచకులకు
అమ్మలుకన్న పసిబొమ్మలొక లెక్కా"
"కాలం ముంగిట్లో నిలబడి
కాలు దువ్వుతుంది"

ఇలాగే చాలా కవితల్లో "మరి గిరి శిఖరాలో!", "గుండె కేంపని?", "అక్షరానువాదమే కదా!" వంటివి సినారె వాచిక సామర్థ్యాన్ని నిరూపిస్తాయి. ఈ నాటకీయ శైలి పాఠకుల్ని ఆత్మీయులుగా చేస్తుంది.

"పిరికిగాలి, చావులోతు, విత్తుకంటికి, కసికడుపులు, నెత్తురు గుజ్జులు, మడత మతులు, వెండితెర వేల్పు..." వంటి పదబంధాలు సినారె తెలుగు నుడికడలి నుండి ఏరుకొన్న కొత్త ముత్యాలే! ఎంత ఎత్తు కెదిగినా సినారె తెలుగు మూలాల్ని, పల్లీకరణని విస్మరించలేని సంస్కారి. లేకపోతే పొర్లి, ఓనమాలు, చేదుకొని, చివికి పోతూ, కుమ్మేస్తూ,

ఒగురుస్తూ, డీలాపడ్డ, సొగసరి, గడసరి, బజ్జో..." వంటివి సమయోచితంగా ప్రయోగించటం సాధ్యం కాదు. గేయ కావ్యాలలో గానీ, 'విశ్వంభర' మహాకావ్యంలోగానీ సినారె రచనా నైపుణ్యం తెలుగు ఎంత కండగల భాషో మనకి విశదీకరిస్తుంది.

కవిత్వంలో మాత్రమే సినారె తెలుగుదనం పరిమళించింది... అనటం పాక్షిక సత్యం. ఆయన పలుకే బంగారం. వచన రచనలో కూడా ఇదే పలుకుబడి, ఇదే తెలుగువాడి, పనివాడితనం దర్శనమిస్తుంది. సిద్ధాంత గ్రంథంలో తళుకులకీ, బెళుకులకీ, సొగసులకీ అవకాశం తక్కువ. విషయ వివేచనకే ప్రాధాన్యం. సినారెకి విషయ వివేచన ఎంతముఖ్యమో శబ్ద వివేచనా అంతే ప్రాధాన్యం. అరువు తెచ్చుకొన్న గుణం కాదు కాబట్టి ఏ ప్రక్రియ చేపట్టినా ఓ పట్టు పట్టడం ఆయన నైజం. "అంగవర్ణన కన్న అంతరంగ వర్ణనకి ప్రాధాన్యం" వంటి వాక్యాలలో చమత్కారం భావప్రకటనాశక్తిని తెలియజేస్తుంది.

గురజాడకి ఉపోద్ఘాతంగా సిద్ధాంత వ్యాసంలోగల ఈ కప్పురపు గుబాళింపు గమనించండి.

"సాహిత్యము ఏ కొందరి సొత్తో యనుకొన్న కాలములో అది ప్రజల సొమ్మని ఉదారముగా పంచిపెట్టిన సౌమ్యశీలి ఆయన. ఆయన చేతి చలువతో అస్పృశ్యముగా పడియున్న వాడుక భాష అందలమెక్కినది. మెత్తని తెలుగు పలుకు కత్తి వాదరవలె మెరసినది. వీధి మానిసికి వేదిక లభించినది".

సినారె వ్యాసాలు గానీ, యాత్రా రచనగానీ, మందారమకరందాలు వంటి వ్యాఖ్యానంగానీ పరిశీలిస్తే సినారె తెలుగు పలుకులోగల జిగిబిగి సువ్యక్తమవుతుంది. జాషువా గురించి చాటుతూ అన్న మాటలివి–

"ఈ పద్యం తెలుగువారి నోటి కెక్కింది
హృదయ కోటికెక్కింది"
"ఇటు రక్తికీ అటు ముక్తికీ
మూలకందమైంది ఈ కందం"
"ఈ పద్యాన్ని పిండితే వచ్చే అర్థం ఆవంత
చదివితే ఉదయించే నాదం కొండంత"

డా॥ ఎన్.గోపి ఎంతో శ్రమపడి సినారెగారి ఛలోక్తులు సేకరించి ప్రచురించారు. సినారె సహజ పాండిత్యం, సమయస్ఫూర్తి, చాకచక్యం వాటిల్లో దర్శనమిస్తాయి. తెలుగు పలుకులలో గల శక్తిని సినారె రుచి చూపించారు. 'శబ్దక్రీడ'లో సినారె అందెవేసిన చేయి. సంస్కృతాంధ్రాంగ్ల పదాలతో గమ్మత్తుగా ఆడుకుంటూ కొత్త గొంతుకతో మనల్ని మత్తు హత్తుకున్నట్టుగా తయారు చేస్తారు. అందులో మనం ఒకింత తుళ్ళిపడతాం. 'నోరూరా' రసానుభూతి పొంది సినారె సొగసరి మాత్రమే కాదు 'శబ్ద గడుసరి' అనుకుంటాం:

"రచన వేళ్ళతో కూడుకున్న పని
ప్రచురణ వేలతో కూడుకున్న పని"

"తిమ్మారెడ్డి తతిమ్మారెడ్ల వలె కాదు"

"పరశురాముడు - పర్సురాముడు"

"విద్వత్కవి- విద్యుత్కవి"

నిత్యం వాకింగ్ చేయటానికి పెట్టిన పేరు- 'గతి వ్రతం'

నఖచిత్ర కారుడిని చూసి - "నఖేనఖే సరస్వతీ"

"పిహెచ్.డి పరిశోధనలు ఎత్తి పోతల పథకంగా
మారడం మాత్రమే కాదు - ఎత్తి రాతల పథకంగా మారాయి"

ఈ ఛలోక్తులలో లోకానుభవం వుంది. వాగ్బాణాలున్నాయి. సినారెకి సామాజిక తపనవుంది. సినారె మాటల పరమేశ్వరుడు. తెలుగు పలుకుల గంధర్వుడు. "ఎక్కడ సినారె వుండునో అక్కడ తెలుగు వెలుగు ఉండును" అనటం స్వభావోక్తి అవుతుంది. సినారె తెలుగు పిలుపు విందాం:

"తేనియలకే తీపిపెంచే తెలుగులో మాట్లాడుకో
తెలుగు జాతి సమైక్యగీతి పదే పదే నువు పాడుకో
నాటి నన్నయ మొదలుగా ఈనాటి యువకవి అవధిగా
తరగలెత్తిన తెలుగు కవితల స్వరం నీలో నింపుకో".

15

మనం జారవిడుచుకున్న కవిగారి 'నుడికడలి'

"పండితుడు, భాషావేత్త, తెలుగు నలువ, సంస్కర్త, దేశనాయకుడు, నటుడు, నాట్యాచార్యుడు, నీతిమంతుడు, విశాఖలో కిరీటం లేని సమ్రాట్టు, ఆయన ఆడింది ఆటగా పాడింది పాటగా సాగిందక్కడ. ఆబాల గోపాలం ఆయన నెరుగని వారు లేరు. ఆయనను ఆరాధించనివారూ లేరు".

ఈ మాటలు మారేపల్లి రామచంద్రశాస్త్రి (1874-1951) గురించి పురిపండా అప్పలస్వామి చెప్పినవి. రామచంద్రశాస్త్రి విశాఖ ప్రాంతంలో "కవిగారు"గా మాత్రమే ప్రసిద్ధులు. "కవిగారు" అనేది ఆంధ్రాభిమానానికి మరో పేరు. చిన్నప్పుడు హైస్కూలులో తెలుగు మేష్టారు "తెలుగు ముక్కలకు వ్యుత్పత్తి ఏమిటి?" అని ఎగతాళి చేశారట! అప్పటినుంచి "తెలుగు తల్లి పెంపు సొంపులు వెల్లడించ"టానికి దీక్షపూనారు. ఈ పద్యాలు కవిగారి దృక్పథాన్ని వెల్లడిస్తాయి.

"ప్రాకృతము సంస్కృతంబును ప్రకృతులనిరి
అకట! తెనుగన్నచో వాని వికృతి అనిరి
ఎన్ని వ్రాతలు చూచిన ఇదియె నిగ్గు
తెనుగునకు బానిసతనంబు తెచ్చియిడిరి"

"సంస్కృతము మహాభాషయై చనునుగాక
ప్రాకృతము గొప్ప బాసయై పరగు గాక
తెనుగు వానికి వికృతి అంచనుట ఎట్లు
తాను ఒకనాటి పలుకయి తనరునపుడు"

ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి సూర్యరాయాంధ్ర నిఘంటువు మచ్చు పదాల పీఠిక వెలువడింది. అందులో "సాధన సామగ్రి చాలమింజేసి" తెలుగు పదాల ఉత్పత్తి, వ్యుత్పత్తులుగా రాయటం విరమించినట్లు ప్రకటించబడింది. అది చూసిన కవిగారు ఎంతగానో నొచ్చుకొన్నారు. ఆయన దీక్ష మరింత దృఢపడింది. "తెలుగు తల్లిని గద్దెనెక్కించుట ఎట్లు?" అని ఆవేదన చెందారు. తెలుగు నుడుల్ని, జాతీయాలను, సామెతలను సేకరించారు. 'పలునాడులలోని పలుకులను' పరిశీలించారు. "పలుకుల పొలకువల తెలియగలరు. దగ్గర బాసలతో, దూరపు బాసలతో తెనుగునకు గల చుట్టరికమును పోల్చి చూచి తెలుగు మేలిమిని వీరు తెలిసికొనినారు. తెలుగు పుట్టువును వెలిపెట్టగల నిఘంటువును రచియింప తలపట్టియున్నారు" అని ఆంగిరస భాద్రపదం–భారతి సంచికలో కవిగారిని గురించి రాసిన మాటలు అక్షరాక్షరసత్యాలు.

ప్రమాణాంధ్ర నిఘంటువును నిర్మించాలని జీవితమంతా వెచ్చించారు. ఆ నిఘంటువుకి "నుడికడలి" అని పేరు పెట్టారు. జైలులో వున్నప్పుడు చిన్న చిన్న కాగితం ముక్కల మీద చిత్తు ప్రతిని తయారు చేసేవారు. అప్పట్లో కాగితం కరువు బాగా ఉండటం వల్ల సేకరించిన నుడుల్ని అకారాది క్రమంలో రాసుకోవటంగానీ, వ్యుత్పత్తులు– సోదర భాషాపదాలను రాసుకోవటంగానీ కాంగ్రెసు రసీదుల, గ్రంథాలయాల రశీదుల, కరపత్రాల వెనుక అక్షరాలా "చీమతలకాయంత" అక్షరాలతో రాసేవారు. ఒక అరటావులో సరిపడే విషయాన్ని చిన్న రశీదు వెనకాలవైపు సరిపెట్టేవారు. వాటిని భూతద్దాల సహాయంతో మాత్రమే తెలుసుకోగలం.

కవిగారి డైరీలవల్ల ఆయన ఈ నిఘంటువు నిర్మాణంలో ఎంత కష్టపడ్డారో తెలుస్తుంది. ఏ ఊరు వెళ్ళినా పదాల సేకరణ, అర్థాల సేకరణ నిత్యకృత్యంగా పెట్టుకొనేవారు. కొన్నిచోట్ల కొందరిని ఈ పనికి నియమించారుగాని అంత ప్రోత్సాహం లభించలేదని తెలుస్తుంది. వేటూరి ప్రభాకరశాస్త్రి, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, తల్లావజ్ఝల, గిడుగు మొదలైన పండితులతో కలసి చర్చించేవారు. ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేవారు. వేటూరి వారి సహకారం బాగా లభించినట్టు డైరీలవల్ల తెలుస్తుంది. పురిపండా, జయంతి సుబ్బారావు కవిగారి శిష్యులే కాబట్టి వారి సహాయం లభించింది. ఎలమంచిలిలో దీని కోసం "తెలుగు నుడి" కార్యాలయం ప్రారంభించారు. విజయవాడలో దానిశాఖ ఉండేదని చెప్తారు. కవిగారి అమ్మా నాన్నలు కొన్ని వ్యావహారిక పలుకుబడుల్ని సేకరించి వివరించేవారు.

నిఘంటు నిర్మాణానికి ముందు కవిగారు ఒక ప్రణాళిక వేసుకొన్నట్టు గమనిస్తాం. ముందుగా 'శరము' (శబ్దరత్నాకరము)లో లేని తెలుగు నుడులు సేకరించారు. వాడుక నుడులు సేకరించి అకారాది క్రమంలో కూర్చారు. 'విద్యార్థుల నిఘంటువు'ను తయారు చేశారు. ద్రావిడ భాషల్లోగల సజాతీయ పదాలను సమకూర్చుకున్నారు. సామెతలు సేకరించి "సామెతల కడలి" మేలు ప్రతిని సిద్ధం చేశారు. సూర్యరాయాంధ్ర నిఘంటువుకు ఎక్కని పదాలను రానుకొన్నారు. "క్రొత్తనుడులు– అసలు నుడులు" అనే నోట్సు తయారు చేసుకొన్నారు. "తెనుగు నుడిదండలు" అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. ఈ పూర్వరంగాన్ని ఏర్పరచుకొని "నుడి కడలి"కి శ్రీకారం చుట్టారు.

ముందుగా "మచ్చునుడులు" ప్రకటించి పండితుల, భాషా వేత్తల అభిప్రాయాలు తెలుసుకోవాలన్న శాస్త్రీయ దృక్పథం కవిగారికి వుంది. కవిగారు నిరుపేద. మచ్చునుడులు అచ్చువేసే తాహతు లేదు. అందుకని ఎలమంచిలిలో గల శ్రీరామలింగేశ్వరాలయంలో 1944 సెప్టెంబర్ 30 నుంచి సత్రయాగం జరుగుతోంది. సత్రయాగ కార్యదర్శియైన ఆకెళ్ళ సూర్యనారాయణకి మచ్చునుడుల సంగతి తెలిసింది. అయన ఎలా సేకరించారోగానీ– డబ్బు సేకరించి సత్రయాగం తరపున 1945 అక్టోబర్‌లో "నుడికడలి– ప్రమాణాంధ్ర నిఘంటువు – మచ్చునుడులు" ప్రచురించారు. మద్రాసు ఆనంద ప్రెస్‌లో ఆరుపుటలలో ఇది ముద్రించబడింది. ఈ "మచ్చునుడులు"కి ముందు మాటలో కవిగారు పలికిన పలుకుల్లో కింది మాటలు తప్పక గుర్తుంచుకోవాలి.

"ప్రమాణాంధ్ర నిఘంటువు లేని లోటు తీర్చుటకే నేను నుడికడలి కూర్పుదలంచితిని. ఇప్పటికి దొరకిన కొంత సజ్జు తోడకూర్చినవే ఈ మచ్చునుడులు. స్వభాషాభిమానులు నుడికడలిలోని మచ్చునుడులు పరికింతురుగాక! అందు ముఖ్యముగా హెచ్చునుడులు, ఉత్పత్తి వ్యుత్పత్తులను ఉండుట గుర్తింతురు గాక! ప్రయోగాదులు పిదప నిందు నుడి దండలో హెచ్చుగా చేరగలవు. నెఱవాదులు నుడికడలికి మెఱుగుతెచ్చు సలహాలే ఒసంగుదురు గాక! తెనుగు తోబుట్టువులారా! మీ తోడ్పాటుతోడనే మీ కొరకు నేను కూర్చుచున్న నుడికడలిపైకి రాగలదను నమ్మకముతో పాటుపడుచున్నాను. నుడికడలి పని మీ పని అనియే తలంచి మీకు తగినట్లు తోడ్పడుదురు గాక!"

కవిగారికి అచ్చ తెలుగు పదాలపై మక్కువ ఎక్కువ. ఇది ఒక్కొక్కసారి 'అతి' అనిపిస్తుంది కూడా. నిఘంటువులో వాడిన సంకేతాలను ముందుగా 'గుర్తుల తెలివిడి' అనే శీర్షికలో వివరించారు:

క్రొ.ను.	–	క్రొత్తనుడి
ఎ.చె.	–	ఎక్కటిచెయిది, అకర్మక క్రియ
చే	–	చేర్పు, ప్రత్యయము
పే	–	పేరునుడి, నామవాచకము
పే. తో.	–	పేరుతోడు, విశేషణము
మా.	–	మార్పునుడి, తద్భవము
స.	–	సరినుడి, తత్సమము
వి.	–	విప్పిడి, అవ్యయము
పొ.చె.	–	పొందిమిచెయిది, సకర్మక క్రియ
గు	–	గుట్టు తెలిమి, వ్యుత్పత్త్యర్థము
నా	–	నాటినుడి.

"నుడి కడలి – మచ్చునుడులు" కరపత్రంలో ఉదాహరించిన కొన్నిటిని పరిశీలిద్దాం:

- అంకినీడు: నా. పే. గు. (అంకి+నీడు) దేశమునకు ప్రభువు.
  - ఱేడు, రాజు (A King)
  - చల్లపల్లి జమీన్‌దారుల బిరుదు పేరు

  ఈ గుర్తుగల నుడులు సూ.ని. (సూర్యరాయాంధ్ర నిఘంటువు)లో కంటె ఇందు హెచ్చు.
- అంకిళ్ళు : నా. పే. దవుడు క్రింది కీళ్ళు

  గు. (అంకిలి+కీళ్ళు) శ.ర.సా (సామెత)– అంకిళ్ళు పడిపోయిన పిదప, అత్తగారూ అరిసెలు కావాలా అని అడిగినదట కోడలు.

  అలమేలు మంగ : నా. పే. వెంకటేశ్వరుని భార్య.

గు. (ఆలరుమేలు మంగ; త. అలర్మేళ్‌మంగై – (తామర) పూవు మీద ఉండునది. మా. రూ. అలమేల్మంగ (మారురూపం)

◆ అనాస : పోర్చు. మా. పే. 1. అనాసమొక్క, 2. అనాసపండు (Pineapple) అనానస్. బ్రే. నానస్

దీని పుట్టుచోట్లు మెక్సికో, పనామా. అనాసమొక్కలు కొండల మీద పెరుగును. అనాసపండు రసము ఆయుస్సును పెంచునందురు.

కురులు : నా.పే. తలవెండ్రుకలు+గు (క.త. కురుళ్ (చురుళ్) – చుట్టుకొను) చుట్టుకొనునవి.

తూర్పు : నా.పే.+గు. ప్రొద్దుపొడుచు దిక్కు. తూర్పు (ఉదయించు) + పు.మ. చుక్కతూఱింది (వా) – వాడుక భాష.

పిల్లి : నా.పే. పులితెగలో చేరిన చిన్న జంతువు. మాంసము తినును. పో.కో.ఒ. బిలేఇ. తూ.బం– బిలాఇ; పాలి. చిలార, బిలాల, బిరాల; హిం–బిల్లా – మగపిల్లి. బిల్లీ= ఆడపిల్లి. (A Cat)

ఈ నిఘంటు ప్రణాళికను గమనిస్తే కవిగారు సోదర భాషలైన తమిళ, కన్నడ మలయాళాది ద్రావిడ భాషాపదాలతోనే కాక గ్రీకు, తుర్క్, పారశి, పోర్చుగీసు, ఫ్రెంచి, బ్రెజిలు వంటి భాషాపదాలతో కూడా పోల్చదలిచినట్టు తెలుస్తుంది. కొన్ని పదాలకి వ్యుత్పత్తులు చెప్పినవారి పేర్లు ప్రక్కనే వే. ప్ర. (వేటూరి ప్రభాకరశాస్త్రి), మ.సో. (మల్లంపల్లి సోమశేఖరశర్మ) అనే విధంగా సూచించి కృతజ్ఞతలు చెప్పారు. అయితే పూర్తిపేర్లు రాయకపోవటం వల్ల చిక్కులు ఏర్పడవచ్చు. అచ్చు వేసిన మచ్చునుదులులో 125 పదాలున్నాయి. బాంబు, బిల్లు, బాజా వంటి అన్యదేశ్యాలను కూడా తీసుకున్నారు. కొన్నిటికి మాత్రమే కావ్య ప్రయోగాలు చూపారు. 'బస్తా' పదం పారసీ నుంచి వచ్చినదని తెలిపారు (కాని పురిపండా ఇది బెంగాలీ పదంగా చెప్పేవారు).

వియ్యంకుడు, అందం మొదలైన దేశ్యపదాలకు వ్యుత్పత్తులు చెప్పారు. 'తెలుగు', 'తెనుగు'లకు కవిగారు చెప్పిన వ్యుత్పత్తులు ఇవి:

తెల్+ఉన్+గు = తెలుంగు – తెలుగు

తెలి(వి)+ఉన్+గు = తెలుంగు

అంటే తెల్లగా ఉండు వారి భాష, తెలివితో ఉండువారి భాష.

(ఈ వ్యుత్పత్తుల్ని భాషా శాస్త్రవేత్తలు అంగీకరించలేదు).

తెలుగు = తెన్+ఉన్+గు = దారిలో ఉండు వారి భాష. ఒక తెన్నుగల వారి భాష. ఇది తెలుగు రూపాంతరము కాదు. త్రిలింగ వికృతి కాదు. ఎక్కటినుడి (తెన్= దక్షిణము, దక్షిణ దేశభాష అని బ్రౌ). బ్రౌణ్య నిఘంటువుకి సంకేతం బ్రౌ.

కవిగారు 'ఇంత' శ్రమించి తయారు చేసిన 'నుడికడలి' చాలా భాగం వరదలు వచ్చినప్పుడు కొట్టుకుపోయింది. రెండు భాగాలు దొరికాయి. ఒక భాగం ఒక మహానుభావుడు తస్కరించాడని పురిపండా చెప్పారు. మరొక భాగం ఆయన దగ్గర ఉన్నది నాకు ఇచ్చారు. ఈ ప్రతి కూడా సిరాతో ఉండటం వల్ల అలికిపోయి "ఎంతో కాలం వుండను" అన్నట్టుగా వుంది. ఈ నిఘంటువును అచ్చువేయడానికి పురిపండా శ్రమపడ్డారు. నేను కూడా కొంత కృషి చేశాను. అయినా ఇప్పటికీ ఈ విలువైన నిఘంటువు భాగం అముద్రితంగానే వుంది తప్ప ముద్రణ భాగ్యానికి నోచుకోలేక పోయింది. అందుకే కవిగారు ఉన్న మాట అన్నారు– "తల్లి పలుకుపై మన్నన ఎల్లరకు ఉండునందురు. అట్టి మన్నన మన తెలుగువారికి పెక్కురకు తెనుగునందు సున్న! ఇది తెలుగుతల్లి నోచుకొన్న కొరనోము పంట!" ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా ఉన్న పండితులు ఆచార్య రవ్వా శ్రీహరిగారికి ఈ నుడికడలి కొంత భాగాన్ని ఇచ్చి భద్రపరచి అవకాశముంటే ముద్రించమని అడిగాను. కాని, ఇంతవరకు ఫలితం శూన్యం!

16

లిఖిత సాహిత్య పత్రికలు

తెలుగు పత్రికలకి సుమారు నూట అరవై సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ శతాబ్దం తొలినాళ్ళలో ఎక్కువగా పండితులూ, కవులూ సాహిత్య పత్రికల్ని నిర్వహించటం గమనిస్తాం. తెలుగులోగల సాహిత్య పత్రికలని ముద్రిత పత్రికలు, లిఖిత పత్రికలు అని రెండుగా విభజించవచ్చు. సాహిత్య సంస్థలు, గ్రంథాలయాలు ప్రారంభమైనప్పటి నుండి లిఖిత సాహిత్య పత్రికలు వెలువడినట్టు తెలుస్తోంది. లిఖిత పత్రికలు 1925-30 ప్రాంతాల నుంచి ఉన్నట్టు తెలుస్తున్నా 1950 నుంచి ప్రాచుర్యం ఎక్కువగా ఉంది. సామాన్యంగా లిఖిత పత్రికలు ఒక జిల్లాకో, ఒక ప్రాంతానికో, ఒక పట్టణానికో పరిమితమై వుంటాయి. మరికొన్ని ఆయా విద్యాలయాలకి, కార్యాలయాలకీ మాత్రమే పరిమితమై వుంటాయి. లిఖిత పత్రికలు చేతితో రాయించేవి కాబట్టి సామాన్యంగా రెండు మూడు కాపీల కంటే ఎక్కువ వెలువడేవి కావు పైగా దస్తూరితో రాయగల లేఖకులు దొరకటం కూడా కష్టమే. అయినా కొన్ని లిఖిత పత్రికలు అచ్చువేసినట్లుగా అందంగా రాయబడేవి. బొమ్మలు కూడా గీయించేవారు. ఆ తర్వాత కొన్ని పత్రికలు టైపు చేయబడేవి. 'జిరాక్స్' వచ్చిన తర్వాత లేఖన సమస్య తగ్గింది. దీనివల్ల ఎక్కువ కాపీలు వెలువడి ఎక్కువ మందికి అందే వీలు కలిగింది. లిఖిత పత్రికలు ఎక్కువగా ఎలా వెలువడతాయంటే-

- సాహిత్య సంస్థల ద్వారా
- గ్రంథాలయాల ద్వారా
- విద్యాలయాలలో విద్యార్థుల ద్వారా

- వివిధ కార్యాలయాలలోని ఉద్యోగుల ద్వారా
- కొంతమంది వ్యక్తుల ద్వారా

వివిధ ప్రాంతాల నుంచి వెలువడిన, వెలువడుతున్న లిఖిత పత్రికల్ని సేకరించగలిగితే దాదాపు వందకు పైగా దొరుకుతాయని చెప్పవచ్చు. అయితే చాలా మటుకు అలభ్యాలవుతున్నాయి. ఇటీవల ఈ లిఖిత పత్రికలు బాగా తగ్గిపోయినా వీటి అవసరం లేకపోలేదు. ముద్రిత పత్రికల్ని నిర్వహించాలంటే ఆర్థిక స్తోమత వుండాలి. విమర్శలకి తట్టుకోవాలి. చందాదారుల సమస్య ఏర్పడుతుంది. ఒకవేళ వున్నా– అటువంటి పెద్ద పత్రికలు, బాగా సర్కులేషన్‌గల పత్రికలు కొత్త రచయితల్నీ, వర్ధమాన రచయితల్నీ ప్రోత్సహించే అవకాశం బాగా తక్కువ. అందుకు ఈ లిఖిత పత్రికల అవసరం వుంది. ఒక్కసారే పెద్ద పత్రికలకి రాయటం కన్నా ఈ లిఖిత పత్రికలలో అభ్యాసం చేయటం మెరుగ్గా వుంటుంది. 'చిన్న' రచయితలకి ప్రోత్సాహం దొరుకుతుంది. వాళ్ళ రచనా శక్తికి మెరుగు పెట్టే అవకాశం లభిస్తుంది. పైగా ఒకే ప్రాంతంలో ఎందరో రచయితలు వుంటారు. అందరి రచనలూ ముద్రిత పత్రికల్లో వెలువడడం సాధ్యం కాదు. వారి సాహిత్య తపనని ఈ లిఖిత పత్రికలు తొలిదశలో రచయితల్ని వెలికిదీసి 'తర్ఫీదు' ఇచ్చాయని చెప్పవచ్చు. లిఖిత పత్రికల ద్వారా పత్రికా రంగంలో రాణించిన వారూ వున్నారు. ముందు లిఖిత పత్రికల్ని నిర్వహించి, ఆ తర్వాత ముద్రిత పత్రికల్ని బాగా నిర్వహించినవారూ ఉన్నారు. లిఖిత పత్రికలలో కొన్ని సాహితీ, శారద, ప్రతిభ వంటి పూర్వ సాహిత్య పత్రికల స్థాయిని తలపించేవి కూడా వున్నాయి.

సాహిత్య సంస్థలు నిర్వహించే లిఖిత పత్రికలకి ఒక స్థాయి కనిపిస్తుంది. ఎందుకంటే అప్పట్లో సాహిత్య సంస్థల నిర్వాహకులుగానీ, సభ్యులుగానీ సాహిత్య జ్ఞానం, రచనా నైపుణ్యం గల వారై వుండేవారు. సికింద్రాబాద్‌లో నెల్లూరి కేశవస్వామి, బూర్గుల రంగనాథరావు, భాగి నారాయణమూర్తి, జమ్మలమడక సూర్యప్రకాశరావు మొదలైనవారు 'సాధన సమితి' అనే సాహిత్య సంస్థను వైభవంగా నడిపేవారు. ఈ సంస్థ తరఫున "ప్రత్యూష" అనే లిఖిత పత్రిక వెలువడేది. ఈ పత్రికకి ప్రధాన లేఖకుడిగా విష్ణుభట్ల కామేశ్వరరావు ఉండేవారు. చాలా అందమైన దస్తూరితో ఉండేది. సాహిత్య సంస్థ సభ్యులే సంపాదకవర్గంగా ఉండేవారు. చాలా విలువైన సాహిత్య

వ్యాసాలు, కవితలు, ఏకాంకికలు, కథలు ఉండేవి. కథలకి బొమ్మలు కూడా వేసేవారు. మధ్య మధ్య 'జోకులు' ఉండేవి. 1940–55 ప్రాంతాలలో 'ప్రత్యూష' సంచికలు బాగా వెలువడేవి. పిల్లలమఱ్ఱి హనుమంతరావు, వెల్దుర్తి మాణిక్యరావు ప్రభృతుల కలం ఈ పత్రిక ద్వారానే పదునెక్కింది. తెలంగాణాకి సంబంధించిన యువకులకి 'ప్రత్యూష' ప్రోత్సాహాన్నిచ్చింది.

"అధునాతన సనాతనాంధ్ర సాహిత్య సుధాపాత్ర"గా 1940–46 ప్రాంతంలో పిఠాపురం నుంచి "అక్షయపాత్ర" అనే లిఖిత సాహిత్య పత్రిక వెలువడేది. సోమసుందర్ సంపాదకులుగా బుజ్జాయి చిత్రకారుడిగా ఈ పత్రిక సాహిత్య విలువలతో వెలువడేది. దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేంకటపార్వతీశ కవులు, సోమసుందర్, రాంషా, పాలగుమ్మి పద్మరాజు, కరుటూరి సత్యనారాయణ, వింజమూరి శివరామారావు వంటి వారి రచనలు ఈ పత్రికలలో కనబడతాయి. ఇందులోని చాలా రచనలు అచ్చుకాకుండా వెలుగుచూడకుండా వున్నాయి. పాలగుమ్మి పద్మరాజు రచించిన 'కట్నం' అనే నాటిక ఇంకా ముద్రితం కాలేదని అనుకుంటాను. మొక్కపాటి నరసింహశాస్త్రిగారి కుమారుడు సుబ్బారాయుడుగారు కూడా మంచి కథకుడని "కష్టాలు" అనే కథ ద్వారా తెలుసుకుంటాం.

"అలవలీమనోజ్ఞ మృదులాధర హాస వసంత భృంగవం

శీలలితా రవోన్మిషితశీకరముక్త లతాంత..." అనే శైలిలో అద్భుతంగా పద్యాలు చెప్పిన పెన్మెత్స వరాహాలరాజును అక్షయపాత్రలో చూస్తాం. సామర్లకోటకు చెందిన ఈ వరహాల రాజు అప్పటికి పందొమ్మిది సంవత్సరాల వికలాంగుడైనా గొప్ప ప్రతిభావంతుడని సోమసుందర్ వివరించారు. సోమసుందర్ రచించిన "వసంత విలాసము" అనే రూపకం (ఇప్పటికీ అముద్రితం) ఇందులో చదివి ఆనందిస్తాం. 'రాంషా' అనగానే చాలామందికి 'అభిసారిక' మాత్రమే గుర్తుకు వస్తుంది. ఆయన నవీన భావాలుగల కవి అని ఆనాటి రచనలు తెలుపుతాయి.

"ఒకరి కావ్యాల దూషించు నొకరు జగతి
నింద్య జీవిత మిట్టుల నిలపువార
లెన్నటికి గారు కళల బోషించు వారు"

వంటి పద్యాలతో ఈ రాంషా అనబడే దర్భా వెంకటరామశాస్త్రి రచించిన "దివ్యాలోకము" ఈ సంచికల్లో చూస్తాం. బూరుగుల సుబ్బారావు రచించిన "సాహిత్య చట్రం" అనే వ్యాసం ఇప్పటికీ కొత్తగానే వుంటుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన-రచనలు 'అక్షయపాత్ర'లో చాలా వున్నాయి. దేవులపల్లి రాస్తున్న "నయనోల్లాసం" అనే ప్రబంధం నుంచి స్వీకరించిన "వసంత వర్ణనము" అనే శీర్షికతో కొన్ని పద్యాలున్నాయి. అన్నిటికన్న విశేష రచన దేవులపల్లి వారి "అభినవ వేమన" పద్యాలు. ఇవి ప్యారడీ పద్యాలు.

"ఒక్క నోటు బుక్కు ఒక బుక్కు కవి వాక్కు
కలపి రుబ్బి రుబ్బి అలికి అలికి
అతడు పీఠమెక్కి యాచార్యుడయ్యేరా
విశ్వదాభిరామ వినురవేమ!"

వంటి పద్యాలు మొదట ఇందులోనే వచ్చాయట! ఆ తర్వాత 'యువ' పత్రికలో అచ్చయ్యాయి (శ్రీశ్రీ సిరిసిరిమువ్వ శతకానికి ఇవి 'ఇన్స్పిరేషను' అని సోమసుందర్ ముఖాముఖీగా అన్నారు).

బి.వి.సింగరాచార్య, బొడ్డు బాపిరాజు, సామవేదం జానకి రామశర్మ, శంకర శ్రీరామారావు కొనకళ్ళ, వేమూరి ఆంజనేయశర్మ మొదలైన వాళ్ళతో 1939లో ఏలూరులో "సాహిత్య మండలి" అనే సంస్థ స్థాపించబడింది. ఇది చాలా ప్రసిద్ధి చెందిన సంస్థ. ఈ సంస్థ "శ్రావణి" అనే లిఖిత పత్రికను నిర్వహించేది. బి.వి.సింగారాచార్య, సామవేదం జానకి రామశర్మలు సంపాదకులుగా మాసపత్రికగా వెలువడేది. ముదుంబి నరసింహాచార్యులు లేఖకులుగా, మొక్కపాటి కృష్ణమూర్తి చిత్రకారునిగా ఉండేవారని సంపాదకవర్గ సభ్యులైన పైడిపాటి సుబ్బరామశాస్త్రి తెలిపారు. ఆ తర్వాత 1943లో చతుర్థవార్షిక సంచికగా ముద్రిత పత్రిక వెలువడింది. శ్రావణి లిఖిత పత్రికలు దొరకలేదు.

రాజమండ్రి నుంచి వెలువడిన "వివేకవర్ధిని" లిఖిత పత్రిక చాలా ప్రాచుర్యం చెందింది. కందుకూరి వారి పత్రికను స్ఫూర్తిగా తీసుకొని 16.4.1967లో "ఆంధ్రకేసరి యువజన సమితి" ఈ పత్రికను ప్రారంభించింది. ఇటీవలి వరకు (అప్పుడప్పుడైనా) వివేకవర్ధిని వెలువడుతూ ఉండేది. 1969లో కొన్నాళ్ళు త్రిభాషా లిఖిత పత్రికగా

వెలువడేది. మొదట్లో మాసపత్రికగా, తర్వాత త్రైమాస పత్రికగా వుండేది. ఆ తర్వాత కాల నియమం లేకుండా వెలువడేది. సాహితీవేత్తల జయంతులకీ, వర్ధంతులకీ వెలువడిన ప్రత్యేక సంచికలు విలువైనవి. ఈ పత్రికలలోని విశేషం ఏమిటంటే కొన్ని రచనలు రచయితల 'స్వదస్తూరి'తో వుండటం. ఇతర సాహిత్య పత్రికలలోగల కొన్ని విలక్షణమైన, విశేషమైన రచనల్ని సేకరించి ఇందులో రాసేవారు. ఇప్పటికి దాదాపు అరవైకి పైగా సంచికలు వెలువడడమే కాదు– ఇప్పుడు పరిశీలించటానికి వీలుగా భద్రపరచబడ్డాయి కూడా. ఒక్కొక్క పత్రికకి ఒక్కొక్కరు సంపాదకులుగా వుండేవారు.

"ఒక్కటి యున్ననింకొకటి యుండదు నేటి కవీంద్రులందు నీ
దృక్కవులందు సర్వమమరించును దైవము, పాండితీ పరి
స్పుక్కమనీయ ధారయు వరిష్ఠముగా లలిత్వమున్ గడున్
పెక్కువగాగ నుండిన కవి ప్రభువీయన యంచు జెప్పెదన్"

అని మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిపై విశ్వనాథ చెప్పిన పద్యం వివేకవర్ధినిలో వుంది. మూర్తిశ్రీ చాలా బాగా రాసిన 'ఆంధ్రకేసరి ప్రకాశం' అనే బుర్రకథ కనిపిస్తుంది. కేవలం రాజమండ్రి ప్రాంతం వారి రచనలే కాకుండా తెలికిచెర్ల వెంకటరత్నం, మొక్కపాటి, విశ్వనాథ మొదలైన ఇతర ప్రాంతాల రచయితల రచనలకి కూడా అవకాశం కల్పించేవారు.

తూర్పుగోదావరి జిల్లాలో ఆత్రేయపురం గ్రామంలో కొంత మంది యువకులు "స్నేహలత" సంస్థని 1978లో ప్రారంభించారు. బాపు, ముళ్ళపూడి మొదలైనవారు ప్రారంభసభలో పాల్గొన్నారు. మత్స వెంకట సత్యసూర్యనారాయణ (పండితులు, పద్యకవులు), ఎం.వి.రమేష్, బి.ఎన్.మూర్తి (బ్నిం) సంపాదకులుగా "స్నేహలత" అనే లిఖిత త్రైమాసిక పత్రిక వెలువడేది. ఈ సంచిక సర్వాంగ సుందరంగా, అందరూ చదివేలా, యువరచయితలకి కరదీపికలా వెలువడడానికి ముఖ్యకారుడు 'బ్నిం'. ''వనీసౌందర్యము 'స్నేహలత'లో గోచరించినది. లిఖితవత్రిక చాలా బహిరంతస్సుందరముగా ఉన్నది" అని మధునాపంతుల కూడా ప్రశంసించారు. అద్దేపల్లి రామమోహనరావు, రసరాజు, పెమ్మరాజు గోపాలకృష్ణ, ఆసు రాజేంద్ర, నల్లా నరసింహమూర్తి, వాసా ప్రభావతి మొదలైన వాళ్ళ కవితలు ఇందులో కనిపిస్తాయి. నల్గొండ, నూజివీడు, రాజమండ్రి, హైదరాబాద్‌లకి చెందిన కవయిత్రులు, రచయిత్రులు

'స్నేహలత'లో కనిపిస్తారు. స్త్రీల రచనలకి ప్రాధాన్యమిచ్చిన లిఖిత సాహిత్య పత్రికగా చెప్పవలసి ఉంటుంది. కవితలతో పాటు కథలు, వ్యాసాలు, స్కెచ్‌లు వున్నాయి. నీలాప్రియ పేరుతో బ్నిం చురుక్కు మనిపించే మినీ కవితలు రాశాడు:

ఉల్లకల్లోలం	ఐస్‌వాటర్
నిశ్చలమైన నిర్మలమైన	విస్కీలో కలిపి
నీ మనోకాసారంలోకి	నువ్వు తాగే
గజగమన	ఐస్‌వాటరు
స్నానానికి ప్రవేశించిందా	ఇంటి దగ్గర ఏడుస్తున్న
గోవిందో... గోవిందా!	నీ భార్య
	'ఐ'స్ వాటరు!

వేమనకి అంకితమిచ్చిన ఓ ప్రత్యేక సంచికలో వేమన పద్యాలకి వ్యాఖ్యాన ప్రాయంగా సమకాలీన వ్యవస్థను చిత్రిస్తూ బ్నిం వేసిన కార్టూన్‌లు అలరిస్తాయి. రచయితలకి బొమ్మలు వెయ్యడం, కవితా పోటీలు నిర్వహించడం, ఆధునిక కవిత్వానికే ప్రాముఖ్యమివ్వడం 'స్నేహలత' ప్రత్యేకతలు.

పాఠశాలల్లో, కళాశాలలోనే అధ్యాపకుల ఆధ్వర్యంలో విద్యార్థులు లిఖిత పత్రికల్ని నిర్వహించటం గమనిస్తాం. కొన్ని విశ్వవిద్యాలయాలలో తెలుగు శాఖ తరపున లిఖిత పత్రికలను వెలువరించడం ఉంది. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినీ విద్యార్థుల రచనలు కూడా వీటిలో చోటు చేసుకుంటాయి. ప్రసిద్ధ కథకులు, సంపాదకులు వీరాజీ విద్యార్థిగా వుండగా విజయవాడ మునిసిపల్ హైస్కూలులో "మిత్ర" అనే లిఖిత పత్రికను నిర్వహించారు. కోనసీమలోని విద్యాలయాలలో ఈ లిఖిత పత్రికలు ఎక్కువని తెలుస్తోంది. వీరపల్లిపాలెం గ్రామంలోని హైస్కూల్‌లో యు.ఆర్. అవధానులు ప్రధానోపాధ్యాయులుగా వుండగా వి.వి.బి.రామారావు, ఆకెళ్ళ సుబ్బారావు ప్రభృతుల ఆధ్వర్యంలో "బాలభారతి" అనే లిఖిత పత్రిక వెలువడేది. వక్కలంక రామారావు 'ఆధునిక ఆంధ్ర రచయితలు' అనే వ్యాసంలోని ఈ అభిప్రాయం గమనించదగినది. "ఈమె సినిమా కథల బాణీలో నవలలు రాయటం ఈ నీరసస్థితికి కారణం కావచ్చు. ఈమె నవలల్లో చాలా సన్నివేశాలు కృత్రిమంగా వుంటాయి" ఇది కౌసల్యాదేవి నవలలపై విమర్శ.

2-2-1969న వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారిచే ఆవిష్కరింపబడిన ఈ 'బాలభారతి'లో 9వ తరగతి, ఎన్.ఎన్.ఎల్.సి. విద్యార్థుల రచనలు ఆకట్టుకుంటాయి. కె.నరసింహారావు అనే డ్రాయింగ్ మాష్టారు బొమ్మలు వేసేవారు. "Fortune favours foods", "One Flower make no garland", "The tree is known by its fruits" మొ॥ అంగ్ల సూక్తులు ఆలోచనాత్మకంగా వుండేవి. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో గల బాలికోన్నత పాఠశాల నుంచి వెలువడిన "శారద" లిఖిత వార్షిక సంచికలు, ఆకర్షణీయంగా, వైవిధ్యంగా వుండేవి. వక్కలంక రామారావు, కమలదీవనమ్మ మొదలైన వారి అధ్వర్యంలో వెలువడే ఈ సంచికల మార్పు, చిత్రలేఖనాల బాధ్యత అప్పటి విద్యార్థి వక్కలంక కిషోర్ (ఇప్పుడు ఎబిఎన్ ఛానల్‌లో పనిచేస్తున్నాడు) నిర్వహించేవాడు. విద్యార్థులు కాపీ కథలు, పాఠ్యపుస్తకాల లోని కథలు రాసేవారని సంపాదకులు హెచ్చరించేవారు. "విద్యార్థినులలో అజ్ఞాతంగా దాగి వున్న రచనా వ్యాసంగాన్ని చిత్రకళాభిరుచి వెలికితీయటం శారద ఆశయం" అని ప్రకటించారు.

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఏ జాబ్ చేసినా
పొగడవమ్మా చెల్లి మీ పాఠశాలను
మరువకమ్మా తల్లి మీ ఉపాధ్యాయులను"

అనే ప్యారడీ రచనలు కూడా కనిపిస్తాయి.

అమలాపురం ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో 'తరుణ భారతి' అనే లిఖితపత్రిక వెలువడింది. తెలుగు లెక్చరర్లు, స్పెషల్ తెలుగు విద్యార్థులు దీనిని నిర్వహించారు. సిహెచ్.కె. రాజు అనే బి.ఏ. విద్యార్థి-

"అనుభూతుల సముద్రంలో
పుట్టిన చందమామ - నా చెల్లి
మానవతామూర్తులు మమతల మల్లెలు తప్ప
మలినమంటే ఏమిటో తెలియని
అమాయకపు తల్లి - నా చెల్లి"

అనే విధంగా మంచి కవితలు రాసేవాడు. తెలుగు అధ్యాపకులు వి.చక్రపాణిరావు నిర్వహణలో 'తరుణభారతి' వెలువడింది. ఆయనే లేఖకుడు. 'మార్గశీర్ష' ఒక సంచికలో 'భజనగీతం' పేరుతో వ్యంగ్యంగా ఇలా రాశారు–

"అప్పుడి తిప్పుడి తాండ్ర
అల్లిబిల్లి తాండ్ర
మా వాడు రాసిందె మా దొడ్డ కావ్యం
మా వాడు చెప్పిందె మా కెపుడు శ్రావ్యం
మా కెదురు లేరెవరు ఏ బెదురు లేదు
మా అడుగుజాడలో 'ఎవ్వార్డు' పోదు
మా భజన గీతాలు యువతకే జూకాలు
మాకు సమ్మానాలు నవతకే బాకాలు
జో జో గుయ్ గుయ్
జో జో గుయ్ గుయ్".

ఇటువంటి తరుణ భారతి మూడు సంచికలతోనే ఆగిపోయింది. సంస్థలతో, సంఘాలతో సంబంధం లేకుండా కొంతమంది వ్యక్తులు స్వయంగా లిఖిత సాహిత్య పత్రికల్ని నడపటం కూడా గమనిస్తాం. మచిలీపట్నం నుంచి గొర్తి జానకీరామశర్మగారు "ఆంధ్రవాణి" అనే లిఖిత పత్రికను 1954–56 సంవత్సరాల మధ్య వెలువరించారు. పంచాంగం వేంకటనరసింహాచార్యులుగారు వీరికి సహకరించే వారు. అద్దేపల్లి రామమోహనరావు అప్పట్లో పద్యరచనా నైపుణ్యం కలవారని 'ఆంధ్రవాణి'లోని "సూనశరుడు" పద్యాలు సాక్ష్యమిస్తాయి. ఒక పద్యం–

"అందములోన నీకు సరియౌ పురుషుండు జగాన లేడటం
చందురు, కాని కండ్లగాన జాలము నిన్నలనాడు రుద్రు మో
హాంధుని చేయనెంచియు, తదక్షివినిర్గత ఘోరవహ్నికిన్
చందము గొలుపోయితివి శాశ్వత మానసచారి! మన్మథా".

ఈ ఆంధ్రవాణిలో పద్య, గేయ రచనలతో పాటు కథలు, సంభాషణాత్మక రూపకాలు రచింపబడేవి.

రాజమండ్రి నుంచి నాళం కామేశ్వరరావుగారు వ్యయ ప్రయాసలకోర్చి "కౌముది" అనే లిఖిత పత్రికను నడిపేవారు. "మేం నిజంగా గర్వపడాలి. ఎందుకంటారేమో, ఇలా వినండి. ఏ కాగితం ముక్కా దొరకని ఈ కరువు రోజుల్లో తెల్ల కాగితాల మీద అందమైన వ్రాతలతో యథాప్రకారంగా మా కౌముది 6వ సంచికని వెలువరించడం గర్వపడదగ్గ విషయం కాదూ? అందులోనూ బంగారయ్య గారూ, తిలక్‌గారు, సూర్యప్రకాశరావుగారు, బుచ్చిబాబుగారు మొదలగు విఖ్యాత రచయితలు దయతో ఇచ్చిన రచనల వలన మా కౌముదీ ప్రకాశం ఇనుమడించింది" అని నాళం కామేశ్వరరావు సంపాదకీయంలో పేర్కొన్నారు.

"దేవుడా! కాఠిన్య హృదయుడా
ఆర్తనాదం
సంధ్యారాగపు సముద్ర ఘోష
విరహిణీ హృదుల మృదుల తాపం
విరక్తి పొందిన కుసుమ విరాగం
ఆశలు వీడిన ఆంధ్ర ప్రతాపం
విన్నావా, కన్నావా!
విరసే పూలను తురుముతున్నావా!
అనాథల వేదన ఆలకించవా
సంఘ దౌర్జన్యం నిర్మూలించవా
దేవుడా, పాషాణ హృదయుడా!"

అనే విధంగా పొన్నాడ వెంకటేశ్వరరావు రచించారు. అభ్యుదయ భావాలకు కౌముది వేదికగా ఉందని తెలుస్తుంది. నండూరి రామమోహనరావుగారి విజ్ఞానశాస్త్ర నాటిక కూడా ఒక సంచికలో ఉంది.

భద్రాచలం దగ్గర గల సత్యనారాయణపురం నుంచి డాక్టర్ చింతలపూడి వెంకటేశ్వర్లు నాలుగు పుటల లిఖిత పత్రిక "తెలుగు లిపి"ని నిర్వహించేవారు. తెలుగు లిపిని గురించి, లేఖన చిహ్నాలను గురించి, లిపి సంస్కరణ గురించి చిన్న వ్యాసాలతో, ఒక కవితతో వెలువడేది. సాహిత్య సభల సమాచారం కూడా ఇచ్చేవారు. 'లిపి'పై

ప్రత్యేకమైన శ్రద్ధతో ఒక లిఖిత పత్రిక– వెలువడటం తెలుగులో ఇదే మొదలు. 'నాకు నేనే ఓ మానిఫెస్టో' అనే భద్రాచలం శశితేజ్ కవిత విశిష్టమైనది.

పిఠాపురంలో "సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం", రాజమండ్రిలో "శ్రీరామ బాలభక్త పుస్తక భాండాగారం", "సీతంపేట గ్రంథాలయం", విజయవాడలో "రామమోహన పుస్తక భాండాగారం" లిఖిత పత్రికలు నిర్వహించేవి. కొన్ని ఉద్యోగ సంఘాలు, కర్మాగారాలలోని సాంస్కృతిక సంఘాలు లిఖిత పత్రికలను వెలువరించాయి. వీటిల్లో విజయవాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు నడిపిన "కృష్ణవేణి" పత్రికను పేర్కొనవచ్చు. నంద్యాలలోని సూరన సారస్వత సంఘం కూడా ఒక పత్రిక నిర్వహించింది. గుంటూరు నుంచి డి. ప్రభాకర్, సుగమ్ బాబు, ఆకుల వి. పానకేశ్వర రావు ప్రభృతులు "జీవని" అనే లిఖిత పత్రికని తీసుకువచ్చేవారు. మధునామూర్తి రాజమండ్రి నుంచి రచయితల చేతిరాతలతో లిఖిత పత్రికని నడిపేవారు. మిరియాల రామకృష్ణ అధ్యాపకులుగా వివిధ కళాశాలలకు వెళ్ళినప్పుడు "ఇంద్రధనుస్సు"నూ, రాజమండ్రి నుంచి "రచన" నూ వెలువరించేవారు. విజయనగరం సంస్కృత కళాశాల నుంచి వెలువడిన "జ్యోతి" లిఖిత పత్రికలో పిలకా గణపతిశాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, మిరియాల రామకృష్ణ మొదలైనవారి రచనలు వుండేవి. భీమవరం నుంచి రాయప్రోలు భగవాన్ "సుధానిర్ఝరి" అనే పత్రికను నడిపేవారు. హైదరాబాద్ నుంచి సుధామ కూడా "యువమిత్ర" అనే పత్రిక నడిపేవాడు.

రంగు సత్యనారాయణ "సత్యం మిత్రమండలి" పక్షాన ఆరు పుటల సాహితీ బులెటిన్ "కడలి" నడిపేవారు. జిరాక్స్ కాపీలతో చాలా మందికి పంపేవారు. ఆధునిక కవిత్వానికి, అభ్యుదయ భావాలకి ప్రాధాన్యమిచ్చిన 'కడలి' – మతం, అమ్మ, కార్మికులు, స్త్రీ మొదలైన వాటిపై ప్రత్యేక సంచికలుగా వెలువడటం విశేషం.

"జనారణ్యంలో
పెంచి పోషింపబడే
పులి – మతం
దానాకలి

తీర్చాల్సినప్పుడల్లా
నువ్వో... నేనో... ఖతం"

అనే అలిశెట్టి ప్రభాకర్ కవిత కనిపిస్తుంది. సౌభాగ్య అనువాద కవితలూ వున్నాయి. నవ్యాంధ్ర సాహిత్య సమితి (హైదరాబాదు) వారు 'శారద' మాసపత్రికను నిర్వహించేవారు. ఇంకా నూజివీడు నుంచి 'పాంచజన్యం' తిరువూరు నుంచి "మేఘమాల" మొదలైన లిఖిత పత్రికలు వెలువడేవి. ప్రవాసాంధ్ర సాహిత్య సంస్థలు కొన్ని లిఖిత పత్రికలు నిర్వహించేవి. భిలాయ్ నుంచి 'చేతన' మొదట్లో లిఖిత పత్రిక వచ్చేది. జంషెడ్‌పూర్ నుంచి వెలువడిన "ప్రవాసి" లిఖిత పత్రిక చాలా బాగుండేది. ఆంధ్ర విజ్ఞాన సమితి కవర్‌పేజీ అచ్చుతో వెలువరించేది. రెండు నెలలకోసారి వచ్చేది. కవుల జయంతులకి, పండుగలకి ప్రత్యేక సంచికలు వెలువడేవి. 1946 నుంచి 1952 దాకా నిర్విరామంగా సాగిన "ప్రవాసి"– ఆ తర్వాత అప్పుడప్పుడు వెలువడేది.

ఈ లిఖిత సాహిత్య పత్రికలన్నీ ప్రామాణికమైనవిగానీ, వీటిల్లో విలువైన సాహిత్యం మాత్రమే వుందని గానీ చెప్పడానికి వీలులేదు. ఎక్కువగా సాదాసీదా రచనలే వుంటాయి. అయితే రచయితల క్రమపరిణామానికీ, స్థానికంగా రచనా సహకారానికీ ఇవి ఎంతో తోడ్పడతాయని మర్చిపోకూడదు. కొన్ని మంచి రచనలు వెలుగులోకి రాకుండా ఈ లిఖిత పత్రికలలో వున్నాయి. వీటిని సేకరించి భద్రపరచవలసి వుంది. ప్రచురించవలసి వుంది.

17

జాషువా కవిత్వం - మరో కోణం

"నా కవితావధూటి వదనంబు నెగాదిగ జూచి రూపురే
ఖాకమనీయ వైఖరులు గాంచి భళీభళియన్న వారె, మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింపసిగ్గగున్"

అంటూ జాషువా మొట్ట మొదటగా "గౌరవం కులానికా? కలానికా?" అన్న ప్రశ్న వేసినమాట వాస్తవమే.

"ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు
నలువురు కుమారులనుట విన్నాముగాని
పసరముకన్న హీనుడభాగ్యుడైన
యైదవ కులస్థుడెవరమ్మా, సవిత్రి?"

అంటూ గర్జించి తన ఆవేదనను వెల్లడించడమూ నిజమే.

"ఆ యభాగ్యుని రక్తంబునా హరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయు
కసరి బుసకొట్టు నాతని గాలిసోక
నాల్గు పడగల హైందవ నాగరాజు"

అంటూ అంటరానితనానికి కారణమైన హిందూమతాన్ని తీవ్రంగా నిరసించడాన్ని అర్థం చేసుకోవాల్సిందే.

"గవ్వకు సాటిరాని పలుగాకుల మూకల నూయ చేత న
న్నెవ్విధి దూరినన్ ననువరించిన శారద లేచిపోవునే?
ఇవ్వసుధాస్థలిం బొడమరే రసలుబ్ధులు? గంట మూనెదన్
రవ్వలు రాల్చెదన్ గరగరల్ పచరించెదనాంధ్రవాణికిన్"

అనే పద్యంలో జాషువా ప్రతిఘటనా దృక్పథాన్ని అంగీకరించక తప్పదు.

అయితే-

"కులమతాలు గీచుకొన్న గీతలజొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖిలలోక మెట్లు నిర్ణయించిన, నాకు
తిరుగులేదు, విశ్వనరుడ నేను"

అన్న జాషువాను ఒక 'దళిత కవి'గా, ఒక 'వాద'కవిగా నిర్ణయించి "ముద్ర" వేయడమే దిగులు కలిగిస్తుంది. జాషువాలో విభిన్న భావాలున్నాయి. విశాల దృక్పథం వుంది. మానవీయత అంతటా పరచుకొన్న కవిత్వం జాషువాది.

"వాని డెందంబు సోకి పోవని తలంపులు
వాని కనుసన్న తలలు వంపని ఉపమలు
వాని కలమున కులుకుచూపని పదములు
మందునకులేవి నాటి వాఙ్మయమునందు"

అని ఫిరదౌసిలో చెప్పిన పద్యం జాషువాకి కూడా అన్వయిస్తుంది.

"కాలపురుషుని నఖక్షతము బోలి
కెంపెక్కిన కన్ను మూసికొని యెం
గుముదంబు నిశావధూటి
నీ చక్కని మంచు వెన్నెల భుజించు చకోరము"

అనే భావుకతగల పద్యాలు రాశాడు. మేఘాన్ని పురుషుడిగా భావించి ఉత్ప్రేక్షాలంకారంలో గొప్ప పద్యం చెప్పాడు. గిజిగాడు, నెమలి, శిల్పి, సాలీడు వంటి ఖండికలు జాషువా కల్పనా రామణీయకతను, వినూత్న భావనా శిల్పాన్ని వెల్లడిస్తాయి. "సఖి" అనే ఖండికలో కనిపించే జాషువా హృదయం చూడండి:

"పాలకులై ప్రపంచ విభవంబును జుట్టిన గొప్పవారి గో
రీలవిగో శ్మశానమున బ్రేయసి! వారి ప్రశంసలెల్ల ని
ర్మూలములయ్యె! బొందివిడిపోవక ముందు సుఖించు వారిదే
మేలను కొందు కాలము గమింతమురమ్ము కవుంగిలింతలన్"

మహా భారతంలోని పాత్రల్ని నిష్పక్షపాతంగా విమర్శించాడు. ద్రౌపదిని సభలో పరాభవించిన దుర్యోధనుడ్ని 'ఇదేమి మొగతనం?" అంటూ ఈసడించాడు. కర్ణుని పక్షాన నిలిచి జాషువా ఇలా అంటాడు-

"గవ్వకుంగాని పాడు శిఖండిముందు
వ్యర్థ పుచ్చితె పార్థుని పరువు కొఱకు
కౌరవునియాస గంగలో కలసిపోయె"

జాషువా ఎంతలోతుగా చూస్తాడో అంత విస్తృతంగానూ పరిశీలిస్తాడు. "విభిన్నత, నవ్యత" జాషువాకి సహజం.

"యానాటికి నేటికింక నొకనాటికి నీ కెదురేరీ సత్కవీ" అంటూ రామరాజ భూషణుని శ్లేషకవితా వైభవాన్ని ప్రశంసిస్తాడు. సాహితీరంగంలోగల అవాంఛనీయాల్ని సహించలేడు కూడా!

"నా కవిత్వంబునందు రత్నములుగలవు
వాని బెకలించి చూపెడు వాడు లేడు
కాలమిట్లున్నదని మొనగాడు వోలె
పలుకు కవిగాడ! యేటికీ స్వాతిశయము"

అని డబ్బాకొట్టుకొనే వాళ్ళకి చురకలేస్తాడు. "ఆడుది లేకుండిన" ఈ జగత్తులో శోభ అనేది లేదనీ, కాబట్టి స్త్రీని పనిచేసే యంత్రంగా చూడకూడదనీ నొక్కి చెప్తాడు. "గణనీయము నీజననీత్వమూర్వరన్" అని మాతృవందనం చేస్తాడు. జాషువా "సీరియస్" కవిత్వమే కాదు అధిక్షేపం, హాస్యంగల కవిత్వమూ రాశాడు. మచ్చుకి-

"అల్లుడనని నిక్కిన నా
కల్లుడొకడు దాపరించి యధికారముతో
నిల్లుంజొచ్చెన్నేనిపు
డల్లుండను గాను మామనై కూర్చుంటిన్"

జాషువా "గబ్బిలం" రాయడానికి గాంధీ ప్రభావమే కారణం. గాంధీ చేపట్టిన అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ ఉద్యమాలే 'గబ్బిలం' కావ్యానికి స్ఫూర్తి.

అసలు జాషువా సిసలైన గాంధీయవాది. "స్వచ్ఛమైన అసలైన సిసలైన భారతీయునిగా గాంధీమహాత్ముని అనుచరునిగా మహాకవి ప్రతిన బూని మిగిలిన భారతీయులందరికి ఆదర్శప్రాయుడైనాడు" అని రెవ. డా॥ ఆర్.ఆర్. సుందరరావు "మహాకవి జాషువ వ్యక్తిత్వం- కవిత్వం" అనే పుస్తకంలో స్పష్టీకరించారు. జాషువాకి గాంధీ అంటే ఎంత ఇష్టమంటే ఆయనపై "బాపూజీ" అనే ఖండకావ్యమే రాశాడు. జాషువా గాంధీని-

"భార్యాబిడ్డలున్న ప్రత్యక్ష దైవం"గా భావించాడు.

"మా కన్నీరు తుడిచే బంధువు"గా ప్రశంసించాడు. అంతేకాదు-

"చదువుకొన్నాడను సాలీనిగూటిలో
దాగిన గాంధీకథానకంబు"

అని వెల్లడించాడు. ఇంతే కాదు-

"అడిన మాట తప్పను, మహాత్ముని జాడలోన కాలాడ చరించెదన్" అని ప్రకటించాడు.

జాషువా మనసులోని మరో మాట ఇది-

"నా కవచంబహింస... లోకమోహన సబర్మతి సన్మునికిన్ కుమారుడన్"

ఇంకా పలికిన మరోమాట- "గాంధీ శాంతి సిద్ధాంత మార్దవమార్గాలు". కాబట్టి జాషువా మనసా, వాచా, కర్మణా గాంధీని ఆరాధించాడు. దళిత కవులూ, రచయితలూ, నాయకులూ ఇవన్నీ తెలుసుకోవాలి.

"కండె బొట్టున నైదుఖండాల నోడించి కొలుపులందినది మా కోమటన్న" అనటం, గాంధీని క్రీస్తు, బుద్ధులతో సమానంగా చూసి "కర్మయోధుడు" అనటం- గబ్బిలంతో జాషువా ఈ పద్యం పలికించడం మర్చిపోకూడదు-

"మఖచితి నాది దేవుని సమానుడు బుద్ధుని యంతవాడు భా
సుర దరహాస చంద్రికల శుభ్రతలోన గట్టివాడు య
ద్దారలకు గాదు వారి చెవి దూరిన వారిని లక్ష్య పెట్టడ
ప్పరమమునిన్ సబర్మతిని వాసిని జూచితివే తపస్వినీ"

జాషువా గాంధీయవాది అనటానికి ఇన్ని సాక్ష్యాలున్నాయి. మరి జాషువాను మెచ్చుకుంటున్నవారు జాషువా గాంధీయతను చెప్పకపోవటం సమంజసమా?

జాషువా ఆగ్రహాన్ని వివరిస్తూ విమర్శకులు, కవులు పదే పదే ఈ పంక్తుల్ని ఉదాహరిస్తూ ఉంటారు–

"నిమ్నజాతుల కన్నీటి నీరదములు
పిడుగులై దేశమును కాల్చివేయుననుచు"

నిజానికి ఇవి దళితుల గురించి జాషువా చెప్పినవి కావని చాలామందికి తెలీదు. తర్వాతి రెండు పాదాలూ చెప్తే గానీ అసలు విషయం బయటపడదు. ఆ పంక్తులివి–

"..... కాల్చివేయుననుచు
రాట్నమును దుడ్డు కఱ్ఱకరాన బూని
దెసల దోతెంచె గుజరాతు ముసలి సెట్టి"

ఇక్కడ గాంధీ ఆవేదనను జాషువా చెప్పాడు. అది గాంధీ ఆగ్రహం!

జాషువా "నాల్గు పడగల హైందవ నాగరాజు" అని కళ్ళెర్రజేసినా, పూజారి వ్యవస్థపై ధ్వజమెత్తినా "ప్రతిమల పెండ్లి"కి ఖర్చు చెయ్యటాన్ని నిరసించినా మనం అర్థం చేసుకుంటాం. ఎందుకంటే అంటరానితనాన్ని పెంచి పోషించింది హిందూమతం కాబట్టి. "ఆత్మవత్ సర్వభూతాని" అనే ఆర్యోక్తిని హిందూమతం ఆచరణలో చూపలేకపోయింది. కాబట్టి జాషువా హిందూమత ప్రాశస్త్యాన్ని వెల్లడిస్తూనే అసమానతనూ, అమానుషాలను ఎత్తి చూపాడు. కాబట్టి జాషువాను అర్థం చేసుకోవాలి తప్ప "హిందూ వ్యతిరేకి"గా ముద్ర వెయ్యకూడదు. ఈ దేశాన్నీ, ఇక్కడి హిందూ సంస్కృతినీ అభిమానిస్తూనే లోపాలను ప్రకటించాడు.

"బహుదేశములను పేర్వడసి మీసముదీటు
భరత ఖండంబునా పాఠశాల
స్తనయుగంబున గాన సాహిత్యములు పిండ
భాషా వధూటి నా పంతులమ్మ

సాందీపముని సమక్షమున విద్య గడించు
వనమాలి నా సహపాఠకుండు
భక్తి వైరాగ్య భావముల తావలమైన
భాగవతంబు నా బాలశిక్ష"

ఇదీ జాషువాకి భారతీయతపైగల అభిమానం.

మన సంస్కృతిని మెచ్చుకుంటూ– "నేడేదీ తొల్లిటి మందహాసముల మమ్మీక్షింపు హిందూరమా" అనటం గమనార్హం. హిందువులు పవిత్రంగా ఆరాధించే గోవును ముత్తైదువుగా, లోకపావన చరితగా కొనియాడాడు. గోవు వున్న ఇల్లు పవిత్రమైన దంటాడు. అంతేనా? "పాపభంజకమైన నీ పంచితంబంటి సంశుద్ధి నందని స్థానమేది?" అంటాడు. గోవు కాలిడిన చోటును కాశీ, గయ, ప్రయాగల వంటిదని చాటుతాడు. ప్రాచీన కవుల్ని మెచ్చుకుంటాడు. గబ్బిలంలో కూడా వ్యాసుడ్ని, కాళిదాసుని, శ్రీనాథుడ్ని ప్రశంసిస్తాడు. ఇవన్నీ నేటి "దళిత భావన" గల వారికి నచ్చని అంశాలు. "శబ్దశాసను ద్రాక్షా కవిత్వమును" అంటూ పరవశించి పోతాడు. గబ్బిలంలో "వారణాసి"ని తెగమెచ్చుకుంటాడు. శివుడ్ని "ఉజ్జీలేని దయాస్వభావుడు"గా పేర్కొంటాడు. అసలు గబ్బిలాన్ని కైలాసంలోని శివుడికి పంపటంలోనే హిందూమతాభిమానం తెలుస్తుంది. ముక్తి, మోక్షం, పుణ్యం అనే భావాలు జాషువా పద్యాలలో చూస్తాం.

జాషువా హృదయం నిర్మలమైనది. ఎటువంటి భేదభావాలకు, అసూయలకు తావులేనిది. "ఉన్నమాట" చెప్పటంలో జాషువాకి అసక్తి మెండు.

"హిందువులను చూచి యెగతాళి చేసెద
వింటనున్న మురికేవగింప మొరుల
తప్పిదంబులోరుచుకొనలేము
సొంత తప్పు మాకు చురుకు లేదు"

అని నిర్భయంగా చాటగల సత్తా వున్న కవి జాషువా. పంచములలో సోదరత్వం లేదని ప్రకటించాడు. హిందువుల అంటరాని తనాన్ని ప్రకటించే ముందు మాల, మాదిగల అస్పృశ్యతని ఆలోచించమన్న "వాస్తవ" కవి జాషువా–

"దేవుడొకడు మాకు దేవళములు రెండు"

"మాల క్రీస్తుని కన్న మాదిగ క్రీస్తుడే
యరవీసె గొప్పవాడనియె నొకడు"

అని అంటాడు. అంతే కాదు- మాల కాకి, మాదిగ కాకి వేరని చెప్పాడు. సిగ్గు విడిచి మాలో మేం హెచ్చు తగ్గులకోసం తన్నుకొంటున్నామన్నాడు. ఇదీ జాషువా సిసలైన హృదయం. "తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు" అన్న దాన్ని జాషువా స్పష్టంగా వివరించాడు. జాషువా నిర్భయ, స్వచ్ఛ హృదయాన్ని చాటి చెప్పే పద్యమిది-

"మాలబోధకు డెన్నడో మాదిగింట
గుడిచినాడని యమ్మాల గూడెమునకు
నెడముగా నుంచి దాహంబు నీయరనుచు
గుసగుసలు గల్గునిది తేల్చి కొనుట లెస్స".

జాషువా గుండె చప్పుళ్ళు ఇవి. మాల మాదిగల మధ్యగల అనైకత్యతను, అసఖ్యతను ఆనాడే చాటి చెప్పిన ద్రష్ట జాషువా. ఇవాళ 'ఎ బి సి డి' వర్గీకరణల వల్ల ఒకరిపై మరొకరు నిప్పులు జల్లుకోవటం చూస్తున్నదే. "ఇంట గెలిచి రచ్చగెలవండి" అన్నదే జాషువా తత్వం. "గబ్బిలం" కావ్యంలో సారంగధరుడికి సానుభూతిగా జాషువా ఒక పద్యం రాశాడు. నిజానికి సారంగధరుడు రాజకుమారుడు. అంటే అగ్రవర్ణపువాడు. జాషువా అతని పక్షాన గళమెత్తాడు. అంటే జాషువా మానవతావాది. ఎవరికి ఎక్కడ ఎప్పుడు అన్యాయం జరిగినా సహించలేనివాడు. దీనికి మరొక సాక్ష్యం "ఫిరదౌసి" కావ్యం.

జాషువా మానవతావాద కవి. అందరివాడు. జాషువాకి ఓ 'ముద్ర' వేసి సంకుచిత పరచటం సముచితం కాదు. సగరమాంధాతాది చక్రవర్తుల్ని, బుషుల్నీ పొగడుతూనే "పేదల పకీరుల" గురించి ఆలోచించినవాడు. ఓసారి లవణం 'మా నాన్న దళితకవి' అనడం నా కిష్టం లేదని నాతో చెప్పారు. కాబట్టి జాషువా- ఈ నేలను సంస్కృతినీ ప్రేమించినవాడు. వర్ణద్వేషాన్ని నిరసించినవాడు. ఎండ్లూరి సుధాకర్‌లా "నెత్తురు ప్రశ్న" వేసినవాడు. శివసాగర్‌లా "నడుస్తున్న చరిత్ర" ను తిరగరాయాలన్నవాడు. మానవీయతకు గోపురం నిర్మించినవాడు. అదీ జాషువా అంటే!!

18

శ్రీశ్రీ హాస క్రీడలు

"యుగకలం అయన చేతిలో వుంది.

అది కదిలినా కక్కినా అందమే, ఆనందమే"

అన్న శ్రీ రమణ మాటలు అక్షరాలా నిజం

శ్రీశ్రీ ప్రతిభ శతపత్రమై సురభిళిస్తూ వుంటుంది. శ్రీశ్రీ కవిత్వం ఎప్పటికీ వాడని పారిజాత సుమం. అయితే శ్రీశ్రీ అభ్యుదయ కవి, విప్లవ కవి మాత్రమే కాదు– హాస్య కవీ, హాస్య రచయిత కూడా! నెత్తురును మండించే రచనలతో పాటు హృదయ వికాసాన్ని కలిగించే వ్యంగ్య హాస్య రచనలూ చేశాడు.

"శృంగారం, కరుణ చచ్చిపోయిన రసాలు. బీభత్సం, వీరం ఇవి ఈనాటి సజీవ రసాలు. వీటికి హాస్యం 'తల్లివేరు' అన్నాడంటే శ్రీశ్రీ హాస్యానికి ఎంత ప్రాముఖ్యమిచ్చాడో తెలుస్తుంది.

ఎనిమిదో ఏటనే కంద పద్యం రాసిన శ్రీశ్రీకి కందం అంటే ఇష్టం. అందుకే సిరిసిరిమువ్వా శతకం రాశాడు. ఇందులో శ్రీశ్రీ వ్యక్తిత్వం, అభిరుచులు, అసహ్యాలు, కోపాలు, తాపాలు అన్నీ వున్నాయి. కొన్ని ఘాటుగా ఉంటాయి. కానీ 'నిర్మొగమాటం' అనే దృష్ట్యా చదివితే సర్దుకుపోతాం.

"దెయ్యాలను చూపిస్తా
నయ్యా రమ్మనుచు నొక్క ఆసామీ నా
కయ్యా, తన కూతుళ్లను
చెయ్యూపుచు పిలిచి చూపె సిరిసిరిమువ్వా"

అంటూ చమత్కరించగల శ్రీశ్రీ మన ఎన్నికలు, రాజకీయ కక్షలపై రాసిన ఈ పద్యం చూడండి:

"తలకాయలు తమ తమ జే
బుల లోపల దాచుకొనుచు పోలింగుకు పో
వలసిన రోజులు వస్తే
సెలవింక డెమోక్రసీకి సిరిసిరిమువ్వా"

ఇవాళ్టి ఎన్నికలకి ఈ పద్యం అద్దం పట్టడం లేదూ? మనకి కవులెక్కువంటూ విసిరిన ఛలోక్తి ఇది–

"అవురా, మన తెలుగింట్లో
కవిరాజులు, కవి వరాహ గార్దభ శునకా
ద్యవతారమూర్తులెందరో
శివమెత్తినటుల్ నటింత్రు సిరిసిరిమువ్వా"

ఇందులో కవులకి గల బిరుదు వ్యామోహాలు కూడా స్ఫురింపచేశాడు. "మూర్ఖ పద్ధతి" అంటూ శ్రీశ్రీ విసిరిన ఛలోక్తి ఇది:

"నేను ఒక మూర్ఖుణ్ణే
ఐనా నాకన్న మూఢులగపడుతుంటే
ఆనంద పారవశ్యము
చే నవ్వక తప్పలేదు సిరిసిరిమువ్వా"

ఆరుద్ర మన స్వాతంత్ర్యం ఒక మేడిపండు అన్నాడు. ప్రజాస్వామ్యం ఒక ప్రహసనంగా మారింది. నల్లధనంతో అపరకుబేరులవుతున్నారు నాయకులూ– వారి అనుయాయులు? దీనిని శ్రీశ్రీ అప్పుడే పసిగట్టి "ఉపాలంభనం" పేరుతో పద్యాలు రాశాడు. ఒక్కటి రుచి చూడండి–

"గౌను బనాయిస్తే దొర
సానిగ గడసాని మారజాలునే? భాదీ
తానులు సైతాను ధరి
స్తే నాయకుడెట్టులవును? సిరిసిరిమువ్వా"

ప్యారడీ సూరీడు జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిని 'జరుక్‌శాస్త్రి' అనీ "రుక్మాయి" అనీ పిలిచేవారు. శ్రీశ్రీ రుక్కుటేశ్వర శతకం ప్రారంభించి కొన్ని పద్యాలు మాత్రమే రాశాడు. అంత్యప్రాసల చమత్కారంతో గల పద్యమిది–

"రుక్కునకు, ఆ గ్రహముగల
ముక్కునకు, విచిత్ర భావముఖరితవాణీ
భాక్కునకున్, తెగవాగెడి
డొక్కునకున్ సాటిలేని డుబుడుక్కునకున్"

శ్రీశ్రీ మూఢ నమ్మకాలపై చెణుకులు విసిరాడు. అతని కలానికి హద్దులు లేవు. 'పాప నాశనం' అనే పంచపదులులో ఇలా అంటాడు–

"గంగ
లో మునుగంగ
పాపాలు పోతాయని ఒక దొంగ
కాశీకి వెళ్ళి గంగలో బుడుంగ
ని మునింగి చనిపోయాడు చల్లంగ"

శబ్దాలతో ఆడుకోవటం శ్రీశ్రీకి ఉగ్గుతో అలవడిన విద్య. శబ్ద బ్రహ్మ కాబట్టి ఏమైనా చేయగలడు. ఎలాగంటారా? చూడండి:

"అరిచే కుక్కలు కరవవు
కరిచే కుక్కలు మొరగవు
కరవక మొరిగే కుక్కలు తరమవు
అరవక కరిచే కుక్కలు మరలవు
అరవని కరవని కుక్కలెక్కడా దొరకవు"

తనపై సరదాకి పలికిన మాటల్ని స్వాగతించి పునరుద్ఘాటించడం శ్రీశ్రీ వ్యక్తిత్వంలో ఒక కోణం–

"రెండు శ్రీలు ధరించి
రెండు పెగ్గు బిగించి
వరలు శబ్ద విరించి"

అనుచు మీటెను దంచి

ఆరుద్ర కవితా విపంచి".

తెలుగు పదాలతోనే కాదు ఇంగ్లీషు పదాలతో కూడా శ్రీశ్రీ చమత్కారాలు చెయ్యగలడు.

"విదూషకుడి *temperament*

ఏదో ఒక *discontent*

బ్రదుకుతో *experiment*

పదాలు *patent* రసాలు *torrent*

సద సత్సమస్యకి *solvent* శ్రీశ్రీ *giant*"

పానుగంటి నరసింహారావు "సాక్షి" వ్యాసాల ద్వారా సుస్థిర స్థానం సంపాదించారు. తెలుగుదనానికి, తెలుగు భాషా వైభవానికి అవి నిలువుటద్దాలు. శ్రీశ్రీ నోట ఈ ముత్యాల మూటలు:

"లక్ష్మీ నరసింహారావు పానుగంటి

సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి

ఎంచేతంటే వాటిలో పేను లాంటి

భావానికాయన ఏనుగంటి

రూపాన్నియ్యడం నేను గంటి"

"మరో ప్రస్థానం" శ్రీశ్రీ విప్లవ కావ్యం. అయినా తన తిరుగుబాటు భావాలను చెప్పడానికి వ్యంగ్యాన్ని ఆయుధంగా తీసుకొని వేళాకోళాన్ని దట్టించి "దైవప్రార్థన" చేశాడు శ్రీశ్రీ. మీరూ వినండి:

"ఏడు కొండలవాడా గోవిందా

బస్సు ప్రమాదం

ఆరు కొండలవాడా గోవిందా

నూనె లడ్డుండలు

ఐదు కొండలవాడా గోవిందా

హుండీలో నల్లడబ్బు

నాలుగు కొండలవాడా గోవిందా
నా పెళ్ళాం నాతో లేచిపోయింది
మూడు కొండలవాడా గోవిందా
ముఖ్యమంత్రి మూర్ఛపోయాడు
రెండు కొండల వాడా గోవిందా
చాలు నీ అవతారం చాలించు
ఒంటి కొండవాడా గోవిందా
తిరుమల తిరుపతిని మిగిలించు"

సినిమా పాటల్లో కూడా శ్రీశ్రీ నవ్వులు పండించాడు. సరదాగా జల్సాగా వుండాలంటూ పాటలు రాశాడు.

"సరదాగా హై-జల్సాగా హై
చీటికి మాటికి సిగరెట్ దమ్ములు
ఘాటు ఘాటుగా లాగాలి
సోడాలకీ కిల్లీలకీ ఒక కాతా కొట్టును చూడాలి
నలుగురు కలసీ కాఫీ త్రాగి ఒకడే బిల్లు ఇవ్వాలి
మార్కుల కోసం మాస్టరు గారిని మస్తుగ కాకా పట్టాలి"

సి.ఐ.డి. (డబ్బింగ్) సినిమాలోని ప్రేమ పాటలోగల చమత్కారం చూడండి-

"కోకిల వాణీ బ్యూటీలో రాణి
పోరాదె నన్ను వీడి జానీ
చూడను రూపు లేదే చేతను రూక లేదే
ఓ ప్రియా, నా ప్రేమరాణి నిన్ విడనాడనే కామినీ
లవ్ లేదా హార్ట బర్స్టు హా సఖీ"

"కులగోత్రాలు" సినిమాలో ప్రసిద్ధమైనది-

"మామా! శత్రు భయంకర నామా
అందానికి చందమామ!
బలమున గామా! నీవే కద మా ధీమా!
గుణధామా విశ్వదాభిరామా! మామా!"

గురజాడ "మనవాళ్ళొట్టి వెధవాయలోయ్" అన్నాడు. శ్రీశ్రీ అంత ఘాటుగా కాకపోయినా ఆ స్థాయిలో తెలుగుతనంపై తెలుగు వారిపై చురకలు వేశాడు. ఆ చురకలలో కొన్ని:

"తెలుగు విమర్శకుడికి తిట్టడంలో ఉన్న ప్రజ్ఞ మెచ్చుకోవడంలో లేదు. వేలెడంతేసివాడు జానెడంతేసి వాణ్ణి చూసి మూరెడంతేసివాళ్ళున్నారు లేవోయ్ అంటాడు. తెలుగువాడన్న ప్రతివాడికీ ఉన్న గుణమే అది. సినిమాకి వెళ్ళి ఈసడిస్తాడు. విందుకు వెళ్ళి వెక్కిరిస్తాడు. కావ్యం చదివి కరవ్వాస్తాడు. తెలుగు వాళ్ళల్లో పైకి వచ్చిన వాళ్ళంతా పైకి పోయినవాళ్ళే".

✧ ✧ ✧

"శూర్పణఖకు మాత్రం మానం లేదా? దాన్ని సంరక్షించడం ఉత్తమాదర్శం కాదా?" అంటూ శ్రీశ్రీ "శూర్పణఖామాన సంరక్షణం" అనే వ్యంగ్య గల్పిక రాశాడు.

"కథవండుదామని కలం పట్టుకుని కాగితాలు పెట్టుకుని కూచున్నాను. ఇతివృత్తాన్ని ఎసరు మీది కెక్కించాను. కథానాయకుణ్ణి ముక్కలుగా తరిగి కారప్పొడి జల్లి పచ్చడి చెయ్యాలనుకున్నాను... చి.కా.బు. అంటే జ్ఞాపకం వచ్చింది. చిత్తు కాగితాల బుట్టల్లో వెదికితే ఎన్నో కథలకి బీజాలు దొరుకుతాయి. చాలా కథల్ని సంపాదకుడు చంపేస్తూ ఉంటాడు..." అంటూ 'అనామిక' అనే కథ సాగుతుంది. "పెదనాన్న సర్కస్ పులీ" అనే కథ ఇలా ప్రారంభమై మనల్ని వినోదపరుస్తూ చకచకా నడుస్తుంది- "నువ్వు క్షవరం చేయించుకోవాలన్నాడు మా స్కూల్ మాష్టారు. తల కత్తిరించుకో నాయనా అంది మా అమ్మ. నీకు క్షవరం అవసరమని హెచ్చరించాడు మా తమ్ముడు. ప్రపంచమంతా నేను క్షవరం చేయించుకు తీరాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఒక పెద్ద బుట్టంత తలనాది. అంతజుట్టు అనవసరం అంది లోకం. రోజూ ఒక పెద్దమనిషి- ఆయన తల మీద టార్చి లైటు వేసి చూసినా జుట్టు కనపడదు- నున్నగా పొన్నకాయలా వుంటుంది... ఈ బట్టతల పెద్దమనిషి నన్ను నా అడివినీ నలుగురికీ చూపించి ఆంధ్రప్రదేశ్ అంతజుట్టు అని ఎగతాళి చేసేవాడు..."

శ్రీశ్రీ తనమీదనే చమత్కారాలు వేసుకోగల విశిష్టుడని ఇంతకుముందు చెప్పుకున్నాం. "కాక్కారోకో" అనబడే "రాజకీయ కుక్కుటేశ్వరము" అనే చిన్న సంభాషణాత్మక నాటిక ప్రహసనం వంటిది రాశాడు. రామలక్ష్మణ పాత్రల్ని తీసుకు

వచ్చి ఆధునికానికి అన్వయింప జేశాడు. లక్ష్మణుడు "మహాకవి శ్రీశ్రీ" అనబోతూ వుంటే రాముడు "ఆగుమాగుము ఆ రచయిత ఇంకను మహాకవి యనుటకు వీలులేదు" అంటాడు. లక్ష్మణుడు ఎందుచేత అని ప్రశ్నిస్తే రాముడు "మహాకావ్యమును రచింపనివాడెట్లు మహాకవియగును?" అని సమాధానమిస్తే లక్ష్మణుడు తన సందేహాన్ని ఇలా వెలిబుచ్చుతాడు–

"అన్నయ్యా! మహాకావ్యమనిన ఒక పకోడీల దుకాణమునకు నెల రోజుల వరకును సరిపోవు కాగితములు కలదియా? లేక కనీసమొక కంద రామాయణమైనను లిఖింపనివాడు కవి కాడని నీవు భావించుచున్నవాడవా?"

రాముడు : తమ్ముడా! శ్రీశ్రీ మహాకవి అంటే బాధపడే వాళ్ళింకా కొంతమంది ఉన్నారు. అందరునూ ఒప్పుకున్న నాడే మనము అంగీకరించుట లెస్స. ప్రజావాక్యమే భగవద్వాక్యము.

లక్ష్మణుడు : యూ ఆర్ పర్‌ఫెక్ట్‌లీ రైట్ బ్రదర్!

శ్రీశ్రీ చూపు నిశితమైనది, లోతైనది అనటానికి చాలా రచనలు సాక్ష్యాలుగా నిలుస్తాయి. అటువంటి "బొజ్జమ్మా బొచ్చుకుక్కా" ఒకటి. వస్తు విస్తృతికి ఈ రచన చిన్న ఉదాహరణ. "కళ్ళంటూ వుంటే చూసీ" అన్నాడు గదా మరి! శ్రీశ్రీ కలం ఎలా కదం తొక్కిందో చూడండి:

"సాధారణంగా చాలామందికి కుక్కల్ని పెంచడం అన్న సరదా చాలా పెద్ద హాబీలాంటిది. బొజ్జమ్మకీ ఆ సరదా ఉంది. కాని ఒకేరకమైన ఇష్టంలో మళ్ళీ చాలా రకాల ట్విస్ట్‌లుంటాయి. ఫర్ ఎగ్జాంపుల్ కొంతమందికి పెసరట్లంటే ఇష్టం ఉందనుకుందాం వాళ్ళంతా పెసరట్లు ఒకేలా ఉంటే అంతయిదిగానూ తింటారను కోవడం చాలా పొరపాటు. కొంతమంది ఉత్త పెసరట్టు ఇంకొందరు దాన్ని ఉప్మాతో కలిపి, మరికొందరు అందులో అల్లం, జీలకఱ్ఱ, ఉల్లి ఎక్కువగా వేసి తినడం అంటేనూ ఎలాగయితే తేడాలు చూపిస్తారో అయ్యదే రీతిన శునకములను పెంచుట యందు కూడా అనేక తెగలవారు కలరు. ఆమెకు బొచ్చుకుక్కలంటే ఎంత ప్రాణం అంటే హఠాత్తుగా భగవంతుడే గనక ప్రత్యక్షమై నీకు జన్మరాహిత్యాన్ని ప్రసాదిస్తానంటే ఆమె కళ్ళనీరు పెట్టుకొని తనకింకొక్క జన్మలో బొచ్చుకుక్క జీవితాన్ని ఇవ్వాల్సిందని

ప్రాధేయపడుతుందనడంలో అతిశయోక్తి ఉండదు..." ఇలా విలక్షణంగా సాగి మనకి మందస్మితం కలిగిస్తుంది.

శ్రీశ్రీ స్కెచ్‌లలో, కథలలో, వ్యంగ్య గల్పికలలో చాలా హాస్యం దొరుకుతుంది. "నింపాదిగా కోపం చెయ్యి" అనే రచనలో కోపం గురించి చెప్పి మనల్ని నవ్విస్తాడు. ఇందులోగల ఓ చమత్కారం ఇది–

"పొగతాగకూడదని అక్కడ స్పష్టంగా రాసి ఉంటే మీరెందుకు చుట్ట కాలుస్తున్నారని ఆయన్ని అడిగేను. 'ఆఁ, ఏముంది. పోనిద్దురూ. ఎవరికి తోచింది వాళ్ళు రాసుకుంటారు. నేడే చూడండి' మా సినిమాను అని ఎన్నిచోట్ల మనం చదవడం లేదు? అలాగని ఆ ప్రకారం మనం చేస్తున్నామా? అలాగే ఇది కూడా"

✧ ✧ ✧

శ్రీశ్రీ కొన్నేళ్లుగా పత్రికలలో 'ప్ర/ జ' పేరుతో ప్రశ్నలూ జవాబుల శీర్షిక నిర్వహించి తన వాక్చతురతనీ, హాస్య ప్రియత్వాన్నీ కనబరచి పాఠకుల్ని రంజింప చేశాడు. శ్రీశ్రీ బహుముఖ ప్రతిభతో పాటు చమత్కార కుశలత కూడా ద్యోతకమవుతుంది. మచ్చుకు కొన్ని:

◆ ఒక అమెరికన్ పత్రికలో ఈ మధ్యనే నేను చదివినట్టిది– అమ్మనీ నాన్ననీ చంపినవాడు జడ్జీ ఎదుట నిలబడి "నన్ను క్షమించండి బాబూ, అమ్మా నాన్న లేనివాణ్ణి" అన్నాడట.

ప్ర : సృష్టిలో తీయనిది ఏది?

జ : తీయనిది ఏదీ లేదు. అన్నీ తీసినవే.

ప్ర : శ్రీనాథ మహాకవికి శ్రీశ్రీ మహాకవికి గల తేడా ఏమి ఓ సిరిసిరిమువ్వా?

జ : శ్రీనాథుని కావ్యాలను శ్రీశ్రీ చదివాడు. శ్రీశ్రీ కావ్యాలను చదివే అవకాశం శ్రీనాథుడికి లేకపోయింది.

◆ వెనకటికొక తెలుగు సరిగ్గా రాని సినీ డైరెక్టరు "నీ మీద ఈగనైనా వాలనివ్వను" అనడం తన హీరో హోదాకు సరిపోలేదని "నీ మీద ఏనుగయినా వాలనివ్వనని" మార్చబోయాడు.

◆ ప్ర : (అడిగినవారు పిచ్చయ్య)

చలం రాసిన పీఠిక చదివితే చాలు- మహా ప్రస్థానం చదవక్కర లేదనుకుంటాను.

జ : నిజంగా మీరు సార్థక నామధేయులు.

✧ ✧ ✧

శ్రీశ్రీ విసిరిన ఛలోక్తులెన్నో వున్నాయి. 'మాటకి మాట' అందించగల సమర్థుడు. మాటలతో ఆటలాడుకోగల నిపుణుడు. మాటల మాంత్రికుడైన శ్రీశ్రీకి ఛలోక్తులు ఒక లెక్కా?

◆ శ్రీశ్రీ స్నానం చేస్తూంటే చూసి విశ్వనాథ సత్యనారాయణ "శ్రీశ్రీ నీళ్ళాడుతున్నారే?" అని వ్యంగ్యంగా అన్నారు.

దానికి వెంటనే శ్రీశ్రీ "విశ్వనాథవారు కనుచుండగా నేను నీళ్ళాడితే తప్పేమిటి?" అన్నాడట!

◆ ఆకాశవాణి వాళ్ళు శ్రీశ్రీని "ఏ నాటిక అయినా రాసివ్వండి" అన్నారట. శ్రీశ్రీ "ఏనాటికైనా రాసిస్తాలే" అన్నారుట!

◆ ఓ నాటకంలో పాత్రధారి "పాతాళంబున..." అంటూ చెయ్యి పైకెత్తి చూపించాడట. శ్రీశ్రీ పక్కన కూర్చున్న వ్యక్తి "ఇదేమిటండి చెయ్యి కిందకి చూపించాలి గానీ పాతాళం కింద గదా వుంది" అన్నాట్ట.

శ్రీశ్రీ "అదే కరెక్టు. ఎందుకంటే మన నాటక రంగం పాతాళానికంటె కింద వుందిగదా" అని చమక్కు వేశాడు.

ఈ విధంగా శ్రీశ్రీ తన హాస్య ప్రతిభను ప్రదర్శించాడు. "నవ్వే గుణమే నాలో వుండకపోతే ఏనాడో గుండెలు పగిలిపోయి వుండేవి. ఇప్పటికీ నేను మునిగిపోకుండా కొట్టుకొస్తున్నానంటే హాస్యరసంలో వున్న విలువ నాకు అర్థం కావడం వల్లనే" అన్న శ్రీశ్రీ మాటలు మనందరినీ ఆలోచింపజేస్తాయి. ఒక సందేశమిస్తాయి.



Vimarshaadarsham

By Dr.Dwa.Na. Sastry

అసలైన విమర్శ కేవలం ఉపరిప్రశంస కాదు. అసందర్భమైన అధిక్షేప ప్రకర్ష కాదు. విమర్శకుడు సరితూక మెరిగిన విజ్ఞుడుగా ఉండాలి. అక్కడక్కడా చెణుకులు విసురుతూనే తాను ఉద్దేశించిన అంశానికి సంబంధించిన మూర్తిమత్వం ముమ్మూర్తులుగా కుదురుకోవాలి. ఆ కోవకు చెందిన సద్విమర్శకుడు ద్వానా. మరో పార్శ్వం నుంచి చూస్తే చమత్కారోక్తుల ఖజానా ద్వానా.

-జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత, డా॥ సి.నారాయణరెడ్డి

ఆధునిక తెలుగు సాహిత్యరంగంలో తన కొక సుస్థిరస్థానం కల్పించుకున్న సాహితీ వేత్త, సహృదయుడు డా. ద్వానాశాస్త్రి. విశేషం ఏమిటంటే వీరు ఎప్పుడూ సృజనాత్మకమహాయజ్ఞం చేస్తూనే వుంటారు. ఆయన ఎంతటి విమర్శకులో అంతటి సమీక్షకులు. ఎంతటి సమీక్షకులో అంతటి వక్త. ఎంతటి వక్తో అంతటి మంచిమనిషి, విశేషించి, సాహితీ కార్యకర్త కూడా.

– పద్మశ్రీ డా. యార్లగడ్డలక్ష్మీ ప్రసాద్

విస్తృతమైన విమర్శక వ్యాసంగం ఒక పక్కన వున్నా ద్వానాశాస్త్రి అంతరంగం కల్లా కపటంలేనిది. సన్నిహిత మిత్రులతో కూడా విభేదించేంత సాహిత్య నిబద్ధత, కొండొకచో కొంత కొంటెతనం ఆయన సొత్తు. ద్వానా శైలికి వున్న నైగనిగ్యం, ఋజుప్రకాశం, నిక్కచ్చితనం, సత్యాన్వేషణా పరత్వం చాలామందిలో వుండవు.

– డా॥ ఎన్. గోపి.

మంచి వ్యక్తిగా, మంచిమిత్రుడుగానే కాక మంచి పరిశోధకుడుగా నాకు తెలుసు. అంతేగాదు, రచయితగా, అనేక గ్రంథ సమీక్షకుడుగా మంచి ఉపన్యాసకుడుగా, ఉత్తమ అధ్యాపకుడుగా పలువురి ప్రశంసలకు పాత్రుడు కావడం, నా కళ్ళముందే "ఇంతింతై వటుడింతై..." అన్నట్టు సాహిత్యరంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం మహానందంగా వుంది".

– డా॥ ఎస్. గంగప్ప

విషయసేకరణలో, సేకరించిన సమాచారాన్ని కూర్పుచేయడంలో జర్నలిస్టులకు ఉండే సామర్థ్యం శాస్త్రిగారికి ఉంది. మంచి అధ్యాపకుడేకాదు, మంచి సాహిత్య విమర్శకుడే కాదు, ఆయన మంచి పత్రికా రచయిత కూడా.

– డా. పొత్తూరి వెంకటేశ్వరరావు

తెలుగు విమర్శని పాపులర్ చేసినవాళ్ళున్నారు. ఆ క్రమంలో చేరా మొదటి వారు. ద్వానా రెండోవారు (ఇద్దరూ గురు శిష్యులే). అది పుస్తక సమీక్ష కావచ్చు, విమర్శకావచ్చు. ఒకానొక సందర్భంలో పాత కవిని మూల్యాంకనం చేయటం కావచ్చు. అతడేది చేసినా దేనికీ వెరవలేదు. Open minded గానే చేశాడు – చేస్తున్నాడు. ఒక నిర్భీతి కలవాడు.

కె. శివారెడ్డి

KINNERA PUBLICATIONS